# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

telugubooks

1వ భాగం

తెల్లవారు ఝామున నాలుగు గంటలైంది.

మోకాళ్ళ మీద తల పెట్టుకుని కూర్చొని వున్నాడు చిరంజీవి. రాత్రినుంచీ ఏడవటం వల్ల కంటి పక్క నీటి చారలు కట్టినయ్. రాత్రంతా నిద్ర పోలేదు - కొంచెంసేపు ఏడ్చాడు. తరువాత అది వెక్కిళ్ళలోకి దిగింది. తరువాత అదీ ఆగిపోయింది.

ఆ కుర్రాడికి నాలుగడుగుల దూరంలో అతడి బాబాయ్ కూర్చొని వున్నాడు. అతడి మొహం అంతా రక్తం తోడేసినట్టు తెల్లగా పాలిపోయివుంది. అతడినెవరైనా పరీక్షగా చూస్తే ఆ వణికే పెదవులూ, చేతివేళ్ళూ చూసి, అతడేక్షణమైనా నేలకూలిపోతాడని తప్పనిసరిగా భావిస్తారు. అంత చలిలో కూడా అతడి వళ్ళంతా చెమట పట్టింది. "ఇంకా ఎంతసేపుంది బాబాయ్" అడిగాడు. ".......... గంట" వణుకుతూన్న కంఠంతో అతడన్నాడు.

.....

విశాలమైన జైలు ఆవరణలో చీకటి చాపలా పరుచుకుని వుంది. జేగురురంగు గోడలు పల్చటి వెన్నెలలో మరింత వెలవెల బోతున్నాయ్. వరుసగా వున్న సెల్స్‌లో ఖైదీలు నిద్రపోతున్నారు. పొడవాటి వరండాలో ఇద్దరు వ్యక్తులు నెమ్మదిగా నడుస్తున్నారు. దూరం నుంచి పడుతున్న లైటు కాంతిలో వారి నీడలు పొడుగ్గా పాముల్లా కదుల్తున్నాయి. ఇద్దరూ ఒక సెల్ దగ్గర ఆగారు. తాళం తీస్తున్న చప్పుడికి లోపలి ఖైదీ తలెత్తి చూశాడు. కిర్రుమంటూ తెరుచుకున్న తలుపు చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దం. పొట్టిగా వున్న వ్యక్తి ఖైదీకి కొత్త యూనిఫాం యిచ్చాడు. ఉరికి ముందు కొత్త బట్టలు ఇవ్వటం ఆచారం. జైలు రూల్సు ప్రకారం ఖైదీకి అతడి మరణం గురించి ఇరవై నాలుగు గంటలు ముందుగా తెలియబరుస్తారు. అతడు ముందు నిశ్శబ్దంగా రోదించాడు. కానీ సమయం గడిచి, ఉరి దగ్గిర పడుతున్న కొద్దీ అదో రకమైన వేదాంత భావం అలవడింది. కొంతమంది ఏడుస్తారు. కొంతమంది గింజుకుంటారు. కొంతమంది హిస్టీరిక్‌గా మారుతారు. కానీ చాలామంది నిర్లిప్తంగా దాన్ని ఆహ్వానిస్తారు. ఏది ఏమైనా ఇరవై నాలుగు గంటలలో మరణం అని తెలియగానే చాలామంది జీవచ్ఛవాలవుతారు. ఖైదీకి మరణ సమయం తెలియబర్చడానికి ఒక రోజు ముందు, అంటే మొత్తంమీద రెండు రోజుల ముందు, అతడి బంధువులకి ఆ విషయం తెలియబరుస్తారు. బంధువుల్ని ఆ విషయం ఖైదీకి చెప్పవద్దని అంటారు గానీ, అదెలాగైనా ప్రవర్తన బట్టి తెలిసిపోతుంది ఖైదీకి. మరణశిక్ష ధృవీకరింపబడిన ఖైదీల్ని సాధ్యమయినంతవరకూ ఒంటరిగానే వుంచుతారు. పిచ్చి ఆవేశంలో తోటి ఖైదీల మీద దౌర్జన్యం చేయకుండా..... అలాగే మిగతా ఖైదీలు నిద్రలో వున్నప్పుడే, సూర్యోదయానికి ముందే 'ఉరి' తీయబడుతుంది. నిశ్శబ్దంగా తమలోంచి ఒక ఖైదీ మాయమైన సంగతి మరుసటిరోజు ఖైదీలు గుర్తిస్తారు. అంతకుముందు రాత్రి డాక్టర్ వచ్చి అతణ్ణి పరీక్షచేశాడు. అతడు అనారోగ్యంగా లేడని ధృవీకరించాడు. అలా ధృవీకరిస్తేనే ఉరి అమలు జరుగుతుంది. ఆరోగ్యం సరిలేని ఖైదీని ఉరివేయరు. ఖైదీ కొత్త బట్టలు కట్టుకున్న తరువాత అతడి చేతులు వెనక్కి కట్టబడ్డాయి. ఇద్దరూ బయటికి వచ్చారు. ఖైదీ వెనుతిరిగి, ఆఖరిసారి తన గదిని చూసుకున్నాడు. గుమ్మం దగ్గర నిలబడిన సెంట్రీని కళ్ళతోనే పలకరించి, "............ వెళ్ళొస్తాను" అన్నట్టు చేశాడు. సెంట్రీ కళ్ళు తిప్పుకొన్నాడు. అతడు చాలా కుర్రవాడు. మరణాల్ని చూడలేదు - ఇంకా. వారందరూ వరండాలో నడుస్తూంటే జైల్లో గంట కొట్టింది..... నాలుగున్నర అయినట్టూ... మచ్చల్నీ, మిగతా గుర్తుల్నీ పరీక్షించి అతడే ఉరితీయబడాల్సిన వ్యక్తిగా ధృవీకరించి వ్రాసుకున్నారు. ఆ తరువాత వారెంట్ చదవబడింది. "నీ భార్యని హత్య చేశావన్న కారణంగా నిన్ను

ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 ననుసరించి ఉరి తీస్తున్నారు". అతడు మౌనంగా తనపై మోపబడిన అభియోగాన్ని విన్నాడు. ఖైదీ కాళ్ళు దగ్గరికి చేర్చబడ్డాయి. తెల్లటి తాడుతో వాటిని దగ్గరగా బంధించారు. బంధించేముందు "నీ ఆఖరి కోర్కె ఏదయినా వుందా?" అని అడిగారు. ఆరోజు నిద్రలేచిన దగ్గర్నుంచీ - మొట్ట మొదటిసారిగా అతడు నవ్వాడు" ..... ఏదైనా తీరుస్తారా?........... ఏదైనా?" అన్నాడు. నిజమే. చాలామందికి ఆ అపోహ వుంటుంది, జైలు అధికారులు ఏ ఆఖరి కోర్కెనైనా తీరుస్తారని, అది తప్పు. మాన్యుల్ ప్రకారం ఏ ఆఖరి కోరికా తీర్చఖ్కరలేదు.... చివరిసారిగా ఎవర్నయినా బంధువుల్ని చూడాల్నుంటే తప్ప అదైనా ముందుగా తెలియబరిస్తేనే. ఈ విషయంలో ప్రచారంలో వున్న కథలన్నీ చౌకబారు కథకులు ప్రచారం చేసినవి. ఖైదీ 'విల్లు' వ్రాయాలన్నా, వ్రాసిన విల్లు మార్చుకోవాలన్నా ఆఖరి కోర్కెగా దాన్ని తీర్చుకోవచ్చు. "చెప్పరేం? ఏదైనా తీరుస్తారా?" "తీర్చగలిగేది - చిన్నదేదైనా" అతడు తిరిగి నవ్వాడు "నా కోర్కె మీ రెవరూ తీర్చలేరు. దేవుడే తీర్చాలి" "ఏమిటా కోర్కె" "చనిపోయే ఆఖరి క్షణం ప్రార్థిస్తాను, విందురుగాని" అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకొన్నారు. తరువాత అతడి మొహం మీదుగా నల్లటి గుడ్డ కప్పబడింది..... అతడి మరణాన్ని ధృవీకరించడానికి డాక్టరూ, మరో యిద్దరు సాక్షులూ రెడీగా వున్నారు. అరుగు మధ్యలో చెక్క తాపడం వున్నది. దాని ప్రక్కనే లివర్ వుంది. ఖైదీ చెక్క తలుపు మీద నిల్చొనివున్నాడు. అతడి మెడకి ఉరితాడు బిగించబడింది. అంతా నిశ్శబ్దంగా, మెకానికల్‌గా జరుగుతోంది. సరీగ్గా ఇంకో అయిదు సెకన్లలో మరణం సంభవించబోతోంది. మొహానికి కప్పి వున్న నల్లటి గుడ్డ వెనుక నుంచి చిరంజీవి తండ్రి బిగ్గరగా అరిచాడు. "న్యాయస్థానం గుడ్డిది, చట్టం చెవిటిది. ఈ హత్య నేను చేయలేదు....చేయలేదు"

.....

కెవ్వున కేక పెట్టాడు చిరంజీవి "అయిపోయింది బాబాయ్! అయిదయిపోయింది. నాన్నని చంపేస్తున్నారు వాళ్ళు. అమ్మా చచ్చిపోయింది, నాన్న చచ్చిపోతున్నాడు......." బాబాయ్ ఇక ఆపుకోలేక "మీ నాన్న కాదురా మీ అమ్మను చంపింది, నేను!" అని అరిచాడు. బాబు స్థాణువయ్యాడు. "అవున్రా, మీ అమ్మ తప్పు చేసిందనీ, పతితురాలనీ జీవితాంతం కుమిలిపోనఖ్ఖర్లేదొరేయ్ నువ్వు! మీ అమ్మ పతివ్రతరా - మీ అమ్మ పతివ్రత. నేనే.... నేనే నీచుణ్ణి. ఒంటరిగా వుండటం చూసి కబళించాలనుకున్నాను." బాబు దు:ఖం మర్చిపోయాడు. ఊహించలేని ఆ నిజం ఆ పన్నెండేళ్ళ కుర్రవాణ్ణి నిశ్చేష్టుడిని చేసింది. అతడి బాబాయ్ గుండె పట్టుకొని కూలిపోయాడు. "బతిమాలిందిరా మీ అమ్మ, కాళ్ళు పట్టుకొని వేడుకుంది. అపర కాళి అయి కత్తి పీట తీసుకుంది. అయినా పశుబలం ముందు ఓడిపోయింది. ఆ ఓటమిలో ప్రాణాలర్పించింది. ఒక్కక్షణం ముందొచ్చిన నాన్న ఇంకోలా వూహించి ఆవేశంతో వూగిపోయాడు. ఆ ఆవేశాన్ని నేను ఇంకోలా వుపయోగించుకున్నాను. నేరాన్ని మీ నాన్న మీదకి తిప్పేశాను. నీకు తల్లి లేకుండా చేశాను, తండ్రినీ లేకుండా చేశాను. కానీ వొరేయ్.......మనిషిని పాపం వెంటాడుతూనే వుంటుందిరా, నిదర్శనం నేనే...." అతడు మెలికలు తిరిగిపోతున్నాడు ....." ఈ క్షోభ నేను భరించలేను. ఇది నన్ను మింగేస్తుంది.... నేను - నే - ను" ఆ తరువాత గొంతులోంచి మాటలు రాలేదు. ఎవరో నొక్కినట్టు ఆగిపోయాయి. తెరిచి వున్న కళ్ళు అలాగే స్థిరమైపోయాయి. గుండెమీద నుంచి చెయ్యి కిందికి జారిపోయింది.

.....

"మనిషిని చంపే హక్కు సాటి మనిషికి లేదు. బ్రతికితే బైట పడే నిజాన్ని చంపి శాశ్వతంగా పాతి పెడతారు.... ఈ శిక్ష రద్దు చేయాలి!" లివర్ కదులుతున్న చప్పుడు. ఆ చప్పుడుని మింగేస్తూ అతడి కంఠం జైలు గోడలు కంపించేలా ప్రతిధ్వనిస్తోంది "ఉరిశిక్షని రద్దు చెయ్యాలి. ఉరిని రద్దు చెయ్యాలి" లివరు వెళ్ళి కాళ్ళకింద తలుపు తాలూకు కొక్కాన్ని

రిలీజ్ చెయ్యటంతో దబ్‌మన్న శబ్దం. తలుపు కిందకి దిగిపోయింది. శరీరం గాలిలో వేలాడగానే మెడకి ఉరి బిగుసుకుంటుంది. సెకండ్, స్ప్లిట్ సెకెండ్. "ఉరిని రద్దు చెయ్యండి. అదే నా ఆఖరి కోరిక. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ మూడొందల రెండుని రద్దు చేయండి. ఇదే నా ఆఖ......" టప్‌మన్న చప్పుడుతో అతడి వెన్నెముక పై భాగం మెడ దగ్గర విరిగిపోయింది. పాంటులో స్పెర్మ్ రిలీజయింది. ప్రపంచంలోవున్న విధానాల్లోకెల్లా అత్యంత సులభంగా చావును సంపాదించిపెట్టే విధానం..... మెడకి ఉరి వేసి చంపటం..... తాడు ముడి మెడని విరగకొట్టగానే సెకనులో స్పృహ తప్పిపోతుంది. స్పెర్మ్ రిలీజ్ అవటంతో అది అత్యంత సంతృప్తికరమైన మరణంగా అతడిని పైలోకాలకి తీసుకుపోతుంది. అతడి శరీరం లోపలికి వెళ్ళిపోగానే అక్కడ ఒక్కసారిగా 'స్' మన్న శబ్దం వచ్చింది. అప్పటివరకూ బిగపట్టిన వూపిరి అంతమందీ ఒక్కసారి వదలటం వలన వచ్చిన శబ్దం అది. ఎంత అనుభవపూర్వకంగా చేసినా ఆఖరి క్షణం వరకూ టెన్షనే. ఆ తరువాత నాలుగైదు రోజుల వరకూ ఆ దృశ్యం కళ్ళముందు కదలాడుతూనే వుంటుంది. ముందే మరణం తెలిసిన మనిషి వృద్ధుడు కాడు. మృత్యువుతో పోరాడటానికి డాక్టర్ వుండడు. బేలగా చూస్తూ చుట్టూ బంధువులుండరు. చీకటి గదిలో ఒంటరితనం, నిశ్శబ్దంగా నడుచుకుంటూ ఉరికంబం దగ్గరకి రావటం, అనుభవజ్ఞుడైన డాక్టర్ ఆపరేషన్ చేసినట్టు అతడి మెడకి ఉరి బిగించి ప్రాణాలు తీయటం. ఎవరిచ్చారు ఆ అధికారం? కళ్ళు లేని, చెవులూ సరిగ్గా లేని ఈ న్యాయస్థానానికి - బ్రతకటం మనిషి హక్కుగా నిర్ణయిస్తూ మనం రాసుకున్న కాన్స్టిట్యూషన్‌కి వ్యతిరేకంగా ఉరి తీసే హక్కు! అతడి శరీరం అరగంట పాటు అలాగే వుంచబడింది. తరువాత డాక్టరు పరీక్షించి మరణాన్ని ధృవీకరించాడు. సూపరింటెండెంట్ కాగితాల్లో తన విధి నిర్వర్తించినట్టు వ్రాసుకుని ఫైలు మూసేశాడు. ఉరి తీయబడిన వ్యక్తి శవాన్ని బంధువులకి అప్పగించరు. దాన్ని బైటకి తీసుకుపోయారు. తూర్పు నుంచి సూర్యుడు నెమ్మదిగా పైకి వస్తున్నాడు. ఆ ఆవరణ అంతా నిర్మానుష్యంగా వుంది. ఒక ముసల్ది మాత్రం చీపిరికట్టతో ఒక మూల ఊడుస్తోంది. అంతా నిశ్శబ్దంగా వుంది. ఉరి స్థంభపు అడుగులోతుల్లోంచి మాత్రం ...... ఒక ఆత్మ - శరీరంలో కొట్టుకొని కొట్టుకొని అప్పుడే బైటకి వచ్చి - ఎలుగెత్తి అరుస్తూన్నట్టూ వుంది- "ఉరి శిక్ష రద్దు చేయండి..... ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 ని మార్చండి" - అని - ఇది జరిగి పన్నెండు సంవత్సరాలైంది.

....

"పాలు తక్కువ వేసి ఒక కాఫీ. పంచదార కూడా తక్కువగానే వుండాలి. అలా అన్చెప్పి - " చిరంజీవి మాటలు పూర్తి కాలేదు "షుగర్ తక్కువ స్ట్రాంగ్ కాఫీ ఓటీ" అని అరిచి సర్వర్ అక్కణ్ణుంచి వెళ్ళిపోయేడు హడావుడిగా. చిరంజీవి బక్కచిక్కిపోయాడు, తన మాటలు అతడు పూర్తిగా విననందుకు. అయినా వెళ్ళిపోతున్న సర్వర్‌ని ఆరాధనా పూర్వకంగా చూశాడు. ఎంత గట్టిగా అరిచాడు? ఇంతమంది జనం మధ్యలో ఎవర్నీ పట్టించుకోకుండా ఎంత కమేండింగ్‌గా - ఇంతలో వెయిటర్ స్ట్రాంగ్‌కాఫీ తెచ్చి బల్ల మీద పెట్టి వెళ్ళిపోయాడు. అప్పుడు కదిలింది ముక్కులో ఏదో స్థాణువై - నిశ్చేష్టుడై - ఆగిపోయాడు. తనకు తుమ్ము రాబోతూందని అర్థమైంది. ఆ ఆ ఆ హచ్చ్ - అని తుమ్మితే - అమ్మో - అని కళ్ళూ తన వైపు తిరగవూ...... తింటూన్న వాళ్ళంతా తమ చర్యని ఆపి, తనను చూడరూ! ఎక్కడో చదివేడు - తుమ్మితే నీటి తుంపర్లు గంటకు నూరు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయట. నోటికి చేతులు అడ్డుపెట్టి ముందే వాటిని నిరోధించవచ్చుగానీ, శబ్దాన్ని ఆపు చెయ్యలేముకదా, జనాన్ని ఆకర్షించేది ఒక్కసారిగా వెలువడే ఆ శబ్దమే కదా! అయినా తన ప్రయత్నం, పనిలో నిమగ్నమైవున్న జనాన్ని తనవైపు ఆకర్షించకుండా వుండాలనే కదా. అప్పుడు తట్టింది అతడికి ఆలోచన. గుండెల్నిండా శ్వాస పీల్చి వదిలితే తుమ్ము రాదనీ - వచ్చేది ఆగిపోతుందనీ పెద్దలు చెప్పారు. తనని తనే ఆ ఆలోచన వచ్చినందుకు అభినందించుకుని, కళ్ళు మూసుకొని ఊపిరి తీసి వదలటం ప్రారంభించాడు. భారంగా వూపిరి వదులుతూ రెండు నిమిషాలు గడిపిన తరువాత అంతా సర్దుకొన్నట్టు అనిపించి, కళ్ళు తెరిచి, చుట్టూ వున్న దృశ్యాన్ని చూసి అవాక్కయిపోయాడు. వెయిటర్ మంచినీళ్ళు పట్టుకొని అతడి వైపే ఆందోళనగా చూస్తున్నాడు. పక్క టేబిలు కండువా

పంచాయనా, ఎడమ వైపు అడ్డబొట్టు పెద్ద మనిషీ తినటం సగంలో ఆపి అతడ్నే అనుమానంగా చూస్తున్నారు. ఎదుటి దారాసింగ్ కన్నార్పకుండా పరికిస్తున్నాడు. చిరంజీవి బిక్కచిక్కిపోయి "బిల్లు" అన్నాడు. "ఏమైంది సార్" "ఏమీ కాలేదు - బిల్లు...." వెయిటర్ బిల్లిచ్చి వెళ్ళిపోయాడు. వాతావరణం అంతా మామూలుగా సర్దుకున్నదని నమ్మకం కలిగాక బిల్లు పట్టుకుని లేచాడు. లేస్తూ బిల్లు చూసి ఉలిక్కిపడ్డాడు. బిల్లు అయిదు పైసలెక్కువైంది - అతడి దగ్గరున్న డబ్బు కంటే. అసలతడి దగ్గర ఎక్కువ డబ్బులేదు. అందుకే నిన్న సాయంత్రం తాలూకూ భోజనమూ, పొద్దున చేయవలసిన బ్రేక్‌ఫాస్టూ కలిపి ఒకేసారి, రెండిడ్లీ ఒక స్ట్రాంగ్ కాఫీగా తన దగ్గరున్న డబ్బులకి సరిచూసుకొని లాగించేశాడు. అంతలా చూసుకొని చూసుకొని తిన్నా అయిదు పైసలెక్కువవటం అతడిని చాలా ఇబ్బందిలో పడేసింది. సర్వరేమనుకుంటాడో అని భయపడుతూనే బిల్లు చూపించి, సర్వరు కూడికల పట్ల తనకేవిధమైన అనుమానం లేదనీ, కానీ ఎన్నో లెక్కలు - ఎంత మంది తిన్నవో మనసులో పెట్టుకోవాల్సిన గురుతరమైన బాధ్యతలో చిన్న పొరపాటు చేసి వుండవచ్చనీ సూచించాడు. "నూట పదిహేను పైసలు కరెక్టే సార్" "కానీ నిన్న ఇదే రెండిడ్లీ - ఒక్క కాఫీకి నూట పది పైసలే అయింది కదా" "నిన్న సాయంత్రం మినిస్ట్రీ మారింది కద్సార్" అనేసి వాడెళ్ళిపోయాడు. చిరంజీవి బి.య్యేలో ఎకనామిక్సూ పాలిటిక్సే. కానీ రాజకీయాలకీ, ఆర్థిక శాస్త్రానికీ అంత దగ్గర సంబంధం వుంటుందని అతడికి అప్పుడే తెలిసింది. కౌంటర్‌వైపు చూశాడు. అక్కడ కూర్చున్నాయన సౌమ్యుడిలా కనిపించి ధైర్యం తెచ్చుకుని దగ్గరకి వెళ్ళి, వున్న డబ్బులిచ్చి "రుబ్బురోలెక్కడ సార్" అడిగాడు మర్యాదగా. "మా వోటలంతా ఎలక్ట్రీ కరెంటే" అన్నాడాయన. "ఎల్లెల్బీ పాసయ్యాను. మరీ ఎంత ఉస్మానియా యూనివర్సిటీ అయినా, కప్పులు కడగటం అంత బావోదేమో! దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు. "అసలు విషయం ఏమిటి?" చిరంజీవి అయిదు పైసలు తక్కువైన విషయం చెప్పాడు. ఆయన భోళాగా నవ్వేసి "జీవితం ఖాళీ అయిపోయిన కప్పులాంటిది. డబ్బులు ప్లేట్లో ఇడ్లీల్లాంటివి. ఒకదాని కోసం ఇంకొకటి ఖర్చుపెట్టకు నాయనా, ఫర్లేదులే" అన్నాడు. మనస్ఫూర్తిగా ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుని బైట పడ్డాడు చిరంజీవి.

.....

"ఇలాటి వాడివి ఈ జీవితంలో ఎలా బ్రతుకుతావో నాకు అర్థం కావటం లేదు...." అన్నాడు యస్సెస్ స్ఫూర్తి.

"ఎలాటివాడిని జీవితంలో ఎలా బ్రతుకుతానో నీకు అర్థం కావటం లేదు?" అని అడిగాడు చిరంజీవి అర్థంకాక.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

2 వ భాగం

"గట్టిగా తుమ్మితే ఎవరేమనుకుంటారో అని భయపడేవాడివి.... బల్ల మీద ఓ రేటూ, బిల్లుమీద ఓరేటూ వేస్తే గట్టిగా దెబ్బలాడలేని వాడివి...."

"నా జీవితాశయం వ్యవస్థకు పట్టిన దుమ్ము దులిపి హోటల్ రేట్లని అదుపులో పెట్టటం కాదు....."

"మరి?"

"ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302ని మార్చటం! భారతదేశపు న్యాయశాస్త్ర పరిధి నుంచి ఉరిశిక్షని రద్దు చేయటం!!! నా తండ్రిని పొట్టన బెట్టుకున్న ఈ సమాజంమీద కసి దీర్చుకోవటం!" పిడికిలి బిగించి ప్రతిజ్ఞ చేశాడు.

"చూడమ్మా చిరంజీవి..... ప్రాక్టీసు పెట్టి మూడేళ్ళయింది. బైట నిలబడితే చెట్టుకింద ప్లీడరంటారని లోపల కూర్చుంటున్నావు తప్పితే, ఇంతవరకూ ఒక్క కేసు వాదించలేదు నువ్వు. భారతదేశపు మ్యాపులో ఢిల్లీ ఎక్కడుంటుందో నీకు తెలియదు. ఢిల్లీలో పార్లమెంటెక్కడా అని గట్టిగా అడిగితే బీచి ఒడ్డున అంటావు. అటువంటిది...... నువ్వు - ఐ.పి.సి. ని మారుస్తావా......?"

"నవ్వితే నాపచేనే పండుతుంది శేషావతారం! ఆరువందలమంది పార్లమెంటు సభ్యులు....." అతడు మాట్లాడటం ఆపుచేసి కలల్లోకి వెళ్ళిపోయాడు.

ట్లింగ్.....ట్లింగ్.....

పార్లమెంటులోంచి చిరంజీవి బైటకి వస్తున్నాడు. విశాలమైన మెట్లు ...... ఇరువైపులా పార్లమెంటు సభ్యులు ..... రాజ్యసభ మెంబర్లు..... నవ్వుతూ విష్ చేసి, కళ్ళతోనే కంగ్రాట్స్ చెప్పి వెళ్ళిపోయిన ప్రధాన మంత్రి.

చిరంజీవి రెండు మెట్లు దిగి యెదురుగా వున్న అశేష ప్రజానీకాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. కొంతమంది చేతిలో దండలు, కొంత మంది చేతిలో జెండాలు, అందరి మొహాల్లో సంతోషం, హర్షధ్వానాలు చేస్తున్నారు కొందరు. 'లాంగ్ లివ్ చిరంజీవి' అంటున్నారు కొంతమంది.

చిరంజీవి మైక్ పట్టుకోగానే సూది పడితే వినపడేటంత నిశ్శబ్దం. అతడి ముందు దూరదర్శన్, ఆకాశవాణి వాళ్ళు మైకుల్తో కలిసి ఇరవై అయిదు మైకులున్నాయి. ప్రెసిడెంట్‌కి కూడా పదహారుకన్నా యెక్కువ వుపయోగించరు.

"మహాజనులారా! నా భారత మిత్రులారా....."

సముద్ర కెరటంలా చప్పట్లు - వెంటనే నిశ్శబ్దం. అందరూ ఉత్సుకతతో అతడు చెప్పబోయేది వింటున్నారు.

"భారతదేశంలో ఉరిశిక్ష రద్దు చేయటానికి వీలులేదు అని కోర్టు మొన్న మొన్నే (మే 9, 1981న) బచ్చన్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో తీర్పు ఇచ్చింది! నాలో ఆవేశం రగలటానికి కారణం అదే! ప్రపంచం అంతా ఉరిశిక్ష రద్దు కోసం

ఆలోచిస్తూ వుంటే మనదేశం అమాయకుల్నీ, విప్లవకారుల్నీ ఉరి తీస్తుంది. బలమైనవాడు హత్య చేసి, బలహీనుడి మీద బుజువుల్తో సహా రుద్దితే - వాడు వురికంబం ఎక్కుతున్నాడు"

విపరీతమైన చప్పట్లు - ఆపమన్నట్టూ చిరంజీవి చెయ్యి ఎత్తి, చెప్పటం మొదలుపెట్టాడు.

".....బాత్రా కేసులో స్పెషన్స్ జడ్జి ఓమ్రా .....సునీల్ బాత్రా అనే ఈ ముద్దాయిని చాలా దారుణమైన వ్యక్తిగా గుర్తించి అతడికి ఉరిశిక్షే సరి అయినదిగా భావిస్తున్నాను అని జడ్జిమెంటు ఇచ్చాడు. 1981లో ఇదే కేసు సుప్రీంకోర్టుకు వచ్చినప్పుడు జస్టిస్ సర్కారియా జడ్జిమెంట్ చెబుతూ, 'మరణశిక్ష అనేది అత్యంత అరుదైన సందర్భాల్లోనే విధించాలి. ఈ కేసుని అంత దారుణమైన దాన్నిగా నేను పరిగణించటంలేదు. ముద్దాయి మరణశిక్షని యావజ్జీవ కారాగార శిక్షగా మారుస్తున్నాను' అన్నాడు.

ఒక మనిషిని చంపాలా, బ్రతికించి వుంచాలా అన్న వేర్వేరు దృక్పథాలు ఎంత కొద్దిలో మారుతున్నాయో గమనించండి, మనిషి మరణానికీ, బ్రతుక్కీ తేడా ఇంత చిన్నదా అని ఆలోచించినప్పుడు నా కర్తవ్యం నాకు బోధపడి ఈ పోరాటానికి నన్ను ఆయత్తం చేసింది. మీ అందరి ఆశీర్వాదాలతో గెల్చాను"

వందలాది కెమేరాలు క్లిక్ మన్నాయ్...... ఎవరో నీళ్ళు అందించారు.......... అవి తాగి చిరంజీవి ఉపన్యాసం కొనసాగించాడు.

"క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కి కొత్తగా జత చేయబడిన సెక్షన్ 235(2) మరింత అయోమయంలో పడేస్తుంది. హత్యల్లో కూడా కొన్ని కేటగిరీలు ఏర్పరచారు (నవ్వులు). మీరు గుండెల్లో పొడిచినా అవతలి వ్యక్తి మరణించకపోతే మీకు ఉరిశిక్ష పడదు. మీరు మోచేతితో పొడిచి, వాడు ఛస్తే ఉరిశిక్ష ఖాయం. ఇంత బేవార్సుగా వుంది మన న్యాయశాస్త్రం."

అతడామాట అనేసరికి జనం ఉత్సాహం కట్టలు తెంచుకుంది. తమ ప్రియతమ నాయకుడికి దూరంగా వుండలేకపోయారు. ప్రవాహంలా దగ్గరకొచ్చేశారు. అమ్మాయిలు చుట్టుముట్టి ఆటో గ్రాఫ్‌లకోసం ఎగబడ్డారు.

ఒకమ్మాయి ముద్దు పెట్టేసుకుంది కూడా. "ఏ కాలేజీ మీది" అడిగాడు. "మేరీస్టెల్లా" అంది రహస్యంగా.

ఒక చేత్తో సరిపోవటంలేదు. రెండు చేతుల్తో ఆటోగ్రాఫ్‌లు పెట్టేస్తున్నాడు.

"ఒరేయ్! కళ్ళు మూసుకుని ఏమిట్రా ఆ భరతనాట్యం?"

గ్ ంట్లే...... గ్ ంట్లే.....

చప్పున ఈ ప్రపంచంలోకి వచ్చేశాడు. తన వైపు తెల్లబోయి చూస్తున్న స్ఫూర్తికి తన కల విషయం చెప్పాడు.

"పగటికల కూడా సరిగ్గా కనలేవా బ్రదర్. ఢిల్లీలో మేరీ స్టెల్లా కాలేజీ యెక్కడుంది? విజయవాడలో కదా వున్నది!"

"అంతేనంటావా. పోనీ ఢిల్లీ ఎక్స్‌కర్షన్ కొచ్చారనుకోరాదూ అమ్మాయిలు!"

"ఎక్స్‌కర్షన్ కొచ్చినవాళ్ళు కుతుబ్‌మీనారూ, ఎర్రకోట చూడకుండా నీ ఉపన్యాసానికి ఎందుకొస్తారు!"

"కుతుబ్‌మీనారూ, ఎర్రకోట చరిత్రలో ఎలా నిల్చిపోయాయో అలాగే చిరంజీవి పేరూ చిరంజీవి అవుతుంది చూస్తూ

వుండు''.

"పోస్ట్'' అంటూ కవరు విసిరేసి వెళ్ళిపోయాడు పోస్టు బంట్రోతు.

అందమైన కవరు. పైన నీట్‌గా 'చిరంజీవి' అని టైప్ చేసి వుంది. విప్పి చూశాడు. అందులో ఇలా వుంది ఇంగ్లీషులో -

"ప్రియమైన మీకు (డియర్ సర్).

జనవరి ఇరవై నాలుగో తారీఖు సాయంత్రం ఆరింటికి మా ఇంట్లో ఇచ్చే కాక్ టెయిల్ పార్టీకి మీరు వచ్చి, మీ కంపెనీతో నన్ను ఆనందింపచేయ ప్రార్ధన.

ఇట్లు, సర్వోత్తమరావు, అడ్వకేట్''

కెవ్వున కేక పెట్టబోయి తమాయించుకున్నాడు చిరంజీవి.

సర్వోత్తమరావు! దేశానికి పాల్కీవాలా ఎలాగో క్రిమినల్‌లో సర్వోత్తమరావు అలా. అలాంటి సర్వోత్తమరావు తనని పార్టీకి పిలవటం ఏమిటి? అతడు కవరు తిప్పి అడ్రసు చూసుకున్నాడు. తనదే!

"గురూ ఇది మనదేనంటావా?'' అన్నాడు చిరంజీవి.

"నిస్సంశయంగా మనదే'' అని నవ్వి "కాదని ఎలా అనుకోమంటావ్? ఆ పాల్కీవాలా కారు డ్రైవరుకి మనకన్నా రెండు రెట్లు ఎక్కువ జీతం రావొచ్చుగాక..... అయినా ఈ పార్టీకి నువ్వెళ్తున్నావ్'' అన్నాడు స్ఫూర్తి.

చిరంజీవి విస్మయంతో తలెత్తి చూశాడు.

"అవును గురూ. నువ్వీ పార్టీకి వెళ్తున్నావ్. 'తెలివైనవాడు అవకాశాల్ని వెతుక్కొంటాడు, అవి వచ్చేవరకూ కాచుకుని కూర్చోడు' అని అన్నాడు కవి కాళిదాసు. అలాంటిది పొరపాటో, గ్రహపాటో నీకో క్రిమినల్ లాయర్లు, హైకోర్టు జడ్జీలు, రాజకీయ నాయకులు, గవర్నరు - పార్టీ అంటే అందరూ వస్తారు. నువ్వూ వెళ్ళాలి. వెళ్తున్నావ్'' అని చిరంజీవి చేతిలో కవరు వణకటం చూసి, "అదేమిటి'' అన్నాడు.

"భయం వేస్తూంది గురూ.''

స్ఫూర్తి విసుగ్గా చూసి "ఈ లెఖ్ఖన నువ్వు పీనల్ కోడ్ కాదు కదా - పిన్ కోడ్ కూడా మార్చలేవ్'' అన్నాడు.

"కోప్పడకు - వెళ్తాన్లే'' అన్నాడు చిరంజీవి బిక్కమొహం పెట్టి.

....

"సూటయితే పన్నెండు రూపాయలు. లోపల చొక్కాకూడా తీసుకుంటే యింకో రెండ్రూపాయలెక్కువ..... రేపొద్దునకల్లా తెచ్చి యిచ్చేయాలి'' అన్నాడు లాండ్రీవాడు.

"టై ఎంత?''

"ఎర్ర టై అర్ధరూపాయి, నల్ల టై అయితే రూపాయి"

"ఉట్టి పాంటెంత?"

"నాలుగు రూపాయలు."

"ఉట్టి కోటు?"

"ఎనిమిది రూపాయలు."

"అయితే ఉట్టికోటూ, ఎర్రటై ఇవ్వు - చాలు" ఎనిమిదిన్నర తీసి యిస్తూ అన్నాడు.

"మరి షర్టూ, పాంటూ గురో" అని మధ్యలో కల్పించుకున్నాడు చిరంజీవి.

"నీ దగ్గర నల్లపాంటు లేదా?"

"ఉంది కానీ మాసిపోయింది."

"తెల్లషర్టు లేదా?"

"ఉంది కానీ అక్కడక్కడా చిరిగిపోయింది."

"షర్టు కోటు లోపలికి వుంటుంది కాబట్టి చిరిగినా ఫర్లేదు. నల్ల పాంట్ ఏ కోటు మీదకైనా సూటవుతుంది. కాబట్టి మరీ ఫరవాలేదు. అదీ గాక మన దగ్గర ఈడ్చితంతే పది రూపాయలు కన్నా యెక్కువలేవు. అసలు విషయం అదీ......"

ఇది జరిగిన యిరవై ఆరు గంటలకి అంటే ఆ మరుసటిరోజు ఆరు గంటలకి - నల్ల పాంటు మీద బ్రౌనుకోటు వేసుకొని దానిమీద ఎర్ర టై కట్టుకొని 'మేరానామ్ జోకర్'లో రాజ్ కపూర్‌లా అతడు సర్వోత్తమరావు యింటికి బయలుదేరాడు.

## 3

విశాలమైన కాంపౌండు. ప్రహరీగోడ నానుకొనే అశోకవృక్షాలూ, లోపలికి ఎర్రమట్టి రోడ్డు....... రోడ్డు కిరువైపులా తెల్ల సున్నం వేసిన ఇటుక రాళ్ళూ..... చిన్న పోర్టికో... అందమైన బంగళా.

మెయిన్ రోడ్డు మీద విజిల్ వేసుకుంటూ అటూ యిటూ రెండుసార్లు నడిచాడు చిరంజీవి. ఇంకో రెండుసార్లు నడిచేవాడే కానీ, దొంగేమోనని గూర్ఖా అనుమానపడ్తాడేమోనని అనుమానపడ్డాడు. కార్లేగానీ పురుగుకూడా లోపలికి నడిచి వెళ్ళటం లేదు. పురుగులెలాగో నడవ్వు. అది వేరే సంగతి.

ఒక్కసారి మనసారా దేవుణ్ణి స్మరించి పాంటు జేబులో వున్న ఇన్విటేషన్ కార్డుని జేబులో పెట్టుకుని గట్టిగా పట్టుకుని బింకంగా లోపలికి నడిచాడు. గూర్ఖాని దాటుతూంటే గుండె వేగంగా కొట్టుకోసాగింది. వాడి వైపు ఓ చిరునవ్వు పారేసి, ఆ నవ్వుకి వాడు రెస్పాన్స్ ఇవ్వకపోయేసరికి దాన్ని చిన్న దగ్గుగా మార్చి లోపలికి హుందాగా నడిచాడు.

మెట్లకానుకొని నిలువెత్తు అద్దాల తలుపులు తోసుకుని లోపల ప్రవేశించాడు. ఒక క్షణం లోపల వైభవాన్ని చూసి అవాక్కై నిలబడిపోయాడు.

ఆసియాలో కెల్లా పెద్ద షాండ్లియర్ ఆగ్రా మొగల్ హోటల్లో వుందని ఎక్కడో చదివాడు. అంత పెద్ద దీపం హాలుమధ్య వేలాడుతోంది. దాంట్లోంచి వెలువడుతున్న రకరకాల కాంతులు కింద మనుషుల మధ్య అందంగా ప్రతిబింబిస్తున్నాయి. గుమ్మం దగ్గర్నుంచి హాలు అటు చివర పై మెట్లవరకూ వేసిన వాల్ టు వాల్ కార్పెట్‌కి అయిన ఖర్చు ఒక కుటుంబాన్ని జీవితాంతం పోషిస్తుంది.

చిరంజీవి ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. పొరబాటున వచ్చినట్లు అక్కణ్ణుంచి స్టైయిల్‌గా వెనక్కి వెళ్ళిపోదామనుకున్నాడు గానీ, 'హాల్లో' అన్న పలకరింపు వినిపించి, ఉలిక్కిపడి తిరిగి చూశాడు.

డాక్టర్ ప్రకాష్ - పక్కనే ట్రేతో వెయిటర్. గొంతులో వెలక్కాయ పడటం అంటే ఏమిటో అప్పుడు అర్ధమయింది చిరంజీవికి. ట్రేలో మొత్తం పదహారు గ్లాసులున్నాయి. ఎనిమిది నిండుగా వున్నాయి. రెండు ముప్పాతిక వంతులున్నాయి, నాలుగు సగం వున్నాయి.

రెండింటిలో రెండేసి గుక్కలు చొప్పున వున్నాయి. నిండుగా వున్న గ్లాసుల్లో మూడింటిలో పచ్చటి ద్రవం వున్నది. నాలుగింటిలో తెల్లది, ఒకదాన్లో ఎర్రది, సగం గ్లాసులు నల్లవి. అందులో కొన్ని లెమనేడ్ కలసిన జిన్నులు - కొన్ని రమ్ములు, కొన్ని సన్‌సిప్‌వారి తయారీ! కానీ ఏది తీసుకోవటం?.... పెద్దగ్లాసు తీసుకుంటే కక్కుర్తి అని నవ్వుతారేమో....

మరిక ఆలస్యం చేస్తే బావోదని మనసు చెప్పగానే చాకులా చెయ్యి కదిల్చి (ట్రేలో అన్నిటికన్నా తక్కువ ద్రవం వున్న గ్లాసు) తీసుకున్నాడు.

అది ట్రిబుల్ ఎక్స్ రమ్!!!

రేప్ తప్పనిసరి అయినప్పుడు కళ్ళు మూసుకుని హాయిగా అనుభవించమన్నాడు కవి కాళిదాసు. ఏ గ్లాసులో ఏమున్నదో తెలియనప్పుడు కక్కుర్తిపడ్డాడూ అనిపించుకోవటం కంటే అదే మంచిది. గ్లాసు నోటి దగ్గరకి తీసుకొంటూ, ఆకస్మాత్తుగా ప్రకాష్ కళ్ళలో ఆశ్చర్యం గమనించి యేమిటన్నట్లు చూశాడు.

"రియల్లీ వండ్రపుల్, మీరు పైకి అలా కనబడుతున్నారుగానీ... అమ్మో"అన్నాడు విస్మయం, సంభ్రమం నిండిన గొంతుతో.

"యస్ మిస్టర్ ప్రకాష్, మీరేం చెప్పదల్చుకున్నారు?" అన్నట్లు కళ్ళెగరేశాడు చిరంజీవి.

ప్రకాష్ ఏమీ చెప్పలేదు కానీ, గ్లాసు పైకెత్తి 'ఛీర్స్' అన్నాడు.

అమ్మ! ఇంతసేపటికి ఈ వాతావరణంలో తనకి తెలిసిన పదం ఒకటి వినబడింది. తనూ 'ఛీర్స్' అని గ్లాసులోంచి ఒక గుటక నోట్లో పోసుకున్నాడు. అయితే ఆపిల్ జ్యూస్‌కి ఛీర్స్ చెప్పరని అతడికి తెలీదు. ఎప్పుడూ మందు కొట్టనివాడు మొదటిసారి కొడ్తే ఆ తరువాత అతడి అవస్థని అయిదు భాగాలుగా విడగొట్టవచ్చు.

మొదటి క్షణం ఏమీ తెలియదు, అంటే నిరామయ లక్ష్య కారక అయోమయస్థితి అన్నమాట. యోగులకూ సాధువులకూ తపస్సు చేస్తే లభ్యమయ్యే స్థితి అది.

ఆ తరువాత మంట! బాగా వెలుగుతూన్న కాగడాని గొంతులో దూర్చినట్టు!!!

ఆ తరువాత పేగుల్లో చిన్న కదలిక. ఆ కదలిక ఊపిరితిత్తుల్ని కదల్చగా, అక్కడవున్న గాలి స్థానభ్రంశం చెంది, ముక్కునించి బైటకి రావటానికి ప్రయత్నించి అక్కడ అంత చోటులేక నోటినుంచి వచ్చేయటానికి చేసిన ఘర్షణ మూడో స్థితి - ఆ పొర పొవటాన్ని ఆపే ప్రయత్నంలో వచ్చిన దగ్గు..!

అన్నిటికన్నా అయిదో స్థితి గొప్పది. స్వామీ అద్వైతానంద చెప్పింది..... మన బాధని మనలోనే దాచుకొని యితరులకి చిరునవ్వు పంచి యివ్వటం అనేది.

నిముషంలో పై బాధలన్నీ అనుభవించేసి, నవ్వుతూ "చెప్పండి ఏమిటి విశేషాలు" అన్నాడు చిరంజీవి.

ప్రకాష్ నవ్వలేదు. చిరంజీవి వైపు ఆరాధనాపూర్వకంగా చూస్తూ "ఐస్ కూడా వేసుకోకుండా తాగేస్తున్నారే! రియల్లీ గ్రేట్" అన్నాడు.

అమ్మ ప్రకాషూ దొరికావ్ కదా! ఆ తరువాత వారిద్దరి మధ్యా సంభాషణ యిలా జరిగింది.

"అవును మిస్టర్ ప్రకాష్! మొదట్లో బాధగానే వుంటుంది. కానీ ఒకసారి అలవాటయితే చాలా బావుంటుంది."

"అయితే దీనికి చాలా అనుభవమూ, నరాల మీద కంట్రోలు కావాలని నా వుద్దేశ్యం"

"అవును మొదట్లో కష్టం. అయినా మీరెందుకు ప్రయత్నించకూడదు?"

"నాకు భయం"

"భయం మనిషిని కృంగదీస్తుంది మిస్టర్ ప్రకాష్. జీవితంలో పైకి రావాలంటే దూసుకుపోవాలి బేరర్.....ఇదిగో."

"అయిదు నిముషాల్లో రెండో పెగ్? మైగాడ్. మిమ్మల్ని చూసినవారెవరూ మీరింత గొప్పవారనుకోరు సార్"

"ఆష్ కవర్డ్ ఫైర్ అన్న సామెత మీ రెప్పుడూ వినలేదా మిస్టర్ ప్రకాష్" సంభాషణ స్వచ్ఛమైన ఇంగ్లీషులో జరుగుతోంది.

"బెగ్ పార్డన్ సర్"

"నివురు కప్పిన నిప్పు...... మిస్టర్ ప్రకాష్! ఆష్ కవర్డ్ ఫైర్."

ఈ లోపులో అక్కడ వున్నట్టుండి వాతావరణం నిశ్శబ్దం అయింది. అందరూ అటు చూడటం చూసి, చిరంజీవి కూడా అటు తిరిగాడు. కొంచెం ఎత్తయిన ప్లేస్‌మీద సర్వోత్తమరావు గారు నిలబడి వున్నారు. ఆయన మాట్లాడదల్చుకొన్నారని అర్ధమై అందుకోసం రెండు నిమిషాలు మౌనంగా వుండదల్చాడు చిరంజీవి.

"మైడియర్ లెర్నెడ్ ఫ్రెండ్స్!" ఆయన కంఠం గంభీరంగా పలికింది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

3వ భాగం

"మీ అందర్నీ యిక్కడికి ఈ రోజు యిలా ఆహ్వానించటంలో ఒక అంతరార్థం వుంది. మీరందరూ బాగా చదువుకున్నవారు. మీ మీ వృత్తుల్లో నిష్ణాతులు. క్షమించాలి. నాకు తెలుగు సరిగ్గా రాదు. (నవ్వులు) మీలో లాయర్లున్నారు, డాక్టర్లున్నారు, ఇద్దరు పార్లమెంటేరియన్లు కూడా వున్నారు" ఆయన కొంచెం ఆగి, తిరిగి మాట్లాడసాగారు.

"నాగురించి మీకు తెలుసు, దాదాపు ఇరవై అయిదు సంవత్సరాల్నుంచీ ప్రాక్టీసు చేస్తున్నాను. క్రిమినల్ లాయర్‌గా కొద్దో గొప్పో పేరు సంపాదించాను."

ఒక ఖద్దరు చొక్కా ఆయన కల్పించుకుని "కొద్దేమిటీ? దేశంలో వున్న కొద్దిలో ఒకరిగా" అన్నాడు. మళ్ళీ నవ్వులు. సర్వోత్తమరావు కూడా నవ్వారు. అంతలోనే ఆయన మొహంలో నవ్వు మాయమైంది. ఒక క్షణం మౌనంగా వుండి ఆయన చెప్పటం మొదలు పెట్టారు.

"నా ఇరవై అయిదు సంవత్సరాల న్యాయవాద వృత్తిలో ఎన్నో కేసులు వాదించాను. కొన్ని గెల్చాను, కొన్ని ఓడిపోయాను. అయితే క్రిమినల్ లాయర్‌ని అవటం వల్ల నా దగ్గరకొచ్చే వాళ్ళందరూ జూదర్లూ, తాగుబోతులూ, హంతకులే"

శ్రోతలు నవ్వబోయి, ఆయన మొహం సీరియస్‌గా వుండటం చూసి మానేశారు.

"ఫ్రెండ్స్! నా దగ్గరకొచ్చిన ప్రతి కేసూ నేను తీసుకోలేదు. ముద్దాయి నిర్దోషి అని మనస్ఫూర్తిగా నేను నమ్మిన తరువాతే ఆ కేసు టేకప్ చేస్తూ వచ్చాను. దానికోసం సుప్రీం కోర్టు వరకూ వెళ్ళిన సందర్భాలు చాలా వున్నాయి. ఆ విషయం మీకు తెలుసు."

ఆ విషయం అక్కడ చాలామందికి తెలుసు. అంతే కాదు, ముద్దాయి నిర్దోషి అని నమ్మితే, తనే స్వంత ఖర్చుతో పైకోర్టులో అప్పీలు చేస్తారని ప్రతీతి. అందుకే నలభై అయిదు సంవత్సరాల వయసులోనే దేశంలోకెల్లా విశిష్టమైన లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. "ఒక్కోసారి ప్రాసిక్యూషన్ ఆధారాల్తో నా క్లయింటు నిజంగా నేరం చేశాడని నేను కూడా నమ్మే స్థితి ఏర్పడుతుంది. అప్పుడు ముద్దాయికి శిక్షపడితే నేను అంత చింతించను కానీ........ కానీ..." ఆయన ఆగాడు "ప్రాసిక్యూషన్ తప్పుడు సాక్ష్యాల్తో ముద్దాయి మీద బలవంతంగా నేరాన్ని రుద్దినప్పుడు అది నాకూ ముద్దాయికీ మాత్రమే తెలుస్తుంది. నాకళ్ళముందే ఆ నిర్దోషికి శిక్ష పడుతుంటే నిస్సహాయంగా చూస్తూ వూరుకోవాల్సిన సందర్భాలు చాలా వున్నాయి. ఆ శిక్ష మరణశిక్ష అయితే అంతకన్నా దారుణం ఇంకొకటిలేదు. ఆ జ్ఞాపకాలు నన్నెప్పటికీ వెంటాడుతూ వుంటాయి. అందుకే - సర్వం కోల్పోయినా సరే, మరణించేలోపులో ఆ ఆశయాన్ని సాధించగలననే ఆశిస్తున్నాను."

"హుర్రేర్రేర్రేర్రే....." అంటూ గాలిలోకి చేతులు ఎగరేస్తూ - ఒక్కసారిగా లోపల్నుంచి తన్నుకొచ్చిన ఎగ్జయిట్‌మెంట్‌తో గది కదిలేలా అరిచాడు చిరంజీవి. లోపల్నుంచి ఉద్వేగం తన్నుకొస్తోంది. "నా జీవితాశయం గూడా అదే గురూగారూ.. గ్రేట్ మెన్ థింక్ ఎలైక్....." అంటూ చెప్పబోయాడు.

అంతలో ఎవరో "ష్' అన్నారు. దాంతో కొంచెం స్పృహలోకి వచ్చి మౌనం వహించాడు.

అతడి స్థితి ఎలా వుందంటే - పట్నానికి ఎవరో పెద్ద యాక్టరు వస్తున్నాడని తెలిసి పల్లెటూర్నించి వచ్చి, వేదిక మీద మాట్లాడుతున్న ఆ పెద్ద యాక్టరు తనతో చిన్నప్పుడు గోడిబిళ్ళ ఆడిన వాడేనని గుర్తించి, అంతమంది జనం మధ్యనుంచి, "ఒరేయ్! నేనురా.... ఇక్కడ - " అని అరవాలనిపించేలా వుంది. కానీ గుర్తించేది ఎవరు?

సర్వోత్తమరావు తిరిగి మొదలు పెట్టారు.

"మరణ శిక్ష గురించి మొదట వ్రాసినవాడు మనవు. ఎనిమిదో ప్రకరణంలో (వశిష్ట - 19 'తప్పుచేసిన మనిషిని దేముడి దగ్గరకు పంపే హక్కు వున్నదని' అతడు చెప్పాడు) హిందూ ధర్మ శాస్త్రంలో హత్య పంచ మహాపాతకాల్లో ఒకటిగా చెప్పబడింది. హంతకుడి నీడని కూడా నాశనం చెయ్యాలని వ్రాసివుంది. కానీ తరువాత, తరువాత మనిషి అభిప్రాయం మారుతూ వచ్చింది. అయినా అనాగరికపు రోజుల్లో దారుణమైన విషయాలు జరుగుతూ వుండేవి.

"నిచ్చెన పై మెట్టుకి చేతులూ, క్రింద కర్రకి ఒకదానికి కాళ్ళూ కట్టి కర్రని బిగించేవారు. చేతులకింద కొవ్వొత్తుల మంట పెట్టేవారు. బాధతో గంగ వెర్రులెత్తిన ముద్దాయి చేయని నేరాన్ని కూడా ఒప్పుకునేవాడు. అప్పుడతనికి మరణశిక్ష విధించేవారు."

శ్రోతల్లో 'ప్చ్' 'అయ్యో' అన్న మాటలు వినిపించాయి.

"మనం యింతకన్నా నాగరికంగా ఏం లేం ఫ్రెండ్స్! పోతే యింత దారుణంగా కాకుండా కొంచెం జాగ్రత్తగా మెడకి వురితాడు వేసి చంపుతున్నాం. మనల్ని చూసి, మనం సిగ్గుపడవలసిన స్థితి యిది! దీన్ని యెదుర్కోవటం కోసమే ఈ షర్వోత్తమరావు...."

వింటూన్న చిరంజీవి వులిక్కిపడ్డాడు ఏమిటీయన పూర్తిగా మందు కొట్టాడా అనుకున్నాడు. ఆ తరువాత - కొట్టింది తనేననీ, చెవులక్కూడా అది ఎక్కిందనీ అర్థమైంది. లేచి నిలబడ్డాడు. ఆడపిల్లకు వేవిళ్ళ సమయంలో కలిగే బాధలాంటిది కలిగింది. ఎదురుగా అంతా గౌరవప్రదమైన సభ్యుల సమాజం. ఒక్కడుగు ముందుకేసి నిలదొక్కుకుని చుట్టూ చూశాడు. ముగ్గురు సర్వోత్తమరావులూ, నలుగురు ప్రకాష్‌లూ కనిపించారు. తొందరగా అక్కణ్నుంచి బైటపడటం మంచిదని అనిపించింది.

సర్వోత్తమరావు అంటున్నాడు "నేనూ, నా మేనకోడలూ తప్ప మాకెవరూలేరు. ఆమె తల్లి దండ్రుల తాలూకు ఆస్తే పది తరాలకు సరిపడావుంది. కాబట్టి నేను సంపాదించిందంతా ఆ ఆశయసిద్ధికోసం వినియోగించుకోవచ్చు. నా చెల్లెలికి మరణశయ్యమీద ఇచ్చిన వాగ్దానం ప్రకారం తనని మెడిసిన్ చదివించాను. ఇంకో రెండునెలల్లో హౌస్ సర్జన్సీ పూర్తవడంతో ఆమె డాక్టరైపోతుంది. ఇంక నాకే బంధాలూ వుండవు."

ఇమ్మీడియట్‌గా తను అక్కణ్ణుంచి తప్పుకోవటం యొక్క ఆవశ్యకతని గుర్తించి చిరంజీవి అటూ, ఇటూ చూశాడు. ఎక్కడా వాష్ బేసిన్?

ఎడమ వైపు ద్వారం కనబడితే అటు వెళ్ళాడు. అదో విశాలమైన వరండా, అతడి నడక పరుగులోకి మారింది. కడుపులో ద్రవం పైకి తంతూంది. అవుట్‌లెట్ లేదు. వరండా చివర మెట్లు కనపడితే వెనుకా ముందూ చూడకుండా ఎక్కేశాడు. మేడ మీద రెండు రూములు చెరోవైపునా కనిపించాయి.

తెరిచివున్న తలుపు వెనుకనుంచి వాష్ బేసిన్ కనబడింది. బాణంలా దూసుకు వెళ్ళాడు లోపలికి, అయిదు పెగ్గుల ద్రవం

బైటకొచ్చిన అయిదు నిమిషాల తరువాత కొద్దిగా మామూలు మనిషి అయ్యాడు. ప్రపంచం మళ్ళీ ఆశాజనకంగా కనిపించసాగింది.

మొహం కడుక్కుందామని వాష్ బేసిన్ కొళాయి తిప్పితే నీరు రాలేదు. అతడు అయోమయంగా చుట్టూ చూశాడు. ఎందుకో తెలీదుకానీ, ఆ క్షణం అతడికి విశ్వనాథ సత్యనారాయణ గారు జ్ఞాపకం వచ్చారు.

చదువరీ! ఆ కుర్రవాడి అవస్థ చూసి నవ్వుకునే అవసరం మనకు లేదు. మనం యెప్పుడైనా విమానాశ్రయమునకు వెళ్ళినప్పుడు గానీ, మొదటిసారి మొదటి తరగతి రైలు పెట్టె యెక్కినప్పుడు గానీ, ఈ విధంగానే అవస్థ పడెదము. అవస్థ అనగా అది చాలా విధములు, కొన్ని అవస్థలు....

నీళ్ళు! నీళ్ళు లేకపోతే ఎలా? అనుకుంటూ చుట్టూ చూసిన చిరంజీవి, అది బాత్‌రూమా, బెడ్రూమా అని అనుమానపడ్డాడు. గోడలన్నీ మొజాయిక్ మెరుపుతో అద్దంలా వున్నాయి. బాత్ టబ్ పచ్చగా మెరుస్తోంది. దానిపక్కనే వేసిన ప్లాస్టిక్ పాలిథిన్ కర్టెన్ అందంగా తెల్లగా వుంది. ఒకరకమైన మత్తైన వాసన గదంతా వ్యాపించి వుంది. సినిమాల్లో తప్ప అతడు ఎప్పుడూ అలాంటి బాత్‌రూమ్‌ను చూడలేదు. అంతలో అతడికి కర్తవ్యం గుర్తొచ్చింది.

నీళ్ళు!

అతడు తల కిందికి వంచి నీటి పంపు చూశాడు. చిన్నతనంలో గొట్టం దగ్గర వున్న చిన్న చక్రం తిప్పితే నీరు ధారగా పడటం గుర్తొచ్చింది. అలాంటి చక్రం కోసం చూశాడు. అదృష్టవశాత్తు అది వాష్ బేసిన్ క్రింద కనబడింది జాగ్రత్తగా దాని కిందికి వంగి నెమ్మదిగా దాన్ని తిప్పాడు.

అంతే!

బాత్‌టబ్ కొక్కేనికి పెట్టివున్న గొట్టపు షవర్‌లోంచీ, పైన కప్పు దగ్గరున్న షవర్‌లోంచీ, వాష్ బేసిన కొళాయిలోంచీ, శతృసైనికులు పెద్దగా అరుచుకుంటూ చుట్టుముట్టినట్టు ఒక్కసారిగా నీటిధార అతడిని అన్ని వైపుల్నుంచీ తడిపేసింది.

అతడు మొదటిసారి వేసిన గంతుకి పై బేసిను తలని సుతారంగా ముద్దు పెట్టుకుంది. రెండో గంతులో కాలు పక్కకి జరిగింది. ఒక కాలు కుడికి, ఇంకోకాలు ఎడమకి ఒకే వేగంతో ప్రయాణం చెయ్యటంతో గరిమనాభి నేలకి దగ్గరయింది. ఈ లోపులో నీళ్ళు తమ పని కానిస్తూ వున్నాయి.

గబగబా చక్రాన్ని వెనక్కి తిప్పాడు. నీళ్ళు ఆగిపోయాయి. కానీ ఇం కా చప్పుడు వస్తూనే వుండటంతో అతడు కొద్దిగా కంగారు పడి తన వంటి వైపు చూసుకున్నాడు. తన కోటే ఒక నీటి రిజర్వాయరుగా మారిందని గుర్తించాడు. జేబుల్లోంచి నీరు ధారాపాతంలా కారుతోంది.

అంతలో అద్దంలో ఎవర్నో చూసి, చప్పున వెనుతిరిగాడు. ఎవరూ లేరు. అయోమయంగా అద్దంలో తిరిగిచూసి, ఆ అగంతకుడు తనేననీ, తన రూపం మారిపోయిందనీ గ్రహించాడు.

వెంటనే తువ్వాలు అవసరం గుర్తొచ్చి, అతడు ముందు గదిలోకి వస్తూంటే బైట అడుగుల చప్పుడు వినబడింది. చప్పున బీరువా వెనక్కి వెళ్ళాడు. వచ్చిన అమ్మాయి సన్నగా హమ్ చేస్తూ డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చొని బుగ్గలకు పౌడరు రాసుకుంటోంది. ఆ తరువాత చిన్న జెర్కుతో స్టూల్ మీద నుంచి లేచి, చేతులు మెడ వెనక్కి పోనిచ్చి బటన్ విప్పుతూ

బీరువాదగ్గర కొచ్చింది.

మరో క్షణం తను అలాగే నిలబడి వుంటే, తడిసిన కోటుతోపాటూ తననీ వుతకటం ఖాయమని ఆంజనేయ దండకం ఆఖరిసారి చదువుకుని, ధైర్యంగా అడుగు ముందుకేసి, "హల్లో" అన్నాడు.

కెవ్వున కేక పెట్టాలన్న ధ్యాసకూడా లేకుండా ఆ అమ్మాయి షాక్ తగిలినట్టు అవాక్కయిపోయింది. కలో, నిజమో అర్థం కాలేదు. ఎదుటి మనిషి ఆకారంకూడా అలాగే వుంది. నుదుటి మీదకు పాయలు కట్టిన జుట్టు-జుట్టులోంచి కారుతున్న నీటిధార - బ్రౌనుకోటు తడిసి కాఫీ రంగుకి మారింది. ఎర్రటి టై కోటు బైటకొచ్చి జేబు పక్కకు అతుక్కుపోయింది. నిలబడ్డ చోట కార్పెట్ చిన్న మడుగులా తయారయింది.

"నేనిలా మీ బెడ్ రూమ్ - అదే ఐమీన్ - మీ గదిలోకి రావటం - అదే ఆ దృక్పథం నాకు కల్గటం - అంటే - బాత్ రూమ్ - బాత్‌రూమ్ నీళ్ళు - అవి కావల్సి రావటం యాద్ -యాద్ - యాద్......"

"యాదృచ్ఛికం" అందా అమ్మాయి.

"అవును యాదృచ్ఛికం" అన్నాడు చిరంజీవి. కొంచెం ధైర్యం వచ్చింది. "హలో ..... నా పేరు చిరంజీవి. బి.య్యే. ఎల్లెల్బీ...... ఉస్మానియా యూనివర్సిటీ, సీ.కే.పీ."

ఆమె కళ్ళలోంచి విస్మయం పూర్తిగా తొలగిపోలేదు. అదే స్వరంతో "నా పేరు అర్చన. మెడిసిన్ అయిపోయింది. అంకుల్ నాకు అంకుల్ అదే - ఐమీన్ నేను - అంకుల్‌కి ...నేను...." తడబడింది.

"మేనకోడలు" అన్నాడు చిరంజీవి.

....

అక్కడ ఆ సంభాషణ అలా జరుగుతుంటే క్రింద హాల్లో సర్వోత్తమరావు ఉపన్యాసం చివరి దశకి వచ్చింది....... " కాబట్టి ఫ్రెండ్స్- ఈ ఉరిశిక్షకి వ్యతిరేకత అన్నది ఉద్యమంలా సాగాలి! పార్లమెంట్‌లో యిది చర్చనీయాంశం కావాలి. సభ్యులు మనవైపే ఓటు వేసి, రాజ్యాంగాన్ని మార్చాలి. మిమ్మల్ని ఈరోజు యిక్కడికి పిలవటానికి కారణం అదే. నాకు కొద్దిగా చేయూత నివ్వండి, అంతే నేను కోరేది."

'ష్యూర్' - 'తప్పకుండా' లాంటి పదాలు ప్రతీవారి నోటివెంట వచ్చినయ్. ప్రకాష్ లేచి వరండాలోంచి పైకి బయలుదేరాడు. అర్చన అక్కడి నుంచి అంతకుముందే వెళ్ళిపోవడం అతడు గమనించాడు.

.....

"మావయ్యదంతా బోరు. ఈ ఉరి సమస్యనే మెడకు ఉరిలా వేసుకున్నాడు" అంటోంది పైన అర్చన.

చిరంజీవి వణుకుతూ "అంతమాట అనకండి" అన్నాడు ఆవేశంతో. అయితే వణుకు ఆవేశం వల్ల వచ్చింది కాదు, చలివల్ల వచ్చింది.

"ఆ కోటు విప్పండి, రేపు పంపిస్తాను."

మనసులో 'అమ్మో - ఎనిమిది రూపాయలు' అనుకున్నాడు పైకి మాత్రం నవ్వి 'ఫరవాలేదులెండి' అన్నాడు. ఈ లోపున వరండాలో అడుగుల చప్పుడు వినిపించింది. అప్రయత్నంగా బీరువా వెనక్కి వెళ్ళాడు. వచ్చింది ప్రకాష్.

గుమ్మం దగ్గర నిలబడి, "ఏం? మధ్యలో వచ్చేశావ్" అన్నాడు. అతను ఆమెని ఏకవచనంలో సంబోధించటం చిరంజీవి గమనించాడు.

"ఏం లేదు, కొద్దిగా తలనొప్పిగా వుంటేనూ."

"తలనొప్పా? ఏదైనా ఇంజెక్షన్......"

"తలనొప్పికి ఇంజెక్షనేమిటి డాక్టర్ ప్రకాష్! మీరు మరీనూ" అంది అర్చన బలవంతంగా నవ్వి.

ప్రకాష్ గుమ్మం దగ్గరనుంచి కదలలేదు "ఇదేమిటి తివాచీ తడిసింది!" అన్నాడు. బీరువా పక్కన నిలబడ్డ చిరంజీవి పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. అర్చన మాత్రం కదలలేదు. కళ్ళు తిప్పి కొద్దిగా తివాచీని చూసి, వెంటనే తలతిప్పి "ఈ రాత్రి దాని గురించి మనం చర్చించటం అంత అవసరమా ప్రకాష్" అంది స్వచ్ఛమైన ఇంగ్లీషులో.

ఆమె అలా సూటిగా అడిగేసరికి ప్రకాష్ తడబడి "వెళ్ళొస్తాను" అన్నాడు.

"మంచిది"

ఆమె అతడిని అలా నిలబెట్టి, కమేండ్‌తో హేండిల్ చెయ్యటం చిరంజీవికి తలమునకలయ్యేటంత ఆశ్చర్యంగా వుంది. అయితే అతడికి తెలియని విషయం ఏమిటంటే; అర్చన పైకి మామూలు కనబడే అల్లరి అమ్మాయేగాని, తరచి చూస్తే చాలా లోతైంది.

ఆ మాటకొస్తే ఆ యింట్లో వున్న ముగ్గురు నౌఖర్లతో సహా చివరకి ఆ ప్రసిద్ధికెక్కిన లాయర్‌తో సహా అందరూ ఆమె అంటే భయపడతారు. ఆమె గురించి ఏమీ తెలీదు కాబట్టే చిరంజీవి అలా ఆమె బెడ్‌రూమ్‌లో తివాచీని దారుణంగా తడపగలిగాడు. తడిపి కూడా ధైర్యంగా (అఫ్‌కోర్స్ చలికి వణుకుతూ) నిలబడగలిగాడు.

ప్రకాష్ వెళ్ళిపోగానే అతడు బీరువా చాటునుంచి ముందుకొచ్చి "థాంక్స్" అన్నాడు. అయితే ఆమె మొహంలో అంతకు ముందున్న ప్రశాంతత లేకపోవటాన్ని గమనించి, నొచ్చుకుంటూ - "ఐయామ్ సారీ" అన్నాడు.

ఆమె విస్మయంతో "ఎందుకు" అన్నది.

"మిమ్మల్ని ఇబ్బందిలో పెట్టినందుకు" అన్నాడు.

ఆమె నవ్వి "ఇబ్బందేమిటి" అన్నది. వెంటవెంటనే తమ ఫీలింగ్స్ మూడ్స్ మార్చుకోగలిగే గొప్ప విద్య చాలా కొద్దిమందికే వుంటుంది.

ఆమె మామూలుగా నవ్వేయటం చూసి అతడు సంతృప్తుడై "మీరు బావున్నారండీ" అన్నాడు అమాయకంగా -

సిన్సియర్‌గా.

ఆ మాటలకి ఆమె బిత్తరపోయి చివుక్కున తలెత్తింది. చిరంజీవికి తన తప్పు అర్థమయి బిక్కచచ్చిపోయాడు...... "అదేనండీ అంటే...... నా వుద్దేశ్యం, మీరు........ మీరు ప్రకాష్‌తో మాట్లాడేటప్పుడు కన్నా నాతో మాట్లాడేటప్పుడు బావున్నారని....." అన్నాడు నసుగుతూ.

ఆమె మొహం కోపంతో మరింత ఎర్రబడటం చూసి, తన మాటల్లో ఇంకా ఏదో తప్పుందని గ్రహించి, తనకొచ్చిన కొద్ది తెలుగుని తిట్టుకుంటూ "అంటే మీరు ఒకరితో మాట్లాడినప్పుడు బావుంటారనీ, ఒకరితో మాట్లాడినప్పుడు బావోరని కాదండీ - అసలు మీరు మాట్లాడకపోయినా బావుం......" అతడికి చప్పున అర్థమైంది - తనేం మాట్లాడుతున్నాడో. తల విదిలిస్తూ "ఇదేం లాభం లేదండీ, వెళ్ళొస్తాను" అన్నాడు.

ఆమెకి లోపల్నుంచి ఉవ్వెత్తుగా నవ్వు తన్నుకొస్తోంది. అయినా సీరియస్‌గా "ఊ" అంది.

అతడు కాళ్ళీడ్చుకుంటూ వెనుదిరిగాడు. ఈ రోజు ఇంత బేవార్సుగా గడుస్తుందని అతడు కలలో కూడా వూహించలేదు. అతడు గుమ్మం దాటుతూ వుంటే "చూడండీ" అన్న పిలుపు వినిపించింది అతడు ఆగి వెనుదిరిగాడు.

"మీ కోట్ బటన్ వూడి పడిపోయింది, యిదిగో"

అప్పుడు చూసుకున్నాడు అతడు తనవైపు తెరుచుకొని వున్న కోటులోంచి తెల్లచొక్కా బైటికొచ్చింది. ఆ చొక్కాకి వున్న రూపాయికాసంత చిరుగు స్పష్టంగా కనిపిస్తోంది.

అతడోక్షణం దాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. అయితే సర్దుకొనే ప్రయత్నం చేయలేదు. నెమ్మదిగా తలెత్తాడు. ఆమె అతడినే చూస్తూంది. నవ్వాడు, నవ్వి "చొక్కా నాదేనండి. చొక్కా ఒకటేనండి" అని వెనుదిరిగి వడివడిగా అక్కణ్నుంచి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

తన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌ని మొట్టమొదటిసారి అతడు జయించిన క్షణం అది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

4 వ భాగం

"నువ్వో వెధవ్వి, ఇడియెట్‌వి, ఫూల్‌వి" అన్నాడు స్ఫూర్తి. చిరంజీవి మాట్లాడలేదు. తల వంచుకుని కూర్చున్నాడు.

"నువ్వు వాళ్ళ మధ్యకి వెళితే నీకూ గుర్తింపు వస్తుందనుకున్నాను. నువ్వు అంచెలంచెలుగా పైకి వెళ్తే, నిన్ను పట్టుకుని నేనూ రావచ్చుననుకున్నాను. ఈ చెట్టుక్రింద ప్లీడరీ తప్పుతుందని భావించాను, నువ్వేమో పూర్తిగా మందు కొట్టేసి అంతా రసాభాస చేసి వచ్చావ్"

చిరంజీవి మాట్లాడలేదు. ఎదుటివాడు తిడ్తున్నప్పుడు బొటన వేలూ, చూపుడు వేలూ కలిపి కదుపుతూ కూర్చోమన్నాడు జ్ఞానానందస్వామి. అలాగే చేస్తున్నాడు చిరంజీవి.

"నేనెంత తిట్టినా అంతేనా?"

"ఏమిటి"

"ఆ వేళ్ళు కదపటం ఆపు" మరింత కోపంగా అరిచాడు, చిరంజీవి దులుపుకోవడం ఆపుచేశాడు.

చాలా సేపు నిశ్శబ్దం తరువాత స్ఫూర్తి సాలోచనగా అన్నాడు "మనమేదైనా చెయ్యాలి" అని ఆగి మళ్ళీ తనే - " సర్వోత్తమరావు గారితో పరిచయం కావటం అంత తేలికైన విషయమేమీ కాదు, దాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలి. లే ......" అన్నాడు.

"ఎక్కడికి?"

"చెప్తా"

అరగంట తరువాత ఇద్దరూ సెంట్రల్ లైబ్రరీలో పుస్తకాలన్నీ వెతికెయ్యటం మొదలుపెట్టారు.

ఉరి మీద నోట్సు వ్రాసుకుని, ఆ నోట్సు తీసుకుని మరుసటిరోజు సర్వోత్తమరావుగారింటికి బయల్దేరాడు చిరంజీవి.

....

"ముందు అప్పాయింట్‌మెంట్ తీసుకున్నారా?"

"లేదు"

"లేకపోతే ఆయన కల్సుకోరు."

"ఉరి గురించి అని చెప్పండి - కల్సుకోకపోతే వెళ్ళిపోతాను....."

క్లర్కు లోపలికి వెళ్ళాడు, పదినిమిషాల తరువాత ఆయన వచ్చారు. చిరంజీవి లేచి నిలబడ్డాడు.

"ఏమిటి సంగతి" అన్నారాయన కూర్చోమన్నట్టు సైగచేస్తూ.

"మొన్న మీ పార్టీకి వచ్చాను. ఉరి శిక్ష రద్దు గురించి మీరు మాట్లాడింది నిజంగా, నిజంగా......" ఆ తరువాత ఏం మాట్లాడాలో అతడికి అర్థం కాలేదు. అతడు చాలా ఎగ్జయిట్ మెంట్‌తో వున్నాడు.

అయితే అనుభవజ్ఞుడైన సర్వోత్తమరావుగారికి అతడు చెప్పదల్చుకుంది అర్థమయింది "మీ పేరేమిటి? పార్టీకి యెవరితో కలిసివచ్చారు" అని అడిగారు.

చిరంజీవి తెల్లబోయాడు. ఈ ప్రశ్న ఎదురవుతుందనే యస్సెమ్ స్వూర్తి అతడితో పాటూ కార్డు తీసుకెళ్ళమన్నాడు. దాన్ని ఆయనకి అందించాడు.

దాని మీద చిరంజీవి అన్న పేరు చూసి, బిగ్గరగా నవ్వుతూ "ఇది సుప్రీం కోర్టు జస్టిస్ చిరంజీవిగారి కోసం పంపింది. మా క్లర్కు ఆయన చిరునామా టైప్ చెయ్యబోయి మీది చేశాడు" అన్నాడు.

చిరంజీవి మొహం పాలిపోయింది. అయితే ఆయన నవ్వుతో అతడికి కొంచెం ధైర్యం వచ్చింది.

"అయితే అబ్బాయ్, నువ్వూ లాయర్‌వేనన్నమాట" అన్నాడు.

"అవును. బి.య్యే.ఎల్లెల్బీ ఉస్మానియా యూనివర్సిటీ సి.కె.పి." అన్నాడు.

సి.కె.పి. అన్న పదానికి ఆయన మరింత బిగ్గరగా నవ్వుతూ "భలేవాడివే" అన్నారు.

చిరంజీవి కొద్దిగా తలవంచి లోపలికి చూశాడు. (ఎందుకో అతడికీ మీకూ తెలుసు) ఈ లోపున సర్వోత్తమరావు "అయితే నీకూ ఈ ఉరిశిక్ష రద్దు మీద ఉత్సాహం వుందన్నమాట" అనటంతో చప్పున ఈ లోకంలోకి వచ్చాడు.

"అవున్సార్" అన్నాడు. తరువాత ముందుకు వంగి అపురూపమైన రహస్యం చెబుతున్నవాడిలా - "మీకు ఉడతాభక్తిగా నేనూ కొద్దిగా వివరాలు సేకరించాను - చీకటి సందుల్లో ఎన్నో ఏళ్ళనుంచీ కప్పుకుపోయిన గ్రంథాలని వెలికితీసి ......" అన్నాడు.

"ఏమిటా వివరాలు?"

"ఏయే దేశాలు, ఎప్పుడెప్పుడు ఉరిశిక్షని రద్దుచేశాయో వినండి.

ఇటలీ: 1948.

వెస్ట్ జర్మనీ: 1949.

బెల్జియం: ఆఖరి మరణ శిక్ష 1863లో.

డెన్మార్క్: 1930.(ఆఖరి మరణశిక్ష అమలు జరిగింది 1892లో)

హాలెండ్: 1872. (ఆఖరి మరణశిక్ష 1860)"

అని కాగితం తీసి చదువుతూంటే - మధ్యలో ఆయన కంఠం అందుకుంది. "ఆస్ట్రేలియా 1850. ఫిన్‌లాండ్ 1826... అబ్బాయ్, నేను ఉరిశిక్ష రద్దుకోసం పదిహేను సంవత్సరాల్నుంచీ పాటు పడ్తున్నాను. నేను మొదటి సంవత్సరం సర్వేలో సంపాదించింది నువ్విప్పుడు చీకటి సందుల్లోంచి సేకరించిన గ్రంథాల్లోంచి చెబ్తున్న వివరాలు..... ఇవన్నీ నేను ఉపన్యాసాల్లో చెబుతూ వస్తున్న స్టాటిస్టిక్స్ వివరాలే?" అన్నాడు. చిరంజీవి తెల్లబోయాడు.

అతడేదో చెప్పబోతుంటే, అతడిని రక్షించటానికా అన్నట్టు "హాయ్" అన్న కంఠస్వరం వినిపించింది. తల తిప్పి చూస్తే అర్చన.

"నీకు తెలుసా అమ్మాయ్ ఇతను"

"ఎక్కడో చూశాను" అంది వస్తున్న నవ్వు ఆపుకుని.

"చిరంజీవి అని - లాయరు"

ఆమె తలూపి, అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్టూ వాచి చూసుకుని "మైగాడ్, మీటింగ్ టైమయిపోయింది, వెళ్ళాలి" అంది.

చిరంజీవి కూడా నిస్సత్తువగా లేచి "నేనూ వెళ్ళొస్తాను" అన్నాడు.

"మీరు ఎటువైపు వెళ్ళాలి?"

అతడు చెప్పాడు.

"రండి నేనూ అటే......." అని చిరంజీవి సమాధానం కోసం చూడకుండా, "నీ టయోటా తీసుకెళ్తున్నా అంకుల్" అంది పక్కకి తిరిగి.

"దానికేముంది, తీసుకెళ్ళమ్మా" అన్నారు.

చిరంజీవి, అర్చన బైటకొచ్చారు. అర్చన డ్రైవింగ్ సీట్‌లో కూర్చొని - వంగి ఫ్రంట్ డోర్ తెరిచింది, చిరంజీవి కూర్చున్నాడు. చిన్న జెర్క్‌తో కారు కదిలింది.

అదే సమయానికి మేడ పైన స్థంభం వెనుకనుంచి ఒక వ్యక్తి నెమ్మదిగా బైటకొచ్చాడు. వెళ్తున్న కారువంక నిదానంగా చూశాడు. ఆ మొహంలో ఏ భావమూ కనబడటం లేదు. కానీ జాగ్రత్తగా గమనిస్తే ఆ కళ్ళు - కొన ప్రాణంతో పడివున్న లేగదూడపైన ఎగురుతున్న డేగకళ్ళలా వున్నాయి.

....

కార్లో ఇద్దరూ యెక్కువగా మాట్లాడుకోలేదు. మామూలుగా మాట్లాడేటప్పుడు ఎంత హుషారుగా వుంటుందో, ఏదైనా ఆలోచిస్తున్నప్పుడు అర్చన అంత మౌనంగా వుండటాన్ని అతడు గమనించాడు. ఈ లోపులో కారు పెద్ద హోటల్ ముందు

ఆగింది. "రండి" అంటూ ఆమె దిగి అడుగు ముందుకు వేసింది.

హోటల్ ప్రొప్రైటర్ వచ్చి తలుపు తెరుస్తాడేమోనని కారు అద్దం గుండా బైటకు చూశాడు చిరంజీవి. ప్రొప్రైటరూ మేనేజరూ కాదుకదా కనీసం గేటు దగ్గర గూర్ఖాకూడా యిటు వైపు చూడటం లేదు. అయినా వాళ్ళకి ఈ కార్ల తలుపులు తెరవటం తప్ప యింకేం పన్లూ వుండవా అనుకుని, తన డోర్ తనే తీసుకుందామన్న నిశ్చయానికి వచ్చాడు.

అతడంతకు ముందు ఏ కదిలే వాహనమూ ఎక్కలేదని కాదు, సిటీ బస్సు చాలా సార్లు ఎక్కాడు. కానీ సిటీ బస్సులకి తలుపులు వుండవుకదా! అందులోనూ అది ఇంపోర్టెడ్ కారాయె!

అతడో క్షణం సూటిగా, తీక్షణంగా డోర్‌వైపు చూశాడు. నికిల్ ప్లేటింగ్ వున్న రూపాయికాసంత బిళ్ళ తళతళా మెరుస్తోంది - దాని పక్కే చిన్న హాండిల్ వుంది. దానికి కొద్దిగా క్రిందగా అరచేతి మందాన ఒక రాడ్ వుంది. ఆ మూడింటిలో ఏది తలుపుని తెరుస్తుంది అన్న మీమాంసలో పడ్డాడు. ముందు చూపుడు వేలితో నాజూకుగా రూపాయికాసుని నొక్కి, అది కేవలం అందం కోసం బిగించిన స్క్రూ అని తెలుసుకుని, దాని పక్కనే వున్న హాండిల్‌ని పట్టుకుని తిప్పాడు. కిటికీ అద్దం నెమ్మదిగా క్రిందికి దిగటం ప్రారంభమవటంతో కంగారుపడి మధ్యలో ఆపుచేశాడు.

లోపున అర్చన వెనక్కి తిరిగి చూసింది. అతడు అతి ప్రయత్నం మీద దగ్గుని తెప్పించుకున్నాడు. ఆమె వచ్చి తలుపు తీయగానే దగ్గు ఆగింది. అందమైన అమ్మాయితో కలిసి ఖరీదయిన హోటల్‌లోకి అడుగుపెట్టడం అరుదైన అనుభవం. అయితే ఆ హోటల్ టోపొగ్రఫీ తెలియక పోవటం దురదృష్టకరం. ఆమె అతడి ముందుకు మెనూకార్డు తోసి "చెప్పండి" అంది.

అతడు దాన్ని తీసుకుని చూసి, అర్థంకాక అయోమయంలో పడ్డాడు. ఉప్మా. వడా, దోసెలాటి పదార్థాలు అందులో లేవు. మొగలాయీ జాల్‌ఫ్రేజీ - రోగన్ జోష్ - ఫిలెట్స్ ఆఫ్ షోమ్ ఫ్రెట్, మషాలా హోర్స్'డి' ఓవ్‌రెస్- స్పినాక్ 'ఆ' గ్రా టిన్.

విశ్వనాథ సత్యనారాయణగారు వాల్మీకి రామాయణాన్ని పరిశీలించినట్టు ఆ కార్డుని మొదటి వరకూ చివరివరకూ ఏకాగ్రతతో అతడు చదివిన తరువాత వారిద్దరి మధ్యా సంభాషణ ఇంగ్లీషులో ఇలా జరిగింది.

అతడు : ఒక్కొక్క హోటలు ఒక్కొక్క పదార్థానికి ప్రత్యేకత కలిగి వుండును. దురదృష్టవశాత్తూ నేనీ హోటలుకు ఎప్పుడూ రాలేదు. అందువలన ఆర్డర్ మీరే ఇవ్వండి.

ఆమె : ఈ హోటల్‌లోని అన్ని పదార్థాలు బాగానే వుంటాయి.

అతడు : అయినా నాకంతగా ఆకలిగా లేదు. (అని కార్డువైపు చూసి - అన్నిటికన్నా తక్కువ ధరలో వున్న పదార్థాన్ని గుర్తించి) నేను మొగలాయీ పాపడ్ జఫ్రానీ తీసుకుంటాను.

ఆమె : (ఆశ్చర్యంతో) వ్హాట్?

అతడు : అవును అర్చనగారూ! నాకు చాలు.

ఆమె : ఒక్క అప్పడంతో సరిపెట్టుకొంటారా చిరంజీవి!

అతడు : (గతుక్కుమని - స్వగతంలో) మొగలాయీ పాపడ్ జఫ్రానీ అంటే అప్పడమా? అద్దాల బీరువాలో అర్ధరూపాయి పెట్టి రూపాయికి అమ్మటం అంటే ఇదే కాబోలు! (ప్రకాశముగా) అవును, నాకు ఆకలిగా లేదు. కేవలం మీకు కంపెనీ ఇవ్వటం కోసమే వచ్చాను.

ఆమె : (నవ్వి) చాలా థాంక్స్.

అందమైన ప్లేటులో అప్పడమూ పక్కన కత్తీ ఫోర్కూ నాప్‌కిన్నూ పెట్టి, అప్పడం తినేశాక బవుల్‌లో నిమ్మకాయ చెక్క వేసిన వేడి నీళ్ళూ చేతులు కడుక్కోడానికి ఇచ్చి, అయిదు రూపాయలు వసూలు చేశాడు హోటల్ వాడు.

బిల్ ఇచ్చి ఇద్దరూ బయటకొచ్చాక "ఎటు వెళ్ళాలి మీరు" అని అడిగింది. తన రూమ్‌కి ఫర్లాంగు దూరం వరకూ ఆ పొడవాటి కారు వెళ్ళదని గ్రహించి "లైబ్రరీకి" అన్నాడు.

"మిమ్మల్ని డ్రాప్ చేసి వెళ్తాను"

"వద్దు మీకు శ్రమ"

"నేనెలాగో మా ఫ్యాక్టరీకి వెళ్తున్నాను" అన్నదామె.

అక్కడికి వెళ్ళేసరికి లైబ్రరీ ఆరోజు కట్టేసి వుంది "ఫ్యాక్టరీకి కూడా సెలవే, కానీ నేను కొంచెం అకౌంట్స్ చూడవలసివుంది. మీకు అభ్యంతరం లేకపోతే రండి - " అంది. మూసివున్న లైబ్రరీ తలుపులు చూసి - ఏం చెయ్యాలో తోచని చిరంజీవితో.

ఆమె కంపెనీ అతడికి ఒక వైపు ఆనందంగానూ, మరో వైపు ఇబ్బందిగానూ వుంది. ఆనందం ఇబ్బందికన్నా ఎక్కువ పాళ్ళల్లో వుండటంతో సరేనన్నట్టు తలూపాడు. పది నిమిషాల్లో వాళ్ళకారు విశాలమైన ఫ్యాక్టరీ ఆవరణలోకి ప్రవేశించింది.

ఆఫీసు గదిలో ఫ్యాక్టరీ మేనేజరుతోనూ అకౌంటు గుమాస్తాతోనూ ఆమె మాట్లాడే విధానం చూసి అతడు ఆశ్చర్యపోయాడు. ఒక మెడిసిన్ ఫైనలియరమ్మాయి ఫ్యాక్టరీ తాలూకు వుత్పత్తి, అమ్మకం, ఇన్‌కంటాక్సు మొదలైన విషయాలు అవలీలగా చర్చించటం అతడికి విస్మయాన్ని కలిగించింది. అరగంటలో ఆమె పని పూర్తయింది.

"రండి ఫ్యాక్టరీ చూద్దాం" అందామె లేస్తూ. అతడామెని అనుసరించాడు. వాచ్‌మెన్ తలుపులు తీసి నమ్రతగా నిలబడ్డాడు. ఇద్దరూ లోపల ప్రవేశించారు.

చాలా పెద్ద పెద్ద మిషన్లున్నాయి లోపల. బాయిలరు పక్కనే ఎక్స్‌ట్రూడర్ మిషను, దాని పక్కనుంచి కన్‌వేయర్ బెల్టు, ఒకపక్క గుట్టగా పోసివున్న పొడిసున్నం, అంతా స్థబ్దంగా నిర్మానుష్యంగా వుంది.

"చాలా ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది ఇక్కడ అంతా, అందువల్ల లేబర్ సమస్య అంతగా లేదు. నాలుగయిదు సంవత్సరాల వరకు నష్టంలో నడుస్తూ వుండేది ఫ్యాక్టరీ, క్రితం సంవత్సరం ఈ మిషన్ జెర్మనీనుంచి తెప్పించాం. దాంతో లాభాలు రావటం ప్రారంభించాయి."

చిరంజీవి చుట్టూ చూశాడు. ఆమె వివరిస్తూ ముందుకు వెళ్ళింది.

అతడికి ఉక్కపోస్తున్నట్టు అనిపించింది. స్విచ్ బోర్డు పక్కనే వున్న ఎగ్జాస్టర్‌ని ఫాన్ అనుకుని భ్రమపడ్డాడు. పక్కనే వున్న

బటన్ నొక్కాడు. అయితే ఆ బటన్ మిషన్ తాలూకుది. అతడు దాన్ని నొక్కగానే పెద్ద చప్పుడుతో కన్వేయర్ తిరగసాగింది. ఒక్కసారిగా అన్నీ పని చేయసాగాయి.

అదే సమయానికి అర్చన రెయిలింగ్ చివరకి వెళ్ళింది. ఒక్కసారిగా వచ్చిన శబ్దంతో ఆమె కంగారుపడి వెనక్కి తిరిగింది. అడుగు తడబడటంతో పక్కకి జారి బెల్ట్ ఆమెను తన్తో పాటూ తీసుకెళ్ళసాగింది. ఆమె కెవ్వున కేక వేసింది. చిరంజీవి చప్పున స్విచ్ ఆఫ్ చేశాడు. కానీ అప్పటికే ఆమె మధ్యకి వెళ్ళిపోయింది.

చిరంజీవి వళ్ళంతా చెమటలు పట్టాయి. ఒక్క క్షణం ఏం చెయ్యాలో తోచలేదు. అర్చన ఏ క్షణమైనా పడిపోయేటట్టు వుంది. మూత తీసి వున్న సిలిండర్లోంచి క్రితం రోజు వేడి తాలూకు పొగలు ఇంకా వస్తూనే వున్నాయి.

అతడు మరి ఆలోచించకుండా రెయిలింగ్ మీద నుంచి క్రిందకి దూకి - బాయిలర్ స్క్రూకన్ పట్టుకుని పైకి ఎక్కాడు. కాల్షియం వాసన ముక్కు పుటాల్లోంచి రక్తం వస్తుందా అన్నంతగా మండుతూంది. బాయిలర్ పక్కనుంచి లివర్ మీద కాలు వేసి బెల్టుని అందుకున్నాడు.

తరువాత నెమ్మదిగా పాక్కుంటూ ముందుకెళ్ళి ఆమెకి చెయ్యి అందించాడు. కొద్ది కొద్దిగా వెనక్కి జరుగుతూ ఆమెతో పాటూ ట్రాలీ వరకూ వచ్చి దానిమీద కాలు వేసి నేలమీదకు దూకాడు. అతడి భుజం పట్టుకుని ఆమె కూడా కిందికి దిగి గుండెల్నిండా వూపిరి పీల్చుకుంది.

"నిజంగా చచ్చిపోయాననే అనుకున్నాను" ఇంకా వణుకుతూన్న చేతివేళ్ళని చూసుకుంటూ అంది అర్చన. తెల్లటి చేతులు - బలం అంతా మోపటం వల్ల రక్తం ఎగచిమ్మి ఎర్రగా మారాయి.

"నన్ను క్షమించండి" అన్నాడు. చిరంజీవి పాలిపోయిన మొహంతో "ఫ్యాన్ అనుకున్నాను."

ఫ్యాక్టరీ వాచ్మెన్. ఆఫీసు గుమాస్తా పరుగెత్తుకుంటూ వచ్చారు శబ్దం విని.

"నేను ఏదో ఆలోచిస్తున్నాను, ఒక్కసారిగా అంత శబ్దం విని కంగారు పడ్డాను. స్విచ్ వేయగానే అంత శబ్దం వస్తుందని నేనూ అనుకోలేదు. అదీకాక ఒక్కసారి బెల్ట్ కదలటంతో నిలదొక్కుకోలేకపోయాను" అంది అర్చన కర్చీఫ్తో నుదురు అద్దుకుంటూ "అయితే నాకో విషయం అర్థం కాలేదు. ఎందుకో సగంలో మీరు స్విచ్ ఆఫ్ చేశారు?" అని అడిగింది.

"మరి చెయ్యకపోతే......" అంటూ ఏదో అర్థమయి వాక్యం పూర్తి చెయ్యకుండా మధ్యలో ఆపు చేశాడు...... చెయ్యకపోతే యేమయి వుండేది? బెల్టు చివరివరకూ వెళ్ళి వుండేది. దానితో పాటే అర్చన కిందవరకూ వచ్చి వుండేది. హాయిగా నేలమీదకు దిగివుండేది. తనేదో పెద్ద రక్షించేవాడిలా మధ్యలో స్విచ్ ఆఫ్ చేసి కిందకు వచ్చేదాన్ని రాకుండా చేసి టార్జాన్లా బాయిలర్ ఎక్కి ఆమెని కిందికి దింపాడు.

తన తెలివి తక్కువతనం అర్థమయ్యేసరికి అతడి మొహం ఎర్రబడింది.

## 5

రోజులు గడిచేకొద్దీ చిరంజీవి చిక్కిపోతున్నాడు. గెడ్డం గీసుకుంటూ ఆలోచనలో పడిపోతాడు. ఎందుకో తనలో తనే నవ్వుకుంటూ వుంటాడు. వగైరా - వగైరా స్ఫూర్తి ఇదంతా గమనిస్తూనే వున్నాడు. ఒకరోజు నిలదీసి అడిగాడు.

“నేను.......నేను.......... అర్చన నేనూ - అదే అర్చనని నేను - ” అని కళ్ళవెంట నీళ్ళు పెట్టుకున్నాడు.

సూర్ర్తి కంగారుపడి “ఏమైంది.......... అసలు సంగతి చెప్పు ” అన్నాడు.

“మొదలు పెడ్తే ధైర్యం వస్తుంది. మొదలు పెట్టనివ్వదు. ధైర్యం వస్తే మొదలు పెట్టగలను. ధైర్యం రాదు.”

“ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నావా? అది చెప్పి ఏడవరాదూ. వూరికే ఏడుస్తావేం?” విసుక్కున్నాడు.

చిరంజీవి మరింత దు:ఖంతో “ప్రేమ పాచిపోయిన పాయసంలాంటిది. అది త్యాగాన్ని కోరుతుంది” అన్నాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

5 వ భాగం

"గన్‌షాట్‌గా........" అన్నాడు స్ఫూర్తి " అర్చన లాంటి అమ్మాయిని ప్రేమిస్తే అది త్యాగానికే దారితీస్తుంది. నెత్తిమీద రూపాయి పెట్టి అమ్మితే అర్థరూపాయికి అమ్ముడుపోయే నీలాంటివాణ్ణి అర్చన కాదుగదా, వాళ్ళింటి వంట మనిషి కూడా ప్రేమించదు."

"మరి నేనేం చెయ్యాలి?"

"హీరోలా ఒక గొప్పపనేదైనా చెయ్యాలి. టెస్ట్ మాచ్‌లో సెంచరీ కొట్టాలి. లేకపోతే రికార్డ్ బద్దలు కొట్టే పనేదైనా చెయ్యాలి. అమ్మాయిలు - అందులోనూ అర్చనలాంటి వాళ్ళు మామూలుగా ప్రేమించేసెయ్యరు."

చిరంజీవి ఆలోచనలో పడ్డాడు. ఏదైనా చెయ్యాలి. నిజమే. ఏదైనా అద్భుతం చెయ్యాలి! ఆ గొప్ప ఆలోచనతో ఓ నెల గడిపాడు. చాలా గొప్ప గొప్ప ఆలోచన్లు, జీవితగతిని మార్చేవి, హఠాత్తుగా స్ఫురిస్తూ వుంటాయి. ఆరోజు పేపరు (సెప్టెంబరు 1981లో వార్త 'హిందూ'లో పడింది) చదువుతూ వుండగా, ఓ వార్తమీద చిరంజీవి దృష్టి పడింది.

"ఉరికంబం ఎక్కబోయే ముందు సుప్రీం కోర్టు స్టే" అన్న హెడ్డింగుతో వున్న వార్త అది. మరుసటిరోజు తెల్లవారుఝామునే ఉరికి సిద్ధపడ్తూన్న ఖైదీకి స్టే లభించింది.

చిరంజీవి మామూలుగానే దాన్ని చదివి పక్కన పడేశాడు. కానీ రాత్రి పక్కమీద వాలాక హఠాత్తుగా ఒక ఆలోచన స్ఫురించింది. నిముషాల్లో అది రూపుదిద్దుకొనగా, అప్పటికప్పుడే లాయరుగారింటికి పరుగెత్తాడు. అప్పుడు రాత్రి పదయింది.

స్టడీ రూమ్‌లో లా పుస్తకాలు తిరగేస్తున్న సర్వోత్తమరావు ఆ సమయంలో చిరంజీవి రావటం చూసి ఆశ్చర్యపోయాడు.

"నాకో బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది. ఇక ఈ దెబ్బతో మన దేశంలో ఉరిశిక్ష రద్దు చేయబడుతుంది. అసలీ వార్త రాగానే దేశం అట్టుడికినట్టు ఉడికిపోయింది. పార్లమెంటు గందరగోళమవుతుంది. అసలు విషయం తెలిసేక మనిద్దరి పేర్లూ మార్మోగిపోతాయి. మన వెనుక ప్రజలుంటారు. దాంతో ఐ.పి.సి. 302 సెక్షన్ మార్చబడుతుంది".

"ఇంతకీ అసలు విషయం చెప్పు."

"నేనో హత్య చేయబోతున్నాను"

ఆయన ముందు ఉలిక్కిపడ్డారు. తరువాత చిరంజీవి మెదడు విషయమై అనుమానం వచ్చి కొద్దిగా బెదిరాడు. డాక్టరు పక్కనుంటే మంచిదని 'అమ్మా! అర్చనా' అంటూ మేనకోడల్ని పిలిచాడు.

ఆయనుద్దేశ్యం గ్రహించి, "మీరు కంగారు పడకండి" అన్నాడు చిరంజీవి........"నన్ను పూర్తిగా చెప్పనివ్వండి."

"చెప్పు"

“ఒక శవాన్ని నేను రెండోసారి చంపుతాను. అది శవమనీ, దాన్ని నేను చంపుతున్నాననీ ఫోటోలు తీద్దాం. కానీ పోలీసులకి మాత్రం అది నేను చేసిన హత్యలాగే కనబడుతుంది. నాకు ఉరిశిక్ష పడేటంతగా దారుణమైన కారణాలు కల్పిద్దాం. మరుసటిరోజు ఇక నేను ఉరికంబం ఎక్కబోతున్నాననగా మీరు రుజువులు బయట పెడ్తారు” చిరంజీవి కంఠం ఆవేశంగా మారింది. “ఒక్కరోజు ఆలస్యమై వుంటే యేమై వుండేది? ఒక అమాయకుడు బలై పోయి వుండేవాడు....... ప్రజలారా - పార్లమెంటు సభ్యులారా - మీరు చూశారుగా, న్యాయం ఎంత గుడ్డిదో ! ఇలా యెంతమంది అమాయకులు ఈ ఉరిశిక్షకి బలి అయిపోయారో ....! మార్చండి........ !! వెంటనే ఐ.పి.సి. 302ని మార్చండి!!!.......... ఇదీ మన నినాదం ఎలా వుంది.”

“నా మొహంలా వుంది” అన్నాడు సర్వోత్తమరావు. “నువ్వు ఒకసారి చచ్చిన శవాన్ని మళ్ళీ ఇంకోసారి మర్డరు చెయ్యటం యేమిటి? దాన్ని నేను ఫోటోలు తియ్యటమేమిటీ? ఆఖరి నిముషంలో ఉరి రద్దు చెయ్యటానికి - ఇదేం నాటకం అనుకున్నావా?”

చిరంజీవి నవ్వాడు. అతడిప్పుడు మామూలు చిరంజీవిలా లేడు. ఒక నిర్ణయానికొచ్చిన నాయకుడిలా వున్నాడు. “మామూలువాళ్ళకి ఇదంతా సాధ్యం కాదు. కానీ మీకూ, నాకూ, అవుతుంది. దేశం మొత్తం మీద మిమ్మల్ని మించిన క్రిమినల్ లాయర్ లేరు. అటువంటి మీరు తల్చుకుంటే సాధ్యం కానిది లేదు. ముందుకి ఉరకటానికి నేనెలాగూ సిద్ధంగా వున్నాను.”

అయినా దానికి ఆయన ఒప్పుకోలేదు.

దాదాపు రెండు గంటల వాగ్వివాదం తరువాత ఆయన అయిష్టంగా ఒప్పుకున్నాడు. చిరంజీవి లేస్తూ అన్నాడు “ఇందులో మనకొచ్చిన నష్టం ఏమీ లేదు గురూగారూ. ఈ దెబ్బతో పీనల్ కోడ్ మారిస్తే మార్చారు. లేకపోతే లేదు - ఇక ఈ దేశ ప్రజల ఖర్మ ఇంతే అనుకుని మన ప్రయత్నం విరమిద్దాం.”

“నాకెందుకో భయంగా వుందబ్బాయ్” అని గెడ్డం గోక్కుంటూ “సర్లే - ఇది కూడా ఎందుకు ప్రయత్నించకూడదు? మహా అయితే కోర్టులో పిల్ల చేష్టలాడినందుకు ఫైన్ వేస్తారంతేగా. వెయ్యనీ” అన్నాడు ఒక నిర్ణయానికి వచ్చినట్టు.

చిరంజీవి ఆయన దగ్గర సెలవు తీసుకుని బైటకొచ్చేసరికి ఒంటి గంట కావొస్తుంది. వెన్నెల పిండారబోసినట్లు వుంది. అతడు గాలిలో తేలినట్టు నడుస్తున్నాడు. మనసంతా థ్రిల్‌తో నిండివుంది.

ట్లింగ్.........ట్లింగ్.............

ఫ్లాష్‌లైట్లు......... విలేఖర్లు........ ఎక్కడ చూసినా న్యూసే....... ప్రాణాలకు తెగించి ఒక యువకుడి సాహసచర్య - ఉరిశిక్ష రద్దుకై ఇద్దరు లాయర్ల అపూర్వ సాహసం....... పార్లమెంటు చరిత్రలోనే నూతన అధ్యాయం......... పీనల్ కోడ్ మార్పు.

గ్ల్ ంటి.... గ్ల్ ంటి....

ఒక మోటర్ సైకిల్ పెద్ద శబ్దం చేసుకుంటూ వచ్చి పక్కన ఆగటంతో వులిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. దూరంగా జైలు గంటలు రెండు సార్లు మ్రోగినయ్. ఆగిన మోటార్ సైకిల్ మీదనుంచి ఒక పోలీసు ఇన్ స్పెక్టరు ఆగి- “ఎక్కడికి బ్రదర్ ఈ టైమ్‌లో” అని అడిగాడు అనుమానంగా.

రోడ్డు మధ్యలో తూల్తున్న చిరంజీవి తలతిప్పి ఇన్‌స్పెక్టర్‌ని చూసి "హల్లో, గుడ్ ఇవినింగ్" అని ఆకాశం వైపు చూసి రాత్రని గుర్తుకొచ్చి "సారీ గుడ్ నైట్" అని, అంతలోనే అర్ధరాత్రి దాటిపోయిందని గమనించి "గుడ్ మార్నింగ్"అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ అనుమానం బలపడింది "రాత్రి రెండింటి వరకూ ఏ బారు తెరిచివుంది?" అని గద్దించాడు.

చిరంజీవి బిత్తరపోయాడు. తాను లాయర్ననీ, అయినా ఎప్పుడూ నిజమే చెప్తాననీ సర్వోత్తమరావు గారింటినుంచి వెళ్తున్నాననీ అన్నాడు.

సర్వోత్తమరావుగారి పేరు చెప్పగానే ఇన్‌స్పెక్టర్ కొద్దిగా అటెన్షన్‌లోకి వచ్చి బహువచనంలోకి దిగి నమ్రతగా "ఆయన మీకేం అవుతారు సార్" అని అడిగాడు.

"ఆయన మా మావగారు"

"ఆయనకి కూతుర్లు లేరే" మళ్ళీ అనుమానం వచ్చింది ఇన్‌స్పెక్టర్‌కి.

నీ కడుపు కాల - నీకు ఆయనింటి విషయాలు చాలా తెలుసే అనుకుని "అదే - ఆయన మేనకోడలూ - నా ఫియాన్సీ" అన్నాడు స్టైయిల్‌గా.

"కంగ్రాచ్యులేషన్స్. మీ కారేమయింది సార్! నడిచి వెళుతున్నారు."

"గారేజిలో వుంది, రిపేరుకిచ్చాను" అన్నాడు, చెప్పులు కనబడకుండా పాంటులోకి లాక్కొంటూ.

"మీరేమీ అనుకోకపోతే - మోటార్‌సైకిల్ మీద దింపుతాను."

"నో . నో. అక్కరలేదు" అంటూ ముందుకు కదిలాడు చిరంజీవి.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

చిరంజీవి ఇంటికి వెళ్ళేసరికి రెండున్నర. సరాసరి రాములవారి బొమ్మ దగ్గరికి వెళ్ళిపోయాడు. చెంపలేసుకుని - "స్వామీ, అబద్ధం ఆడాను నన్ను క్షమించు.... నోటికొచ్చినట్లు అర్చన గారి గురించి కోశాను. సారీ."

స్ఫూర్తి దుప్పటి తొలగించి అర్ధరాత్రి పూజలు చేస్తున్న చిరంజీవిని ఓరగా చూసి, మళ్ళీ పడుకున్నాడు. చిరంజీవి కూడా పక్కమీదకు చేరాడు. కానీ నిద్ర పట్టలేదు. కళ్ళు మూసుకుంటే అర్చన - కళ్ళు తెరిచినా అర్చనే.

## 6

తమ ఇంట్లో అదోలాటి శ్మశాన వాతావరణం నెలకుని వుండటానికి కారణం రామయ్యేనని అర్చన అభిప్రాయం. చాలా చిత్రమైన మనిషి అతడు. ఎప్పుడూ మౌనంగా వుంటాడు. అతడి నోటివెంట మాట బైటకొచ్చి ఎన్నేళ్ళయిందో. అతడి కళ్ళల్లో భయం కొలిపే అదోలాటి స్తబ్దత వుంది. అయితే ఇంటి పనంతా ఠంఛనుగా, కరెక్టుగా చేస్తాడు.

రామయ్యకన్నా భయం కొలిపేవాడు అతడి కొడుకు బైరాగి. అతడో ఫెటిసిస్ట్. ఆడవాళ్ళ బట్టల్నీ, వస్తువుల్నీ దాచుకుని

సంతృప్తి పడే వాళ్ళని ఫెటిసిస్ట్ అంటారు. పదహారేళ్ళ వయసులో అతడిని చూసి భయంతో వణికిపోయేది అర్చన. అప్పుడతనికి ఇరవై ఏళ్ళు. అయినా సన్నగా - అస్థిపంజరంలా - పద్నాలుగేళ్ళ కుర్రవాడిలా వుండేవాడు. లోతుకుపోయిన బుగ్గలు - గాజు కళ్ళు, సన్నటిమెడ - అతని చూపులు ఆమెని చాలా భయపెట్టేవి.

అయితే మెడిసిన్‌లో చేరి, కొద్దికొద్దిగా ఆమె వ్యక్తిత్వాన్ని సంపాదించుకునే కొద్దీ అతడు నెమ్మదిగా తన 'షెల్' లోకి వెళ్ళిపోయాడు.

ఆ ఇంట్లో మూడో వ్యక్తి రంగమ్మ -వంటమనిషి. ఆమె వంటింట్లో మాట్లాడితే పైన ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లోకి కూడా వినిపించాల్సిందే - మతిమరుపు ఎక్కువ అవటంతో ఉప్పు బదులు పంచదార - దాని బదులు వంటసోడా వేసి అందర్నీ ఇబ్బంది పెట్టేది.

ఈ ముగ్గుర్నీ ఆ ఇంటినుంచి తప్పించటానికి మొదట్లో అర్చన ప్రయత్నించింది. కానీ ఎంతో కాలం నుంచీ నమ్మకంగా పని చేస్తున్న వాళ్ళని తొలగించటానికి ఆయన ఒప్పుకోలేదు. ఆ తరువాత అర్చన తన చదువు, బిజినెస్ వ్యవహారాల్లో పడి ఇంటి విషయాలు పట్టించుకోవటం మానేసింది. ఆమెకి అంత టైమ్ లేదు కూడా.

......

టైమ్ ఏడయింది. క్రింద నుంచి పెద్ద స్వరంతో సుప్రభాతం వినిపిస్తోంది. అర్చనకి మెలకువ వచ్చింది కానీ లేవలేదు. బద్ధకంగా అలాగే పడుకుంది. తమకి నలభై పెర్సెంట్ షేర్లున్న పంచదార కంపెనీ బ్యాలెన్స్ షీట్ స్టడీ పూర్తయ్యేసరికి రాత్రి రెండయింది.

దాదాపు పదిలక్షలదాకా మేనేజింగ్ డైరెక్టరూ, మిగతా వాళ్ళు కలిసి తినేశారన్న ఆమె అనుమానం, ఆడిట్ రిపోర్ట్ చదివాక ధృవపడింది. మరుసటిరోజు మీటింగ్‌లో ఆమె వాళ్లని కడిగెయ్యటానికి నిశ్చయించుకుంది వీలైతే తొలగించటానికి కూడా.

ఏడున్నరయింది. ఇంకా మూడోకాల్ రాలేదు.

సర్వోత్తమరావు అయిదింటికే లేస్తాడు. లేవగానే మేనకోడల్ని లేపటానికి ప్రయత్నిస్తాడు. అది మొదటి కాల్. తరువాత స్నానం చేసి రెండవసారి వస్తాడు. అర్చన లేవదు. పూజ అయ్యాక మళ్ళీ అప్పటికి ఎనిమిది అవుతుంది.

అప్పుడు లేస్తుంది. "నీ కెన్నో మంచి గుణాలు నేర్పానమ్మాయ్, ఈ ఒక్కటీ నేర్పలేకపోయాను" అంటాడు. ఆమె నవ్వేస్తుంది "పోన్లే అంకుల్. మరీ అన్నీ మంచి గుణాలే వుంటే బావోదు."

ఆరోజు మాత్రం ఆయన పైకొచ్చేసరికి ఆమెలేచింది. మోకాళ్ళ మీదనుంచి నైట్ గౌను సర్దుకుంటూ పక్కమీదే కూర్చొని "అంకుల్ - నేను కొంచెం మాట్లాడాలి" అంది ఉపోద్ఘాతంగా.

"ఏమిటి విషయం? ఈ రోజు ప్రొద్దున్నే లేచావ్?"

"రాత్రి చాలాసేపు ఈ రిపోర్టులు చూశాను అంకుల్, బ్రహ్మానందం మనని పది లక్షల దాకా ముంచాడు" అంది. బ్రహ్మానందం కంపెనీ మేనేజింగ్ డైరక్టరు.

"పది లక్షలు కాదు, యాభైలక్షలైనా సరే - నువ్వు స్నానం చేసి తీర్థం తీసుకునేదాకా ఏ విషయమూ మాట్లాడను" అంటూ లేచాడు. అర్చన నాలుక బైటపెట్టి వెక్కిరించి బాత్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

సన్నగా హమ్ చేసుకుంటూ పంపుతిప్పింది. బాత్ టబ్‌లోని నీళ్ళు నిండుతున్నాయి. జుట్టు వెనక్కి తోసి, తడవకుండా ప్లాస్టిక్ కాప్ పెట్టింది. మెడవెనగ్గా చేతులు పోనిచ్చి బటన్ విప్పింది. నడుము దగ్గర తాడు విప్పి భుజాలు ష్రగ్ చేయగానే గౌను నేలమీదకు జారింది.

ఆమె షవర్ తిప్పింది. పడిన నీటి చుక్క ఆమె శరీరం మీద ధారగా మారి క్రిందికి జారుతుంది. నుదుటిమీద పడిన చుక్క, ముక్కు కొన శిఖరంలా వుండటంతో హిమాలయం మీదనుంచి దూకిన అలక్‌నందా అయింది. పెదవి మీద పడిన చుక్క గెడ్డం వంపులో మెలికతిరిగి కృష్ణానది అయిజారింది. మరో చుక్క కంఠంమీద పడి జారిపాపికొండల మధ్య గంగగా మారింది. నాభిమీద పడింది జారి క్రిందికి దిగి అమేజాన్ అయ్యింది.

"సమ్‌టైమ్స్ ఐ - ఫీల్ లైక్ ఎ మదర్‌లెస్ ఛైల్డ్" సన్నగా పాడ్తూ స్నానం చేస్తున్న అర్చన చప్పున పాట ఆపింది.

ఎవరో చూస్తున్నారు.

బైట నిలబడి - తాళం చెవి కన్నంలోంచి ఎవరో రహస్యంగా చూస్తున్నారు. ఆమె మొహం ఎర్రగా కందిపోయింది. కానీ క్షణంలో సర్దుకుని పాట కొనసాగిస్తూ, షవర్ మరింతగా తిప్పింది. పెద్ద శబ్దంతో నీళ్ళుపడ్తున్నాయి. ఆమె చప్పుడు కాకుండా టబ్‌లోంచి లేచి పక్కకి వెళ్ళింది - క్లీన్ చేసే బ్రష్‌లోంచి ఒక పుల్లని తీసుకుని మరింత నిశ్శబ్దంగా తలుపు పక్కకి చేరుకుంది. కన్నంలోకి జాగ్రత్తగా పుల్లని తోసి, ఒక్కసారిగా ముందుకు నెట్టింది. బాధగా చిన్న మూలుగు - ఎవరో పరుగెత్తిన శబ్దం.

ఆమె మామూలుగానే స్నానం పూర్తి చేసి క్రిందకి వచ్చింది. మనసులో ఏ భావాలున్నా ఆవేశపడకుండా మామూలుగా వుండటం ఎగ్జిక్యూటివ్ లక్షణం.

బ్రేక్ ఫాస్ట్ వడ్డిస్తున్న రంగమ్మతో మామూలుగానే అడిగింది - "బైరాగి ఏడి రంగమ్మా?"

"ఇప్పటివరకూ ఇక్కడే వుండాలి. ఎక్కడికి వెళ్ళాడో............. పంపించమంటారా?"

"పంపించు" అని ఆమె లేచిపోయింది.

ఆమె స్టడీరూమ్‌లో సర్వోత్తమరావుతో మాట్లాడ్తూవుంటే రంగమ్మ వచ్చి "కనబడటంలేదు. ఎక్కడికి వెళ్ళాడో మరి?" అన్నది.

ఆయన మధ్యలో కల్పించుకుని"ఏమిటి" అని అడిగాడు. బైరాగి యెక్కడికి వెళ్ళాడన్న ప్రసక్తి వచ్చింది. "వంట్లో బావోలేదన్నాడు, ఆస్పత్రికి పొమ్మన్నాను" అన్నాడాయన.

"ఏమైందట" రంగమ్మ అడిగింది. పైకి గయ్యాళిలా కనబడ్తుంది కానీ ఎవరికేమైనా ఓర్చుకోలేదు.

"కంట్లో ఏదో కురుపైందట" అన్నాడాయన. అర్చన మొహం కోపంతో ఎర్రబడటం వాళ్ళిద్దరూ గమనించలేదు.

రెండ్రోజుల తర్వాత బైరాగి వచ్చాడు. అయినా ఆ విషయం ఇక పట్టించుకోలేదు. ఆమె ఒకసారి అతడి వైపు పరిశీలనగా చూసింది. కానీ, అతడి కన్ను మామూలుగానే వుంది.

అయినా ఆమె మరికొన్ని రోజుల్లో ఒక దీర్ఘ విదేశీ ప్రయాణపు హడావుడిలో వుంది. కొత్తగా పెట్టబోయే పరిశ్రమకోసం ఆమె ఫ్రాన్స్ వెళ్తోంది. ఎలాగూ వెళ్తోంది కాబట్టి, సెలవులు వున్నాయి కాబట్టి మరో మూడు నెలలు యూరప్ అంతా తిరగాలని ఆమె అభిలాష. ఈ ఫారిన్‌ట్రిప్ వల్ల ఆమె చాలా ఉత్సాహంగా వుంది చాలా రోజుల్నుంచి.

## 7

శవం సంపాదించటం ఎలా అన్నది పెద్ద ప్రాబ్లెం అయింది చిరంజీవికి. నిజమే - శవం ఎక్కడ దొరుకుతుంది? అందులోనూ బంధువులూ, మిత్రులూ లేని అనామక శవం. ఎవరో బిచ్చగత్తెగానీ, ఫుట్ పాత్ మీద శవంగానీ దొరకవచ్చు గానీ, అలాంటి వాళ్ళని హత్య చేయవలసిన అవసరం ఇతగాడికి లేదని జడ్జీ కోర్టులో కేసు కొట్టేస్తే కష్టం.

ఆస్పత్రుల్లో అనామక శవాలు దొరకచ్చుగానీ డెత్ సర్టిఫికెట్ నోట్ చేసుకుంటారు. తరువాత పోలీసుల పరిశోధనలో అది ఆస్పత్రిలో సహజంగా మరణించిన శవం (వాక్యం కరెక్టేనా) అని తేలితే కష్టం. ఈ ప్లాన్‌లో వచ్చిన చిక్కేమిటంటే, కోర్టుకెక్కిన తరువాత ఒకసారి ఉరిశిక్ష పడకపోతే - మళ్ళీ ఇంకోసారి నాటకమాడటానికి వీలుండదు.

శవాన్ని ఎలా సంపాదించాలా అన్న సమస్య నిజంగానే అతడిని చాలా బాధ పెట్టింది. చాలా రోజులు కొట్టుమిట్టాడి సర్వోత్తమరావుగారిని కల్సుకున్నాడు.

"నిజమే" అన్నాడాయన "మామూలుగా శవం అయితే లాభంలేదు. ఏదైనా మిడిల్‌క్లాస్ కుటుంబపు శవం అయితే బావుంటుంది" అని ఆగి సాలోచనగా, "మనం అనవసరంగా చిక్కుల్లో ఇరుక్కుంటామేమో ఆలోచించు చిరంజీవీ" అన్నారు.

"నేనూ ఆలోచించాను గురూగారూ! కానీ మీకున్న అనుభవంతో మీరు చెప్పండి. ఈ ప్లాన్‌లో ఎక్కడన్నా లొసుగులున్నాయా? ప్రాణాపాయం వుందా?"

"లేదనుకో" నసిగాడు ఆయన.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

6 వ భాగం

"మరెందుకు భయం ........" అన్నాడు చిరంజీవి.

ట్లింగ్....ట్లింగ్......

అర్చన తెల్లచీరెలో రాజహంసలా పూలదండ పట్టుకుని నడుస్తూ తన మెడలో.....

గ్ల్ ంటి.... గ్ల్ ంటి....

"శవం ఒక అమ్మాయిది అయితే బావుంటుంది" అన్నాడాయన "మిడిల్ క్లాస్ అమ్మాయి. పెళ్ళయినా, పిల్లలున్నా ఫరవాలేదు. కానీ పోస్టు మార్టమ్‌లో సహజమరణం కింద రాకుండా వుండాలి."

"ఎంత ఖర్చయినా ఫరవాలేదు. అవునా" అన్నట్టు అడిగాడు చిరంజీవి.

"అవును, ఖర్చుకి వెనకాడగూడదు"

చిరంజీవి వంగి రహస్యంగా "గురూగారూ - నాదగ్గర డబ్బుల్లేవు - ఈడ్చితంతే అర్ధరూపాయి వుంది. ఏం చేద్దాం " అన్నాడు.

.....

హోటల్లో శుభ్రంగా తిని డబ్బులు తక్కువై జీవితాన్ని ప్లేటుఇడ్లీ - రుబ్బురోలుతో పోల్చుకొన్న తరువాత ఆ హోటలు ప్రొప్రైటరూ, చిరంజీవీ స్నేహితులై పోయారు. ఆయన అరువు పెట్టేవాడు చిరంజీవికి. అలాంటి అరువు భోజనం చేస్తూ - చేస్తూ తలెత్తి చూసిన చిరంజీవి ఉలిక్కిపడ్డాడు. ఎదుటి సీట్లో దారాసింగ్ భోజనం పూర్తి చేసి, చెయ్యి కడుక్కుని లేచిపోతున్నాడు.

చిరంజీవికి ఫ్లాష్‌లాంటి ఐడియా వచ్చింది. తొందర తొందరగా భోజనం పూర్తి చేసి బైట కొచ్చాడు. అప్పటికే దారాసింగ్ వీధి చివరకి వెళ్ళిపోయాడు. దాదాపు పరుగెడ్తూ చిరంజీవి ఆ వీధి చేరుకునేసరికి దారాసింగ్ ఆ వీధి ఇంకో చివర మలుపు తిరుగుతూ కనిపించాడు.

ఇలా పత్తేదారు నవలలోలాగా అతడిని వెంబడించి చివరకు వూరిచివర సగం కూలిన సత్రం దగ్గరికి చేరుకున్నాడు చిరంజీవి. అప్పటికే అతడు లోపలికి వెళ్ళిపోయాడు.

తనూ లోపలికి వెళ్ళటానికి ధైర్యం చాలక చిరంజీవి మెట్లమీదే నమ్రతగా నిలబడి "దారాసింగ్ గారూ - అయ్యా దారాసింగ్ గారూ" అని పిల్చాడు.

అలికిడిలేదు. అతడికి ఏం చెయ్యాలో తోచలేదు. రెండు మెట్లెక్కి మళ్ళీ పిల్చాడు. సమాధానం రాక, లోపలికి వెళ్ళాడు.

లోపల అంతా గబ్బిలాల వాసన. ఏవైనా డబ్బాలుంటాయేమో - చూసిన సినిమాల్లోలాగా అనుకున్నాడుగానీ అలాంటివేమీలేవు. నలుగురు గూండాలూ - మధ్యలో డాన్సరు కూడా లేరు. అతడు మళ్ళీ ఇంకోసారి పిలవబోతూ వుండగా "ఎవరదీ" అన్న స్వరం గంభీరంగా వినబడింది.

చిరంజీవి ఉలిక్కిపడి ముందుకు తూలి పడబోయి నిలదొక్కుకున్నాడు. ఎదురుగా ఆరడుగుల మనిషి - క్రూరంగా నిలబడి వున్నాడు.

"గుడ్ మార్నింగ్ దారాసింగ్ గారూ" షేక్ హాండ్ ఇవ్వబోయి ఎముకల విషయం జ్ఞాపకం వచ్చి మానేశాడు.

"నా పేరు దారాసింగ్ కాదు భీమేశ్వర్" అన్నాడు రౌడీ.

"పేరులో యేముంది? వీరాంజనేయులుగారూ"

"ఇంతకీ యేం కావాలి నీకు" బొంగురు గొంతు గది గోడలమధ్య ప్రతిధ్వనించింది.

చిరంజీవి నమ్రతగా "నాకో మిడిల్ క్లాస్ శవం కావాలి దారాసింగ్‌గారూ" అన్నాడు.

ఈసారి దారాసింగ్ ముందుకు తూలిపడ్డాడు.

.....

సాయంత్రం అయిదయింది.

సర్వోత్తమరావు కోర్టులో పని ముగించుకుని కారు దగ్గరికి వచ్చాడు. ఆయన జూనియర్స్‌తో కలిసి యెక్కబోతూవుంటే "గుడ్ మార్నింగ్ సార్" అన్న మాటలు వినిపించాయి. తల తిప్పి చూశాడు.

చిరంజీవిని అర్ధరాత్రి ఆపుచేసిన ఇన్స్‌పెక్టర్ - దగ్గరకొస్తూ "బావున్నారా సార్" అన్నాడు.

"హల్లో ఇన్స్‌పెక్టర్! మీరా?" అన్నాడాయన.

"మాకు పప్పన్నం ఎప్పుడు పెడ్తున్నారు?" షేక్‌హాండిస్తూ అడిగాడు ఇన్స్‌పెక్టర్.

"దేనికి?"

"అర్చన గారి పెళ్ళి నిశ్చయం అయిందటగా."

"ఎవరు చెప్పారు?"

"చిరంజీవనీ......" అంటూ చెప్పబోయి అనుమానం వచ్చి ఆగాడు. క్షణంలో వెయ్యవవంతు అయోమయంతో సర్వోత్తమరావు తల గోక్కున్నాడు. అతడికి ఇది కలో నిజమో అర్థంకాలేదు. తనకి తెలియకుండా తన మేనకోడలి పెళ్ళి యెలా జరగబోతుంది.

సర్వోత్తమరావు ఆలోచనలో పడటం చూసి ఇన్స్పెక్టర్ "వెళ్ళొస్తాను సార్" అంటూ మోటార్సైకిల్ స్టార్ట్ చేశాడు.

ఆ శబ్దానికి ఈ లోకంలోకి వచ్చి, ఆయన "పెళ్ళిసరే. కానీ ఎవరితో?" అని అడిగాడు. కానీ ఆ మాటలు మోటార్సైకిల్ శబ్దంలో కలిసిపోయినయ్, ఇన్స్పెక్టరెళ్ళిపోయాడు.

.....

"గురూగారూ ఓ గుడ్ న్యూస్" అంటూ చిరంజీవి హుషారుగా లోపలికి ప్రవేశించాడు. చదువుతూన్న బౌండు పుస్తకం పక్కన పెట్టి, సర్వోత్తమరావు తలెత్తి చూశాడు.

"మీకో మంచి విషయం చెప్పాలి సార్" హడావిడిగా అన్నాడు.

ఆయన తాపీగా "నిన్ను తల వాచేటట్టూ చివాట్లు పెడ్తామనుకుంటున్నాను. నువ్వు విషయం చెప్పాక చెయ్యనా? ముందే పెట్టనా" అని అడిగాడు.

చిరంజీవి గతుక్కుమని, అంతలోనే తేరుకుని సిన్సియర్గా "నన్ను ముందు చెప్పనివ్వండి. దాని వల్ల మీ చివాట్ల డెన్సిటీ తగ్గొచ్చు" అన్నాడు.

"అయితే చెప్పు"

"శవాన్ని అయిదొందలకి మాట్లాడాను. దారాసింగ్ అని ఓ రౌడీ వున్నాడు. ఆయన ఈ క్షణంనుంచీ మనకి కావల్సిన శవం గురించి వెతుకుతున్నాడు. బహుశా పదిహేనురోజుల్లో దొరకొచ్చు. మన ప్లాను అమలు చేసే రోజు దగ్గర పడింది. ఇదేమంచి న్యూస్. ఇక మీ చివాట్లు ప్రారంభించండి" గడగడా చెప్పేసి, తల కొద్దిగా వంచి, వాయటం కోసం సిద్ధంగా కూర్చొన్నాడు.

ఆయన గంభీరంగా "అర్చన ఫియాన్సీ ఎవరు? మా ఇంట్లో పప్పన్నం అరేంజి చేస్తున్నారట అదెవరు?" అని అడిగాడు.

చిరంజీవి తల అలాగే వంచుకుని నమ్రతగా, "మొదటిది నేను, రెండోది మీరు"అని, ఆ మాటల్తో వున్న ధైర్యం దిగజారిపోగా - ఆయన చేతులు పట్టుకుని "పాత డైలాగు అంటున్నానని అనుకోకపోతే గురూగారూ, ఇవి చేతులు కావనుకోండి. అర్చనగారికివన్నీ తెలీదు. నేనే నోటికొచ్చినట్టూ ఆ ఇన్స్పెక్టర్ దగ్గర ఏదో వాగేశాను" అని ప్రాధేయపడ్డాడు.

"అంటే నీ కసలు ఆ ఉద్దేశ్యమే లేదా?"

"లేదు గాక లేదు" అనేసి, మళ్ళీ నెమ్మదిగా "వుందనుకోండి" అని నసిగాడు.

"లేదంటే వుండటమేమిటి?"

"లేదుకీ వుందికీ తేడా చాలా చిన్నది. జీవితం మిథ్య. ప్రేమ మిథ్య. ఉండటానికి లేకపోవటానికి తేడా లేదని స్వామి జ్ఞానానందస్వామి భగవద్గీతలో కృష్ణుడితో చెప్పాడు. కృష్ణుడికీ, గోపికలకీ మధ్య అలౌకిక ప్రేమ......"

"భగవద్గీతలో గోపికల ప్రసక్తి లేదే?"

“లేదా. అయితే కృష్ణుడు సీతతో.......”

“చాల్చాలు. నీ పౌరాణిక పరిజ్ఞానానికి జోహార్లు గానీ అసలు విషయానికి రా” అన్నాడాయన.

“పిల్ల కోసం వచ్చి ముంతదాచటం యెందుకు గురూగారూ. మీరే సలహా చెప్పాలి. మీ మేనకోడల్ని వన్వే ట్రాఫిక్‌లో ప్రేమించేశాను ” అన్నాడు చిరంజీవి అన్నిటికీ సిద్ధపడి.

“నీ అంతస్తేమిటో, అర్చన అంతస్తేమిటో గుర్తించావా? ఆమెకి రెండు కోట్లున్నాయి.”

“లాయర్ని. నాకూ వున్నాయి.”

ఆయన దాన్ని పట్టించుకోలేదు “ఆఫ్‌కోర్స్. ఈ కాలం ఆడపిల్లలు డబ్బుకి విలువ ఇవ్వరనుకో. కానీ అర్చన చాలా ఇంటలిజెంట్. ఇండస్ట్రియలిస్ట్ కూడా, ఇలా ప్రేమా వగైరా అంటే మండిపడ్తుంది. ఆమె మెదడెప్పుడూ ఫ్యాక్టరీలూ - బ్యాలెన్స్ షీట్ల మధ్య తిరుగుతూ వుంటుంది. అలాంటి హృదయపు బీడులో ప్రేమ విత్తనం జల్లాలంటే దానికి మంచి వాతావరణం వుండాలి. అనునయంగా ఆమెకి నీ హృదయంలో మాట చెప్పాలి.”

ట్లింగ్...........ట్లింగ్............

పొడవాటి ప్లిమత్ కారు హోటల్ ఏషియానాలోకి మెత్తగా దూసుకుపోయింది. ఫుల్ సూట్‌లో చిరంజీవి దిగాడు. పక్కన అందమైన షిఫాన్ చీరలో అర్చన. మత్తయిన డిన్నర్ - గమ్మత్తయిన గాలి. కోటుజేబులోంచి ఉంగరం తీశాడు చిరంజీవి. మసక చీకట్లో ఖరీదైన వజ్రం ధగధగ మెరుస్తోంది. ఆమె చేతిని సుతారంగా తన చేతుల్లోకి తీసుకుని, ‘ఐ లవ్యూ’ అంటూ వేలికి తొడిగాడు.

గ్ ంట్లి............గ్ ంట్లి......

“నా చెయ్యి వదిలిపెడ్తావా?” అని ఆయన అనేసరికి ఉలిక్కిపడి వదిలేసి “సారీ సార్” అన్నాడు.

“ఫర్లేదు. దీన్ని బట్టి నువ్వెంత గాఢంగా ఆ అమ్మాయిని ప్రేమించావో అర్థమవుతూంది. కానీ చిరంజీవి ఒక్క విషయం. డబ్బు సమస్య కాకపోయినా మీ ఇద్దరికీ పెళ్ళయితే కొన్ని సమస్యలుంటాయి.

లెవల్ ఆఫ్ థింకింగ్, వే ఆఫ్ లివింగ్ ముఖ్యమైనవి. నీకీ విషయంలో ఏ సాయం కావాలన్నా నేను చేస్తాను. కానీ కారు డ్రైవింగ్ కూడా రానివాడివి, అర్చనని ఎలా చేసుకుంటావ్? ఆలోచించు.”

కట్ చేస్తే చిరంజీవి హుస్సేన్ అండ్ కంపెనీ.

హుస్సేన్ అండ్ కంపెనీ ఇరవై సంవత్సరాల క్రితం స్థాపించబడిన సంస్థ. పాత కార్లు డొక్కుకార్లు - తుక్కుతుక్కైన కార్లు - పెళ్ళి కార్లు - వగైరా అన్నీ అక్కడ దొరుకుతాయి. కార్లను మార్చి కార్లు కొంటూంటాడు హుస్సేన్. అతడికో డ్రైవింగ్ స్కూల్ కూడా వుంది. అతడికి నత్తి.

చిరంజీవి ప్రస్తుతం అక్కడే వున్నాడు.

"జీ......జీ..........జీ......."

"జీవితం" అన్నాడు చిరంజీవి. అతడికీ హుస్సేన్ సంగతి అర్ధమయిపోయింది.

"జీవితం కారులాంటిది సాబ్" అని ఫస్ట్‌గేరు వేశాడు హుస్సేన్. కారు పెద్ద శబ్దం చేసింది "పెళ్ళాం క్లచ్ లాంటిది సాబ్. ఎప్పుడూ నొక్కిపట్టి వుంచాలి వదిలేస్తే....." కారు పెద్ద జర్కు యిచ్చి ముందుకు దూకింది.

"ప్రే.........ప్రే......" అంటూ గేరు మార్చటానికి అవస్థపడుతూ అన్నాడు హుస్సేన్.

"ప్రేమ" అన్నాడు చిరంజీవి విసుగ్గా. అతనికి ఈ డ్రైవింగ్ నేర్చుకోవడం పరమ బోరుగా వుంది. అతడు అర్చనని కలుసుకునే తొందరలో వున్నాడు. చాలా కొద్దిరోజుల్లోనే ఆమె ఫారిన్ ట్రిప్ వెళ్తోంది, ఈ లోపులోనే ఆమెకి తన ప్రేమని వెల్లడించాలి.

"ప్రేమ ఆక్సిలేటర్‌లాంటిది సార్. నొక్కేకొద్దీ వేగం హెచ్చుతుంది" అని చటుక్కున ఆపుచేసి "పెళ్ళి బ్రేకులాంటిది" అన్నాడు వేదాంతిలా చివరికి నవ్వి.

చిరంజీవి నుదురు యెదురు రాడ్‌కి కొట్టుకుని అప్పటికే బొప్పికట్టింది.

"ఎంత కాలంలో వస్తుంది నాకు డ్రైవింగ్" అని అడిగాడు,

"ఎంత సాబ్" అన్నాడు హుస్సేన్ "రెండు నెలల్లో బెజవాడలో కూడా డ్రైవ్ చేసెయ్యగలరు మీరు"

"అఖర్లేదు అలా అయితే" అన్నాడు చిరంజీవి.

"అర్చన పదిరోజుల్లో వెళ్ళిపోతుంది. ఈ లోపులో ...." అని వివరంగా చెప్పేశాడు.

హుస్సేన్ ఆలోచనలోపడి తల గోక్కున్నాడు "మీకు మోటర్ సైకిల్ నడపటం వచ్చా సాబ్" అని అడిగాడు.

"రాదు"

"పోనీ సైకిలు"

"వచ్చు"

"చాలు సాబ్" అన్నాడు హుస్సేన్, సమస్య తేలిపోయినట్టు "హోటల్ వరకూ వెళ్ళి వచ్చెయ్యడమేగా! నా దగ్గరో స్టాండర్డ్ కారుంది. సైకిల్ తొక్కడం తెలిస్తే చాలు - దాన్ని నడిపేయ్యొచ్చు. ఒక్కసారికి పెద్ద డ్రైవింగ్ తెలియఖ్కర్లేదు. తీసుకెళ్ళండి, ఫస్టుగేరూ - లాస్టుగేరూ చెప్తాను" అన్నాడు.

అతడు చెయ్యి వూపగానే ఇద్దరు కుర్రవాళ్ళు. కాకీ బట్టల మీద గ్రీజు పూతవున్న వాళ్ళు బేకారుగా వున్న కారునొకదాన్ని తోసుకువచ్చారు. చిరంజీవి దాని వైపు అనుమానంగా చూశాడు. హుస్సేన్ అతడికి అభయమిస్తున్నట్టు "ఎక్కండి సాబ్" అంటూ ఎక్కించి దాన్నెలా నడపాలో వివరించాడు.

అతని వివరణ చిరంజీవికి రంగా బిల్లా కేసు జడ్జిమెంటులా సగం అర్థమయి సగం అర్థమవలేదు. "మీ ఫీజు?" అని అడిగాడు.

"ప్రేమకి ఫీజు లేదు సాబ్. ఈ ట్రిప్పు మా కంపెనీ కానుక"

చిరంజీవి ఇగ్నిషన్ తిప్పగానే రేసుగుర్రంలా ముందుకు దూకి, ఆ తరువాత ఎందుకో ఆగి, మళ్ళీ పరుగెత్తింది.

అటే చూస్తూ నిలబడ్డాడు హుస్సేన్. అతడికి ముందు అల్లా, తరువాత ఆంజనేయస్వామి జ్ఞాపకం వచ్చారు. మౌనంగా వాళ్ళిద్దర్నీ ప్రార్థించి గంభీరంగా తల పంకిస్తూ లోపలికి వెళ్ళబోతూవుంటే అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి - చిరంజీవికి రివర్స్‌గేరు వెయ్యటం నేర్పలేదని.

......

కోటు సవరించుకుని కారు దిగి, తనవైపే ఆశ్చర్యంగా చూస్తున్న గూర్ఖా వైపు ఓ చూపు విసిరేసి, స్టయిల్‌గా హారన్ నొక్కాడు. పెద్దశబ్దంతో 'బోయ్' మని ఆ కాంపౌండ్ ప్రతిధ్వనించింది. అర్చన బాల్కనీ మీదనుంచి చూసి, వస్తున్నానన్నట్టు చెయ్యి వూపి పరుగెత్తుకు వచ్చింది.

స్టీరింగ్ దగ్గర కూర్చోబోతున్న చిరంజీవికి చప్పున గుర్తొచ్చింది. అమ్మాయి కారెక్కటానికి వస్తూంటే డోర్ తెరిచి పట్టుకోవాలని. దిగి అటువైపు వెళ్ళి, ఆమె వస్తూంటే డోర్ తెరవబోయాడు.

రాలేదు. బొటన వేలుతో నాబ్ వత్తి బలంగా లాగాడు.

అర్చన ఆగి, సూటులో కొత్తగా వున్న అతడి వైపు వింతగా చూసింది. నిజంగా సూట్‌లో అతడు చాలా బావున్నాడు. ఆమె కళ్ళల్లో అభినందన కనబడ్తోంది. అయితే అతడు మాత్రం దాన్ని గుర్తించే స్థితిలో లేడు చెయ్యి మార్చి - అతి సులువుగా వున్నట్లు కనబడటానికి ప్రయత్నం చేస్తూ తలుపు తెరవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. నుదుటి మీద చెమట పడ్తోంది.

"గుడ్ మార్నింగ్ అర్చన" అని అతడు రెండు చేతుల్తోనూ హాండిల్ పట్టుకుని లాగాడు. ముందు కిర్రుమని తరువాత టప్‌మంది. తలుపు వూడి వచ్చి తెరుచుకుంది.

అయితే తెరుచుకోవటానికి, వూడి తెరుచుకోవడానికి డిఫరెన్స్ ఉంది, తన చేతిలోవున్న తలుపు తాలూకు బరువు యెక్కువ అవటంతో అతడికి అర్థమయింది తలుపు వూడిందని. ఒకవైపు స్క్రూ విరిగి వేలాడుతోంది. ఏడ్వలేక నవ్వటం అంటే ఏమిటో అర్థమయింది.

అలా నవ్వుతూ తలుపు తెరిచి, ఆమె కూర్చొన్న తరువాత భద్రంగా వేసి, స్టీరింగ్ ముందు కూర్చొన్నాడు.

"ఎక్కడికి వెళ్దాం"

"హోటల్ ఏషియానా" అంటూ చిరంజీవి కారు స్టార్టు చేశాడు. పెద్ద చప్పుడు తర్వాత నిశ్శబ్దం..........మళ్ళీ ఇగ్నిషన్ తిప్పాడు. ఈసారి పెద్ద గాజుగ్లాసు భళ్ళున బ్రద్దలయిన శబ్దం. అతడు తల తిప్పి అర్చన వైపు చూశాడు.

మొహంలో ఏ భావమూ లేకుండా ఆమె బైటకు చూస్తోంది. అతడు తల రెండో పక్కకి తిప్పాడు. రామయ్య, బైరాగీ, రంగమ్మ బాల్కానీలో నిలబడి చూస్తున్నారు. దూరంగా గూర్ఖా నిలబడి వున్నాడు.

ఈసారి బలంగా వేళ్ళతో పట్టుకుని పెదవులు బిగించి తాళం తిప్పాడు. భూకంపం వచ్చినట్టు కదిలింది కారు. జర్క్ ఇచ్చి ఆగింది.

"కారు గేరులో వున్నట్టుంది" అన్నది అర్చన.

ఆమె మొహంలో ఏ భావమూ లేకపోవడం అతడిని మరింత కంగారు పెడుతోంది. గేరు ముందుకు తోసి, క్లచ్ నొక్కి స్టార్టు చేశాడు. అయితే అతడికి తెలియనిది గేరు న్యూట్రల్ దాటి, రివర్స్‌లోకి వెళ్ళిందని.

కారు స్టార్టు అయి, క్లచ్ మీద కాలు తియ్యగానే వెనక్కి బయలుదేరింది. కారు వెనక్కి వెళ్ళడాన్ని అసలు వూహించని చిరంజీవి కంగారు పడి బ్రేకు నొక్కాడు. అయితే అతడు బ్రేకు అనుకొన్నది ఆక్సిలేటరు.

అప్పుడు మొదలైంది సర్కసు. ముందు, వెనుక చక్రం మెట్లెక్కింది. ముందుది కూడా ఎక్కబోతూ అతడు స్టీరింగ్ గిర్రున తిప్పటంతో - పడవలా పక్కకి తిరిగి రెండు పూలకుండీల్ని శత్రుసైనికుల్ని పడగొట్టినట్టూ పడగొట్టి - ఆ తరువాత ఎర్రమట్టి దుమ్ము లేపుకుంటూ ఫౌంటన్ పక్కనుంచి లాన్‌లోకి ప్రవేసించింది.

అక్కడ చిన్న గుంటలో పడి గుర్రంలా ఎగిరి, రెట్టించిన ఉత్సాహంతో గులాబీ తోటలోకి ప్రవేశించింది, అక్కడ మన్ను లూజుగా వుండటంతో ఎరువుల కోసం వేసిన గుంటల మధ్య పెద్ద శబ్దంతో ఆగింది. కారు చప్పుడు ఆగింది కానీ, చిరంజీవి గుండెశబ్దం మాత్రం ఇంకా బైటికి వినిపిస్తూనే వుంది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

7 వ భాగం

మొహంలో ఏభావమూ లేకుండా “మనం మన కార్లో వెళ్తే బావుంటుందేమో చిరంజీవిగారూ” అంది అర్చన. బిక్కచిక్కిన మొహంతో “అలాగే” అన్నాడు.

అర్చన డ్రైవ్ చేస్తుంటే చెవర్లెట్‌లో కూర్చొని తల తిప్పి చూశాడు చిరంజీవి. స్టడీ రూమ్‌లోంచి అప్పటివరకూ చూస్తున్న సర్వోత్తమరావు బొటన వేలు ఎత్తి “బెస్ట్ ఆఫ్ లక్ మై బోయ్” అన్నట్టు సైగ చేశాడు.

కారు కాంపౌండ్‌లోంచి బైటకి దూసుకుపోయింది.

......

“ఈ రోజు నేను మీకు డిన్నర్ ఇవ్వబోతున్నాను” అన్నాడు చిరంజీవి హోటల్లో కూర్చున్నాక.

“ఎందుకు” అని అడిగింది అర్చన గెడ్డం క్రింద చేతులు పెట్టుకుని.

జవాబు చెప్పలేదు చిరంజీవి. మౌనంగా ఉండిపోయాడు. అతడికి ఇంకా గుండెదడ తగ్గలేదు. ఎలా మొదలుపెట్టాలో అర్థం కావడంలేదు. ముందు సూప్‌కి ఆర్డరిచ్చాడు.

బోనీ యమ్ రికార్డు మంద్ర స్థాయిలో వినిపిస్తోంది. చుట్టూ తెరలు వేసి వుండటం వల్ల పట్టపగలైనా చీకటిగానే వుంది లోపల.

“అర్చనగారూ” అన్నాడు మృదువుగా, కానీ ఆమె తలెత్తేసరికి మాట మార్చి “ఏమిటాలోచిస్తున్నారు?” అని అడిగాడు.

“ఏం లేదు” అందామె. నిజానికి ఆమె షుగర్ కంపెనీ వ్యవహారాల గురించి ఆలోచిస్తూంది. తనలో తానే అనుకుంటున్నట్టూ పైకి “ఈ ప్రపంచంలో ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు కదూ” అంది.

ఆమె వైపు చిత్రంగా చూశాడు. ఒక మామూలు అమ్మాయిలా ఆమె బైట పడటం అదే మొదటిసారి. నిజానికి ఆ క్షణం ఆమె మనసంతా వాసిలేటింగ్ గానూ, ఒంటరిగానూ వున్నది.

“మీ తల్లిగారు మిమ్మల్ని బాగా చూసుకుంటారా” చిన్నపిల్లలా అడిగింది. ఎందుకో తెలీదుగానీ - మళ్ళీ వెంటనే అలా ఎందుకు అడిగానా అని అనుకొంది. చాలా చిన్న పిల్ల వేసిన ప్రశ్నలాగుంది అది.

అయితే దానికి సమాధానంగా అతను “నాకు తల్లిలేదు” అనేసరికి ఆమె కొద్దిగా ఆశ్చర్యపోయి “తండ్రి?” అని అడిగింది.

“లేదు, ఇద్దరూ చిన్నప్పుడే పోయారు.”

“నాకూ... నాకూ చిన్నతనంలోనే పోయారు ఇద్దరూ” అంటూ వుంటే ఆమె కంఠం వణికింది. నిశ్శబ్దం వారిద్దరి మధ్యా సానుభూతిని సమంగా పంచి ఇచ్చింది.

వెయిటర్ వచ్చాడు. ఆర్డరిచ్చాడు చిరంజీవి.

"మీ రెప్పుడు లా పాసయ్యారు?" మామూలు మూడ్‌లోకి వస్తూ అడిగింది. అతడు చెప్పాడు.

"ఎంత సంపాదిస్తారు నెలకి?"

చెప్పటానికి సిగ్గుపడ్డాడు అతడు. అయితే అబద్ధం చెప్పలేదు "చెప్పాగా మొదటిరోజే - చిరంజీవి ఎల్లెల్బి, సీ.కే.పీ. అని" అన్నాడు.

"అవునవును అప్పుడే అడుగుదామనుకున్నాను. సీ.కే.పీ. అంటే ఏమిటి?" కుతూహలంగా అడిగింది అర్చన.

"చెట్టు క్రింద ప్లీడరు"

నవ్వాపుకోలేక పొలమారింది. అయినా కడుపు పట్టుకుని అలా నవ్వసాగింది. అప్పటి వరకూవున్న దిగులంతా ఒక్కసారి పోయినట్లయింది అతడితో మామూలుగా కబుర్లు చెప్పసాగింది. ఇంతలో వెయిటర్ ప్లేట్ తెచ్చిపెట్టాడు.

ఆమె ఫోర్కూ, స్పూనూ ఒకదానిపక్కనొకటి పెట్టి "ఇలా అంటే ఏమిటో తెలుసా?" అని అడిగింది.

తెలీదన్నట్లు తలూపాడు. "ఇంకా వడ్డించమని సేమ్ డిష్" అంది.

అని, రెంటినీ మార్చి "ఇలా అయితే ఇక చాలు అని" అంది, ఆ తరువాత స్పూన్‌ని బోర్లించి ప్లేట్లో పెట్టి "ఇలా అయితే నా డిన్నర్ పూర్తయిందని అర్థం" అంది ఆమె చిన్న పిల్లలా ఆడుకోవటం చూసి అతడికి నవ్వొచ్చింది బావుంది కూడా. ఒక పెద్ద బిజినెస్ ఎగ్జిక్యూటివ్ గాలిపటం ఎగరేసినట్టు.

అంతలో బిల్ వచ్చింది. చూసి ఉలిక్కిపడ్డాడు. అతడు ఏ డెబ్బయ్యో, ఎనభయ్యో అవుతుందనుకున్నాడు. కానీ రెండొందలా ఇరవై అయింది. అతడి దగ్గర నూటపాతికకన్నా యెక్కువ లేవు. మామూలు హోటల్స్‌లోలాగా పిండి రుబ్బటానికి ఈ పాష్ హోటల్స్‌లో ఒప్పుకుంటారో లేదో!

అయినా పక్కన అర్చన వుందే! అతడు ఓరగా ఆమె వైపు చూశాడు. బిల్ అతడు ఇస్తానన్నాడు కదా అని ఆమె మామూలుగా కూర్చొని వుంది.

ఇక లాభంలేదన్నట్టు చిరంజీవి వంగి రహస్యంగా "అర్చనగారూ, మీ దగ్గరో వంద వుందా?" అని అడిగాడు.

ఆమె ఎందుకు అని అడగబోయి అంతలోనే అర్థమయి పర్స్ తెరిచి ఇచ్చింది. అతడు జేబులోంచి నూటపాతిక తీసి ప్లేట్లో పెడ్తూంటే దాంతో పాటు ఎగిరిన కాగితం వచ్చి ఆమె కాళ్ళ మీద పడింది. ఆమె తీసి చూసింది. అందులో ఇలా వుంది;

మెడల్ ఎస్సెల్సీది : ఉంగరం
గ్రాడ్యుయేషన్ : 75రూ
ఎల్లెల్బి మెడల్ : 85రూ

--------

మొత్తం 160

---------

సూటు అద్దె :20

పెట్రో ఖర్చు :15

-----

మిగిలినది 125

"ఏమిటిది" అని అడిగింది ఆమె ఆశ్చర్యంగా. అతడి మొహం వాడిపోయింది ముందు చెప్పలేదు. ఆమె రెట్టించి అడగ్గా - అడగ్గా చెప్పాడు. అయితే ఆమెకి అన్నిటికన్నా ఆశ్చర్యం కల్గించింది మరొకటి వున్నది.

"మీరు ఎస్సెల్సీలో రాంక్ హోల్డరా?" అని అడిగింది. అవునన్నాడు.

"గ్రాడ్యుయేషన్‌లో? ఎల్లెల్బీలో?"

"ఆ రెండు గోల్డుమెడల్సూ అమ్మితేనే నూట అరవై వచ్చింది" అన్నాడు. ఉంగరం సంగతి చెప్పలేదు. అయితే ఆమె దానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వకుండా "మీరెవరి దగ్గరుండి చదువుకున్నారు?" అని అడిగింది.

"బంధువులు ఎవరూ లేరు. నా తల్లిని చంపాడని భావించి, పొరపాటున నా తండ్రిని వురి తీసింది న్యాయస్థానం- నా అయిదారేళ్ళ వయసులో....."

ఆమె దిగ్భ్రాంతితో "మరి మీరు...." అన్నది.

"వారాలుండి చదువు పూర్తి చేశాను - లాయర్నవ్వాలని..."

ఆమె చాల సేపు మౌనంగా వుండి - "మిమ్మల్ని చూసిన వారెవరూ మీ వెనుక ఇంత బాధ వుందనుకోరు" అంది.

"నాకు బాధేమీ లేదే. నేను హాయిగా వున్నాను" అంటూ నవ్వేశాడు.

ఆమె నవ్వలేదు. అదే అమాయకమైన నవ్వూ, ఎప్పుడూ నవ్వుతూ వుండే కళ్ళూ, ఈ నిజాయితీ, ఈ అమాయకత్వం, ఈ నిర్మలత్వం, అన్నిటికీ మించి ఈ చిన్నపిల్లాడితనం, ఆమెని క్రొత్త ప్రపంచంలోకి తీసుకెళ్ళినయ్.

ఇప్పటివరకూ ఆమె వున్న ప్రపంచం వేరు. అది కృత్రిమత్వంతో నిండి వున్నది. అక్కడ ప్రతివారూ లౌక్యులే. కొందరు తమ క్వాలిఫికేషనూ, తమ అర్హతలూ డైరెక్టుగా తెలిపేవారు. మరికొందరు ఇన్‌డైరెక్టుగా తెలిసేలా చేసుకుని ఆమెని ఇంప్రెస్ చెయ్యడానికి ప్రయత్నించేవారు. అయితే ఇంతకాలపు పరిచయంలో కూడా చిరంజీవి తనో రాంక్ హోల్డర్‌నన్న సంగతిగానీ, తన బాధల సంగతికానీ చెప్పనేలేదు.

ఎప్పుడూ మొహంమీద చిరునవ్వే, అందులో కొద్దిగా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు వుంటే ఉండొచ్చుగాక అయినా నవ్వు నవ్వే కదా!

చేతిలోవున్న ఫోర్క్ పళ్ళమధ్య, స్పూన్ ఇరికిస్తూ ఆమె ఆలోచనలనుంచి తేరుకుని లేచి "పదండి పోదాం" అన్నది.

అతడు లేచేసరికి ఆమె ద్వారం దగ్గరకి వెళ్ళింది. వెయిటర్ వచ్చి టిప్ తీసుకుంటున్నాడు. ఆమె బల్లమీద మర్చిపోయిన కారు తాళాలు అందుకుంటూ అతడు ఫోర్క్‌నీ, స్పూన్‌ని చూశాడు.

ఆ భంగిమ విచిత్రంగా వుండటం గమనించి "ఇలా ఫోర్క్‌లో స్పూన్ పెడ్తే ఏమిటి?" అని అడిగాడు.

"ఐ లవ్ యూ సర్" అన్నాడు నమ్రతగా వెయిటర్.

"హుర్రే.......హుర్రే" అన్న చిరంజీవి అరుపు ఆ హోటల్ అంతా ప్రతిధ్వనించింది. ఒక్క ఉరుకుతో బైటకు పరుగెత్తాడు. కారు దగ్గర అర్చన నిల్చునివుంది. అతడి హుషారు చూసి నవ్వుతూ తాళాల కోసం చెయ్యి చాచింది.

"నేను డ్రైవ్ చేస్తాను" అన్నాడు.

"చెవర్లెట్" అందామె.

"మీరు పక్కనుంటే లారీ అయినా డ్రైవ్ చేసేస్తాను అర్చనగారూ" అన్నాడు. ఆమె నవ్వి అతడిపక్కన కూర్చొంది. కారు రివర్స్‌లోకి వెనక్కి వెళ్ళి గేటుగుండా బైటకి దూసుకుపోయింది.

అయిదు నిమిషాల్లో కారు ఆమె ఇంటిముందు ఆగింది. ఆమె కారు దిగుతూంటే "ఒక్క నిమిషం" అని ఆమె చెయ్యి తీసుకుని నాజుగ్గా వేలికి ఉంగరం - ఎస్సెల్సీ మెడల్‌తో చేయించింది తొడిగాడు. ఆ తరువాత అతడు తన రూమ్‌కి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి ఊహల్లో తేలిపోతూ నిద్రపోయాడు.

కానీ అర్ధరాత్రి దాటాక నిద్రాభంగం అయింది. ఎవరో తలుపు కొట్టిన చప్పుడు. కళ్ళు నులుముకుంటూ వెళ్ళి తీశాడు.

ఎదురుగా దారాసింగ్!

"మీరడిగినట్టు శవం రెడీగా వుంది సార్" అన్నాడు.

చిరంజీవికి మొదట అర్థంకాలేదు. కాగానే హుషారుగా లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో తయారయి వచ్చాడు.

ఇద్దరూ నిర్మానుష్యమైన వీధుల గుండా నడవసాగారు. రాత్రి ఒంటిగంట దాటుతోంది.

"ఎవరిదీ శవం" అడిగాడు చిరంజీవి.

"నాకూ తెలీదు సాబ్" అన్నాడతను "నాకు తెలిసిన రిక్షావాళ్ళకీ - లేబర్‌కీ చెప్పి వుంచాను - ఏదైనా శవం పడుంటే నాకు చెప్పమని, ఆచారి వీధిలో ఉందని కబురొచ్చింది. నేనూ ఇంకా చూడలేదు. చూసి, మీకు నచ్చితే తీసుకుందాం" అన్నాడు అదేదో కూరగాయల బేరంలాగా.

సందులూ, గొందులూ తిరిగి చివరకి ఒక పాడుబడిన పెంకుటిల్లు చేరుకున్నారు ఇద్దరూ.

వీధంతా చీకటిగా వుంది. మెట్లముందు నుంచి మురిక్కాలువ పారుతోంది. దాని వాసన దుర్భరంగా వుంది. అక్కడ వీధిలైట్లు లేవు. దారిద్ర్యం గూడుకట్టుకుని వున్నట్లుంది.

ఇద్దరూ లోపలికి ప్రవేశించారు. ఒకటే గది. గచ్చు అక్కడక్కడా పగుళ్ళుదీసింది. మూలనో పాత ట్రంకుపెట్టె వుంది. దండెం మీద ఉతికిన చీరె ఒకటివుంది. చిన్న గూట్లో రాములవారి విగ్రహం ముందు చిన్న దీపం. ఉన్నంతలో శుభ్రంగా వుంది ఆ గది.

గుమ్మానికి ఎడమపక్క, గోడ దగ్గరగా పడుకోబెట్టి వుంది శవం ఒక యువతిది. దాదాపు ఇరయ్యేళ్ళుంటాయి.

శవం పక్కగా కూర్చొనివుంది ఒక ముసలమ్మ. అలికిడికి తల తిప్పి చూసి "ఎవరు మీరు" అంది.

"ఓబులేసు పంపిండు" అన్నాడు దారాసింగు.

ఆ అవ్వ లేచి చిరంజీవిని పరీక్షగా చూసింది "సుశీలకేమవుతావు నువ్వు?" అని అడిగింది.

చిరంజీవికి అర్థంకాలేదు ఆ ప్రశ్న "ఈ అమ్మాయిపేరు సుశీలా?" అన్నాడు.

అడిగిన తరువాత తప్పు చేశాననుకున్నాడు. సుశీల బంధువునని చెప్పి శవం తీసుకోవాల్సింది. అయితే అందులో ఒక చిక్కువుంది. ఈ అర్థరాత్రి పూట శవాన్ని తీసుకువెళ్ళటానికి ఈ ముసలావిడ వప్పుకుంటుందో, లేదో! ఇంతకీ ఈ అవ్వ ఎవరు?

అయితే అతడు అనుకున్నంత కష్టం కాలేదు ఆ సమస్య. ఆ ముసలావిడ ఇంటిగలావిడ. ఈ సుశీల అనే అమ్మాయి ఆర్నెల్లనుంచీ ఆ ఇంట్లో అద్దెకుంటోంది. ఏదో మిడిల్ స్కూల్లో టీచర్.

"నెలనెలా తప్పకుండా ఒకటో తారీఖుకల్లా అద్దె చెల్లించేది బాబూ. ఎవర్నీ కన్నెత్తి చూసేది కాదు. తన పనేదో తను చేసుకుపోయేది. మంచి పిల్ల" అంటూ సోది మొదలు పెట్టింది. చిరంజీవీ, దారాసింగూ మొహామొహాలు చూసుకున్నారు.

"ఇంతకీ ఎలా పోయింది?" దారాసింగ్ అడిగాడు.

"రెండ్రోజుల్నుంచీ వంట్లో బావోటం లేదని పొద్దున చెప్పింది బాబూ! పొద్దున జొరం బాగా ఎక్కువైందనుకుంటా, నేను చూసినప్పుడు మూలుగుతోంది. 'డాక్టరుకు చూపించుకో పిల్లా' అని చెప్పి వెళ్ళిపోయాను. రాత్రి పదింటికి దీపం ఎలగటంలేదేమో అని చూస్తే సచ్చిపోయి వుంది. పాపం చాన మంచి పిల్ల. బంధువులు యెక్కడున్నారో తెలీదు. ఓబులేసుని పిల్చి చూపించాను."

మిగతాది అర్థమయింది చిరంజీవికి. ఆ ఓబులేసు వచ్చి ఇతడికి చెప్పాడన్నమాట.

అతడు ఏ విధమైన లొసుగులూ వుంచదల్చుకోలేదు. ఆమెకు రెండు రోజుల్నుంచీ వున్నది మామూలు జ్వరమేననీ, ఏ డాక్టరూ వచ్చి చూడలేదనీ నిర్ధారణ చేసుకున్నాడు. ఎందుకంటే ఆ తరువాత పోలీసులు పేపర్లో ఫోటో ప్రకటించటంలాటిది చేస్తే మళ్ళీ డాక్టరు వచ్చి అది సహజమరణంగా చెప్పకూడదు.

టెంపరేచర్ యెక్కువై, కోమాలోకి వెళ్ళి, పట్టించుకునే నాధుడు లేక చచ్చిపోయిందా ఆ అనాధ అమ్మాయి! తనకి

కావల్సింది అలాంటి చావే.

ఆ తరువాత అవ్వని వప్పించటం కష్టం కాలేదు. ఆవిడ ఒకరకంగా సంతోషించింది కూడా. ప్రొద్దున్నే జనం మూగటం, శవాన్ని తీసుకెళ్ళటం సమస్య, అన్నీ ఆలోచించి బాధపడ్తోంది ఆవిడ. ఏ మూడు నెలలో ఇల్లు పాడు పెట్టాలీ అంటే అద్దెపోతుంది. అది మరీ బాధిస్తూంది ఆవిడని.

దాన్ని గుర్తించాడు చిరంజీవి. యాభై రూపాయలు చేతులు మారేసరికి అవ్వటోన్ మారిపోయింది "తీసుకెళ్ళు బాబూ. పాపం బతికున్నన్ని రోజులూ ఎవరూ పట్టించుకోలేదు. ఇన్నాళ్ళకి నువ్వొచ్చావు" అంది.

ఆ తరువాత పని చకచకా జరిగిపోయింది. ఈ పని కోసమే వేరుగా తీసి పెట్టి వుంచిన డబ్బు దారాసింగ్‌కి ఇచ్చేశాడు. అతడు సలాం చేస్తూ "మళ్ళీ యేదైనా శవం కావల్సొస్తే చెప్పండి సాబ్. ఈ వూళ్ళో యిట్లాంటి చావులెన్నో" అన్నాడు.

"ఊరేమిటి - దేశంలోనే ఎన్నెన్నో" అనుకున్నాడు చిరంజీవి మనసులో. పైకి మాత్రం "అఖ్ఖర్లేదులేవోయ్" అన్నాడు. అతడు వెళ్ళిపోయాక సర్వోత్తమరావుకి ఫోన్ చేసి నిద్రలేపాడు.

శవం గురించి చెప్పగానే ఆయన నిద్రమత్తు వదిలిపోయింది. చిరంజీవి తనెక్కడ వున్నదీ గుర్తులు చెప్పాడు. పదిహేను నిమిషాల్లో ఆయన కారేసుకుని వచ్చాడు. ఇద్దరూ తిరిగి ఆ ఇంటికొచ్చారు. శవం అలాగే వుంది.

శవాన్ని తీసుకొచ్చి కార్లో పడుకోబెట్టారు. గూట్లో వున్న ఆమె హాండ్ బాగ్ తీసుకున్నాడు చిరంజీవి. గదిలో వున్న శవాన్నీ, తరువాత దాన్ని చిరంజీవి కార్లో పడుకోబెడ్తున్నప్పుడూ ఆయన ఫోటోలు తీశాడు. వెనుక సీట్లో శవాన్ని వేసుకుని కారులో వూరి చివరికి వెళ్ళారు ఇద్దరూ. సత్రం వెనుక పాడుబడిన బావి వుంది. కొంచెం దూరంగా తుప్పలున్నాయి. కారు బోయినెట్ మీద కాగితం పెట్టి చిరంజీవి ఒక ఉత్తరం వ్రాశాడు.

"డియర్ సుశీలా! మన సమస్యలు చాలా చర్చించాలి. సాయంత్రం ఆరింటికి సత్రం దగ్గరికి రా - చిరంజీవి"

ఆ కాగితాన్ని ఆమె హాండ్‌బ్యాగ్‌లో పెట్టి దూరంగా తుప్పల్లోకి విసిరేశాడు.

ఆ తరువాత శవాన్ని కార్లోంచి దించాడు. బావి పక్కగా పడుకోబెట్టి చిరంజీవి గొంతు నులిపాడు. అతడా పని చేస్తూ వుండగా ఆయన ఫ్లాష్‌తో ఫోటోలు తీశాడు. ఆ తరువాత శవాన్ని బావిలోకి తోస్తూ వుండగా మరోసారి ఫోటోలు....

ఆ తరువాత చిరంజీవి తనతో పాటూ తెచ్చిన సిగరెట్ పాకెట్ విప్పి నాలుగైదు సిగరెట్ పీకలు తుప్పల్లో - ఆమె పర్సు విసిరేసిన చోట పడేశాడు. బావి గట్టుమీదా, అంచుమీదా ముద్రలు పడేటట్టు వేళ్ళు అద్దాడు.

ఇదంతా చేస్తున్నప్పుడు ఇద్దరూ మౌనంగా ఎవరి పని వాళ్ళు చేసుకుపోయే రోదసీ యాత్రికుల్లా వున్నారు. రాజ్యాంగంలో ఒక గొప్ప మార్పుకోసం వారు చేస్తున్న అద్భుత ప్రయత్నాన్ని ముందు ముందు దేశం గుర్తించవచ్చుగాక - లేకపోవచ్చుగాక. కాని వాళ్ళు దానికోసం తీసుకుంటున్న రిస్కు మాత్రం అభినందనీయం.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

8 వ భాగం

అయితే ఆ రిస్కులో ఏ మాత్రం లొసుగులు లేకుండా చూడటానికి ఆ ప్లాన్ వెనుక సర్వోత్తమరావు మొదడు వుంది. అందుకే చిరంజీవి "నన్ను యింటి దగ్గర దింపేసి మీరు వెళ్ళిపోండి" అన్నప్పుడు ఆయన నవ్వాడు "అప్పుడే మన పని పూర్తి కాలేదు" అన్నాడు.

"ఇంకేముందీ? రేపు పోలీసులు వచ్చి నన్ను అరెస్టు చేయటమేగా" అన్నాడు చిరంజీవి.

"ఈ ఫోటోలు సరిగ్గా వచ్చినాయో లేదో చూడొద్దూ."

చిరంజీవి నాలుక్కర్చుకుని "అవును, అంత ముఖ్య విషయమే మర్చిపోయాను" అన్నాడు.

ఇద్దరూ కార్లో లాయరుగారింటికి వెళ్ళారు. కార్లో ఆయన అన్నాడు - "ఒకవేళ ఈ ఫోటోలు గాని సరిగ్గా రాకపోతే మనం తిరిగి బావిదగ్గరకి వెళ్ళాల్సి వుంటుంది."

అయితే ఆ అవసరం రాలేదు.

సర్వోత్తమరావు ఇంట్లోనే డెవలపింగ్ పరికరాలున్నాయి. లైట్ ఆఫ్ చేసి, ట్రేలో డెవలపర్ వేసి నెగిటివ్ కడిగాడు. అది ఆరగానే కట్ చేసి ఎన్లార్జర్‌లో ఫిక్స్ చేసి లైటు వేశాడు. క్రింద ప్రింటుమీద బొమ్మ పడింది. లెన్స్ కదిపేకొద్దీ బొమ్మ పెద్దదవసాగింది. ప్రింట్లన్నీ కడగడానికి అరగంట పట్టింది.

మొదటి ఫోటో...... గదిలో ఒక మూలగా శవం. శవం సుశీలదని స్పష్టంగా తెలుస్తోంది. రెండో ఫోటో ఆ అమ్మాయి శరీరాన్ని చిరంజీవి కార్లో పెట్టడం. మొత్తం ఫోటోలన్నీ వరుసగా ఎన్లార్జ్ చేశారు. జరిగిన కథంతా మరెవరూ చెప్పనవసరం లేకుండా అవే చెబుతున్నాయి.

వాటిని భద్రంగా దాచిన తర్వాత చిరంజీవి ఇంటికి వెళ్ళిపోయాడు. అప్పుడు రాత్రి మూడయింది.

.....

మరుసటిరోజు చిరంజీవికి మెలకువ వచ్చేసరికి తొమ్మిదయింది. తొందర తొందరగా పక్కింటికి వెళ్ళి పేపరడిగి తిరగేశాడు. మొత్తం అంతా చూసినా ఎక్కడా ఏమీ న్యూస్ కనబడలేదు.

అతడు లేచేసరికే పట్టణం అంతా అట్టుడికినట్టు వుడికిపోతూ ఉంటుందనీ, ఎవరినోట విన్నా ఈ హత్య సంగతే వినపడుతుందనీ అనుకున్నాడు. ఎవరూ దీన్ని గురించి మాట్లాడకపోవటంతో కంగారుపడి సర్వోత్తమరావుకి ఫోన్ చేశాడు.

"ఇంకో రోజు పోనీ, అదీ మనమంచికే" ఆయన అన్నాడు "అప్పటికీ తెలియకపోతే మనమే పోలీసులకి ఫోన్ చేద్దాం..... ఆకాశరామన్నగా" నవ్వారు.

“నిన్న అర్థరాత్రి నేను మీ ఇంటికి వచ్చినట్టు అర్చనకి తెలీదు కదా”

“ఉహూ. తెలీదు అయినా తను హడావుడిలో వుందిలే. రేపేగా తన ప్రయాణం.”

........

సాయంత్రం ఆరయింది. కార్లోనే కూర్చొని - నీటి మీద పడ్తున్న ఎర్రటి సంధ్యని చూస్తున్నారు ఇద్దరూ - చిరంజీవి, అర్చనా.

“మళ్ళీ తిరిగి రాక యెప్పుడు?” చిరంజీవి అడిగాడు.

“మూడు నాలుగు నెలలు పట్టొచ్చు. ప్లాంట్ స్టడీ వుందిగా..... అందుకని ఇంకో నెల ఆలస్యం అయినా అవ్వొచ్చు” అంటూ అతడిని ఏడిపించడానికి నవ్వింది. ఆ నవ్వులో నాలుగు నెలల పాటూ ఒకర్నొకరు చూడకుండా వుండగలమా? అన్న చిలిపిదనం వుంది.

“ప్రతి మూడ్రోజులకి ఒక ఉత్తరం వ్రాయాలి” అన్నాడు చిరంజీవి.

“ఇంకా పాతకాలం ముసలమ్మలా ఉత్తరం ఏమిటి? ఫోన్ చేస్తాను. రోజు విడిచి - రోజు - ఇంటర్నేషనల్ కాల్”

“నాకు ఫోన్ లేదుగా”

ఆమె దెబ్బతిన్నట్టు అతడి వైపు చూసింది “ఇంకా మీదీ, నాదీ ఏమిటి - మా ఇంటికే వచ్చెయ్యండి. రోజూ ప్రొద్దున్నే యెనిమిదిన్నరకు చేస్తాను. ఆ టైమ్‌కి సరిగ్గా ఫోన్ దగ్గర ఉండండి”

“ఏ యే రోజులు?”

“ఇంగ్లీషు వారంలో ‘యు’ వున్న రోజులు” అంటూ నవ్వింది.

అతడికి అర్థంకాలేదు ‘అంటే’ అన్నాడు.

“ఆదివారం స్పెల్లింగ్ ఏమిటి?”

S-U-N-D-A-Y అన్నాడు.

“అందులో ‘యూ’ వుందా?”

“ఉంది”

“సోమవారం స్పెల్లింగ్?”

చెప్పాడు.

“అందులో ‘యూ’ వుందా?”

"లేదు"

"ట్యూస్‌డేలో?"

"ఉంది"

"రోజువిడిచి రోజు అంటే అదే - స్పెల్లింగ్‌లో 'యూ' ఉన్న రోజు చేస్తానన్నమాట."

"ఫ్రాన్స్ వాళ్ళు వారాలకి కొత్త పేర్లు పెట్టారు తెలుసా?"

ఆమె ఆశ్చర్యపడి "ఏమిటి" అని అడిగింది.

"ఫ్రాన్స్ వెళ్తూ ఆ మాత్రం తెలుసుకోకపోతే ఎలా?"

"అబ్బా - అలా కవ్వించకపోతే చెప్పకూడదా ఏమిటి?" అందామె ఇంగ్లీషులో.

"సోమవారానికి - మూన్ డే, బుధవారం - వుడ్‌నెస్‌డే" అంటూ అతడు పూర్తి చెయ్యకుండానే ఆమెకి అర్థమయి నవ్వటం ప్రారంభించింది "తెలివి తేటలున్న అబ్బాయిల్ని అమ్మాయిలు అందరికన్నా ఎక్కువగా అభిమానిస్తారు. అయితే బైట ఎక్కడా వాటిని ప్రదర్శించకుండా అమాయకంగా కనబడ్తూ కేవలం తమ దగ్గరే ఆ తెలివితేటల్ని చూపించే అబ్బాయిల్ని మరింత ప్రేమిస్తారు."

ఆమె నవ్వటం ఆపి - దిగులుగా "నాకు వెళ్ళాలనిపించటం లేదు" అంది.

"నాకూ అనిపించటంలేదు" అన్నాడు.

"పోనీ ప్రయాణాన్ని కాన్సిల్ చేసుకోనా, తరువాత ఇద్దరం కలిసే వెళ్ళొచ్చు" అంది.

చిరంజీవి బోల్డెంత ఆనందంతో "అంతకన్నానా" అన్నాడు ఆరాధనా పూర్వకంగా ఆమె వైపు చూస్తూ. అంతలో యేదో జ్ఞాపకపం వచ్చి పక్కలో బాంబు పడ్డట్టూ అదిరిపడి "వద్దొద్దు" అన్నాడు.

ఆమె ఇక్కడే వుంటే, తను అరెస్టయితే చూస్తూ వూరుకోదు. తనని ఈ కేసులోంచి బైటకు రావటానికి పేరు మోసిన క్రిమినల్ లాయరే అవసరం లేదు. ఏ చెట్టు కింద ప్లీడరయినా చాలు - ఆ సుశీల గురించి వాకబు చేసి, ఆ ఇంటిగలావిడ్నో - దారాసింగ్‌నో - ఓబులేసునో కోర్టుకి తీసుకొస్తే - దూది ఎగిరినట్టూ కేసు ఎగిరిపోతుంది. అదికాదుగా కావల్సింది.

"మనం వెళ్దామా యిక" అన్న అర్చన మాటల్తో ఆలోచనలోంచి తేరుకున్నాడు చిరంజీవి. బాగా చీకటిపడ్తూంది. వెళ్దామన్నట్టూ తలూపగానే ఆమె కారు రివర్సు చేసింది. చేస్తూంటే, "హల్లో గురూగారూ" అన్న అరుపు వినిపించి తలతిప్పి చూశాడు. దూరం నుంచి దారాసింగ్ పరిగెత్తుకు వస్తున్నాడు.

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడబోయి, మాటిమాటికీ పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడితే బావోదని తమాయించుకున్నాడు.

దారాసింగ్ దగ్గరకొచ్చి "శవం బావుందా సార్" అని అడిగాడు.

అర్చన ఈ అర్థంలేని వాక్య నిర్మాణానికి ఆశ్చర్యపోయింది.

"ఇతడు నా క్లయింట్. ఓ కేసులో వాదించాను" అని పరిచయం చేసి అతడి వైపు తిరిగి స్టైయిల్‌గా "ఏవోయ్ - ఎలా ఉన్నావ్" అని అడిగాడు.

"మీరిచ్చిన డబ్బుతో మూడు సీసాలూ, ఆరు కాయలూ" అన్నాడు దారాసింగ్.

అర్చనకి మరింత మతిపోయింది. కేసు వాదించిన ప్లీడరు క్లయింట్‌కి డబ్బు ఇవ్వడం ఏమిటి?

మరి కొద్దిసేపు అతడు అక్కడుంటే ప్రమాదమని గ్రహించిన చిరంజీవి "సర్లే వెళ్ళిరావోయ్ - మళ్ళీ కలువు" అన్నాడు హుందాగా - రాజు సైనికుడికి చెప్పినట్టూ.

"కలవాలంటే ఎప్పుడైనా రండి కోటలోనే వుంటాను" అన్నాడు దారాసింగ్, చక్రవర్తి సామంతరాజుని ఆదేశించినట్టు.

వింటూన్న అర్చనకి పూర్తిగా మతిపోయింది......"కోటలో ఉండటమేమిటి?" అని అడిగింది అయోమయంగా.

"కోట గుమ్మం వీధిలో" అన్నాడు చిరంజీవి. అని, "పోదామా" అన్నాడు.

ఆమె కారు స్టార్టు చేసింది. ఆమె ఇంటి దగ్గర దిగి, రూమ్‌కి వెళ్తూ వెళ్తూ ఈవెనింగ్ ఎడిషన్ పేపరు కొన్నాడు.

చివరి పేజీలో చిన్న అక్షరాల్తో పడింది వార్త -

యువతి హత్య!

ఊరి చివర సత్రం పక్కనున్న బావిలో ఒక యువతి శవాన్ని పోలీసులు కనుక్కున్నారు. దాదాపు ఇరవై సంవత్సరాలున్న ఈ యువతి గొంతు ఎవరో నులిమి బావిలో పడేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మిగతా వివరాలకోసం పోలీసులు వెతుకుతున్నారు.

చదవటం పూర్తి చేసిన చిరంజీవి పెదవులమీద చిరునవ్వు వెలిసింది.

.......

ఎయిర్ పోర్టు హడావుడిగా వుంది. సర్వోత్తమరావు, మిగతా పరివారం అంతా అక్కడే వుంది. అర్చన తెల్లటి చీరెలో కొట్టొచ్చినట్టు కనబడుతోంది. చిరంజీవి తన మామూలు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో దూరంగా నిలబడ్డాడు.

ఆమె అందర్నీ తప్పించుకుని అతడి దగ్గరకొచ్చి, చిరునవ్వుతో "వెళ్ళిరానా" అంది. ఎందుకో తెలీదుగానీ అతడి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. జీవితంలో అతడి పట్ల అంత ఆప్యాయతా, అతనంటే అంత ఇంట్రెస్టూ చూపించిన అమ్మాయి ఆమె వొక్కతే.

"ఇదేమిటి" అందామె.

“విరహం” అన్నాడు కంటినిండా నీటితోనే.

ఆమె కూడా కదిలిపోయి, అంతలోనే తమాయించుకుని నవ్వి, “మొగవాళ్ళు ఏడవరు” అంది.

“రివర్సు గేరు మొన్నే నేర్చుకున్నాను” మొహంలో ఏ భావమూ లేకుండా అన్నాడు.

ఆమె చిరుకోపంతో “అందరూ ఉన్నారు కాబట్టి సరిపోయింది. కానీ లేకపోతే ఏం చేసేదాన్నో తెలుసా?” అంది.

“తెలుసు”

ఆమె ఆశ్చర్యపోయి “ఏం చేసుండేదాన్ని?” అంది.

“చెంప వాయగొట్టనంటే చెప్తాను.”

“కొట్టను”

“మెడ చుట్టూ చేతులు వేసి ఫేర్‌వెల్ .... చెప్పి వుండేవారు” మాటలు మింగేస్తూ నసిగాడు.

“హౌ డేర్ యూ ఆర్” గద్దిస్తూ అన్నది.

“మూడ్నాలుగు నెలలు విరహాన్ని కవర్ చేయడానికి ఆ మాత్రం సిమెంట్ కావాలి.”

“పెళ్ళవకుండా ముద్దు పెట్టుకుంటే చెడ్డపిల్లలు పుడ్తార్ట, మా నాయనమ్మ చెప్పేది.”

“పెళ్ళవకుండా ముందు పెట్టుకున్న మొదటి ముద్దు మనవడు పుట్టేదాకా జ్ఞాపకం వుంటుందట - మా తాతయ్య చెప్పేవాడు.”

ఆమె కన్విన్స్ అయింది కానీ చుట్టూ చాలామంది వున్నారు. విమానాశ్రయం విదేశానిది కాదు.

“ఏమిటా పుస్తకం” అన్నాడు ఆమె చేతిలో పుస్తకాన్ని చూస్తూ,

“ఛాప్‌మన్స్ రిపోర్టు. ఇర్వింగ్ వాలెస్‌ది” అంది. పుస్తకం అట్ట మీద రెండు పెదవుల బొమ్మ వుంది. అది అందుకుని - చూపుడు వేలుని ముద్దు పెట్టుకుని, ఆ బొమ్మ మీద అద్దాడు.

ఆమె పుస్తకాన్ని తీసుకుని పరీక్షిస్తున్నట్టు మొహం దగ్గరకి తీసుకుంది. ఇద్దరూ చాలా సీరియస్‌గా లక్షల లక్షల బిజినెస్సు మాట్లాడుకుంటున్నారేమో అనుకున్నారు చూస్తున్నవాళ్ళు. వాళ్ళిద్దరి మధ్య సీక్రెట్‌గా ఓ ముద్దు ట్రాన్స్‌ఫర్ అయిందన్న విషయం గమనించింది సర్వోత్తమరావుగారొక్క రే. క్రిమినల్ లాయర్‌గదా. ఆయన గుబురు మీసాల వెనుక చిరునవ్వు కదలాడింది.

సరిగ్గా పదినిముషాల తర్వాత అర్చన విమానంలోకి ప్రవేశించింది. ఆ తరువాత పది నిమిషాలకి విమానం బయలుదేరి వెళ్ళిపోయింది.

.......

పోలీసు దర్యాప్తు చురుగ్గా సాగింది. బావికి వందగజాల దూరంలో వున్న హాండ్ బ్యాగ్ రెండురోజుల తర్వాత దొరికింది. చిరంజీవి అనే పేరు చిన్న పిల్లలకి వుంటుందని ముందు హైస్కూళ్ళూ, మిడిల్ స్కూళ్ళూ వెతికారు. అక్కడ దొరక్కపోయేసరికి ఫైలు మూసేద్దామా అనుకున్నారు.

అంతలో ఇన్‌స్పెక్టర్‌కి ఈ చిరంజీవి అన్న పేరు ఎక్కడో విన్నట్టుందే అనిపించింది. ఆరోజు అర్ధరాత్రి కల్సినవాడు జ్ఞాపకం వచ్చాడు. లాయరని తెల్సింది. చేతి వ్రాత పరిశీలించారు. అతడిదే అని తేలింది.

రాత్రి తొమ్మిదింటికి నిద్రకుపక్రమిస్తూంటే ఇన్‌స్పెక్టర్ వచ్చాడు "మిస్టర్ చిరంజీవి, ఈ చేతి వ్రాత మీదేనా" తలుపు తీసి నిలబడ్డ చిరంజీవిని అడిగాడు.

"నాదే"

"మీరే సిగరెట్లు కాలుస్తారు?"

కాల్చను అనబోయి, తమాయించుకుని "చార్మినార్" అన్నాడు.

"యూ ఆర్ అండర్ అరెస్ట్" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"చార్మినార్ సిగరెట్లు కాల్చేవారందర్నీ అరెస్టు చేస్తున్నారా?" అడిగాడు చిరంజీవి.

ఇన్‌స్పెక్టర్ పళ్ళు బిగించి "సుశీల అనే అమ్మాయిని హత్య చేసినందుకు మిమ్మల్ని సెక్షన్ 366, సెక్షన్ 351ల క్రింద అరెస్టు చేస్తున్నాను."

"సెక్షన్ 302 లేదా" దిగులుగా అడిగాడు.

"ఉంది."

"థాంక్యూ ఇన్‌స్పెక్టర్" అంటూ వేన్ ఎక్కాడు. వేన్ పోలీసుస్టేషన్ వైపు కదిలిపోయింది.

ముద్దాయిని నేరం చేశావా, చెయ్యలేదా అని కోర్టులో అడుగుతారు. కొంతమంది పోలీస్‌స్టేషన్‌లో యిచ్చిన స్టేట్‌మెంట్, తను బలవంతం మీద యిచ్చాననీ, తను నేరం చేయలేదనీ కోర్టులో చెప్తారు.

చాలామంది నేరం చెయ్యలేదనే మొదటినుంచీ వాదిస్తారు. చాలా తక్కువమంది నేరాన్ని పూర్తిగా వొప్పుకుంటారు. అటువంటప్పుడు ప్రాసిక్యూటర్ పని తేలికవుతుంది. చిరంజీవి కేసులో ప్రాసిక్యూటర్ ఓ శాడిస్టు. కానీ, మంచి చమత్కారినని తనకి తనే అనుకుంటూ వుంటాడు.

ఆయన నవ్వితే ఏడ్చినట్టూ, ఏడుస్తే భయపడినట్టూ వుంటుంది. ఆయన కోర్టులో వేసే జోకులకు కోర్టు బంట్రోతు కూడా నవ్వడు. ప్రాసిక్యూటర్‌కీ, చిరంజీవికీ మధ్య మధ్య సంభాషణ ఇలా జరిగింది.

ప్రాసిక్యూటర్ : మీ పేరు?

చిరంజీవి : చిరంజీవి.

ప్రా.క్యూ : ఓహో - ఆ పేరుందనే ధైర్యంతోనేనా మర్డర్లు చేస్తున్నారు.

చిర : నేను పుడ్తున్నప్పుడు నర్సుకి వరుసగా తుమ్ములు వచ్చినాయట, అందుకని నాకా పేరు పెట్టారు.

కోర్టులో నవ్వులు వినబడటంతో ప్రాసిక్యూటర్ ఇరిటేట్ అయ్యాడు. జడ్జి 'ఆర్డర్ ఆర్డర్' అన్నాడు.

"మీరేం చేస్తూ వుంటారు?"

"ఎప్పుడు?"

"ఆఫ్‌కోర్స్, పనిచేసేటప్పుడు"

"వెల్. పని చేస్తూ ఉంటాను."

"అది తెలుసు. కానీ ఎక్కడ?"

"టేబిల్ ముందు కుర్చీలో కూర్చొని"

ప్రాసిక్యూటర్ మరింత ఇరిటేట్ అయి "ఎవరు చేసినా అదే చేస్తారు" అని అరిచాడు.

"కాదు. నేనప్పుడప్పుడు చెట్టు క్రింద కూడా నిలబడ్తూ ఉంటాను" సిన్సియర్‌గా అన్నాడు చిరంజీవి.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

9 వ భాగం

"నిలబడి?"

"కష్టమర్ల కోసం చూస్తూ ఉంటాను"

"ఎటువంటి కష్టమర్లు?"

"డబ్బులిచ్చే వాళ్ళు."

"ఓహో - మొగ వ్యభిచారం అన్నమాట. ఎక్కడుంది ఆ చెట్టు?"

"కోర్టు కాంపౌండ్‌లో సర్! పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవకముందు మీరు నిలబడిన చెట్టు"

కోర్టులో నవ్వులు - జడ్జి 'ఆర్డర్ - ఆర్డర్" అన్నాడు.

అతడికి కుర్చీలో కూర్చోవటం దుర్భరంగా వుంది. ఎప్పుడెప్పుడు హియరింగ్ పూర్తిచేసి ఛాంబర్స్‌కి వెళ్ళిపోదామా అని వుంది. చాలా సింపుల్ కేస్ యిది. శిక్ష ఏం విధించాలా అన్నదే తేల్చుకోవాలి. మూడు సంవత్సరాలు వేద్దామనుకున్నాడు మొదట.

"మిస్టర్ చిరంజీవి - సుశీల మీకెంతకాలం నుంచి తెలుసు."

"రెండు సంవత్సరాలనుంచి"

"మీరామెని ప్రేమించారా?"

"ప్రేమంటే ఏమిటో నాకు తెలీదు" జడ్జీగారికి లేచిపోయిన పెద్ద కూతురు జ్ఞాపకం వచ్చింది. మూడు సంవత్సరాల శిక్షని నాలుగు సంవత్సరాల కఠిన శిక్ష చేశాడు. ప్రేమంటే తెలీదట - ఇడియట్.

వాదన సాగుతోంది.

"ఆమెని రాత్రి సత్రానికి ఎందుకు రమ్మన్నారు?"

"పగలు మా రూమ్‌కి రమ్మంటే మర్డర్ చేయటానికి వీలుండదని."

నాలుగు సంవత్సరాల శిక్ష ఏడు సంవత్సరాలైంది.

"ఒక పెళ్ళికాని అమ్మాయి మిమ్మల్ని నమ్మి, అడవిలోకి వస్తే ఆమెని బలాత్కారం చేయడం అమానుషం అని మీరు భావించటంలేదా?"

"ఎలాగూ చంపుతున్నాను కదా అని సరదాగా బలాత్కారం చేశాను."

ఇతడికి యావజ్జీవ కారాగార శిక్ష సరి అయినది అనుకున్నాడు జడ్జి.

"మిమ్మల్ని నమ్మి వివాహం చేసుకోవాలన్న ఆశతో వచ్చిన అమాయకమైన అమ్మాయిని అలా చెయ్యటానికి మీకెలా మనసొప్పింది చిరంజీవి?"

"కావాలంటే ఉంచుకుంటానన్నాను - విన్లేదు. పెళ్ళే కావాలన్నది. మర్డరు తప్ప మరో మార్గం కనబడలేదు."

జడ్జిగారికి - తన కూతుర్నొదిలేసిన అల్లుడనబడే క్రిమి జ్ఞాపకం వచ్చాడు. ఓ నిర్ణయానికి వచ్చేశాడు. ఆ తరువాత కొంతసేపు వాదన జరిగింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు ప్రెజెంట్ చేశాడు. హియరింగ్ వచ్చేవారానికి వాయిదా వేయబడింది.

హియరింగ్ రోజు కోర్టు కిటకిటలాడి పోయింది. అప్పటికే పత్రికలు ఈ వార్తని ప్రముఖంగా ప్రచురించసాగాయి. ఒక బాధ్యత తెలిసిన యువకుడు - లా చదివినవాడు - ఇంత విచక్షణారహితంగా ప్రవర్తిస్తాడా అని ఎడిటోరియల్స్ వ్రాశాయి. సెన్సేషనలిజానికి అలవాటు పడిన పత్రికలు మరింత ముందుకెళ్ళి చిరంజీవి ప్రఖ్యాత క్రిమినల్ లాయర్ మేనకోడలైన అర్చనని ప్రేమించాడని, పెళ్ళి ప్రయత్నం కూడా జరిగిందనీ ప్రచురించాయి.

అయితే కొన్ని వేల మైళ్ళ దూరంలో వున్న అర్చనకి ఈ విషయాలు ఏవీ తెలియవు. బ్రిటిష్ షిప్ బ్రేకింగ్ కంపెనీ మానేజింగ్ డైరెక్టర్ కారులో వాళ్ళిద్దరూ విమానాశ్రయం వైపు వస్తున్నారు. ఓడల్ని బ్రద్దలు కొట్టే పరిశ్రమ విశాఖపట్టణంలో స్థాపించాలని ఆమె ప్రయత్నం. వాళ్ళ కారు ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్ గుండా పార్క్ లేన్ దాటి హైడ్ పార్క్ మీదుగా వెళ్తోంది. ఇంకో ఇరవై నాలుగు గంటల్లో చిరంజీవిని కలుసుకోబోతున్నానన్న ఆలోచన ఆమెకి ఆనందాన్ని యిస్తోంది.

ఒకవైపు ఆలోచనల్లో వుంటూనే ఎమ్.డి. చెప్పేది వింటోంది. ఓడని డ్రైడాక్‌లోకి తీసుకొచ్చి నీళ్ళు తోడేసి దాన్ని ఎండబెట్టడం గురించి వివరిస్తున్నాడు అతడు. అర్చన విసుగ్గా టైమ్ చూసుకుంది.

అదే టైమ్‌కి చిరంజీవి ఇద్దరు పోలీసులు వెంటరాగా కోర్టులోకి ప్రవేశిస్తున్నాడు. జనం అతడిని చూడసాగారు. వాళ్ళ చూపుల్లో కోపం, కుతూహలం అన్నీ మిళితమై వున్నాయి. అతడి ప్రవేశంతో కోర్టు ఒక్క సారిగా నిశ్శబ్దమైపోయింది.

విక్టోరియా స్ట్రీట్‌లోంచి విమానాశ్రయం ప్రవేశించింది కారు. కారు ఆగగానే ఒక వ్యక్తి వచ్చి విష్ చేశాడు.

"కెప్టెన్ ఫోర్డు" అని అతడిని పరిచయం చేశాడు. ఎమ్.డి. అతడు మాట్లాడి వెళ్ళిపోతూంటే అర్చన అతడి వైపే కుతూహలంగా చూడటం చూసి, "ఏమిటి అలా చూస్తున్నారు?" అని అడిగాడు.

"అతడి నడకని..." సాలోచనగా అంది అర్చన.

"నౌకల మీద ఎక్కువకాలం గడిపిన వారి నడక అలాగే వుంటుంది" అన్నాడు ఎమ్.డి. కౌంటర్ వైపు నడుస్తూ "పాదాలు విశాలంగా పెట్టి నడిస్తే గరిమనాభి, లంబరేఖ పీఠాన్ని అతిక్రమించకుండా అలా నడుస్తారు. అదే బైటకూడా అలవాటు అయిపోతుంది".

అర్చన దాని గురించి ఆలోచించడం లేదు. అలాటి నడక ఎక్కడో చూసింది. ఎక్కడ...ఎక్కడ?

అతడివద్ద సెలవు తీసుకుని ఆమె కస్టమ్స్ వైపు నడిచింది. ఆ హడావుడిలో మరి ఆ విషయాన్నే మర్చిపోయింది. మరో గంట తర్వాత ఆమె ఎక్కిన విమానం భారతదేశం వైపు బయల్దేరింది.

సరీగ్గా అదే సమయానికి జస్టిస్ పరశురాముడు తన నాలుగు పేజీల జడ్జిమెంట్ చదువుతున్నాడు. కోర్టులో సూది పడ్తే వినపడేంత నిశ్శబ్దం వ్యాపించి వుంది.

"సుశీల అనే యువతిని చిరంజీవి హత్య చేశాడన్న విషయం ప్రాసిక్యూటర్ 'బియాండ్ డౌట్' నిరూపించగలిగింది. ఈ చిరంజీవి అనే యువకుడిలో ఏ మూలా సున్నితత్వమూ, జాలీ, కరుణా లేవనేది నిరూపణ అయింది. పైగా ముద్దాయి ఈ హత్య ఏదో కసితోనూ ఆవేశంతోనూ చేశాడన్న నమ్మకం నాకు కుదరటంలేదు. ఇది చాలా కోల్డ్‌బ్లడ్డెడ్ మర్డర్ అని నేను నమ్ముతున్నాను.

ముద్దాయి ఈ హత్యని తానే చేశానని స్వయంగా వప్పుకున్నాడు. దురదృష్ట మేమిటంటే, ఈ హత్యపట్ల ముద్దాయి పశ్చాత్తాప పడ్తున్నాడన్న అభిప్రాయం నాకు అతడి ప్రవర్తన వల్ల కలగటం లేదు. పైగా తనకి ప్రేమంటే నమ్మకం లేదని అతడే వొప్పుకున్నాడు. అతడి ప్రేమలో పడి మరింతమంది యువతులు శలభాల్లా మాడిపోయే ప్రమాదం కూడా వుంది. జైలు జీవితం ఇతడిని రిఫార్మ్ చేస్తుందని నేను భావించడంలేదు.

కాపిటల్ పనిష్‌మెంట్ రేర్ ఆఫ్ ది రేరెస్ట్ కేసుల్లోనే విధించాలన్న సుప్రీం కోర్టు సూచనని ఇక్కడ ప్రస్తావించదల్చుకున్నాను. ఈ కేసు అటువంటి రేర్‌కేసుగా పరిగణించి, చిరంజీవి అనబడే ఈ ముద్దాయికి మరణ శిక్ష విధిస్తున్నాను.హి విల్ బి హేంగ్డ్ బై నెక్ టిల్ హి ఈజ్ డెడ్........"

10

రకరకాల వ్యక్తుల్తో విమానాశ్రయం కళకళలాడుతోంది. ప్రకటన వినిపిస్తూ వుండగా ఎయిర్ బస్ శబ్దం చేసుకుంటూ దిగింది. తరువాత ఐదు నిమిషాలకి అర్చన విమానం దిగుతూ కనిపించింది. సర్వోత్తమరావు జనంలోంచి ఒక్క అడుగు ముందుకేశాడు. ఫ్యాక్టరీ తాలూకు పరివారం ఒక మూలగా నిలబడివున్నారు.

అర్చన దగ్గరకు రాగానే "హౌ ఆర్యూ బేబీ...." అన్నాడు. ఆమె చిరునవ్వుతో "బావున్నారా అంకుల్" అన్నది. ఆమె కళ్ళు అటూ ఇటూ వెతుకుతున్నాయి. కావాల్సిన వ్యక్తి కనిపించటం లేదు. ఇంతలో మానేజరూ, మిగతావారూ ఆమె దగ్గర కొచ్చి అభినందనలు తెలుపడం మొదలెట్టారు. ఆమె అన్యమనస్కంగానే వారితో మాట్లాడుతూ ముందుకు నడిచింది. సర్వోత్తమరావుతో కలిసి కారు ఎక్కబోతూ వుంటే ప్రక్కనో కారు వచ్చి ఆగింది.

అందులోంచి ప్రకాష్ దిగాడు.

అతడి చేతిలో పూలగుత్తి వుంది. చిరునవ్వుతో ఆమెకి దాన్ని అందిస్తూ "కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు. ఆమె దాన్ని అందుకుని "థాంక్స్" అంది.

అయితే ఆ మాటల్లో పెద్ద సంతోషం లేదు. ఆమె వళ్ళు మండిపోతోంది. ఇన్నాళ్ళ తరువాత కలుసుకోబోతూ వుంటే - ఇక్కడికి రాకుండా ఈ మహానుభావుడు ఏం రాచకార్యం వెలగబెడ్తున్నాడు?

ఆమె కారు సీటు వెనక్కివాలి, కళ్ళు మూసుకుని మామయ్య అడిగిన ప్రశ్నలకి అన్యమనస్కంగా సమాధానం ఇవ్వటం ప్రారంభించింది. కారు ఇంటికి చేరుకుంది.

ఆమె తన రూమ్‌కి వెళ్ళి, అయిదు నిమిషాల్లో తయారై క్రిందికి వచ్చి, డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంది.

మళ్ళీ అదే నిశ్శబ్దం.

రామయ్య మొహంలో ఏ భావమూ లేకుండా వడ్డిస్తున్నాడు. బైరాగి ఆమెని గాజు కళ్ళతో ఒక్కసారి చూసి, గది తలుపు వెనక్కి తప్పుకున్నాడు. ఆ వాతావరణంలో ఆమెకి ఏదో కొత్తదనం కనబడింది. స్థబ్దానికీ - నిశ్శబ్దానికీ వున్న తేడా అది.

అందరూ తన వైపు చిత్రంగా చూస్తున్నారన్న భావం, అందర్లోనూ ఏదో చెప్పాలన్న తపన. చివరికి, ఎప్పుడూ నిర్లిప్తంగా వుండే రామయ్య మొహంలో అదోలాంటి ఉద్విగ్నత?

ఎందుకు?

ఆమె దాని గురించి మరి పట్టించుకోలేదు. చాలా పన్లున్నాయి. తను లేని ఈ సమయంలో వీళ్ళు ఎంత తినేశారో ముందు పట్టుకోవాలి. సామాన్లన్నీ తెచ్చి పైన పెట్టాడు డ్రైవర్. ఆమె వాటిని విప్పి అందులోంచి ఒక పాకెట్ తీసింది. అది పట్టుకుని మామయ్య గదిలోకి వెళ్ళింది.

"ఇదిగో అంకుల్ - నీ గురించి తెచ్చాను" అని అందించింది. చాలా చిన్న టెలిఫోను, వైరు అవసరం లేనిది. కాలిక్యులేటర్‌లా వుంది. దాన్ని నోటిదగ్గర పెట్టుకుని మాట్లాడితే, మామూలు టెలిఫోను ఆ మాటల్ని అందుకుని కావాల్సిన చోటుకి పంపుతుంది. ఆమె ఆయనకి దాన్ని ఇచ్చి, తిరిగి తన గదికి వస్తూంటే రంగమ్మ కనబడింది.

పని తగ్గించటంకోసం కొన్న ఆటోమాటిక్ క్లీనర్ ఆమె కిచ్చింది. రంగమ్మ మొహం చాటంతయింది.

చివరగా - ఆమె తన గదికి వచ్చి సూట్‌కేస్ పై అరలోంచి చిన్న పెట్టె తీసింది. అగ్గిపెట్టెలా వుందది. విప్పితే, ముఖమల్ గుడ్డ మధ్యరాయి మిలమిలా మెరుస్తూ చిన్న ఉంగరం మధ్యలో పొదగబడి వుంది. ఆమె ఉంగరాన్ని చేతుల్లోకి తీసుకుని వేలితో రాయిని కదిపింది. ఉంగరం రాయి క్రింద చిన్న గడియారం వుంది. ఆమె రాతిని మామూలుగా సర్దింది తన ఉంగరపు వేలు పక్కనే దాన్ని పెట్టి చూసుకుంది.

ఆమె వేలికి ఉంగరం చిరంజీవి గోల్డుమెడల్‌తో చేయించింది! ఆమె మనసు అదోలాంటి తృప్తితో నిండిపోయింది. ఆ క్షణం చిరంజీవి కనబడితే ఎయిర్‌పోర్ట్‌కి రానందుకు క్షమించి వుండేదికూడా.

ఆమె రెండు ఉంగరాల్నీ చూస్తూ వుండగా తలుపు దగ్గర అలికిడి అయి, తల పైకెత్తి చూసింది. గుమ్మం దగ్గర బైరాగి నిలబడి వున్నాడు. ఒక శవాన్ని తలుపుకి నిలబెట్టినట్లు వుంది అతడి ఆకారం.

ఆమె వెన్నెముకలో మొదలైన చలి ఒక్కసారి శరీరాన్ని వణికించింది. కానీ అంతలోనే సర్దుకుని" ఏం కావాలి" అంది.

అతడు మాట్లాడలేదు. ఆ గాజు కళ్ళని పైకెత్తి ఆమె వైపు చూసి, ఆమె తననే చూస్తుందని గమనించి చప్పున తలదించుకున్నాడు. ఏదో అడగాలనుకున్నట్టూ అతడినోరు కదిలి అస్పష్టమైన శబ్దం చేసింది.

ఆమె అతడి వైపు చూస్తోంది. అరచేత్తో అతడు రొమ్ముదగ్గర రాసుకున్నాడు. ఆ చేతిని పైకెత్తి చప్పిడి దవడల మీద పెరిగిన గడ్డాన్ని గోక్కున్నాడు "నాకు... నాకు..." అన్నాడు. "నాకేం తెచ్చారు?"

ఆమె స్థాణువైంది. అతడు అలా అడుగుతాడని వూహించలేదు. అయితే అలా అడగటానికి అతడెంతో కొట్టుమిట్టులాడాడనీ, ఎన్నో రిహార్సల్స్ వేసుకున్నాడనీ అతడి ఆకారం చెబ్తూనే వుంది. విదేశాల్లో ఆమె స్మృతిపథంలో ఓ బైరాగి ఎక్కడో మెదిలి వుంటాడని అతడి ఆశ.

అయితే ఆ ఆశ దురాశే. ఆమెకి అతడొకడున్నాడనే గుర్తురాలేదు. ఆమె తన గిల్టీ కాన్షస్‌నెస్‌ను కప్పిపుచ్చుకోవటానికి -కొంచెం తడబడి తన సామాన్ల వైపు చూసి - అందులోంచి ఏం ఇవ్వాలా అని ఆలోచించే లోపులో అతడు అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఆమె దాని గురించి పట్టించుకోలేదు. ఆమెకి బైరాగి అంటే భయం! అతడి చేష్టలంటే అసహ్యం! ఆ ఫెటిసిస్ట్‌ని ఇంకా ఇంట్లో వుంచినందుకు ఆమెకి మామయ్యమీద కోపంగా వుంది.

ఆలోచనని బలవంతంగా పక్కకి నెట్టి - ఆమె చిరంజీవి రూమ్‌కి వెళ్ళటానికి బయల్దేరింది. అతడి కోసం తెచ్చిన బహుమతిని చుట్టటానికి బల్లమీద వున్న పేపరు తీసుకుని చింపుతూంటే ఒక మూల పెద్ద అక్షరాల్లో కనబడింది, ఒక వార్త -

యువతి హత్యకేసులో ముద్దాయికి శిక్ష! లాయర్ చిరంజీవికి ఉరి.

సుశీల అనే యువతిని హత్య చేసినందుకు లాయర్ చిరంజీవికి ఉరిశిక్ష విధిస్తూ సెషన్స్ కోర్టు జడ్జి పరశురాముడు ఈ రోజు తీర్పు యిచ్చారు. చిరంజీవి ప్రసిద్ధ క్రిమినల్ లాయర్, సర్వోత్తమరావు మేనకోడలికి కాబోయే భర్త అన్న రూమరు ప్రచారం కావటంతో ఈ కేసుకి చాలా ప్రాముఖ్యత వచ్చింది. శిక్ష ఉరి కాబట్టి ఈ జడ్జిమెంటు హైకోర్టు అనుమతి పొందవలసి వుంటుంది. ఈలోపులో ముద్దాయి కావాలంటే అప్పీలు చేసుకోవచ్చు.

కానీ క్రింది కోర్టులోనే నేరాన్ని వప్పుకున్న ముద్దాయి, అప్పీలు కోసం పైకోర్టుకి వెళ్తాడని ఎవరూ భావించటంలేదు. ఈ సందర్భంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ చిరంజీవి లాయరై ఆ వృత్తికే మచ్చ తీసుకొచ్చాడని అన్నాడు. కుమారి అర్చన విదేశాల్లో వున్నట్లు తెలుస్తోంది. (మన విలేఖరి)

చదవటం పూర్తి చేసిన అర్చన నిశ్చేష్టురాలై అలాగే నిలబడిపోయింది. చెవుల్లో హోరు. అది షాక్ కూడా కాదు. అంతకన్నా పెద్దదైన స్థితి. ఆమె విషమ పరిస్థితుల్ని ఎంతో చాకచక్యంతో సరిచేసింది. అయితే ఈసారి మాత్రం స్త్రీ సహజమైన భయంతో - వేదనతో వణికిపోయింది.

.......

తన స్టడీ రూమ్‌లో చదువుకుంటున్న సర్వోత్తమరావు - గాలిలా దూసుకొచ్చిన అర్చనని చూసి ముందు ఆశ్చర్యపోయినా, ఆమె చేతిలో పేపరు చూసి జరిగింది గ్రహించాడు. ఆమె మొహం ఎర్రగా వుంది. పెదవులు కంపిస్తున్నాయి.

ఎప్పుడూ చాలా పెద్దమనిషిలా గంభీరంగా వుండే తన మేనకోడల్ని ఈ సారి నిజమైన అమ్మాయిలా చూడటంతో అతడి మొహంలో క్షణంపాటు నవ్వు కదలాడింది. కానీ దాన్ని దాచి పెట్టి వెంటనే సీరియస్ అయిపోయి "ఏమిటమ్మా" అన్నాడు.

ఆమె పేపర్ చూపిస్తూ - "ఇది....ఇది....." అన్నది. ఆ తరువాత ఆవేశంతో మాట రాలేదు.

"నువ్వు మాట్లాడదల్చుకున్నది చిరంజీవి హత్య గురించా" తాపీగా అడిగాడు. ఆమె అవునన్నట్లు మాట్లాడలేదు.

ఆయన కుర్చీలోంచి లేచి కిటికీ దగ్గిరికి వెళ్ళి చేతిలో పైపులేదు కాబట్టి పెన్సిల్‌ని అలా పట్టుకుని గంభీరంగా, "చూడమ్మాయ్ - నువ్వింక చిరంజీవిని మర్చిపోవాలి, తప్పదు" అంటూ జరిగిందంతా చెప్పాడు. అది వింటూంటే ఆమె మొహంలో రంగులు మారసాగాయి. అతడు చెప్పటం పూర్తిచేయగానే ఆగదిలో నిశ్శబ్దం అలుముకుంది.

అంతా విని ఆమె "చిరంజీవి ఈ హత్య చేశాడంటే నువ్వు - నువ్వు నమ్ముతున్నావా అంకుల్?" అంది వణికే కంఠంతో. ఆయన మాట్లాడలేదు.

ఆమె "అతడు నాకెంత దగ్గరో తెలిసి కూడా నువ్వు ఈ కేసు ఎందుకు టేకప్ చేయలేదంకుల్?" అడిగింది బాధగా.

"నేను కేసు తీసుకుని వుంటే అతడికి ఈ శిక్ష పడకపోవచ్చు. కానీ అతడు చేసిన నేరం చాలా ఘోరమైనదమ్మాయ్. దానికి తోడు అతడే ఆ నేరాన్ని వప్పుకున్నాడు. అందువల్ల నేను ఏమీ ఉత్సాహం చూపించలేదు. ఇక్కడ సమస్య అతడికి ఉరి సరి అయినదా యావజ్జీవ కారాగారం చాలా అన్నది కాదమ్మా.

ఎంత క్రిమినల్ లాయరైనా నాకూ కొన్ని నియమాలున్నాయి. అతడో కోల్డ్‌బ్లడ్డెడ్ మర్డరర్ అని తెలిసీ అతడి తరపున వాదించటం ఆత్మవంచనే అవుతుంది. ఇంత అయినా సరే, అతడు నీ స్నేహితుడని అతడి దగ్గరికి వెళ్ళాను. నా మనసూ, నా నియమాలూ పక్కన పెట్టి నీకోసం - కేవలం నీకోసం అతడి కేసు తీసుకొంటానని చెప్పాను. సర్వోత్తమరావులాంటి లాయరు తనంతట తను అడుగుతే ఎగిరి గంతేయవలసింది పోయి, అతడు నిరాకరించాడు. నీకోసం అతడిని బ్రతిమిలాడాను. అయినా విన్లేదు. నా వుద్దేశ్యం ఏమిటంటే - అతడో సైకిక్‌గా తయారయ్యాడని........"

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

10 వ భాగం

అతడంత అనునయంగా చెప్పేసరికి ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది ఆమె కోపం బాధగా మారింది "చిరంజీవి లాంటివాడు ఇలా చేసి వుంటాడు అంటే నేను నమ్మలేకుండా వున్నాను" అంది.

అతడికేమో ఒక వైపు నవ్వొస్తోంది. దాన్ని దాచటం సాధ్యం కావటంలేదు. అయినా మొహం సీరియస్‌గానే వుంది - "ఇన్నేళ్ళు క్రిమినల్స్‌తో వున్న నా అనుభవంతో నేను తెలుసుకున్నదేమిటంటే - మనిషి పైకి కనబడటానికీ - లోపల ప్రవర్తనకీ చాలా తేడా వుంటుందనీ" అన్నాడు.

అలా అంటూ అతడు వెనుదిరిగేసరికి అర్చన అక్కడ లేదు. బైట కారు బయల్దేరిన చప్పుడు వినిపించింది. కాంపౌండులోంచి బైటకి బాణంలా అది దూసుకుపోవటం కనిపించింది.

జైలు అధికారితో మాట్లాడి చిరంజీవిని కల్సుకునేసరికి అరగంట పట్టింది అర్చనకి.

ఆమె రాకని వూహించని చిరంజీవి అంతగా ఆశ్చర్యపోలేదు. ఇక్కడ చిరంజీవి పరిస్థితిని గురించి కొంచెం చెప్పాలి. అతడు జైలు దుస్తుల్లో గమ్మత్తుగా వున్నాడు. గడ్డం పెరిగింది. బైటకన్నా జైల్లో టైమ్‌కి తిండి ఉండటం వల్ల మొహం మరింత కళగా వుంది.

చిరంజీవి వున్న గదిని కాపలా కాసే సెంట్రీ పేరు విష్ణుశర్మ. పేరులో ఆశ్చర్యం లేదు. పెద్దపెద్ద బూట్లు టకటకలాడించుకుంటూ తుపాకీ పట్టుకుని గాంభీర్యంగా తిరిగేవాళ్ళ పేర్లు విష్ణుశర్మ. తిమ్మారావు. పినాకపాణి అని వుండకూడదని రూలు లేదుకదా!

చిరంజీవి లాయరని తెలిసి నమ్రత హెచ్చింది. ఒకే ఈడువాళ్ళవటంతో చనువుకూడా పెరిగింది.

"అబ్బా, ఏం సినిమా సార్! సినిమా అంటే అలావుండాలి. ఒక హీరో - ఇద్దరు హీరోయిన్లు.... హీరోకి క్షయ......" అంటూ క్రితం రాత్రి బ్లాక్‌లో టిక్కెట్టు కొనుక్కుని చూసిన సెకండ్ షో సినిమా తాలూకు కథ చెప్పేశాడు.

అర్చన వచ్చేసరికి చిరంజీవి ఇంకా ఆ తెలుగు సినిమా మూడ్‌లోనే ఉన్నాడు. అర్చన కళ్ళు వర్షించటానికి సిద్ధంగా వున్నాయి. రాగానే ఆవేశాన్ని బలవంతం మీద అణుచుకుంటూ "ఇదంతా నిజమేనా?" అని ఊచలు పట్టుకుని అడిగింది. "కాదని చెప్పు ...... చెప్పవూ" అంది బేలగా.

"చేసిన నేరాన్ని కాదనటం నాలుక్కి సాధ్యమౌతుందేమో గానీ మనసుకి సాధ్యం కాదుగా అర్చనా" భారంగా అన్నాడు చిరంజీవి.

"కానీ నీ మనసు ఇలాంటి పనికి ఎలా వప్పుకుంది?"

అతడి దృష్టి గోడకున్న సాలెగూడుమీద పడింది "మనసు సాలెగూడులాంటిది అర్చనా ఆలోచన్లు బూజుల్లాంటివి.

ఎప్పుడు ఏ ఈగ అందులో ప్రవేశిస్తుందో తెలీదు" అన్నాడు కొద్దిగా దగ్గి సినిమాలోలా.

"నిన్ను ప్రేమించిన నేనేమవ్వాలి?"

"మనమధ్య ఈరోజు ఇలా అడ్డుగా నిల్చిన ఈ జైలు వూచలు నిజంగా వూచలు కావు. సమాజం నిర్మించిన అడ్డుగోడలు. నన్ను మర్చిపో అర్చనా" అతడి కంఠం వణికింది. "కలకాలం పిల్లాపాపల్తో వర్ధిల్లు. ఏ లోకంలో ఉన్నా ఈ చిరంజీవి మంచి మనసూ, ఆశీర్వాదం నీకెప్పుడూ ఉంటుందన్న విషయం మర్చిపోకు - " అంటూ భుజం మీద శాలువా కోసం తడుముకుని, అది లేకపోయేసరికి చూపుడు వేలుతోనే కళ్ళు తుడుచుకున్నాడు.

"ప్రేమిస్తే మర్చిపోవటం అంత సులభమా చిరంజీవి."

"ప్రేమే లవ్వు! లవ్వే ప్రేమ అర్చనా!"

ప్రేమే లవ్వేమిటి అని అర్చన అతడివైపు విస్తుబోయి చూసి నిజంగా ఇతడు సైకిక్‌గా మారాడా, అనుకుంది. చిరంజీవి మాత్రం కళ్ళు మూసుకునే వున్నాడు.

ఆమె మాట మారుస్తూ "సుశీలెవరు?" అని అడిగింది.

"చాలాకాలం నుంచీ నా స్నేహితురాలు. కానీ నాకు నీతో స్నేహముందని తెలిసి పెళ్ళికి తొందర పెట్టింది......" ఆమె మొహంలో మారుతున్న భావాలు గమనిస్తూ అన్నాడు "నిన్ను వదిలిపెట్టడం నాకు ఇష్టం లేకపోయింది. తన అడ్డు తొలగించుకోవాలనుకున్నాను."

"అందుకని ఆమెని సత్రానికి రమ్మన్నావా?" నమ్మలేనట్లు అడిగింది.

"అవును" అన్నాడు. అతడికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాటలు జ్ఞాపకం వచ్చాయ్. (అమాయకంగా నిన్ను నమ్మి అంత రాత్రి అక్కడకు వచ్చిన అమ్మాయిని దారుణంగా రేప్ చేసి) చిరంజీవి నవ్వొచ్చింది.

నవ్వుతోబాటు హుషారొచ్చింది. ......" మంచిగా అడిగి చూశాను. కావాలంటే ఉంచుకుంటానన్నాను. విన్లేదు. మర్డర్ చేశాను. ఎలాగూ మర్డర్ చేస్తున్నా కదా అని రేప్ చేశాను....."

ఎక్కడో సున్నితమైన బంధం తెగిపోయినట్టయింది ఆమెకి.

"ఐయామ్ సారీ ఫర్ లవింగ్ యూ..........." అంది ఇంగ్లీషులో. అప్పటికే ఆమె మామూలు అర్చన అయిపోయింది. పూర్వపు వేదన - దు:ఖం లేవు. ఆ స్థానాన్ని కోపం ఉక్రోషం చోటు చేసుకున్నాయి.

"పైకి కనబడేదంతా నిజం కాదని నా జీవితం నాకు చిన్నప్పుడే పాఠం చెప్పింది. కానీ ఇన్నాళ్ళకి అది అసత్యమని నిరూపించటానికి నువ్వు కనిపించావనుకున్నాను.... నా చుట్టూ పైకి ఒకరకంగా, లోపల వేరొకరకంగా ప్రవర్తించే వ్యక్తుల్తో విసిగిపోయిన నేను - నీ పట్ల అందుకే వెంటనే ఆకర్షితురాలినయ్యాను. కానీ, నువ్వూ నన్ను మోసం చేశావు బ్రూటస్."

అతడు మాట్లాడలేదు. కానీ ఆమె బాధని చూసి కదిలిపోయాడు. అంతా చెప్పేద్దామా అనుకున్నాడు. మళ్ళీ అగ్రిమెంటు గుర్తొచ్చింది. దాంతో మౌనం వహించాడు. ఆమె వెళ్ళొస్తానంటే 'మంచిది' అన్నాడు.

ఆమె రెండు అడుగులు వేసి ఆగింది. గుండె అడుగుపొరల్లో ఏదో అలజడి. ఆమె సందిగ్ధస్థితిని అతడు గుర్తిస్తున్నాడు. గుర్తించేకొద్దీ ఆనందం వేస్తోంది. ఇంత తప్పుచేసినా ఆమె తనని ఇంకా ప్రేమిస్తూనే వుందన్న భావం ఆమె ప్రవర్తనలో స్పష్టమై - అది అతడికి ఆనందాన్ని ఇస్తోంది.

ఆమె వెనుదిరిగి అన్నది "నీలో ఇంకొంచెం మంచితనం వున్నదనటానికి నిదర్శనం నీ తప్పు నువ్వు వప్పుకోవటం."

అతడు తలెత్తి చూశాడు.

"పై కోర్టుకి అప్పీలు చేద్దాం, మామయ్య ఈ కేసు తీసుకోకపోతే ఇంకో మంచిలాయర్ని పెడ్దాం. నా స్నేహితుడివైనందుకు ...." ఆమె తడబడింది "ఈ మాత్రం సాయం చేయటం నా ధర్మం."

"నేనొప్పుకోను"

"నీ తరపున అప్పీలుకి నేను వెళ్తాను"

అతడు నవ్వాడు "నేను వకాల్తా సంతకం పెట్టను"

ఆమె నిస్సహాయంగా చూసింది అతడి వైపు. మరింత వాదించి అలసి పోయిందే తప్ప అతడు మాత్రం విన్లేదు.

"అంతేనా?"

"అంతే...."

"సరే అయితే...."

"ఇంకో విషయం"

"ఏమిటది?" అడిగింది.

"మరిక నన్ను కలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యొద్దు."

"......ఎందుకు?"

"సుశీల ఆలోచన్లతోనే నా ఈ చివరి క్షణాలు గడుపుదామనుకుంటున్నాను కాబట్టి"

ఆమె దెబ్బతిన్నట్టు అతడివైపు చూసింది. క్షణంలో సర్దుకుని "గుడ్ బై మిస్టర్ చిరంజీవీ" అంది.

"గుడ్‌బై అర్చనా" అన్నాడతడు.

---

పదిరోజుల తర్వాత సర్వోత్తమరావు చిరంజీవిని కలుసుకున్నాడు. ఆయన చేతిలో కాగితాలున్నాయి.

“హైకోర్టు అనుమతి ఇచ్చేసింది” అన్నాడాయన వస్తూనే.

“తెలిసింది” అన్నాడు చిరంజీవి.

“క్షమాబిక్ష వేడుకోవడానికి కొంత టైమ్ ఇస్తారు.”

“అక్కర్లేదని చెప్పాను” అన్నాడు చిరంజీవి - “ప్రొద్దున్న సెంట్రీ చెప్పాడు - అప్పుడే ఏర్పాట్లు జరుగుతున్నాయట.”

“ఇంకో మంచి వార్త” అన్నాడు సర్వోత్తమరావు “ప్రెసిడెంట్ పదిరోజుల సెలవు మీద విశ్రాంతి కోసం ఇక్కడికి వచ్చి వుంటున్నాడట. అదే టైమ్‌లో శిక్ష అమలు జరిపితే మరీ మంచిది మనకి. శిక్షని గవర్నరు రద్దు చేయడం కన్నా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా రద్దు చేస్తే మరింత పబ్లిసిటీ వస్తుంది. ప్రెసిడెంట్ నాకు బాగా తెలుసు. ఆయన దగ్గర అప్పాయింట్‌మెంట్ తీసుకుంటున్నాను. ఈ లోపులో ఉరి తీసేదెప్పుడో తారీఖు కనుక్కోవాలి.”

“అది రేపో ఎల్లుండో చెప్తారనుకుంటాను” అన్నాడు. సాధారణంగా ఉరితీసే వారం రోజుల ముందు ఖైదీకి ఆ విషయం చెప్తారు. పంజాబ్ లాంటి కొన్ని రాష్ట్రాల్లో మాత్రం నేరస్తుడిమీద దయతో - అతడిని వారంరోజులపాటు బాధ పెట్టడం ఇష్టం లేక, ఒక్క రోజు ముందు మాత్రం ఆ విషయాన్ని చెప్తారు.

‘ప్రెసిడెంట్ క్షమాభిక్ష నిరాకరించాడు. ఉరి తప్పదు’ అన్న విషయం తెలియబరచగానే చాలా మంది మోకాళ్ళమీద కూలిపోయి మొహం చేతుల్లో కప్పుకుని బిగ్గరగా ఏడుస్తారు. కొంతమంది స్పృహతప్పి పడిపోతారు. వళ్ళంతా చెమటలు పట్టి కొంతమంది హిస్టీరిక్‌గా మారతారు.

చిరంజీవి మాత్రం “ఈ సస్పెన్సు భరించలేక పోతున్నాను. ఎంత తొందరగా ఆరోజు వస్తుందా అని వుంది” అన్నాడు.

అంతలో గుమ్మం దగ్గర అలికిడి వినిపించి ఇద్దరూ తలతిప్పి చూశారు. సూపరింటెండెంట్ ధర్మారావు రావటం కనిపించింది.

ధర్మారావు ఆరడుగుల మనిషి. ఎప్పుడూ గంభీరంగా వుంటాడు.

వచ్చి సర్వోత్తమరావుకి విష్ చేసి, చిరంజీవివైపు తిరిగి ఇంగ్లీషులో “నేను చెప్పటానికి చాలా విచారిస్తున్నాను. కానీ చెప్పక తప్పదు మీ ఉరి విషయంలో ఫైనల్ ఆర్డర్లు వచ్చాయి. ఎల్లుండి తెల్లవారుఝామున మిమ్మల్ని ఉరి తీస్తారు” అన్నాడు.

చిరంజీవి, సర్వోత్తమరావు మొహమొహాలు చూసుకున్నారు. ఇద్దరి మొహాలలోనూ నవ్వు కనబడింది. ధర్మారావు అది చూసి విభ్రాంతుడయ్యాడు. అతడి ముప్పైఏళ్ళ సర్వీసులోనూ - ఆ వార్త చెప్పగానే నవ్విన మొదటి ఖైదీ చిరంజీవి!

ధర్మారావు వెళ్ళిపోయాక సర్వోత్తమరావు చిరంజీవికి ఒక కాగితాల కట్ట ఇచ్చాడు.

“ఏమిటిది?”

“ఉరి రద్దుకోసం తయారు చేసిన నోట్సు, జైలునుండి బైటకొచ్చేటప్పుడు విలేఖర్లకు పంచి పెట్టాలి. కొన్ని కాపీలు పార్లమెంటుకు కూడా పంపుదాం. చదివి వుంచు” అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

* * *

ఆయన వెళ్ళిన అరగంటకి ఎస్సెమ్ స్వూర్తి చిరంజీవిని కలుసుకోవటానికి వచ్చాడు. అతడి గెడ్డం పెరిగివుంది. మనిషి సగం చిక్కి పోయాడు.

"ఏమిటలా అయిపోయావ్! ఎవరన్నా చూస్తే నీకే ఉరిశిక్ష పడిందనుకుంటారు" అన్నాడు చిరంజీవి.

స్వూర్తి మాట్లాడలేదు. కళ్ళనిండా స్నేహితుణ్ణి నింపుకుని చూస్తూ వుండిపోయాడు.

"అలా వున్నావేమిటి గురూ?"

స్వూర్తికి దుఃఖం ఆగలేదు. అది చూసి కంగారుపడ్డాడు చిరంజీవి "ఏమైంది? ఎవరైనా పోయారా?" అని అడిగాడు. లేదన్నట్లు తలూపాడు.

"మరి ఇంటిగలాయన రూం ఖాళీ చెయ్యమన్నాడా?"

స్వూర్తి ఆశ్చర్యంగా చిరంజీవి వైపు చూశాడు. చిరంజీవి విసుగ్గా "చెప్పకుండా ఏడుస్తే నేను నీ దుఃఖంలో ఎలా పాలు పంచుకోగలను! ముందు చెప్పు" అన్నాడు.

ఈ సారి స్వూర్తి నిజంగానే బిత్తరపోయాడు. చిరంజీవి మానసిక పరిస్థితి పట్ల అనుమానం కూడా వేసింది "నువ్వు......నువ్వు......ఎల్లుండీ పాటికి...." అన్నాడు. ఆ తరువాత భోరున ఏడుపొక్కటే తరువాయి.

చిరంజీవి వేదాంతిలా నవ్వాడు "నీటి బుడగలాంటి జీవితంపట్ల క్షణికమైన బంధాలు పెంచుకోవటం అనవసరం. బ్రతుకు అద్భుతమైనది అది తెగిన గాలిపటం లాంటిది. ఎగిరి వెళ్ళి ఏ ముళ్ళ పొదల్లో పడుతుందో - ఏ మహార్ణవాన్ని చేరుతుందో ఎవరూ చెప్పలేరు" అన్నాడు.

స్వూర్తి అతడి వేదాంతాన్ని మరోలా అర్థం చేసుకున్నాడు. జాలినిండిన కంఠంతో "ప్రతిరోజూ భగవద్గీత చదువుతున్నావా చిరంజీవీ" అన్నాడు బాధగా.

"లేదు. శర్మ అని సెంట్రీ ఒకడున్నాడు. సినిమాల పిచ్చి వున్నవాడు. ప్రతిరోజూ ఒక సినిమా కథ చెబ్తాడు. అది విని నాకీ వేదాంతభావం అలవడింది."

"ఒరేయ్ చిరంజీవీ! హోటల్‌లో తింటూ తింటూ మధ్యలో తుమ్మొస్తే మనసారా తుమ్మటానికి భయపడే వాడివి - చావుని ఇంత జోకుగా ఎలా తీసుకోగల్గుతున్నావ్ రా!"

"చావే తుమ్ములాంటిదిరా. వచ్చేవరకూ భయపెడ్తుంది. వచ్చేశాక హాయిగా వుంటుంది."

స్వూర్తికి మతిపోయింది. కళ్ళు పెద్దవి చేసి చిరంజీవి వైపు చూస్తూ వుండిపోయాడు. చిరంజీవి స్వామి అరవిందఘోష్‌లా విశాలంగా నవ్వాడు.

---

అర్చన తన గదిలో అటూ, ఇటూ తిరుగుతోంది. మనసునెంత దిటవు పరుచుకుందామన్నా కుదరటం లేదు. మాటిమాటికీ

చిరంజీవే జ్ఞాపకం వస్తున్నాడు. చాలా సులభంగా గుడ్‌బై చెప్పేసి వచ్చేసింది కానీ, అది అంత మామూలుగా జరిగిపోయే విషయంగా కనిపించటం లేదు.

తన కళ్ళ ముందు నవ్వుతూ తిరిగినవాడు - హుషారుగా మాట్లాడిన వాడు - ఇంకో

రెండు మూడు రోజుల్లో ఈ లోకం నుంచి నిష్క్రమించబోతున్నాడన్న నిజాన్ని ఆమె భరించలేకపోతున్నది.

అనారోగ్యంతో మంచం మీద తీసుకొని, తీసుకొని పోతే అది వేరు - అకస్మాత్తుగా చచ్చిపోతున్నాడని తెలుస్తే - ఆ భావాల్నీ - ఆ అవస్థనీ వర్ణించటానికి మాటలు చాలవు.

ఆమె మళ్ళీ ఇంకొకసారి చిరంజీవి దగ్గరకు వెళ్ళింది. అప్పీలు కాకపోయినా కనీసం మెర్సీ పిటిషన్ (క్షమాబిక్ష) కోసం ప్రయత్నం చేస్తానన్నది. అతడు ఒప్పుకోలేదు. అరగంట వాగ్వివాదం జరిగాక ఆమె హతాశురాలై వెనక్కి రావల్సివచ్చింది.

ఆమెని చూసి శర్మ మాత్రం థ్రిల్లై పోయాడు.

"ఎవరు గురూగారు ఆ అమ్మాయి?"

"నా ఫియాన్సీ"

"అంటే"

"మేం ఇద్దరం వివాహం చేసుకోవాలనుకున్నాం."

"మరింత అప్సరస నుంచుకుని ఆ సుశీల వెనుక పడ్డారెందుకు సార్?"

చిరంజీవికి ఓ బూతు జోకు జ్ఞాపకం వచ్చింది గానీ, చెప్తే బావోదని వూరుకున్నాడు.

శర్మ అన్నాడు, "అదే సార్ గ్రహపాటు అంటే.....? మా బామ్మ చెప్తూ వుండేది. జాతకంలో వున్నది దేముడైనా మార్చలేడని. ఉదాహరణకి మీ మరణం సంగతే తీసుకోండి. ఇంకో రెండ్రోజుల్లో మరణం. ఎవరాపగలరు దాన్ని?"

"తథాస్తు" అన్నట్లు జైలు గంట కొట్టడం ప్రారంభమయింది,

చిరంజీవి నవ్వి వూరుకున్నాడు.

........

మధ్యాహ్నం రెండయినా చల్లటి గాలి వీస్తూనే వుంది. ఆకాశం నిండా మబ్బులు పట్టి వున్నాయి. సర్వోత్తమరావు కారు ప్రెసిడెంటు విడిదిచేసిన అతిథి గృహంలోకి ప్రవేశించింది. అయిదు నిమిషాల తర్వాత ప్రెసిడెంట్‌ని అతడు కలుసుకున్నాడు.

సాదరంగా ఆహ్వానిస్తూ "బావున్నావా" అని అడిగాడు రాష్ట్రపతి.

ఆయన కూడా తెలుగువాడే. కొంతకాలం హైకోర్టులో ప్రాక్టీసు పెట్టాడు కూడా. తరువాత రాజకీయాల్లో చేరి, ఒక్కో మెట్టూ ఎక్కి భారతదేశపు అత్యున్నత పదవి చేరుకోగలిగాడు. మిత్రులిద్దరూ లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు.

“ఇప్పట్లో పెళ్ళి చేసుకోవా?”

సర్వోత్తమరావు బిగ్గరగా నవ్వి “ఇప్పుడీ వయసులో పెళ్ళేమిటి?” అన్నాడు.

ఇంతలో పి. యస్. వచ్చి “సమయం అయిపోయిందని” చెప్పాడు. రాష్ట్రపతి చెయ్యి వూపుతూ “ఫర్లేదులే” అన్నాడు. కానీ సర్వోత్తమరావు లేస్తూ “వద్దు, నే వెళ్ళొస్తాను. అసలు నే వచ్చిన పని వేరు” అన్నాడు.

“ఏమిటది?”

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

## 11 వ భాగం

"ఉహూ, ఇప్పుడు చెప్పను. రేపు నాలుగింటికి వస్తాను. నాకు అపాయింట్‌మెంట్ కావాలి."

"నీకు ఆ ఫార్మాలిటీస్ అన్నీ ఎందుకు? ఎలాగూ నేను విశ్రాంతి కోసమే వచ్చాను. ఆ సమయానికి రా"

కానీ సర్వోత్తమరావు వప్పుకోలేదు. రాష్ట్రపతి విశ్రాంతి కోసం వచ్చినా, ఆయన్ని కలుసుకోవటానికి ఎవరో ఒకరు వస్తూనే వుంటారని అతడికి తెలుసు. అందువల్లే అధికారపరంగా కలుసుకోవటానికి అనుమతి తీసుకొన్నాడు. అపాయింట్‌మెంట్ పుస్తకంలో నాలుగింటికి అతడి పేరు వ్రాయబడింది..... తరువాత కొంచెం సేపు పిచ్చాపాటీ మాట్లాడి ఇంటికి వచ్చేశాడు.

అప్పుడు నాలుగయింది. చలిగాలి మరింత ఉధృతమయింది.

ఇంటికి రాగానే ఆయన ఓ దినపత్రిక ఆఫీసుకి ఫోన్ చేశాడు. చిన్న చిన్న వార్తల్ని గోరంతలు కొండంతలు చేసి వ్రాసే పత్రికలవి - ప్రతిరోజూ ఏదో ఒక హాట్ న్యూస్ వేసో, లేక మనసుల్ని కలవరపరిచే వార్త వేసో సర్క్యులేషన్ పెంచుకునే పేపర్లు.

"ఎల్లుండి పొద్దున్న సుశీల హత్యకేసులో నిందితుడు చిరంజీవిని ఉరి తీస్తున్నారు. ఈ వార్త కావాలంటే నిర్ధారణ పర్చుకుని, ప్రకటించండి" అన్నాడు సర్వోత్తమరావు.

"ఎవరు మాట్లాడుతున్నారు?" అట్నుంచి అడిగిందో కంఠం.

"అదంత ముఖ్యమా?"

"కాదులెండి"

"ప్రచురిస్తారా?"

"సాధారణంగా అలాంటి వార్తలు ప్రచురించి ప్రజల్ని భయపెట్టడం మా నియమం కాదు. పత్రికలు అలాంటి వార్తలు ప్రచురించకూడదు కూడా. కానీ మా పత్రిక మాత్రం ఇలాంటి నిజాల్ని బైట పెట్టేది. తప్పక ప్రచురిస్తాం...... థాంక్స్."

ఆ మరుసటి రోజున పేపర్లో వచ్చింది ఆ వార్త "రేపే చిరంజీవి ఉరి" అని చదివి అర్చన వణికిపోయింది. ఆ రోజంతా ఇక గది వదిలి బైటికి రాలేదు. అయితే ఆమె రోదించటం లేదు. వేదన కన్నా నిర్వేదం భయంకరమైన స్థితి.

ప్రొద్దున్నే సర్వోత్తమరావు చిరంజీవిని మళ్ళీ కల్సుకున్నాడు.

"ఇంకా ఇరవై నాలుగ్గంటలు" అన్నాడు చిరంజీవి.

"కాదు - పది గంటలే. రాత్రి ఎనిమిదింటికల్లా అంతా అయిపోతుంది. ఈ సాయంత్రం నాలుగింటికి ప్రెసిడెంటుని

కలుసుకుంటున్నాను. ఎందుకైనా మంచిదని గవర్నర్ దగ్గర కూడా అపాయింట్ మెంట్ తీసుకున్నాను. సాయంత్రం అయిదింటికి అది.''

'' పత్రికల వాళ్ళు?''

''ఒక పత్రికకి చెప్పాను. అదీగాక ప్రెసిడెంట్ వూళ్ళో వున్నాడు. అందుకని పత్రికలవాళ్ళు అక్కడే వుంటారు. ఈ ఫోటోలూ, అవీ చూపించి నేను గొడవ చేస్తున్న సమయానికి, పత్రికా విలేఖర్లందరూ దీన్ని నోట్ చేసుకుంటారు. రేపు ఈ వార్త ఎలాగూ పెద్ద పెద్ద అక్షరాల్లో పేపరు కెక్కుతుంది.

మనం వెంటనే దీనిమీద చర్చ ప్రారంభించాలి. ఈ లోపులో ఇంకో వైపు నుంచి సంతకాల సేకరణ ప్రారంభించాలి. ఈ హత్య కేసులో బాగా కదిలిపోయిన ప్రజలు, ఉరి రద్దుకోసం వెంటనే సంతకాలు పెడతారు. అప్పుడు ఎమ్మెల్యేలూ, ఎమ్పీలూ మనకు సాయం చేయటానికి ముందుకొస్తారు. దేశం మొత్తం కదలటంతో ప్రభుత్వానికి చట్టాన్ని మార్చక తప్పదు.''

చిరంజీవి నవ్వాడు ''చాలా పెద్ద యుద్ధం చేయవలసి వచ్చేటట్లూ వుంది.''

''దేశాన్ని కదిలించాలి అంటే ఆ మాత్రం పాటుపడక తప్పదు.''

''ఈ ఫోటోలు కాక, వీలైతే మీతోపాటూ దారాసింగ్‌నీ, ఆ ఇంటిగలావిడ - ముసలమ్మనీ తీసుకెళ్ళండి''

''...... వాళ్ళెందుకు? ఈ ఫోటోల సాక్ష్యం కన్నా బలమైనది ఇంకొకటి లేదు. అయినా ప్రెసిడెంట్ వారందర్నీ కలవడు. వాళ్ళు చెప్పింది కోర్టులో సాక్ష్యంగా నిలబడదు కూడా.''

చిరంజీవికి కూడా అది నిజమే అనిపించింది. అతనూ లాయరే. అతడికి తెలుసు - వాళ్ళ సాక్ష్యం నిలవదని.

''ఈ ఫోటోలు మనం తరువాత కల్పించామని వాళ్ళు అనుకుంటే - ''

''ఎలా అనుకుంటారు? జైల్లో వున్న నిన్ను, నూతి దగ్గర నేను ఫోటోలు ఎలా తీయగలను? అదీగాక ఇంకొక విషయం - ఈ ఫోటో రీలు కొన్న తేదీ రసీదు భద్రపరిచాను. మనం ఫోటోలు తీసిన రోజే మరో స్టూడియోలో ఎన్‌లార్జ్ చేయించి, రసీదు పుచ్చుకున్నాను, అంటే ఇవన్నీ మనకి సాక్ష్యాలు అవుతాయన్నమాట. రీలు కొన్న రసీదూ, స్టూడియో ఎన్‌లార్జ్ చేసిన రసీదూ - వీటన్నిటికన్నా ఎక్కువగా - నా సాక్ష్యం'' ఆయన నవ్వాడు.

అవునది నిజం. ఫోటోలు -ప్రసిద్ధ క్రిమినల్ లాయర్ సర్వోత్తమరావు సాక్ష్యం - ఈ రెండూ వుంటే ఇంకొకటి అనవసరం.

''ఈయనది మాస్టర్ బ్రెయిన్'' అనుకున్నాడు చిరంజీవి. ఎంత దూరం ఆలోచించి, ఫోటో స్టూడియో రసీదులు తీసుకున్నాడు!

''ఎందుకైనా మంచిది. నెగిటివ్స్ కూడా మీతో తీసుకెళ్ళండి ప్రెసిడెంట్ దగ్గరికి'' అన్నాడు చిరంజీవి.

''తీసుకువెళ్ళనని ఎందుకనుకున్నావ్? నెగిటివ్‌లూ - రసీదులూ - అన్నీ తీసుకెళ్తాను. అన్నీ తీసుకెళ్ళి- అధికారుల్ని అన్ని వైపుల్నుంచీ ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరి చేయాలి. సాయంత్రం అక్కడో మంచి డ్రామా జరుగుతుంది. ఒక్కసారిగా

సంచలనం రేగుతుంది. విలేఖరుల కలానికి మంచి మేత........"

"ఆ టైమ్‌లో నేను అక్కడుంటే బావుణ్ణు"

ఆయన బిగ్గరగా నవ్వి " ఈ నాటకంలో హీరోవి నువ్వే" అన్నాడు

చిరంజీవి కొద్దిగా సిగ్గుపడి, మాట మారుస్తూ, "సాయంత్రం ప్రోగ్రాం ఏమిటి?" అన్నాడు.

"సాయంత్రం నాలుగింటికి ప్రెసిడెంట్‌ని కలుసుకుంటాను. మిగతా ఫార్మాలిటీస్ పూర్తవటానికి దాదాపు రెండు గంటలు పట్టొచ్చు. ఏడింటికి అంతా పూర్తవుతుంది. అయితే వెంటనే జైలునుంచి బైటకి వదిలెయ్యటానికి అనుమతి ఇవ్వరు. మేమంతా, అంటే విలేఖర్లు, స్నేహితుల్తో సహా ఇక్కడికే వస్తాం. పూలదండలు కూడా ఏర్పాటు చేశాను. నవ్వకు... మనకి ఎంత పబ్లిసిటీ వుంటే అంత మంచిది. విలేఖర్లకి జైలు నుంచే నువ్వు మొదటి ఇంటర్వ్యూ ఇవ్వవలసి వుంటుంది. అలా చేస్తేనే మంచిది కూడా."

"అవును."

"చెప్పు. నేనింకా చెయ్యవలసింది గానీ - మర్చిపోయిందిగానీ ఏమైనా ఉందా?"

"ఉంది."

"ఏమిటి?"

"ఆ సాయంత్రం అర్చనని మీతో తీసుకురావటం."

అది తట్టనందుకు నాలిక్కరుచుకుని, అంతలోనే బిగ్గరగా నవ్వేస్తూ,"అప్పుడే అమ్మాయితో మెడలో దండ వేయించుకోవాలని కోర్కెగా వుందేమిటోయ్" అన్నాడు.

.....

రేడియో వార్తల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరాన్ని చేరి గంటయింది. గంటకి నూట ఇరవై కిలోమీటర్ల వేగంతో గాలి వీస్తోంది.

మూడున్నరయింది.

సర్వోత్తమరావు రాష్ట్రపతి వున్న గెస్ట్ హౌస్‌కి ఫోన్ చేశాడు. ఆయన ఖాళీగా వున్నారనీ, విలేఖరులతో ఇష్టాగోష్టి సాగిస్తున్నారనీ, పి.యస్. చెప్పాడు. అది మరీ మంచిది, విలేఖర్లు అక్కడే వుండటం. ఆయన ఫోన్ పెట్టేసి - తన గదిలోకి వెళ్ళాడు. సూట్ తొడుక్కున్నాడు. అద్దం ముందు నిలబడి తలదువ్వుకున్నాడు. కర్చీఫ్ తీసి జేబులో పెట్టుకున్నాడు.

కొద్దిగా తలనొప్పిగా వున్నట్లు అనిపించింది. దాన్ని అంతగా పట్టించుకోలేదు. డ్రాయర్ తెరిచి అందులోంచి నెగిటివ్స్ తీసుకున్నాడు. పూర్వం తీసిన పోజిటివ్స్‌లో అన్నీ లేవు. డార్కు రూమ్‌లోకి వెళ్ళి డెవలప్పరుతో పాజిటివ్ పేపరు మీదకి ఫోటోలు ప్రింట్ చేశాడు. అన్ని ఫోటోలూ చక్కగా వచ్చినయ్. ముందుగదిలో హీటరు దగ్గరకొచ్చాడు.

ఆటోమాటిక్ హీటర్‌లో ఫోటోలు క్షణంలో తడి ఆరిపోయాయి. వాటిని కవర్‌లో పెట్టి జేబులో పెట్టుకున్నాడు. అదే కవరులో ఫోటో స్టూడియో రసీదులు కూడా వున్నాయి.

నిశ్శబ్దంగా మెట్లెక్కి మేడ పైకి వెళ్ళాడు. అర్చన గదిముందు నిలబడి - కిటికీలోంచి తొంగి చూశాడు. బల్లందు కూర్చొని మొహం దాచుకుని నిశ్చలంగా కూర్చొని వుంది. చాలా సేపట్నుంచీ అలానే కూర్చొని వుందని ఆ భంగిమ చెబుతోంది.

అక్కణ్నుంచి నిశ్శబ్దంగా తప్పుకుని క్రిందికి వచ్చాడు. పోర్టికోలో వుంది కారు. ఎక్కి స్టార్ట్ చేశాడు.

అప్పుడు ప్రారంభమయింది వర్షం. ఉన్నట్టుండి గాలికూడా నిశ్చలమైంది. ఒక వర్షపు చుక్క మొదట పడింది. అంతే - కుంభవృష్టి మొదలైంది.

రాష్ట్రపతి వుంటున్న విశ్రాంతి గృహం నాలుగు కిలోమీటర్ల దూరం వుంటుంది లాసన్స్ హిల్స్ మీదుగా చుట్టి వెళ్ళాలి. నాలుగింటికే బాగా చీకటి పడిపోయి వీధి లైట్లు కూడా వేసేశారు. ప్రపంచం అంతా తన గూట్లో చేరి అప్పుడే నిద్రకుపక్రమించినట్టుంది - విశాలమైన దారి - తడి మీద లైట్ల వెల్తురు ప్రతిబింబించటంతో అందంగా మెరుస్తోంది. ఎదురుగా ఒక లారీ హెడ్ లైట్లు వేసుకుని కొండమీద నుంచి పల్లంలోకి నెమ్మదిగా దిగుతూంది.

కారు ఎడమపక్కకి తీసి స్లోచేసి, లారీ దాటిన తరువాత మళ్ళీ రోడ్డుమీదకి వచ్చాడు. మలుపు తిప్పగానే హిల్ స్లోప్ కనబడింది. గేరుమార్చి ఎత్తు ఎక్కించటం ప్రారంభించాడు.

చాలా ఖరీదైన లొకాలిటీ అది. అక్కడక్కడ విసిరేసినట్లున్నాయి ఇళ్ళు. పైకి చేరగానే నగరం అంతా - నేలమీద ప్రమిదలు పెట్టినట్టు అందంగా కనిపిస్తోంది. వర్షం తగ్గిపోయింది. అద్దం దింపాడు. చల్లటిగాలి - హాయిగా వుంది.

కారు పల్లంలోకి దిగటం ప్రారంభమయింది. ఎదురుగా ఇంకో లారీ వస్తోంది. కారు పక్కకి తీసి, లారీ వెళ్ళిపోగానే తిరిగి రోడ్డుమీదికి తీసుకురావటానికి ప్రయత్నించాడు. ఎదురుగా పెద్ద గుంట కనబడింది. బ్రేక్ మీద కాలు వేశాడు. కారు వేగం తగ్గలేదు. బ్రేక్ ఫెయిలయిందని అర్థం అయింది. టపటపా కాలితో నొక్కాడు. కానీ లాభం లేకపోయింది. కారు వేగం హెచ్చింది. గుంట దగ్గరవుతోంది. కారు పక్కకి కోశాడు, మరింత ఎడమకి.

అదంతా లోయ. చక్రం జారటం మాత్రం తెలిసింది. అంతే - డోర్ తీసుకు బైటకి దూకబోయి, తలుపు తెరిచాడు.

కారు లోయలోకి దొర్లుకుంటూ వెళ్ళిపోయింది. అడుగున ఎక్కడో పెద్ద రాతికి కొట్టుకున్న చప్పుడు, తరువాత అరనిమిషానికి మంట ప్రారంభం అయింది. పెట్రోలుతోబాటు పాకుతున్న మంటని వర్షపు చినుకులు ఆపలేకపోయాయి.

సర్వోత్తమరావు కోటు జేబులోంచి ఎగిరి బైటపడిన ఫోటోల కవరు కారు పక్కనే పడింది. ముందు పెట్రోలు దాన్ని చేరుకుంది. దాంతోపాటే మంటకూడా నెమ్మదిగా పాకింది. ఫోటోలకి మంట తాకగానే భగ్గున మండిపోయాయి. క్షణంలో బూడిద మిగిలింది.

సర్వోత్తమరావు వెన్నెముక విరిగినట్టుంది. తల పగిలి స్రవిస్తున్న రక్తం - వర్షపు నీటికి మరింత పల్చబడుతోంది.

అయిదు నిముషాల తరువాత అక్కడ పెద్ద విస్ఫోటనం జరిగింది. పెట్రోలు టాంకు పెద్ద చప్పుడుతో పేలిపోయింది. ఆ తరువాత కొద్దిసేపటికి మంటని వర్షం జయించింది. కారంతా బుగ్గయిపోయింది.

హైవే మీద వెళ్తున్న లారీ డ్రైవరు ఒకడు ఈ మంటని చూశాడు. కానీ, క్రిందెవరో చలిమంట వేసుకున్నారని అనుకుని సాగిపోయాడు. మంటలు తగ్గాక మరి పట్టించుకున్న నాధుడే లేడు. చీకటి ఆ పరిసరాల్ని పూర్తిగా మింగేసింది.

అప్పటివరకూ, భయంతో, నిశ్శబ్దంగా వుండిపోయిన కీచురాయి తిరిగి మామూలు శబ్దం చేయటం ప్రారంభించింది.

## రెండో అధ్యాయం

రాత్రి ఆరయింది. వర్షం మరింత ఉధృతమైంది. గాజుకిటికీ అవతల పెద్ద పెద్ద చెట్లు గాలికి వూగుతూంటే జడలు విరబోసుకుని దెయ్యాలు నాట్యం చేస్తున్నట్టు వుంది.

అర్చన కిటికీ దగ్గర నిలబడి బైటకు చూస్తోంది. ఆమె మనసక్కడ లేదు. చిరంజీవి చుట్టూ వుంది. అతడికి ఇంకో స్నేహితురాలుందనీ, ఆమె పట్ల అతడు ఘోరమైన నేరం చేశాడనీ తెలిసికూడా అతడి ఆలోచన్లనుంచి ఆమె తప్పించుకోలేకపోతోందీ అంటే, బహుశా ప్రేమికుడి తప్పుల్ని ప్రేమ సిమెంట్ చేస్తుంది కాబోలు.

ఆమె ఆగలేక జైలుకి ఫోన్ చేసింది. ఆఖరిసారి అతడిని కలుసుకునే అవకాశం యిమ్మని అడిగింది.

అటు ఫోన్ అందుకున్నది ధర్మారావు "సారీ మాడమ్. ఇప్పుడిక లాభం లేదు. బైట వాతావరణం కూడా ఏమీ బావోలేదు. ఖైదీ మానసిక పరిస్థితి ఈ చివరి సమయంలో ఎలావుందో కూడా తెలీదు. ఈ పరిస్థితిలో అతడిని కలుసుకోవటానికి అనుమతి ఇవ్వలేను" అన్నాడు.

ఆమె హతాశురాలై ఫోన్ పెట్టేసింది.

అయితే వారనుకున్నట్టూ చిరంజీవి పరిస్థితి అధ్వాన్నంగా యేమీలేదు, మూడు నవ్వులూ, ఆరు జోకులుగా వుంది. అతడిని చూసి విష్ణుశర్మ థ్రిల్లై పోతున్నాడు.

"గురూగారూ, నా జీవితంలో మీలాంటివారిని చూడలేదార్సర్, ఇంకో పన్నెండు గంటల్లో ఉరికంబం ఎక్కబోతూ మీరిలా త్రుళ్ళుతూ, పేలుతూ ఉన్నారంటే - అది మీ గొప్పకాదు సార్. మీలాంటి ధీశాలిని కన్న మీ తల్లిదండ్రులది."

'పిచ్చివాడా'- అన్నట్లు నవ్వాడు చిరంజీవి "నేనెవర్ని అనుకుంటున్నావ్? మా తాతగారూ అల్లూరి సీతారామరాజూ ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకొనేటంతటి స్నేహితులు."

ఉద్వేగంతో "అమ్మో! అల్లూరి సీతారామరాజే!" అరిచాడు శర్మ.

"అవును, సీతారామరాజు!"

"నే చెప్పాను కదార్సర్, అందుకే మీకింత ధైర్యం వచ్చింది."

చిరంజీవి నవ్వి వూరుకున్నాడు.

“సీతారామరాజు చనిపోతూ బ్రిటీష్ వారు తన దేశాన్ని వదిలిపోవాలని నినాదం చేశాడు. మరి మీరేం చేస్తారు సార్?”

ఖైదీ ఆఖరి మాటలకి చాల విలువ వుంది. వాటిలో ఏ మాత్రం గొప్పతనం ఉన్నా రికార్డు చేస్తారు, అఫీషియల్‌గా కాదు.

చాలామంది ఖైదీలు మౌనంగా తాడు మెడచుట్టూ పడటాన్ని గమనిస్తారు. కొంతమంది విప్లవం గురించి నినాదాలు చేస్తారు. కొంతమంది జోకులేస్తారు. అటువంటివి కొన్ని గమనిద్దాం.

డెలానాక్ అనేవాడు గెలెటైన్ బ్లేడు తన మెడని కత్తిరించబోయే ముందు “ప్రపంచానికి గుడ్‌బై” అన్నమాట ఆఖరుగా అన్నాడు. ఉరికి ముందు ఆఖరుమాటగా ‘లెఫో’అన్న నాటక రచయిత “నిన్నరాత్రి ఆడిన నాటకం గురించి ఈ రోజు పేపర్లో పడుతుందో, లేదో.”

చావుని చాలా తేలిగ్గా తీసుకున్న జేమ్స్ రీడ్ -“ నా ఫాంటు గుండీ సరిగ్గా పెట్టండి ఎవరైనా. నా చేతులు వెనక్కి కట్టేసి వున్నాయి.”

విలియమ్ హార్బరీ అన్న హంతకుడు ఎలక్ట్రిక్ కుర్చీలో కూర్చున్న తరువాత ఆఫీసర్‌ని చూసి “స్విచ్ నొక్కు, ఏమిటి ట్రబుల్? ఆర్‌యూ నెర్వస్?” అన్నాట్ట.

తన చావు చూడటానికి వచ్చిన జనాన్ని గమనించి ఒకడు “జనం అంతా ఇక్కడే వున్నారు. ఈరోజు మార్కెట్‌లో బిజినెస్ డల్‌గా వుండి ఉంటుంది.”

ఉరితీసే వ్యక్తితో సిపోయోర్ అన్న ఫ్రెంచివాడు “నేనే నీవైతే ఇంకొంచెం కామ్‌గా ఉరితీస్తాను” అన్నాడట.

మేరీ బ్లాండీ: “మరీ ఎత్తుగా లాక్కండి తాడు. చూసేవారికి అంత డీసెంట్‌గా వుండదు.”

బహుశా చావు ధైర్యం ఇలాంటి జోకుల్నే పేలుస్తుందేమో, విష్ణుశర్మ అదే అన్నాడు. చిరంజీవి నవ్వి “చావు ధైర్యం ఆఖరి నిముషంలో వస్తుంది. రాత్రినుంచీ వుండదు” అన్నాడు

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

12 వ భాగం

“అవున్సార్. నేను విన్నాను కదా, ఆ రాత్రి అసలు తిండే తినరట....” అన్నాడు విష్ణుశర్మ .

రాత్రంతా నిద్రకూడా పోడు ఖైదీ. ఏ మూడింటిలో మాగన్నుగా నిద్రపడ్తుంది. ఈ ఉరి - ఇదంతా కల అనుకొంటాడు. అకస్మాత్తుగా నాలుగింటికి తలుపు చప్పుడయి మెలకువ వస్తుంది. ఎదురుగా యమదూతల్లా నిలబడ్డ పోలీసుల్ని చూడగానే బ్రతకడం కల అని తెలిసిపోతుంది. ఇంకో అరగంటలో మరణం అని గుర్తు రాగానే భోరున ఏడుస్తాడు.

“పిరికి పందలు” అన్నాడు చిరంజీవి “శుభ్రంగా తినాలి. హాయిగా నిద్రపోవాలి. చావుకి భయపడకూడదు. భయపడి లాభం ఏమిటి? నాన్సెన్స్.”

“అందరూ మీ అంత ధైర్యవంతులు వుండరు కద్సార్”

“టైమెంతయిందోయ్?”

“ఆరున్నర సార్”

“ఫస్ట్ షో బిగిన్ అయివుంటుంది. వూళ్ళో ఏ సినిమాలు ఆడ్తున్నాయ్!”

“రాత్రికి రా, రతి రాత్రి రహస్యం, కరాటే వీరుడు, బురద రాముడు.......”

“సినిమా చూడాలని వుందోయ్ శర్మా.”

“చివరి కోర్కెగా అలాటివి కోరితే తీర్చరు సార్.”

“మంచి భోజనం ఏర్పాటు చేస్తారని విన్నాను.”

“ఆ! అది చేస్తారు. మీ కేదైనా కావాలంటే చెప్పండి. స్పెషల్‌గా చేయిస్తాను. తెల్సినవారున్నారు”

“ముప్వంకాయ కూర వండించు. కొంచెం మసాలా ఎక్కువగా దట్టించమను.”

శర్మ థ్రిల్లై పోతున్నాడు “సార్ - మీరేమీ అనుకోకపోతే పుట్టబోయే అబ్బాయికి మీ పేరు పెట్టుకుంటాను సార్”

తెలియనట్టూ “ఎందుకోయ్!” అన్నాడు చిరంజీవి మనసులో ఆనందపడి.

“ఎంత ధైర్యం! ఎంత నిగ్రహం !! నిజంగా మీలా తయారవటం కన్నా ఏం కావాలి సార్ మా అబ్బాయికి”

“ఎన్నేళ్ళోయ్ మీ అబ్బాయికి”

శర్మ సిగ్గుపడి “నాకింకా పెళ్ళి కాలేద్సార్” అన్నాడు.

ఈ లోపులో వరండా దగ్గర అడుగుల చప్పుడు వినిపించింది. డాక్టరు వస్తున్నాడు. చేతిలో బి.పి. ఆపరేటస్, మెడలో స్టెత్ ఉన్నాయి.

“గుడ్ ఈవెనింగ్ డాక్టరు” అన్నాడు.

డాక్టరు పేరు రంగనాథాచార్యులు. ఆయనకి లో బి.పి. అసలాయనే ఉరికంబం ఎక్కేవాడిలా వణికిపోతూ ఉంటాడు. చాలా నెమ్మదిగా ఆగి ఆగి మాట్లాడుతూ ఉంటాడు.

“ఏవోయ్ - ఎలా - వుస్దీ” అని అడిగాడు.

“ఆ విషయం మీరే చెక్‌చేసి చెప్పాలి”

ఈ లోపులో పోలీసు వచ్చి తాళం తీశాడు. ముగ్గురూ వేరే రూం లోకి వెళ్ళారు. డాక్టరు స్టెత్‌తో పరీక్షించడం మొదలెట్టాడు.

“బైట వాతావరణానికి బాగా తుమ్ములొస్తున్నాయి” అన్నాడు చిరంజీవి వెల్లకిలా పడుకుని.

“తుమ్ములొస్తూంటే ఉరి పోస్ట్ పోన్ చెయ్యరోయ్. పెద్ద జ్వరంగానీ, పక్షవాతం కానీ రావాలి” జోకు వేశాడు డాక్టరు, చావుజోకు.

“నిజమే అనుకోండి. కానీ ఉరికి క్షణం ముందు తుమ్మి, నేను ఆ అపశకునంతో నరకానికి వెళ్తే ఆ పాపం మీకే చుట్టుకుంటుంది కదా” కౌంటరు జోకు వేశాడు చిరంజీవి.

ఆచార్యులు గతుక్కుమని సర్దుకుంటూ, “బి.పి. సరిగ్గానే వుందోయ్” అన్నాడు స్టెత్‌తో రొమ్ములుచూసి, బి.పి. సరిగ్గా వుందంటాడేమిటి అనుకుని మళ్ళీ“ గవర్నమెంటు డాక్టరు కదా” అని సరిపెట్టుకున్నాడు.

డాక్టరు వెళ్ళిపోయాక, చిరంజీవి అతడి సెల్‌కి చేర్చబడ్డాడు.

.......

“ముచ్వంకాయ కూర బావుందోయ్ శర్మా” అన్నాడు చిరంజీవి తింటూ. శర్మ మాట్లాడకపోయేసరికి తలెత్తి చూసి “ఏమిటలా చూస్తున్నావ్?” అని అడిగాడు.

“ఇది మీ ఆఖరి భోజనం సార్” సిన్సియర్‌గా బాధపడ్తూ అన్నాడు.

“అవును - జైల్లో ఆఖరి భోజనం” అంటూ మళ్ళీ తినటానికి ఉపక్రమించాడు. తింటూ -

“టైమెంతయిందోయ్” అని అడిగాడు.

“ఏడుంపావు గురూగారూ”

చిరంజీవి మొదటిసారి ఉలిక్కిపడ్డాడు. ఏడుం పావు..... నిజమే బైట బాగా చీకటి పడింది. అది మబ్బు పట్టడం వల్ల అనుకున్నాడు ఇంతసేపూ, టైమ్ గురించి ఆలోచన రాలేదు. భోజనం కూడా అయిపోయింది.

ఆరున్నరకల్లా వాళ్ళు రావల్సిందే. ఎందుకు ఆలస్యం అయిందో....... బహుశా ప్రెసిడెంట్ స్టాంప్‌తో ఆర్డరు తీసుకోవడం ఆలస్యం అవుతూందేమో! ఏది ఏమైనా మరో గంట....

"ఎన్ని గంటల వరకోయ్ నీ డ్యూటీ?"

"రాత్రి పన్నెండింటి వరకూ సార్."

"పక్క సెల్స్‌లో యెవరున్నారు?"

డెత్ సెల్స్ అన్నీ వరుసగా వున్నాయి. ఒక్కొక్కరికి ఒక్కొక్కటి - మామూలు జైలు గదుల్లా కాకుండా ఇవి కొంచెం విశాలమైనవి, ఒక మూల నీళ్ళపైపు కూడా వుంది. వెల్తురుకూడా బాగానే వస్తుంది.

"అన్ని సెల్స్ ఖాళీగానే వున్నాయి. మీ రొక్కరే ఇందులో వున్నారు. అందుకే నేను వరండాలో యెక్కువగా తిరగనక్కరలేదు."

"చూడవోయ్ శర్మా! నీ కళ్ళముందు ఏదైనా అద్భుతం - మాట వరసకి - ఇంకో అరగంటలో జరిగిందనుకో! ఎలా ఫీలవుతావు!"

"జైల్లో అద్భుతాలేం జరుగుతాయ్ సార్?"

"జరిగిందే అనుకో -"

"జరగదు సార్. ఖైదీ పారిపోవటం ఒక్కటే జరుగుతుంది. అది మాకు అద్భుతం కాదు. ఎందుకంటే రెండు మూడు నెలల్లో పోలీసులు యెలాగూ వాడిని పట్టుకుంటారు."

"అబ్బా, పారిపోవటం కాదయ్యా! ఇంకేదైనా అద్భుతం -"

"నా జీవితంలో అద్భుతాలేం జరుగుతాయి గురువుగారూ?"

చిరంజీవి విసుక్కొని - "నీ జీవితంలో కాదు - నా జీవితంలో....." అన్నాడు. శర్మ నోరు సగం తెరిచి విస్మయంతో చూశాడు. చిరంజీవి చిరునవ్వుతో - "ఉదాహరణకి ఇప్పుడు మీ ధర్మారావు గారొచ్చి 'ఇంతకాలం నిన్ను బంధించినందుకు సారీ చిరంజీవి - నిన్ను వదిలేస్తున్నాం' అన్నారనుకో. అది అద్భుతం కదా" అన్నాడు.

"పొండి సార్. ఇదేమైనా సిన్మానా, అలా అనటానికి -"

చిరంజీవి నవ్వుతూనే వున్నాడు.

శర్మ మళ్ళీ గస్తీ తిరగటం మొదలుపెట్టాడు అటు చివరకు వెళ్ళి వెనక్కి తిరగబోతూ - గవాక్షంలాంటి కిటికీలోంచి బైట మైదానంలో దృశ్యాల్ని చూసి ఆగాడు.

మబ్బులు విచ్చుకుంటున్నాయి, వెన్నెల తడిసిన నేలమీద మెరుస్తోంది. శర్మ చూస్తోంది మెరిసే వెన్నెల్ని కాదు. మైదానం మధ్యలో నిలబడివున్న ఉరికంబాన్ని, ఇద్దరు వ్యక్తులు అక్కడ పని చేస్తున్నారు. నిచ్చెనలాంటి స్టూలు వేసుకుని, పై కర్రని పరీక్షిస్తున్నాడు యాదగిరి, వంగి లివరులో నూనె పోస్తున్నారు ఇంకొకరు.

వెన్నెల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

లివర్ నొక్కగానే ప్లేటు కిందికి వెళ్ళిపోతుందా, లేదా అని పరీక్ష చేస్తున్నారు. చాలా కాలానికొకసారిగానీ ఉరికంబానికి పనిరాదు. అందువల్ల అన్నీ సరిగ్గా వున్నాయా, లేదా అని జాగ్రత్తగా చూసుకోవాలి.

శర్మ చూస్తూ వుండగానే సోమయ్య మైదానంలోకి రావటం కనబడింది. ఆరడుగుల ఎత్తూ పెద్ద పొట్ట - చాలా భయంకరంగా వుంటాడు. సోమయ్య, పొట్టేళ్ళ తలను ఒక్క వేటుతో నరికే కసాయివాడిలా. అతడే ఉరి తీసేది.

పైకి అలా కనబడతాడేగానీ, మనసు చాలా మంచిది. అయినా తన పనిలో యెక్కడా లోపం రానివ్వడు. ఖైదీ తల మీద ముసుగు కప్పగానే ఆలస్యం చేయకుండా ఉరి బిగిస్తాడు. ఆ సమయంలో ఖైదీని యెక్కువసేపు వేదన - ఉద్వేగం - వేదాంతం అన్నీ కలిసిన భావాల్తో సతమతం చెయ్యటం మంచిది కాదని బహుశా అతడి అనుభవం అతడికి చెప్పిందేమో.

ఆఖరి క్షణంలో ఖైదీ ఏ ఇబ్బందికీ గురికాకుండా వుండటం కోసం తనే స్వయంగా అన్నీ పరీక్షించుకోవటం సోమయ్య అలవాటు. అలాగే పరీక్షిస్తున్నాడు.

జైలు గంటలు వినిపించసాగాయి. చిరంజీవి వాటిని లెఖ్ఖ పెట్టటం మొదలుపెట్టాడు.ఎనిమిది...... ఎనిమిది గంటలయింది.

ఆరింటికల్లా వస్తానన్న సర్వోత్తమరావు ఎనిమిదింటివరకూ ఏం చేస్తున్నాడు?

చిరంజీవి వళ్ళు యెందుకో తెలీదుగానీ - ఒక్కసారి జలదరించినట్టయింది............ మొదటిసారి.

.....

ఎనిమిదిన్నర అవుతూ వుండగా అర్చన మేడమీద నుంచి క్రిందికొచ్చింది. డైనింగ్ టేబిల్ పక్కనే రామయ్య నిలబడి వున్నాడు. ఆమె కూర్చోగానే మౌనంగా వడ్డించడం మొదలుపెట్టాడు.

గడియారం చప్పుడు తప్ప - ఆ హాలంతా నిశ్శబ్దంగా వుంది. ఆమె రెండు ముద్దలు కన్నా ఎక్కువ నోట్లో పెట్టుకోలేకపోయింది. చెయ్యి కడుక్కుని లేచిపోయింది. ఆమె వెళ్ళినవైపే నిర్లిప్తంగా చూస్తూ నిలబడ్డాడు రామయ్య.

అర్చన తన గదిలోకి వచ్చి పక్కమీద వాలిపోయింది. పూర్తిగా దు:ఖమొచ్చినా బావుణ్ణు అదీ రావటంలేదు. ఏదో తెలియని ఉద్వేగం, ఎవరిమీదో తెలీని కసి.

ఆమె లేచి మామయ్య గదిలోకి వెళ్ళింది. అల్మైరా తెరిచి అందులోంచి సీసా తీసుకుని తెల్లటి మాత్రలు ఓ నాలుగు వంపుకుంది. తన గదిలోకి వచ్చి వాటిని వేసుకుని నీళ్ళు తాగింది. పది నిముషాల్లో ఆమె కళ్ళ మూతలు పడసాగాయి. ఆమెకి సంతోషం వేసింది. ఇంకేమీ ఫర్వాలేదు, రేపొద్దున కళ్ళు తెరిచేసరికల్లా అంతా అయిపోయి వుంటుంది. అవుతుందీ,

అవుతుందీ అన్న టెన్షన్ కన్నా అయిపోయిందీ అన్న నిర్లిప్తత మంచిది.

మరో అయిదు నిమిషాల్లో ఆమెకి నిద్ర పట్టేసింది. అవసరమైన దానికన్నా యెక్కువ మోతాదులో నిద్ర మాత్రలు వేసుకోవటం వల్ల చాలా కొద్దిసేపట్లోనే అది గాఢనిద్రగా మారింది.

......

ధర్మారావు మేజిస్ట్రేట్‌కి ఫోన్ చేశాడు "తెల్లవారు ఝామున నాలుగింటికి - " అన్నాడు.

"నోట్ చేసుకున్నాను, వస్తాను" అన్నాడాయన.

ఫోన్ పెట్టేస్తూ వాచీ చూసుకున్నాడు. తొమ్మిదిన్నరయింది. జైలంతా నిశ్శబ్దంగా వుంది. అతడికి ఇంటికి వెళ్ళబుద్ధి కాలేదు. బెల్ కొట్టాడు. యాదగిరి వచ్చాడు.

"వెన్న వుందా" అడిగాడు. యాదగిరి "వుంది సార్" అన్నాడు.

నిజానికి రూల్ ప్రకారం వెన్న అవసరం లేదు కానీ, జైలు అధికారులు ఖైదీ మీద జాలితో వెన్న వాడతారు. కేవలం జాలే. ప్రతీ ఉరికీ ఒక కొత్త తాడు ఉపయోగిస్తారు. కాబట్టి అది మెడ చర్మానికి ఒరుసుకోకుండా వెన్న రాయటం ఆనవాయితీ.

ధర్మారావు కుర్చీలోంచి లేచాడు. ఇక వుండి చేసేదేమీలేదు. డ్రాయరు తాళం వేసి గది బైటకొచ్చాడు. చిరంజీవి సెల్‌వైపు వెళ్దామా అనుకుని, మళ్ళీ మనసు మార్చుకుని, ఇంటివైపు నడక సాగించాడు.

......

"ఏవోయ్ శర్మా - ప్రెసిడెంట్ వూళ్ళో వున్నాడా" చిరంజీవి తలుపు ఊచలు పట్టుకుని అనుమానంగా అడిగాడు.

"లేడు సార్. బొంబాయి వెళ్ళాడు ఈ సాయంత్రమే "అన్నాడు విష్ణుశర్మ.

చిరంజీవి కెవ్వున అరిచినంత పని చేసి "ఏమిటీ" అన్నాడు.

"అవున్సార్, యూనియన్ మీటింగ్ వుందిగా"

"ఏ ప్రెసిడెంట్ గురించి నువ్వు చెప్పేది?" అనుమానంగా అడిగాడు.

"మా యూనియన్ ప్రెసిడెంట్ గురించి."

"ఓహ్ - అతడు కాదు. మన ఇండియా ప్రెసిడెంట్ గురించి నేనడుగుతోంది."

"తెలీదు సార్ - నేను పేపరు చదవను."

అయిదు నిముషాలు గదిలో ఇటూ, అటూ పచార్లు వేశాడు చిరంజీవి. మళ్ళీ తలుపు దగ్గరకొచ్చి పిలిచాడు "శర్మా, నాకో చిన్న సాయం చేసి పెట్టాలి."

"ఏమిటి సార్"

"నేనో ఫోన్ నంబర్ యిస్తాను. ఫోన్ చేసి సర్వోత్తమరావుగారు వున్నారో లేదో కనుక్కో........"

"నేనిక్కణ్ణుంచి కదలకూడదు కానీ నా ఫ్రెండ్ ఒకడున్నాడు యాదగిరి అని. అతగాడిని కనుక్కోమంటాను" అని ...నెంబరు తీసుకొని. బైట తలుపు దగ్గరికి వెళ్ళి ఎవర్నో పిలిచాడు.

చూస్తున్న చిరంజీవి కళ్ళు ఎందుకో చెమర్చాయి. అతడు చేస్తున్నది పెద్ద సాయంకాదు కానీ ఒక సెంట్రీ - ఒక ఖైదీకి అలా చెయ్యడం - అలా గౌరవించడం- సార్ అని పిలవడం - పోలీసులందర్నీ దుర్మార్గులుగా చిత్రీకరిస్తూ వుంటారు. అది ఎంత తప్పో అతడికి ఆ క్షణం తెలిసింది.

అతడు ఆలోచనల్లో వుండగానే శర్మ వచ్చి " ఆయన ఇంటికి రాలేదట. సాయంత్రమే వెళ్ళారట" అన్నాడు.

"మరేం చేస్తున్నాడు ఇంతసేపు?" అనుకున్నాడు చిరంజీవి. రెండు నిమిషాలు ఆలోచించి "శర్మా నాకింకో సాయం చేసి పెట్టాలోయ్" అన్నాడు.

"ఏమిటి సార్"

" ప్రెసిడెంట్ గెస్ట్‌హౌస్‌కి ఫోన్ చెయ్యాలి."

శర్మ వులిక్కిపడి అర్థం కానట్టు "ఏమిటి" అన్నాడు.

"అక్కడికి ఫోన్ చేసి సర్వోత్తమరావు వచ్చారో లేదో కనుక్కోవాలి. వస్తే ఇంకా అక్కడే వున్నారేమోకూడా తెలుసుకోవాలి."

"ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాతో నేను మాట్లాడటమా - భలేవారే! నాకు మా సూపర్నెండెంట్‌గారితో మాట్లాడాలంటేనే కాళ్ళు వణుకుతాయి."

"అబ్బా ప్రెసిడెంట్‌తో కాదోయ్... వాళ్ళ పియ్యేలూ, పెర్సనల్ అసిస్టెంట్లూ వూంటారు. ఎవర్నడిగినా చెప్తారు. బాబ్బాబూ - ప్లీజ్ ....."

"బాబోయ్ నాకు భయం సార్."

పది నిముషాలు నచ్చ చెప్పాక శర్మ అక్కణ్ణుంచి కదిలాడు. యాదగిరిని అతడు ఒప్పించటానికి మరో పది నిముషాలు పట్టింది. తలుపు వూచల్లోంచి తలని వీలైనంత బైటకి వంచి, ద్వారం వైపు చూడసాగాడు చిరంజీవి. దూరం నుంచి శర్మ వస్తోంటే అతడి గుండె వడి వడిగా కొట్టుకోవడం ప్రారంభించింది.

శర్మ దగ్గరకొచ్చి " ప్రెసిడెంట్ లేరట సార్. ఆరింటికే ఏదో సాంస్కృతిక కార్యక్రమానికి వెళ్ళిపోయారట. అది అయిన తర్వాత తొమ్మిదింటికి విందు కూడా వుందట ......." అన్నాడు. " సర్వోత్తమరావు అనే పేరు గలాయన అసలు రానేలేదట, అపాయింట్ మెంట్ కాన్సిల్ అయిపోయిందట."

ఊచల్ని పట్టుకుని నిలబడ్డ చిరంజీవి అలాగే క్రిందకి జారిపోయాడు. కళ్ళముందు చీకట్లు కమ్మినట్లయింది. మోకాళ్ళమీద

కూర్చొని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. శరీరం సన్నగా కంపిస్తోంది. సెంట్రీ బూట్ల శబ్దం దూరంగా వినిపిస్తోంది... దగ్గరవుతోంది... మళ్ళీ దూరంగా వెళ్తోంది.

బైట చంద్రుణ్ణి తిరిగి మబ్బు మూసెయ్యటంతో చీకటి కాటుకలా పేరుకుంది. ఇంకో తుఫాను తాకిడికి సూచనగా వాతావరణం స్థబ్దంగా వుంది.

జైలు గంటలు పదకొండుసార్లు మ్రోగినయ్.

చిరంజీవిలో చలనం లేదు.

పదకొండుంపావయింది........ పదకొండున్నర.... పావుతక్కువ పన్నెండు.... పన్నెండు.... పన్నెండు....బైట చీకటి - లోపల చీకటి- కళ్ళు మూసుకుంటే చీకటి - తెరిచినా చీకటే........

ప్రాణాలు పోవటానికి ఇంక సరీగ్గా నాలుగున్నర గంటలు..... ఈ ప్రపంచంలో యెవరూ దాన్ని ఆపుచెయ్యలేరు...... అవునన్నట్టు ఒక్క సారిగా ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పన్నెండు సార్లు గంటలు వినిపించాయి. అవి ప్రతిధ్వనించి - జైలు ఆవరణని కంపింపజేశాయి.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

13 వ భాగం

అడుగుల చప్పుడు దగ్గరగా వచ్చి ఆగటంతో - మోకాళ్ళమీద తల పెట్టుకుని కూర్చొన్న చిరంజీవి తలెత్తాడు, ఎదురుగా శర్మ!

"పన్నెండయిపోయింది సార్, డ్యూటీ దిగిపోతున్నాను......" శర్మ అన్నాడు. అతడి మాటల్లో - ఇదే సార్ మిమ్మల్ని ఆఖరిగా చూడటం అన్న భావం వున్నది. చిరంజీవి ఏదో అనబోయాడు. గొంతులో ఏదో అడ్డుపడి మాట రాలేదు.

చిరంజీవి మౌనాన్ని శర్మ ఇంకోలా అర్థం చేసుకున్నాడు. "........... నన్ను క్షమించండి సార్" అన్నాడు. చిరంజీవి మొహంలో విస్మయం కనబడింది.

"మీ మీద జోకులేశాను. మీరు తినే భోజనం ఆఖరిదన్నాను. మాటి మాటికీ మీకు ఉరి గురించి జ్ఞాపకం చేశాను. ఏదో తెలిసీ తెలియక మిమ్మల్ని బాధ పెడ్తే క్షమించండి."

"ఫర్లేదోయ్" అనబోయేడు. ఈ మాటకూడా బైటకి రాలేదు.

ఈ లోపులో శర్మ ఊచలగుండా చెయ్యి లోపలికి పెట్టి "వెళ్ళొస్తాన్సార్" అన్నాడు "నా జీవితంలో మీలాంటి ధైర్యవంతుల్నీ, చావునికూడా నవ్వుతో పరిహసించగలిగే వాళ్ళని చూడటం యిదే మొదటిసారి."

చిరంజీవి ఏడవలేక నవ్వుతూ చెయ్యి అందించి "నేనేం ధైర్యవంతుడ్ని కాదు. ఉరి తప్పదు అని తెలియగానే చూడు నా చెయ్యి ఎలా వణుకుతూందో" అన్నాడు.

"పొండి సార్, మీ చెయ్యి వణకటం ఏమిటి! అల్లూరి సీతారామ రాజు మనవడి లాంటి వారు మీరు" అన్నాడు.

"లేదు - నిజంగా నేను బాధపడ్తున్నాను. భయపడ్తున్నాను."

"నాకు తెలుసు గురూగారూ....... మీరు బాధపడేది ప్రాణం పోతూందనికాదు. మరోసారి ముప్వంకాయ కూర తినలేక పోతున్నానే అని" అన్నాడు.

షేక్ హాండ్ ఇవ్వడం పూర్తయింది. అంతలో శర్మ మొహం సీరియస్ అయింది. "ఈ రాత్రికి నాకు నిద్ర వుండదు సార్. మీ గురించే ఆలోచిస్తాను. మీరు వ్య క్తిగతంగా హంతకులై వుండొచ్చుగాక, కానీ నాకు మాత్రం మంచి వారే సార్ - మంచి వారే!"

చిరంజీవి షాక్ తగిలినట్టయింది. ఈ విషయం తను ఆలోచించలేదు. తననెవరూ రక్షించలేరనీ, ఉరి తప్పదనీ అనుకున్నాడు. సర్వోత్తమరావుగారు ఏమయ్యారో తెలియకపోవడంతో మరణం ఖాయం అని భావించాడు.

కానీ ఈ మరణంతో పాటూ తను ఒక నిందని కూడా తీసుకెళ్తున్నాడు. సర్వోత్తమరావు ప్రపంచానికి అసలు నిజం చెప్పని పక్షంలో - తన మరణంతో అసలు నిజం కప్పబడిపోతుంది. లోకం దృష్టిలో తనెప్పటికీ హంతకుడుగా నిలబడిపోతాడు.

అర్చన కూడా అలానే అనుకుంటుంది. కనీసం తను ఒక్కత్తీ అనుకోకపోతే అదే చాలు.

తను "వ్యక్తిగతంగా" కూడా మంచివాడే అన్న విషయం ఈ లోకంలో ఒక్క అర్చన నమ్మితే అదే చాలు. తను హాయిగా ప్రాణాలు వదిలేస్తాడు.

అక్కణ్నుంచి విషాదంగా కదలబోతున్న వాణ్ని "శర్మా" అని పిలిచాడు. శర్మ ఆగాడు.

"నాకింకో చిన్న సాయం చేస్తావా? ఈసారి నిజంగా ఆఖరుది."

"ఏమిటి సార్?"

"సర్వోత్తమరావుగారని నా దగ్గరకి వస్తూవుండేవారు తెలుసా?"

"లాయరుగారా?"

"ఆ లాయరుగారే. ఆయనింటికి వెళ్ళాలి...."

"ఇంత రాత్రప్పుడా?"

"అవును. ఇప్పుడే" అన్నాడు చిరంజీవి. క్షణం నిశ్శబ్దంగా వున్నాడు. తరువాత నెమ్మదిగా చెప్పాడు.

"శర్మా. ఈ హత్య నేను చేయలేదు. నేను హంతకుణ్ని కాదు."

కాళ్ళముందు ఒక్కసారిగా మెగాటన్ను బాంబు పడ్డట్టు అదిరి పడ్డాడు శర్మ. అయోమయం, టెన్షన్, విస్మయం అన్నీ ఒక్కసారిగా అతడి మొహంలో చోటు చేసుకున్నాయి. కొంచెం సేపు నోట మాటరాలేదు. తరువాత తడబడ్తూన్న కంఠంతో "ఏ...... ఏమిటి మీరు అంటున్నది" అన్నాడు.

"అవును శర్మా. నేనీ హత్య చేయలేదు" అంటూ తనూ సర్వోత్తమరావు వేసిన ప్లాన్ గురించీ, తమ ఆశయం గురించీ, వివరంగా చెప్పాడు.

"సాయంత్రం నాలుగింటికల్లా ఆయన ప్రెసిడెంట్ దగ్గరికి వెళ్ళి ఆ ఫోటోలు చూపించి నన్ను విడుదల చెయ్యాలి. అదీ మేం అనుకున్నది. కానీ ఆయన రాత్రి పదింటివరకూ ప్రెసిడెంట్‌ని కలుసుకోలేదు. ఏమయ్యాడో తెలీదు. నన్నే శక్తీ రక్షించలేదిక. కానీ నువ్వు చెయ్యవలసిన సాయం ఒకటే. ఆయన మేనకోడలు తెలుసుకదా, అర్చన."

శర్మ తలూపాడు.

"ఈ విషయం అర్చనగారికి చెప్పు. కనీసం ఆమె అయినా నిర్దోషినని నమ్మితేచాలు. ప్రశాంతంగా చచ్చిపోతాను" ప్రశాంతంగా చచ్చిపోతానని మాట వరసకి అన్నాడే కానీ, అతడి వళ్ళు ఆ చలిలోకూడా చెమట పట్టింది.

ఇంకో నాలుగు అయిదు గంటల్లో జరగబోయే కర్మకాండ తల్చుకుంటూంటే వణుకు పుడుతోంది.

"ఎలా - ఎలా సార్ మిమ్మల్ని రక్షించటం?"

చిరంజీవి విషాదంగా నవ్వాడు "రక్షించటమా - ఇక విషయం మర్చిపో."

శర్మ ఇంకా ఈ షాక్ నుంచి తేరుకోలేదు. కళ్ళు పెద్దవి చేసి ఇంకా చిరంజీవి మొహంలోకే చూడ సాగాడు.

చిరంజీవి అన్నాడు "నేనాలాగూ చావబోవటం లేదన్న ధైర్యంతోనే జోకువేశాను. అల్లూరి సీతారామరాజు అన్నాను, ముఫ్వంకాయ కూర అన్నాను. శర్మా - నన్ను నమ్ము, నేనీ హత్య చేయలేదు -"

శర్మ నొచ్చుకుంటూ - "నేను నమ్మకపోవటమా - ఎంతమాట - మిమ్మల్ని చూసినప్పుడే నేను మీరీ హత్య చేయలేదని అనుకున్నాను సార్" అన్నాడు.

అంతలో ఒక గంట కొట్టింది.

శర్మ ఉలిక్కిపడ్డాడు. అప్పుడే గంట అయిపోయిందా? అవునన్నట్టూ జైలు ఒకసారి గంట కొట్టింది.

ఒంటిగంట.

ఏదైనా చేసి ఈ చిరంజీవిని రక్షించాలీ అంటే ఇంకో మూడున్నర గంటల కాలం మాత్రమే వుంది. అలా రక్షించగలిగేది ఒక్క అర్చన మాత్రమే. ఏం చేసినా ఆమే చెయ్యాలి.

మరిక ఆలస్యం చెయ్యదల్చుకోలేదు అతడు.

.......

ధర్మారావుకి ఆ రాత్రి నిద్ర పట్టటం లేదు. పక్క మీదే ఊరికే పొర్లుతున్నాడంతే. అతడిని చూసినవారెవరూ అతడు జైలు అధికారి అనుకోరు. అతడు తన సర్వీసులో పధ్నాలుగు ఉరితీతల్ని చూశాడు. సాధారణంగా ఒక జైలు సూపరెంటెండెంటు తన జీవితకాలంలో ఐదారు శిక్షలకన్నా ఎక్కువ అమలు జరపడు. కానీ అదేం ఖర్మమో అతడెంత వద్దనుకున్నా అతడున్న జైలుకే వస్తూవుంటారు, ఆ నేరస్థులు.

తెల్లవారు ఝామున నాలుగింటికి ఎంతో సహజంగా జరిగిపోయే ఆ కార్యక్రమాన్ని అతడు చాలా నిశ్శబ్దంగా గమనిస్తాడు. తనపని తాను నిర్వ ర్తించుకు పోతాడు. ఆరింటికల్లా అంతా అయిపోతుంది.

ఉరికంబం చుట్టూ స్మశాన వాతావరణం తిరిగి నెలకొంటుంది. అతడు తన ఇంటికి వెళ్ళి తలుపు వేసుకుంటాడు. అతడి పాత డైరీలో ఒక కాగితం వుంది. ఎర్రటి రక్తపు మరక దానికి ఇంకా అంటుకునే వుంది. బాగా ఎండిపోయిన మరక, దాన్ని చూడగానే - అప్పుడు వస్తుంది దు:ఖం - తెరలు తెరలుగా - గుండెల్లోంచి ఉబికి ఉబికి.

తనివి తీరా ఏడుస్తాడు. ఉరికంబం ఎక్కబోయే ముందు ఖైదీ బోనులో జంతువులా గింజుకోవటాన్నీ - ఆఖరి క్షణపు అతడి నిస్సహాయతనీ - టప్‌మన్న చప్పుడుతో మెడ విరిగిపోవటాన్నీ - అంతా జ్ఞాపకం వచ్చి కడుపులో దేవినట్టు అవుతుంది. హంతకుడు హత్య చేసినవాడే కావొచ్చు, పచ్చి నెత్తురు తాగేవాడే కావొచ్చు. నిర్దోషి కూడా కావొచ్చు. అయినా అంత కన్నా పెద్ద నేరాలు చేసిన వాళ్ళు ఎంత మంది తప్పించుకుతిరగటం లేదు?

అతడికి కొడుకు జ్ఞాపకం వస్తాడు. పదమూడేళ్ళ ఆ వయసులో చనిపోయిన కొడుకు. ఆ అబ్బాయి చాలా తెలివైనవాడు. ఆ వయసులోనే భారవిలా చిన్న చిన్న గేయాలు, కవిత్వం వ్రాసేవాడు.

స్కూల్ నుంచి వస్తుండగా వెనుక నుంచి కారు రాష్‌గా వచ్చి ఫుట్‌పాత్ ఎక్కి డాష్ యిచ్చింది. పక్కటెముకలు విరిగి, ఊపిరితిత్తుల్లో గుచ్చుకున్నాయి. స్కూల్ బాగ్ గాలిలో ఎగిరి దూరంగా పడింది. పుస్తకాలు చెల్లా చెదురు అయ్యాయి. అయిదు నిమిషాల పాటు గిలగిలా కొట్టుకున్న చిన్నారి శరీరాన్ని ఎవరూ ఆస్పత్రికి తీసుకెళ్ళటానికి సాహసించలేదు.

నిక్కరు రక్తంతో తడిసిపోయింది. విజ్ఞానంతో నవ్వే ఆ పెద్ద కళ్ళు బాధతో విలవిలలాడాయి..... పొట్లం కట్టి విసిరేసినట్టూ కొంత సేపు ఫుట్ మీద పడివున్నాడు. ఆ తరువాత ఆస్పత్రికి తీసుకువచ్చి ఆపరేషన్ చేశారు.

అయినా బ్రతకలేదు. మధ్యలో ఒక గంట స్పృహ వచ్చిందంతే. ఆ అరగంటలోనూ ఆఖరి గేయాన్ని వ్రాసుకున్నాడు.

"పగలు, రాత్రితో పోరాడి ఓడినవేళ
ఎర్రటి సంధ్య - నల్లటి చీకట్లోకి
వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ
నన్ను తీసుకెళ్ళిపోతూ............"
అని - అంతే.

ఆ కాగితానికి రక్తపు మరక యింకా అలానే అంటి వున్నది. ఒక నిర్భాగ్యుడు ఉరి తీయపడ్డప్పుడల్లా ధర్మారావు ఆ కాగితాన్ని తీసి చూసుకుంటూ వుంటాడు.

అంబాసిడర్ కారు గంటకు నూట యిరవై కిలోమీటర్ల కన్నా ఎక్కువ వేగంతో నడుస్తుందా, లేదా అని గర్ల్ ఫ్రెండ్‌తో పందెం కట్టి, విస్కీ మత్తులో రాష్‌గా నడిపి, ఫుట్‌పాత్ యెక్కించిన వాడు శిక్షనుంచి చాలా సులభంగా తప్పించుకున్నాడు.

కారు స్లోగానే వెళ్తోందన్నారు సాక్షులు. బ్రేకులు ఫేలయ్యాయన్నాడు ఇన్‌స్పెక్టర్. విస్కీఛాయే కనబడలేదన్నారు పోలీసులు. చట్టం ఏం చేయలేకపోయింది. తన కొడుకుని చంపినవాడు ఇప్పటికీ అదే కార్లో తిరుగుతున్నాడు. నిజానికి అతడి మెడకు ఎన్ని ఉరులు వెయ్యాలి? బ్రతగ్గలిగేవాళ్ళు ఎలానూ బ్రతుకుతున్నప్పుడు మరి ఉరిశిక్ష ఎందుకు?

కాగితం పట్టుకుని అతడు పక్క దగ్గరకు వచ్చాడు. ఈ రాత్రికి మరిక నిద్రపట్టదు...... కిటికీ లోంచి నల్లటి ఆకాశం కనబడుతోంది. ఎప్పుడు నాలుగు అవుతుందా, రైటువల్ ఎప్పుడు పూర్తి చేద్దామా అనుకుంటూ కూర్చొని వున్నాడు, కొడుకు ఫోటోవైపే చూస్తూ.

అతడి కంటినుంచి అప్రయత్నంగా జారిన నీటి చుక్క - అతడు చేతిలో పట్టుకున్న కాగితం మీద పడింది.

......

జైలునుంచి అర్చన వాళ్ళిల్లు నాలుగైదు మైళ్ళుంటుంది. అతడి వద్ద సైకిలు లేదు. డబ్బు కూడా ఎక్కువలేదు. రూపాయో, రెండో వున్నాయంతే. అతడు రొప్పుతూ పరుగెడ్తున్నాడు. మధ్యలో ఆయాసం తీర్చుకోవటానికి కొద్దిసేపు ఆగుతున్నాడు. అంతలో సమయం విలువ గుర్తొస్తుంది. మళ్ళీ పరుగు సాగిస్తున్నాడు.

తనెందుకు అంత తొందరపడ్తున్నాడో అతడికే తెలీదు. కానీ ఈ విషయం యెంత తొందరగా వీలైతే అంత తొందరగా అర్చనకి చెప్పాలని అతడి తాపత్రయం.

కారణం చాలా చిన్నది. మన వాళ్ళెవరికైనా ఆక్సిడెంట్ అయితే ఆస్పత్రిలో - మనతోపాటూ నలుగురైదుగురు ఆప్తులు మనతో పాటూ వుండాలని కోరుకుంటాం. వాళ్ళేదో మనకి సాయం చేస్తారని కాదు - మన ఆదుర్దానీ, టెన్షన్‌నీ పంచుకొంటారని!

శర్మ స్థితి అలాంటిదే!

అతడు సర్వోత్తమరావు యింటికి చేరుకునేసరికి పావుతక్కువ రెండు కావొస్తోంది. రొప్పుతూ యింటిముందు నిలబడ్డ అతడిని చూసి గూర్ఖా అనుమానంగా "ఏం కావాలి" అని అడిగాడు.

"అర్చన గారు కావాలి."

రాత్రి రెండింటికి పరుగెత్తుకుంటూ వచ్చి "ఇంటి యజమానురాలు కావాలి" అని అడిగే ఆ అపరిచిత వ్యక్తిని మెడ పట్టుకుని గెంటేవాడే. కానీ, అతడి దుస్తులు చూసి తమాయించుకుని "ఎందుకు......? అసలు నువ్వెవరు?" అని అడిగాడు గూర్ఖా.

శర్మ విసుగుతో "అవన్నీ తరువాత, ముందావిడని పిలువు" అన్నాడు. ఒక వైపు టైమ్ అయిపోతూందని అతడికి కంగారుగా వుంది. అయితే అతడి అరుపుకి గూర్ఖా అహం దెబ్బతిన్నది.

"వెళ్ళెళ్ళు ఇక్కణ్ణుంచి - " అన్నాడు.

"చాలా అర్జెంటు పని -"

"ఏమిటా పని?"

శర్మ ఇబ్బందిలో పడ్డాడు. చిరంజీవి విషయం ఈ గూర్ఖాకి చెప్పొచ్చోలేదో.... ఆ విషయం చెప్పకుండా వాదించటం మొదలుపెట్టాడు. పావుగంట వాదించినా గూర్ఖా వప్పుకోలేదు. అంతలో అతడికో ఆలోచన వచ్చింది.............. టెలిఫోన్.

చాలా పోష్ కాలనీ అది. మెయిన్ రోడ్ మీదకు రావటానికి అరగంట పట్టింది. ఒక ఇరానీ హోటల్ ఇంకా తెరిచివుంది. అక్కణ్నుంచి ఫోన్ చేశాడు. అర్చన గదిలోంచి బైరాగి మెట్లు దిగుతూ వుంటే వినిపించిన ఫోన్ శబ్దం అదే.

బైరాగి ఫోన్ ఎత్తి విసుగ్గా "హల్లో" అన్నాడు.

"అర్చన గారున్నారా? ఒకసారి పిలవండి" వగరుస్తూ అన్నాడు శర్మ.

"ఎవరు మాట్లాడుతున్నది" అని అడిగాడు బైరాగి. అర్చనకి దూరపు ట్రంక్‌కాల్స్ రావటం అర్ధరాత్రి పూట మామూలే.

శర్మకి యిక అసలు విషయం చెప్పెయ్యటం మంచిదనిపించింది "నా పేరు శర్మ. చిరంజీవిగారి విషయం ఒకటి అర్జెంటుగా అర్చనగారికి చెప్పాలి" శర్మ, చేసిన తప్పు అదే - చిరంజీవి విషయం బైరాగికి చెప్పటం.

చిరంజీవి పేరు వినబడేసరికి బైరాగి మొహంలో రంగు మారింది. ప్రత్యర్థి గెలుపుని చూసి ఏర్పడే కసిలాంటిది........... ఎన్నాళ్ళనుంచో మనసులో పేరుకుని వున్నది....... తన మూగ ప్రేమకి అతడు అడ్డు వస్తున్నాడన్నది, తను గెలవలేనిది అతడు గెల్చుకున్నాడన్నది... చిరంజీవీ, అర్చన కార్లో వెళ్ళటం మేడమీద నుంచి చాలాసార్లు చూసి - కసితో కదిలిపోయాడు అతడు.

"ఏమిటి చిరంజీవిగారి విషయం?" అన్నాడు 'గారి' అన్నమాట నొక్కిపలుకుతూ.

"అన్నీ ఫోన్‌లో చెప్పటానికి వీలులేదు. అర్చనగార్ని లేపండి -" ఆతృతగా అన్నాడు శర్మ. ఒక వైపు కొంపలంటుకుపోతూంటే వీళ్ళందరూ ఇంత నిర్లిప్తంగా వుంటారేం...... అతడికి వళ్ళు మండి పోతోంది...."తొందరగా లేపండీ!"

"అర్చనగారు నిద్రపోతున్నారు."

"ఇంత అర్ధరాత్రి పూట ఆమె మెలకువగా వుండరని నాకూ తెలుసు. అందుకే లేపమంటున్నాను" కోపంగా అరిచాడు.

"కుదర్దు" నిర్లిప్తంగా అన్నాడు బైరాగి.

"కానీ ఈ విషయం......" అని అతడింకా ఏదో అనబోతూ వుంటే - ఫోన్ కట్ అయింది.

శర్మ నెమ్మదిగా ఫోన్ క్రిందకి దింపేశాడు. అతడి మొహంలో ఉక్రోషం - కోపం చోటు చేసుకున్నాయి. ఒక వార్త అందించటానికి ఇంత కష్టపడాల్సి వస్తుందను కోలేదు. కసిగా పెదవి కొరుకున్నాడు. అతడిని ఎంత ఉక్రోషం - నిస్సహాయతా ఆవరించాయంటే, అన్నీ మర్చిపోయి ఇంటికి వెళ్ళిపోదామా అనుకున్నాడు. కానీ ఆ భావం క్షణంసేపే. వెంటనే తేరుకున్నాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

14 వ భాగం

జేబులోంచి డబ్బులు తీసి హోటల్ వాడికి ముప్పావులా ఇచ్చాడు. ఇంకాముప్పావులా మిగిలివుంది. అతడికి ఏం చెయ్యాలో తోచలేదు. బయటకొచ్చాడు. చలిగాలి రివ్వున వీస్తోంది. రాత్రి తాలూకు వర్షపునీరు రోడ్డుమీద నిలిచివుంది.

ఊరంతా గాఢనిద్రలో వున్నట్టుంది. ఏం చెయ్యాలో తోచక రోడ్డు మధ్యలో నిస్సహాయంగా నిలబడి వున్నాడతను.

అతడికి ఒక క్షణం ఏం చెయ్యాలో తోచలేదు. ఈ విషయం అర్చనకి ఎలాగైనా తెలియజెయ్యాలి. కానీ ఎలా?

అతడి కోపం అంతా సర్వోత్తమరావు మీదకి మళ్ళింది. ఆయన సాయంత్రం నుంచీ ఏం చేస్తున్నాడూ? అనుకున్నాడు.

అంతలో మెరుపులా ఒక ఆలోచన తట్టింది. తనే సర్వోత్తమరావు కంఠంతో ఫోన్ చేస్తే....?

రిస్క్! అయినా ఫర్లేదు. ఈ అర్ధరాత్రి ఎవడు గుర్తు పట్టి చచ్చాడు గనుక! ఒకవేళ సర్వోత్తమరావుగారే ఇంట్లో వుంటే తను దొరికిపోతాడు. దొరికిపోనీ! ఫోన్ పెట్టేస్తాడు - అంతేగా!!

జేబులో డబ్బులు చూసుకుంటే ఇంకో ఫోన్ కాల్‌కి సరిపడేటంత వున్నాయి. మళ్ళీ ఫోన్ చేశాడు. బైరాగి విసుక్కుంటూ వచ్చి ఫోన్ ఎత్తి "హల్లో" అన్నాడు.

"నేను - సర్వోత్తమరావుని. అమ్మాయుందా?"

బైరాగి చప్పున అటెన్షన్‌లోకి వచ్చి "సార్" అన్నాడు. శర్మ మరింత అధికారంతో, "అమ్మాయుందా అంటే మాట్లాడవేం?" అని గద్దించాడు.

"ని.... నిద్ర పోతున్నారు సార్."

"వెళ్ళి పిలువు"

"అలాగేనండీ....." ఫోన్ క్రింద పెట్టిన చప్పుడు. శర్మ ఊపిరి బిగపట్టి క్షణాలు లెక్క పెట్టసాగాడు.

బైరాగి మేడమీదకు వడివడిగా వెళ్ళి అర్చన బెడ్ పక్కన నిలబడి "అమ్మాయిగారూ..." అని పిలవసాగాడు. అర్చన నిద్రమాత్రల ప్రభావంలో గాఢనిద్రలో వుంది.

ఇంకొంచెం సేపు ప్రయత్నించి విఫలమై కిందకొచ్చి "అమ్మాయిగారు నిద్రలేవటం లేదయ్యా" అన్నాడు. శర్మ గుండెల్లో రాయిపడింది. కానీ వెంటనే సర్దుకుని "ఇడియెట్! బుద్ధి లేదూ? నేనని చెప్పి లేపు" అని అరిచాడు.

మళ్ళీ ఫోన్ క్రింద పెట్టిన చప్పుడు.

బైరాగి మళ్ళీ పైకి వెళ్ళాడు. కొంచెం తటపటాయించి అర్చనని తట్టి లేపాడు. రెండు నిముషాలకి ఆమె కదిలింది.

బలవంతంగా కళ్ళు విప్పడానికి ప్రయత్నం చేస్తూ "ఊఁ" అని, పక్కనే నిలబడ్డ బైరాగిని చూసి ఉలిక్కిపడి లేచి కూర్చుంటూ "ఏమిటి" అంది.

బైరాగి అడుగు వెనక్కి వేసి "అయ్యగారు ఫోనులో వున్నారు - పిలుస్తున్నారు" అన్నాడు. ఆమెకింకా నిద్రమత్తు వదలలేదు. మెదడంతా దేనితోనో నొక్కిపట్టినట్టు వుంది. అసలు ఏ పరిస్థితుల్లో నిద్రపోయిందో మర్చిపోయింది.

ఆ మత్తులోనే తూలుకుంటూ మెట్లు దిగి వచ్చి ఫోన్ అందుకుని "హాల్లో...." అని, "... ఏం మావయ్యా? ఎక్కడ్నించి?" అంది కళ్ళు నులుముకుంటూ.

"నేను మీ మామయ్యను కాను అర్చనగారూ. నా పేరు శర్మ........... ఆగండి, ఫోన్ పెట్టెయ్యకండి, మళ్ళీ చెయ్యటానికి నా దగ్గర డబ్బులు లేవు. నేను డెత్ సెల్ ముందు పహరా తిరిగే సెంట్రీని. చిరంజీవి గదిముందు నేనే తిరిగేది. మీకు అర్జెంటుగా ఒక విషయం చెప్పాలి. చిరంజీవి హంతకుడు కాడు. అతడసలు ఏ హత్యా చెయ్యలేదు" అని తొందర తొందరగా చెప్పేసి "హమ్మయ్య" అనుకున్నాడు. తన బాధ్యత తీరిపోయింది.

చిరంజీవి అన్న పేరు వినబడేసరికి అర్చన నిద్రమత్తు సగం వదిలిపోయింది! హత్య ప్రసక్తి వచ్చేసరికి పూర్తిగా పోయింది.

"ఎవరు నువ్వు - వివరంగా చెప్పు" అంది ఆత్రంగా.

శర్మ విషయాన్ని కుదించి, అయినా ఆమెకి అర్థమయ్యేటట్టు పూర్తిగా చెప్పాడు. తను ఇంటికొచ్చిన సంగతీ, గూర్ఖా అడ్డుపడిన సంగతీ, ఉరి దగ్గరపడుతున్న సంగతీ కూడా చెప్పాడు.

విషయం అంతా విన్న అర్చన శిలలా నిలబడిపోయింది. అవతల్నుంచి శర్మ 'హలో హలో' అంటున్నాడు.

"ఎక్కణ్ణుంచి ఫోన్ చేస్తున్నావ్ నువ్వు?"

శర్మ చెప్పాడు.

"వెంటనే రా. ఆటోగానీ - టాక్సీగానీ - ఏదుంటే అది. ఆలస్యం చెయ్యకు" అని ఫోన్ పెట్టేసి - గోడకి ఆనుకుని నిలబడిపోయింది. ఆమె నుదుటిమీద చెమటపట్టింది. చేతివేళ్ళు కంపిస్తున్నాయి. తను ముందు మామూలుగా మారాలి...... అదీ ముఖ్యం........... ఒకటి ........రెండు........... మూడు అని లెక్క పెట్టసాగింది. ఎప్పుడు ఉద్వేగపడినా, ఎప్పుడు కోపం వచ్చినా ఆమెకి అలా లెక్క పెట్టడం అలవాటు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు చెదిరిన మనసుని కూడగట్టుకోవటం అవసరం.

వంద పూర్తయ్యేసరికి ఆమె మామూలు మనిషి అయిపోయింది. ఏదో ఒకటి చెయ్యాలి. టైమ్ అయిపోయిందనీ, పరిస్థితి చెయ్యి దాటిపోయిందనీ ఆమెకు తెలుస్తోంది.

అయినా ఆమె నిర్లిప్తంగా కూర్చోలేకపోయింది. ఒక అమాయకుడు వురికంబం ఎక్కకుండా నిరోధించడం ఎలా? ఆమె గదిలోకి, బైట వరండాలోకి పచార్లు చేస్తూ శర్మ కోసం ఎదురు చూడసాగింది.

మనసులో వువ్వెత్తున యెగసిపడే కెరటాల్లాంటి ఆలోచన్లు! ఎందుకిలా చేశాడు చిరంజీవి? ఇందులో యెందుకు

యిరుక్కున్నాడు? దేశంలో ఉరిశిక్ష ఏమవుతే అతనికేం? ఒక వైపు అతడి మీద గొంతుదాకా కోపం వస్తోంది. మరొకవైపు ఈ చేసిందంతా తన మెప్పుకోసమే అనుకుంటే ఆనందం వేస్తోంది. ఏడవాలో నవ్వాలో తెలియని స్థితి. ఏమయినా, శర్మ వచ్చి పూర్తి వివరాలు చెబుతేగానీ విషయం తెలీదు. ఆమెకి క్షణమో యుగంగా గడుస్తోంది.

అక్కడ శర్మ పరిస్థితి అధ్వాన్నంగా వుంది. జేబులో డబ్బులు లేవు' రాత్రంతా నా పని పరిగెత్తటంలానే వుంది' అనుకుంటూ అతడు తిరిగి పరుగెత్తడం మొదలు పెట్టాడు. అతడు ఆ యింటికి చేరుకునేసరికి మరో పది నిముషాలు పట్టింది, రొప్పుతూ గేటు ముందు నిలబడ్డాడు.

ఆ అలికిడికి తొంగి చూసిన గూర్ఖా "నీకింకేం పన్లేదా? పోలీసుల్ని పిలవనా" అని అరుస్తున్నాడు. శర్మ ఏదో అనబోయేసరికి వరండాలోంచి అర్చన కంఠం వినిపించింది"అతడిని లోపలికి పంపించు హర్నామ్" అని.

గూర్ఖా ఉలిక్కిపడి అటుచూసి, యజమానురాలిని గమనించి, నమ్రతగా గేటు తెరిచాడు!

శర్మ ఇంకా ఆయాసపడ్తూనే వున్నాడు. అయినా నెమ్మదిగా, వివరంగా అంతా చెప్పాడు. ఆమె జాగ్రత్తగా వింది. చిరంజీవి చెప్పినదంతా అక్షరం పొల్లు పోకుండా చెప్పాడు శర్మ . శవంకోసం వెతకటం, దారాసింగ్ అనేవాణ్ని పట్టుకోవటం, సర్వోత్తమరావూ...... చిరంజీవి కలిసి ఫోటోలు తీసి శవాన్ని నూతిలో పడెయ్యటం వగైరా.

ఇప్పుడు ఉత్పన్నమైన ప్రశ్న - " సర్వోత్తమరావు ఏమయ్యారు?" అన్నది.

"మనం ప్రెసిడెంట్ గెస్ట్‌హౌస్‌కి ఫోన్ చెయ్యాలి" అన్నది అర్చన "అసలు అంకుల్ అక్కడికి చేరుకున్నారో - లేదో; ఫోటోల గురించి కూడా అక్కడ తెలుస్తుంది. ఒక మనిషి జీవన్మరణ సమస్య అంటే వాళ్ళూ అంత తేలిగ్గా తీసుకోరు. జవాబు చెప్తారు."

"ఆ పనీ మేమే చేశాం" అన్నాడు శర్మ "చిరంజీవి రాత్రే ఆ విషయం కనుక్కోమన్నాడు. ప్రెసిడెంట్ దగ్గరికి ఆయన అసలు వెళ్ళలేదట - నాలుగింటి ప్రోగ్రాం కాన్సిల్ అయిందట!"

ఏం చెయ్యాలో అర్చనకి పాలుబోవటంలేదు. ఎవరి మీదో తెలియని కసి. ఈ ప్రపంచం అంతా ఇంత హాయిగా నిద్రపోతుందేం- అని దానిమీద కోపం.

అయినా వీళ్ళిద్దరికీ బుద్ధి వుండొద్దూ - అని ఇంకోవైపు ఏం చెయ్యాలి? జైలు వార్డెన్‌కిగానీ, సూపర్నెండెంట్‌కిగానీ చెప్తే లాభం లేదు. తెలిసినా వాళ్ళనెవరైనా పట్టుకుని ప్రెసిడెంట్‌కి ఫోన్ చేయించి, ఈ ఒక్కరోజుకి చిరంజీవి ఉరిని వాయిదా వెయ్యమంటే? అంతకంటే హాస్యాస్పదం ఇంకొకటి వుండదు. ఎవరైనా క్రిమినల్ లాయర్ని సంప్రదించాలన్నా తన దగ్గర కేవలం చిరంజీవి మాటలు తప్ప వేరే రుజువులు లేవు. ఇంకో రెండు గంటల్లో ఉరి తీయబోయే వ్యక్తిని - విడుదల చెయ్యటానికిగానీ, ఉరి వాయిదా వెయ్యటానికిగానీ ఏ పరిస్థితులుండాలో తనకి తెలీదు. ఆమెని ఒక్కసారిగా నిరాశా నిస్పృహలు ఆవరించినయ్!

అయితే ఈ నిరాశ అంతా ఒక్క క్షణమే!

క్షణంలో ఆమె సర్దుకుంది. పెద్ద పెద్ద సమస్యలు వచ్చినప్పుడు యిలాంటి డిప్రెషన్ రావడం సహజమే. అందులోంచి బయటకొచ్చి - ఎంత తొందరగా దాన్ని ఎదుర్కోగలమా అన్నది స్వశక్తి మీద ఆధారపడి వుంటుంది. చిరంజీవిని ఉరి నుంచి

తప్పించటం అనేది చాలా అత్యాశ అని తెలుసు. ఎందుకంటే - అతడిని ఉరి తీయటానికి ఇంకా గంటా, రెండు గంటల కన్నా ఎక్కువ లేదు.

ఈ లోపులో ఏం సాధించడానికి వీలవుతుంది? కానీ మానవ ప్రయత్నం చెయ్యడంలో తప్పులేదు. చిరంజీవి నిర్దోషిత్వాన్ని నిరూపిస్తే కనీసం అతడి ఆత్మ అయినా..

ఆపైన ఆలోచించ లేకపోయింది ఆమె. లేచి నిలబడి - "పద, మనం వెంటనే జైలుకి వెళ్ళాలి" అన్నది. శర్మ తెల్లబోయి "ఎందుకు" అని అడిగాడు.

"చాలా వివరాలు కావాలి, వీళ్ళకి ఈ శవం యెక్కడ దొరికింది? ఆ అడ్రసు, ఆ దారాసింగ్ అనేవాడు యెక్కడ వుంటాడు? అతడి చిరునామా, ఆ ఫోటోలు కడిగిన స్టూడియో ..." అంటూ చప్పున ఆగిపోయింది ఫోటోలు కడిగిన స్టూడియో!

తమ యింట్లోనే వాటిని కడిగి వుండాలి.

ఆ ఆలోచన స్ఫురించగానే ఆమె లోపలికి వేగంగా పరుగెత్తింది. సర్వోత్తమరావు స్టడీరూమ్ పక్కనే చిన్న గదిని డార్క్‌రూమ్‌గా చేసుకున్నాడు. ఆయనకి ఫోటోగ్రఫీ హాబీ. ఆమె లైట్ వేసి తొందర తొందరగా వెతకసాగింది.

ఎన్నో ఫోటోలు తన చిన్నప్పటివి..... గౌన్లు వేసుకున్నవీ... రకరకాల భంగిమలు ... వగైరా అన్నీ కనబడుతున్నాయి. కానీ, కావల్సినవి మాత్రం కనబడలేదు. దాదాపు పావుగంట వెతికి అవి లేవన్న నిర్ధారణకొచ్చింది. ఇక వెతకటం అనవసరం అనిపించింది. అయినా, సర్వోత్తమరావు నాలుగింటికే బయలుదేరాడు కాబట్టి ప్రెసిడెంట్ దగ్గరకే అయివుండాలి. ఆ ఫోటోలు తనతోనే తీసుకెళ్ళివుంటాడు.

ఆమె బయటకొచ్చి, అక్కడే నిలబడివున్న శర్మతో "పద వెళ్దాం" అన్నది. అతడు కదలకుండా, "ఎక్కడికీ" అన్నాడు.

"జైలుకి"

"జైలంటే అత్తవారిల్లు కాదు ఇష్టమొచ్చినప్పుడు లోపలికీ, బైటకీ వెళ్ళటానికి వప్పుకోరు" అన్నాడు. అది మాత్రం నిజం.

"మెయిన్ జైల్ లాకప్" - అంటే జైలు ముందు గేటు మూసెయ్యటం అనేది రాత్రి ఏడున్నరా, ఎనిమిదింటి మధ్యా జరుగుతుంది. ఇది జరిగిన తర్వాత లోపలి దోమ కూడా బయటకి రాలేదు. నైట్ డ్యూటీ అయిపోయినవాళ్ళు అక్కడే పడుకోవాలి.

అలాగే నైట్ డ్యూటీ వున్న వాళ్ళు సాయంత్రం అయిదింటికల్లా లోపలికెళ్ళిపోవాలి. ప్రతీ బారక్‌కీ ఇద్దరు జవాన్లు వుంటారు. ప్రతీ మూడు గంటలకీ వాళ్ళు మారుతూ వుంటారు. అంటే రాత్రి తొమ్మిదినుంచీ పన్నెండువరకూ - మళ్ళీ తెల్లవారు ఝామున మూడునుంచీ ప్రొద్దున్న ఆరు వరకూ.. అలా డ్యూటీలు మారుతూ వుంటారు.

రాత్రంతా సెంట్రీ పచార్లు చెయ్యాలి కాబట్టి మూడు గంటల కన్నా ఎక్కువ సేపు డ్యూటీ వుండదు. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే ఉరిశిక్ష కన్‌ఫర్మ్ అయ్యాక జైలర్ ప్రతీ పదిహేను నిముషాల కొకసారి ఖైదీని చూడాలి. ఖైదీ, ఆరోజు రాత్రి భయంతో ఆత్మహత్య చేసుకోకుండా వుండటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

అసలు ఖైదీ రాగానే బట్టలు మార్చి జైలు బట్టలు మార్చేటప్పుడు అతడి దగ్గర ఏ విధమైన వస్తువులూ లేవని నిర్ధారణ పర్చుకుంటారు. అంతేకాక అతడి గదిలో వులెన్ దుప్పట్లు, ఇత్తడి సామాన్లు తీసేసి మామూలు గుడ్డలూ, మట్టి పాత్రలూ పెడతారు. గది పైకప్పుకి కొక్కేలు లేకుండా జాగ్రత్త పడ్తారు. కరెంటు దీపం వున్నా కూడా దూరంగా హరికేన్ లాంతరుగానీ, పెట్రోమాక్సు గానీ పెట్టి, ఆ వెలుగు లోపల ఖైదీ మీద పడేటట్టూ యేర్పాటు చేస్తారు.

కరెంటు పోయిన సమయంలో ఖైదీ ఏ అఘాయిత్యానికీ తలపడకుండా చూసేటందుకే ఈ జాగ్రత్తలనీ! ప్రొద్దున్నా సాయంత్రం "విధిగా" గదంతా వెతుకుతారు. గార్డులకి బాయినెట్స్ - తుపాకులు ఇవ్వకుండా, కేవలం వెదురు లాఠీలు మాత్రమే యిస్తారు.

మరుసటిరోజు చచ్చిపోయే ఖైదీ - ఈరోజు రాత్రి ఆత్మహత్య చేసుకోకుండా ఇన్ని జాగ్రత్తలు! ఎంత విషాదకరమయిన - కానీ నవ్వొచ్చే నిజం! లోపల ఖైదీ ఆత్మహత్య చేసుకుంటూంటే ఆపు చెయ్యడానికి సెంట్రీ దగ్గరే తాళం చెవి వుంచుతారు. ప్రతి ఖైదీకి ఒక స్పెషల్ గార్డ్ని ఏర్పాటు చేసి రాత్రింబవళ్ళు ఆ ఖైదీ దగ్గరికి ఎవరూ వెళ్ళకుండా ఏర్పాటు చేస్తారు. ఖైదీతో ఎవరూ మాట్లాడటానికి కూడా వీల్లేదు.

శర్మ ఇదంతా చెప్పి "అన్నిటికన్నా ఈ చివరిదే - అంటే జైల్ మాన్యువల్ రూలు నెం. 534 ఇప్పుడు మనకి అడ్డొస్తుంది. ఖైదీతో ఎవరూ మాట్లాడటానికి కుదరదు" అన్నాడు.

అతడు చెప్పినదంతా శ్రద్ధగా విన్న అర్చన ఏమీ తెలియనట్లు ఒక ప్రశ్న వేసింది."నువ్వు చెప్పిందంతా బాగానే వుంది. కాని ఎనిమిదింటికి మెయిన్ లాకప్ ..... అంటే ఎనిమిదింటికి జైలు తలుపులు మూసేసే పక్షంలో, రాత్రి పన్నెండింటికి నువ్వు బయటికెలా వచ్చావ్?"

శర్మ గొంతులో వెలక్కాయపడ్డట్టు అయింది "అదీ......... నేనూ.......... గేటు దగ్గర నా స్నేహితుడూ..." అంటూ తడబడ్డాడు.

"పద శర్మా - ఆలస్యం వద్దు. నిన్ను బయటకొదిలిన స్నేహితుడే లోపలికి వెళ్ళడానికి కూడా సాయం చేస్తాడు. ఇంకా ఏమైనా మాట్లాడుకోవలసింది వుంటే కార్లో మాట్లాడుకుందాం ఇప్పట్నుంచీ ప్రతిక్షణమూ విలువైనదే ..... " అని అతడి జవాబు కోసం చూడకుండా లోపలికి పరుగెత్తింది. రెండు నిమిషాల్లో పర్సు పట్టుకుని తయారై వచ్చి "పద" అంది. మరు నిమిషం వాళ్ళ కారు రివ్వున గేటు నుంచి బైటకు దూసుకుపోయింది.

కార్లో అర్చన అంది - "ఇప్పుడు నువ్వు చేయవలసిన పని చాలా ముఖ్యమైనది. చిరంజీవి చెప్పే ప్రతి విషయాన్ని అక్షరం పొల్లు పోకుండా జ్ఞాపకం వుంచుకుని నాకు చెప్పాలి. ఆ ఇంటి నెంబరు - అడ్రసు............. అన్నీ వీలైతే రాసుకోవాలి."

"అది కుదరదు" అన్నాడు శర్మ "..............ఇప్పుడు డ్యూటీలో వున్న రాజు కర్కోటకుడు. వీటికి దేనికీ ఒప్పుకోడు. అసలు నేనిలా మళ్ళీ వచ్చి మాట్లాడానని అతడెవరితోనైనా చెబితే అది చాలు నా ఉద్యోగం పోవటానికి."

అర్చన మాట్లాడలేదు. ఏం చెయ్యాలా అని ఆమె ఆలోచిస్తూ వుండగా శర్మ అన్నాడు - " ఈ విషయంలో మీరేమీ దిగులు పెట్టుకోకండి. నా మీద నమ్మకం వుంచండి. చిరంజీవి చెప్పే అడ్రసులన్నీ అక్షరం పొల్లుపోకుండా మీకు చెప్పే బాధ్యత నాది. మీరు గానీ స్వంత డబ్బా అనుకోకపోతే నేను ఏక సంథాగ్రాహిని అని చెప్పుకోగలను. మీకు నమ్మకం కలగడం కోసం జైలు మాన్యువల్ ఆరువందల రూల్సూ సెక్షన్స్‌తో సహా వప్పజెప్పమంటే చెప్తాను."

“అఖ్ఖర్లేదులే” అంది అర్చన.“ఆ మాత్రం రిస్కు తీసుకుందాం. వీటన్నిటికన్నా ముఖ్యమైంది టైమ్! ఏ మాత్రం దాన్ని వ్యర్థ పరచకు. పనవ్వగానే వెంటనే వచ్చెయి” అంది. ఈలోపు కారు జైలు వద్దకు చేరుకుంది. కొద్ది దూరంలో దాన్ని ఆపింది అర్చన.

ఒక పెద్ద యుద్ధరంగంలోకి ప్రవేశించబోయే ముందు సర్వ సైన్యాధ్యక్షుడు మౌనంగా పరికించినట్టు, నిశ్శబ్దంగా సీటుకి ఆనుకుని కూర్చొని, జైలు గోడల జేగురు రంగు మీద పేరుకున్న చీకటిని చూస్తూ “ఆఖరుసారి హాయిగా నిద్రపోతున్న వాడిని అనవసరంగా లేపినట్టు ఆపుతుందేమో” అంది.

ఆఖరిసారి నిద్ర అంటున్నప్పుడు ఆమె కంఠం వణికింది. అలా అన్న తర్వాత మళ్ళీ ఎందుకన్నానా అని బాధపడింది.

శర్మ పేలవంగా నవ్వి “తెల్లవారు ఝామున చావు పొంచి వుందని తెలిసిన ఖైదీ - చివరిరోజు నిద్రపోరు అమ్మగారూ” అంటూ కారు డోరు తీసుకుని దిగాడు.

“శర్మా.......”

అతడు ఆగాడు.

ఆమె కొంచెం తడబడి “నేను ఇక్కడ వున్నట్టు చెప్పకు” అంది. చెప్పటం అనవసరం. ఈ రెండు గంటల్లోనూ అతడి వురి తప్పించటం అసాధ్యం. మానవ ప్రయత్నం చెయ్యాలని చెయ్యటమే ఇదంతా. అటువంటప్పుడు, ఆఖరి నిముషం వరకూ అనవసరంగా చిరంజీవిని ఎందుకు ఆశతో బ్రతికించటం! అందుకే ఆమె తను అక్కడ వున్నట్టు చెప్పవద్దంది.

శర్మ తలూపి జైలు వైపు వడివడిగా కదిలాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

15 వ భాగం

"మీకు శవం ఎక్కడ దొరికిందో ఆ అడ్రసూ - దారాసింగ్ ఎక్కడ వుంటాడో అవీ చెప్పండి........... అర్జెంట్. మాటల సందర్భంలో ఇదంతా చెప్పాలి, రాజుకి అనుమానం రాకుండా.... - మీ శర్మ".

చిరంజీవికి అది అర్థం అవటానికి అరనిముషం పట్టింది.

తలెత్తి "ఇదంతా ఎందుకు?" అని అడగబోయాడు. కానీ శర్మ సైగ చేశాడు. చిరంజీవి తల వంచుకుని, ఉత్తరం వ్రాసే నెపం మీద వ్రాస్తూ సంభాషణ కొనసాగించాడు.

"ఆ కోట పక్కన సత్రంలో దారాసింగ్ కనబడకపోయినా బావుండేది -"

"దారాసింగ్ పేరు గమ్మత్తుగా వుందే" అన్నాడు శర్మ.

"అసలు పేరు భీమేశ్వర్" అన్నాడు చిరంజీవి ఇంకా గుర్తులూనూ, అవీ వ్రాస్తున్నట్లు నటిస్తూ! నిజానికి అతడు వ్రాస్తున్నది, సుశీల శవం దొరికిన ఇంటి అడ్రసూ గుర్తులూనూ, అవి వ్రాస్తూ అన్నాడు "ఆ పక్కింటి ముసలమ్మే ఇంటి యజమానురాలు. శవం దగ్గర కూర్చొని వుంది. బహుశా సుశీల అద్దె ఎగ్గొట్టి చచ్చిపోయి వుంటుంది."

వచ్చిన పని అయిపోయినట్టు శర్మ ఆ కాగితం తీసుకుని, "వెళ్ళొస్తాను" అంటూ లేచాడు.

చిరంజీవికి అప్పటివరకూ వున్న హుషారు పోయింది. మళ్ళీ ఒంటరితనం ఆవరించింది. శర్మని చూడగానే అతడెందుకో ఒక క్షణం రిలీఫ్‌గా ఫీలయ్యాడు. అతడు మానసికంగా మరణం కోసం ఎప్పుడో సిద్ధపడ్డాడు. ఈ లోపులో ఈ రాజు శాడిజాన్ని మాత్రం భరించలేక పోతున్నాడు. దీనికన్నా ఉరికంబం ఎక్కడమే సుఖమని అనిపిస్తోంది.

"శర్మా"

వెళ్ళబోతున్న విష్ణుశర్మ ఆగాడు. చిరంజీవి ఊచల మధ్యనుంచి చేయిజాచి "అర్చనకంతా చెప్పావా?" అన్నాడు.

శర్మ కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి, వాటిని దాచుకుంటూ "చెప్పాను బాబూ. మీ నిర్దోషిత్వాన్ని మేం మందరం మనస్ఫూర్తిగా నమ్ముతున్నాం" అంటూ ఆ చేతిని స్పృశించాడు.

ఈ లోపులో రాజు కదిలి - "ఇక వెళ్ళు" అన్నాడు. శర్మ భారంగా కదిలి అక్కణ్ణుంచి బయటకొస్తూ వుంటే వరండా చివర్న మూడు ఆకారాలు కనబడ్డాయి. అతడు ఉలిక్కిపడి ఆగిపోయాడు.

మేజిస్ట్రేటు, జైలరు, జైలు డాక్టరూ వస్తున్నారు.

వీళ్ళు అప్పుడే ఎందుకు వస్తున్నారు? అన్న అనుమానంతో అతడు అటే చూస్తూ నిలబడిపోయాడు. అతడి అనుమానం నివృత్తి చేసేటందుకా అన్నట్టూ గడియారం నాలుగు సార్లు కొట్టింది. శర్మ వళ్ళు ఒక్కసారిగా జలదరించింది. అప్పుడే

నాలుగైందా? అవును..... తాము హడావుడిలో టైమ్ చూసుకోలేదు నాలుగైంది. ఇంకేముంది........ టైమ్ అయిపోయింది. ఇంక ఏ శక్తీ యితడిని రక్షించలేదు............ అప్పుడే డాక్టర్ వచ్చేశాడు............ స్టేట్‌మెంట్ తీసుకుంటున్నాడు.

అతడు, కాళ్ళు నేలకంటుకు పోయినట్టు అలాగే నిలబడి అక్కడి దృశ్యాన్ని చూడసాగాడు. తలుపులు తాళం తీసి లోపలికి ప్రవేశిస్తున్నారు. వాళ్ళు దూరంగా ఎవరో చీపురు కట్టతో ఊడుస్తున్న ధ్వని. మేజిస్ట్రేట్ చిరంజీవితో మాట్లాడుతున్నాడు. జైల్లో ప్రపంచం నెమ్మది నెమ్మదిగా నిద్ర లేస్తోంది.

శర్మ అలాగే నిలబడి చిరంజీవిని చూశాడు. క్రితంరోజువరకూ హాయిగా నవ్వుతూ జోకులేసిన చిరంజీవి ప్రొద్దున్నకల్లా వుండడు! ఇదే తను ఆఖరిసారి అతడిని చూడటం .....

ఈ ఈ భావమే ఏడుపు తెప్పిస్తూంది. ఒక్క సారి అతడు కదిలాడు, ఇక ఆ పరిసరాల్లో వుండలేనట్టు పిచ్చివాడిలా అక్కణ్నుంచి బయటకు పరుగెత్తాడు.

జైలుకి కొద్ది దూరంలో కారులో కూర్చొనివున్న అర్చనక్కూడా జైలు గంటలు వినిపించాయి. నాలుగైపోయిందని తెలుసుకుని ఆమె స్థబ్దంగా కూర్చుండిపోయింది. మహా అయితే ఇంకో గంటా రెండు గంటలు.... తరువాత ఈ నిజం బయట పడినా లాభం ఏముంది? ఒక నిర్దోషిని ఉరి తీసినందుకు పత్రికలు ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తాయి. అంతే!

దూరంనుంచి శర్మ పరుగెత్తుకు రావటం కనిపించింది. ఆమె ఒక్కసారి తల విదిలించి మామూలు మనిషి అయిపోయింది. ఎంతో విపత్కర సమయాల్లో అతి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు ఎలా వుంటుందో అలా బ్యాలెన్స్‌డ్‌గా మారిపోయింది.

అతడు వచ్చి ఎక్కేలోపులోనే కారు స్టార్టు చేసి వుంచి, అతడు ఎక్కి ఇంకా డోర్ వెయ్యకముందే పోనిస్తూ, 'ఎటు' అంది. అతడు కాగితం చూస్తూ అడ్రసు చెప్పబోయాడు. ఆమె విసుగ్గా "ముందుకా వెనక్కా - ముందు అది చెప్పు" అంది.

"ముందుకే" అన్నాడు శర్మ. ఆమె రోడ్డుమీదకు దృష్టి సారించి, ఆక్సిలేటర్‌ని బలంగా నొక్కింది. కారు స్పీడోమీటరు నలభైమీదనుంచి ఎనభై మీదకి మారింది. "ఊఁ ఇప్పుడు తొందర తొందరగా చెప్పు" అంది.

శర్మ క్లుప్తంగా శవం దొరికిన స్థలం గురించీ, దారాసింగ్ వుండే ప్రదేశం గురించీ చెప్పాడు. ఆమె కారుని యిరుకు సందుల్లోకి తిప్పి అక్కడ కూడా ఏమాత్రం వేగం తగ్గనివ్వకుండా పోనిస్తూ "ఆ ముసలమ్మ యింటిదగ్గర నువ్వు వాకబు చెయ్యి, సత్రం దగ్గరికి నేను వెళ్తాను. ఆ సుశీల మరణం మామూలుదే అనీ, తనే శవాన్ని యిచ్చాను అని గానీ ఆ ముసలమ్మ చెబితే మేజిస్ట్రేటు ఉరిని ఒకరోజుపాటు అయినా ఆపుచేస్తాడని నేను అనుకుంటున్నాను. ఈ లోపులో అంకుల్ ఎక్కడున్నదీ తెలుస్తుంది" అంది.

"ఇద్దరం సత్రం దగ్గరికి వెళ్దాం. ఇంత రాత్రప్పుడు ఒక్కరూ వెళ్ళటం ప్రమాదకరం" అన్నాడు శర్మ.

అర్చన తల తిప్పకుండానే "ప్రతిచోటకీ ఇద్దరమూ కలిసి వెళ్ళటం కుదరదు. టైమ్ సరిపోదు. ఏ చిన్న సాక్ష్య మైనా సంపాదించాలీ అంటే ఇద్దరం చెరో చోటుకి విడిపోవాలి తప్పదు" అంది.

శర్మ తటపటాయిస్తూ ఏదో అనబోయి మళ్ళీ వూరుకున్నాడు.

“ముసలమ్మని నీ ప్రశ్నలతో ఒక్కసారిగా బెదరగొట్టెయ్యకు. అందులోనూ మంచి నిద్రలో వుంటుందేమో - లేపి వెంటనే శవం గురించి ప్రశ్నిస్తే కంగారు పడుతుంది - ఏ పోలీసులో అనుకుని అసలు జవాబు చెప్పదు. జాగ్రత్తగా హాండిల్ చెయ్యి.”

శర్మ ఆమె ముందు చూపుకి ఆశ్చర్యపోయాడు.

“ఇద్దరం కలిసి వెళ్ళడానికి వీలుకానీ పక్షంలో ......” నసిగాడు శర్మ “నేను సత్రానికి వెళ్తాను. ఆ ముసలమ్మతో మీరు మాట్లాడితే బావుంటుంది.”

“సత్రం ముందొస్తుందా - ముసలమ్మ ఇల్లా?”

“ముసలమ్మ ఇల్లు దాటి ముందుకో అయిదు ఫర్లాంగులు వెళ్తే - ఆ ఊరు చివర ... సత్రం.”

“నీకు డ్రైవింగ్ వచ్చా...?”

“రాదు.”

“మరి నిన్ను సత్రం దగ్గర దింపి, నన్ను మళ్ళీ వెనక్కి రమ్మంటావా.... లేక నువ్వు అతడితో మాట్లాడేవరకూ నన్ను అక్కడే ఆగమంటావా?” అని తాపీగా అడిగింది. శర్మ దెబ్బతిన్నాడు.

“శర్మా - టైమ్ సంగతి నువ్వు మర్చిపోతున్నావ్” అంటూ సర్రున పక్కకి కారుని కోసింది. రెండు మురికి కాలవల మధ్యనుంచి పోతూంది కారు. ఏ మాత్రం కొద్దిగా పక్కకి వెళ్ళినా ఏ ఇంటి మెట్లో ఎక్కేలా వుంది.

దూరంగా చిరంజీవి చెప్పిన దీపపు స్థంభం, ముందుకు వంగిన పెంకుటిల్లూ కనబడుతున్నాయి.

విషయంలోకి వస్తూ ఆమె అంది - “ఆ ముసలమ్మ ఎలాటిదో గమనించు. ఉన్న విషయాలు వున్నట్టు చెబితే మంచిదే. లేకపోతే ఎంత డబ్బయినాసరే - అయిదొందలు వెయ్యి - రెండు వేలు - ఎంతైనా సరే యిస్తానను, నేను అతడిని నాతో పాటు తీసుకొచ్చేసరికి నువ్వు ఈమెతో రెడీగా వుండాలి. ఈ రెండు సాక్ష్యాల్తో అధికారుల్ని కొద్దిగా ఆపేలా చెయ్యొచ్చననుకుంటా” అంటూ కారు ఆపింది.

“మీరొక్కరూ సత్రానికి.....”

“శర్మా .... ప్లీజ్” ఆమె కంఠం అసహనంతో వణికింది. మరి మాట్లాడకుండా అతడు

చప్పున కారు దిగాడు.

ఆమె కారు పోనిస్తూ - “ నాలుగుగంటలా అయిదు నిమిషాలయింది. నాలుగుంపావుకల్లా అంతా అయిపోవాలి” అంటూ సాగిపోయింది.

టైమ్ వింటూ అతడు విభ్రాంతుడయ్యాడు. “నాలుగూ అయిదా.... అంటే - రెండు నిమిషాల్లో మూడు మైళ్ళు వచ్చామా?” అనుకున్నాడు. నమ్మశక్యం కాలేదు. తను ఏక సంథాగ్రాహినని అతడికి గర్వం వుండేది.

కాని అతడు చెప్పినదంతా జ్ఞాపకం వుంచుకుని మళ్ళీ తిరిగి అడక్కుండా చిరంజీవి వ్రాసిన ప్లానుని మసక చీకట్లో వొక్కసారి చూసి ఈ లోపులోనే ఏది దగ్గర, ఏది దూరం అని ఆలోచించుకుంటూ ఎవరు ఎక్కడికి వెళ్ళాలి అని నిర్ణయం చేసుకుంటూ ఈ యిరుకు సందుల్లోంచి యింత దూరం అంత తక్కువ సమయంలో తీసుకొచ్చిందే అంటే!

ఈ అద్భుతమైన అమ్మాయి కోసమైనా చిరంజీవి బ్రతుకుతే బావుణ్ణు అనుకున్నాడు మనస్ఫూర్తిగా శర్మ.

ఈలోపులో అర్చన కారు సత్రం ముందు ఆగింది. పాడుబడిన సత్రం అది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగివున్నాయి. ఒకవైపు పూర్తిగా కూలిపోయివుంది. ఎత్తైన గట్టుమీద వుంది అది. పైకి వెళ్ళే మెట్లుకూడా శిథిలమై వున్నాయి.

కీచురాళ్ళ శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది. రాత్రి కురిసిన వర్షానికి నేలంతా చిత్తడిగా వుంది. చల్లటి గాలి రివ్వున వీస్తోంది. చీకట్లో ఆ సత్రం శత్రు సైనికులు పొంచివున్న చీకటి గుహలా వుంది.

కారు ఆగీ ఆగగానే ఆమె ఒక్క గెంతులో దిగింది. క్షణం సేపు సత్రాన్ని పరికించి చూసి, మరి ఆలస్యం చెయ్యకుండా, కుచ్చిళ్ళు ఎత్తి పట్టుకుని జాగ్రత్తగా - అయినా వడివడిగా మెట్లు ఎక్కింది. తడిసిన గాలిలో కలిసిన గబ్బిలాల వాసన గుప్పున ముక్కుపుటాలని సోకింది. ఆమె దాన్ని పట్టించుకోకుండా లోపలికి వెళ్ళింది. మిగతా చోట్లకన్నా కొంచెం శుభ్రంగా వున్న ప్రదేశంలో ఒక మూల నిద్రపోతున్నాడు అతడు. పక్కనే సీసా దొర్లుతోంది.

ఆమె చూసుకోకుండా ముందు కెళ్ళడంతో సగం తినేసి వదిలేసిన అన్నం పాత్ర కాలికి తగిలి బంతిలా ముందు కెళ్ళింది. ఆ శబ్దానికి అతడు కళ్ళు విప్పాడు.

ఎదురుగా కనబడిన అమ్మాయిని చూసి క్షణం పాటు విస్తుబోయేడు. ఈ లోపులో అర్చన అతడు నిద్ర లేవటం గమనించి "నా పేరు అర్చన. చాలా అర్జెంటు పనిమీద వచ్చాను. కొన్ని నెలల క్రితం చిరంజీవికి ఒక శవం చూపెట్టటం జరిగింది, జ్ఞాపకం వుందా? ఆ విషయం గురించి.." అంటూంది.

అతడు ఆమె మాటలు వినటంలేదు. కళ్ళువిప్పగానే కనబడిన అమ్మాయినే చూస్తున్నాడు. చీరెకీ, జాకెట్టుకీ మధ్య ఆమె పచ్చటి శరీరం మీద వెన్నెల మెరుస్తూంది. జఘనం దగ్గర నలిగిన చీర కూడా అదోలాంటి శోభనిస్తూంది.

అతడు లేస్తూ "ఎవరూ - చిరంజీవా?" అన్నాడు.

ఆమె ఆశగా అడుగు ముందుకేసి ఆత్రంగా "ఆ - చిరంజీవే, కొద్ది సేపట్లో అతడిని ఉరితీయబోతున్నారు. రక్షించగలిగేది నువ్వే" అంటూ ముందుకొచ్చింది.

అతడు కొద్దిగా పక్కకి జరగటంతో గుమ్మం ఆటోమాటిక్‌గా కవర్ అయింది. "ఇంత తెల్లవారు ఝామున ఆ ఉరుల సంగతీ - శవాల సంగతీ మన కెందుకులే సిన్నమ్మా" అంటూ నవ్వాడు.

అతడు కళ్ళలో భావాన్ని పసిగట్టి ఆమె చప్పున అడుగు వెనక్కి వేసింది. కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది.

అర్చన పక్కకి రావటంతో గుమ్మంలోంచి ఆమె బయటకు పరుగెత్తకుండా జాగ్రత్త పడుతూ అతడు రెండడుగులు ముందుకేశాడు. ఆమె అతడికి, చెయిజాస్తే అందే దూరంలోకి వచ్చింది. తనెంత తప్పు చేసిందో ఆమెకర్థం అయింది. చుట్టూ చూసింది. బయటకెళ్ళటానికి దారి ఎటు వైపూ లేదు. ఒక వైపు చిన్న కిటికీ లాంటిది వుందిగానీ, దాని కవతలివైపు

వత్తుగా పెరిగిన జిల్లేడు మొక్కలూ, బ్రహ్మజెముడూ కనిపిస్తున్నాయి.

ఏం చెయ్యాలోతోచక, ఏమయితే అదయిందని - చప్పున గుమ్మం వైపు పరుగెత్తింది. అతడు చెయ్యి జాచి ఆమెని పట్టుకుని - ఆ విసురుకి ఆమెతో పాటు గుమ్మం దగ్గరకొచ్చాడు. అతడి బలమైన హస్తాల మధ్య ఆమె నలిగిపోతోంది. నిస్సహాయంగా గింజుకుంటూ సహాయం కోసం అరవబోయింది. అది వూరి చివర అనీ, ఎవరూ రారనీ ఆమెకి తెలుసు. ఆమెకి దు:ఖం రాలేదు. కసీ, ఉక్రోషంతో తనని పట్టుకున్న చేతుల్ని గీరబోయింది కానీ అతడి బలం ముందు నిలవలేకపోతోంది. ఈ లోపులో అతడు ఒక చేతిని ఆమె మెడ వెనగ్గా వేసి, ఆమె మొహాన్ని దగ్గరికి లాక్కుని తల ముందుకు వంచాడు.

అప్పుడు పడింది అతడి తల మీద దెబ్బ! మొదట అతడి కళ్ళముందు వెయ్యి మెరుపులు ఒక్కసారి మెరిసినట్టయింది. ఆ తర్వాత చీకటి కమ్ముకుంది. "అమ్మా" అని కూడా అరవకుండా తల పట్టుకుని కూలిపోయాడు.

అర్చనకి మొదట ఓ క్షణం ఏమీ అర్ధంకాలేదు. తనని పట్టుకున్న చేతులు సడలిపోవటంతో తలెత్తి చూసింది. ఏనుగులాంటి అతడి ఆకారం ఆమె ముందునుంచి నెమ్మదిగా నేలమీదకు జారిపోయింది. దాని వెనుక నుంచి శర్మ వస్తూ కనిపించాడు.

ఆమెలో ఆశ్చర్యం, ఆనందం ఒకేసారి చోటు చేసుకున్నాయి. నుదుటిమీద పట్టిన చెమట తుడుచుకుంటూ "పదండి - పోదాం" అన్నాడు శర్మ.

"నువ్వు.... నువ్వు యిక్కడికెలా వచ్చావ్?" అని అడిగింది అర్చన.

"పరుగెత్తుకుంటూ ... ఈ రాత్రంతా నా పని పరుగెత్తటమే."

"ఇంతకూ అక్కడ విషయం ఏమైంది? ముందా సంగతి చెప్పు. ముసలమ్మ కనబడిందా" అంటూ ఆత్రంగా అడిగింది.

శర్మ విస్మయంగా ఆమె వైపు చూశాడు. తనెంత పెద్ద ప్రమాదం నుంచి బయటపడిందో ఆలోచించకుండా - అక్కడ చిరంజీవి గురించి ఆలోచిస్తోంది.

"ఏం మాట్లాడవేం?" అన్న ప్రశ్నకు తెప్పరిల్లి అతను అన్నాడు- " నేను ముసలమ్మ ఇంట్లోకి వెళ్ళలేదు అమ్మగారూ, మీ కారు వెనుకే పరుగెత్తుకొచ్చాను. నన్ను క్షమించండి. కానీ జైల్లో పనిచేస్తున్న వాణ్ణి కాబట్టి రౌడీలు, ఖూనీకోరులూ ఎలా ప్రవర్తిస్తారో తెలిసినవాణ్ణి. అర్ధరాత్రి ఒంటరిగా ఓ అమ్మాయి తామున్న చోటుకివస్తే, వాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో నకు తెలుసు. అందుకే దానికన్నా ఇది ముఖ్యంగా తోచి ఇలా వచ్చాను."

ఆమెకి ఏం మాట్లాడాలో అర్ధం కాలేదు. అతడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలో, అతడిని చివాట్లు పెట్టాలో తెలియలేదు.

అక్కణ్ణుంచి కదుల్తూ "పద, ఆలస్యం అయిపోతూంది" అంటూ

బయటికి అడుగు వేసింది. నేలమీద ఆకారం కొద్దిగా కదుల్తూ కనిపించింది, శర్మకూడా అక్కణ్ణుంచి బయటపడ్డాడు. మరునిమిషం కారు కదిలింది.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

చిరంజీవి సెల్ తాళం తెరవబడగానే మేజిస్ట్రేట్ అందులో ప్రవేశించాడు. అతడిని చూసి చిరంజీవి లేచి నిలబడబోయి, రాత్రంతా నిద్ర లేకపోవటం వల్ల తూలి, నిలదొక్కుకున్నాడు. అతడి కళ్ళు నిద్రలేమివల్ల ఎర్రగా వున్నాయి, అతడి గెడ్డం మాసివుంది.

మేజిస్ట్రేట్ చేతిలోని కాగితాలని పరిశీలనగా చూసి, అందులోని ఖైదీ పుట్టుమచ్చలూ్నీ గుర్తుల్నీ చిరంజీవితో పోల్చి చూసుకుని, నిర్ధారణపర్చుకున్నాడు. వాటిమీద సంతకం పెట్టి, ఫైలు మూసేస్తూ "నీ ఆఖరి కోర్కె ఏమైనా వుందా?" అని అడిగాడు.

చిరంజీవి ఏదో చెప్పబోతూవుంటే మళ్ళీ అతడే, "ఆఖరి కోర్కె ఏదంటే అదికాదు. కేవలం నీ విల్లు మార్చటం కానీ, నీ వాళ్ళకేదైనా వార్త పంపాలంటే అదిగానీ చేస్తాం. అలాంటిదేదైనా వుందా?" అని అడిగాడు. చిరంజీవి లేదన్నట్టూ తలూపాడు.

మేజిస్ట్రేట్ అక్కణ్ణుంచి తప్పుకున్నాక ధర్మారావు అతడి దగ్గరకొచ్చాడు. ఒక్క క్షణం ఆయన ఏమీ మాట్లాడలేదు. చిరంజీవి కూడా మౌనంగా వున్నాడు ఆ గాఢమైన నిశ్శబ్దంలో ఎంతో ఆర్ధ్రత వుంది. ఆ చీకట్లో అస్పష్టమైన భావాల ఘర్షణ వుంది. బైటకిటికీ ఊచల మధ్య నుంచి ఒక పిల్ల తెమ్మెర జాలిగా స్పృశిస్తూ వెళ్ళిపోయింది.

రాత్రంతా రాని తల్లి కోసం ఎక్కడో చెట్టుమీద పక్షిపిల్ల హృదయవిదారకంగా అరుస్తోంది. చిరంజీవి తలెత్తి ఆయనవైపే చుశాడు. ధర్మారావు నెమ్మదిగా చెయ్యెత్తి అతడి భుజంమీద వేశాడు. భుజాన్ని రెండుసార్లు తట్టి గిరుక్కున వెనుతిరిగి, మరి అక్కడ వుండలేనట్టూ వడివడిగా నడిచి వెళ్ళిపోయాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

16 వ భాగం

ఆయన అలా వెళ్ళిపోగానే గుమ్మం పక్కనుంచి రాజు బయటకు వస్తూ "పద పద నీళ్ళున్నాయి..... ఈరోజు వేణ్ణీళ్ళులే. స్పెషల్....... అంతేకాదు ప్రతిరోజులాగా అక్కడ రష్‌గా వుండదు. వాళ్ళంతా లేచే సమయానికి నువ్వెళ్ళిపోతావ్‌గా" అన్నాడు అదే శాడిస్టు నవ్వుతో.

చిరంజీవి మాట్లాడలేదు. అతడి మనసంతా అదోలాంటి స్థబ్దత ఆవరించి వుంది. ఏదో లోకంలో వున్నట్లు తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు. కొద్దిసేపట్లో, చాలా కొద్దిసేపట్లో, ఒక తాడు తన మెడకి బిగుసుకోబోతున్నదన్న ఆలోచనే నమ్మశక్యం కాకుండా వుంది. కానీ అదంతా మామూలుగా జరిగిపోతూంది - ఏదీ ఆగటం లేదు. ప్రాణం కూడా అలాగే పోతుంది.

నాలుగు గోడల మధ్య - నెమ్మదిగా నాలుగు చెంబుల నీళ్ళు పోసుకుని, స్నానం అయిందనిపించాడు. జైలు దుస్తులు కొత్తవి - తెల్లవి ఉరికి ముందు తొడగబడేవి - ఇవ్వబడ్డాయి. వాటిని ధరించాడు.

వేడినీటి తాలూకు ప్రభావం పోయి, కొద్దిగా చలి పెట్టసాగింది. చుట్టూ ఇద్దరు గార్డులు. అతడి కాళ్ళు తడబడ్డాయి. కానీ బహుశా, అది చలి వల్ల వచ్చింది అయి వుంటుంది. మెట్లెక్కి వరండా గుండా తన సెల్‌కి వచ్చాడు. అక్కడో యిద్దరు సెంట్రీలున్నారు. అందరూ వొక్కరొక్క రే చాలా నిశ్శబ్దంగా తమ పనులకి తయారవటం తెలుస్తోంది.

అతడు సెల్‌వైపుకి రాగానే, అక్కడివాళ్ళు కొద్దిగా దూరంగా వెళ్ళి నిలబడ్డారు.

దైవ ప్రార్థన చేసుకోవటం కోసం అతడికా ఏకాంతం కల్పించబడింది. మోకాళ్ళమీద వంగి కొద్దిసేపు, చాలా కొద్దిసేపు తన ఇష్టదైవాన్ని ప్రార్థించాడు. తరువాత కళ్ళు తెరిచాడు. అతడి చూపు కాగితాల మీద పడింది.

సర్వోత్తమరావు ఇచ్చిన కాగితాలు అవి. ఉరి రద్దుకోసం ఏర్పాటు చేసిన ఉపన్యాసం తాలూకు కాగితాలు. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే, ఎత్తయిన ఉపన్యాస వేదిక మీద చదవవలసినవి!

ప్రార్థన ముగియగానే అతను వాటిని చదవటం ప్రారంభించాడు. సర్వోత్తమరావు చేతివ్రాతతో వున్న వ్యాసం అది.

"ప్రతీ సహజమైన చావు వెనుకా భయం, కరుణ, బాధ వుంటాయి. రక్షించటానికి డాక్టర్లు ప్రయత్నం చేస్తూవుంటారు. బంధువులు ఆశతో ఆవేదనతో ఎదురుచూస్తూ వుంటారు. ఎన్నో కన్నీటిచుక్కలు రాలటానికి సిద్ధంగా ఉంటాయి. ముందు కోమా వస్తుంది. ఆ నిద్రలో మరణం నెమ్మదిగా వచ్చి, తనతోపాటూ హాయిగా తీసుకుపోతుంది. కానీ 'ఉరి' వెనుక భయం తప్ప ఇంకేమీ లేదు. ఆర్నెల్లముందే ప్రాణం ఎప్పుడు పోతూందో తెలుస్తుంది. అప్పట్నుంచీ క్షణం క్షణమూ దిగులే. స్థబ్దంగా, అమానుషంగా తోటి మనిషి ప్రాణం మెడద్వారా బయటకి లాగి వేయబడుతుంది.

హత్య చేసిన వ్యక్తికి మరణమే సరి అయిన శిక్ష అన్న భావం మనలోంచి పోవాలి. 1956లో రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయం అడిగినప్పుడు చాలా ప్రభుత్వాలు ఉరిని 'ఉంచమని' కోరటం దురదృష్టం. 1972లో ఏర్పాటయిన 'లా కమీషన్' కూడా

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఉరిఅమలు జరపవచ్చునన్నది. అయితే ఏ ఏ ప్రత్యేక సందర్భాల్లోనో వివరించలేదు. ఈ కమిటీ ఆడవాళ్ళని కూడా ఉరి తీయవచ్చని రికమెండు చేసింది.

ఉరిశిక్ష దేశంలో నేరాల్ని తగ్గిస్తుందని కానీ, ఉరి తీస్తారేమోనన్న భయంతో మనిషి హత్య చేయటం మానేస్తాడన్న వాదనగానీ నిలబడవు. భారతదేశంలో హత్యలు సెక్సు సమస్యల వల్లగానీ, గ్రామీణ ప్రాంతాల్లో భూమి, రాజకీయ తగాదాల వల్ల గానీ ఎక్కువగా జరుగుతాయి. వీటికి, ఉరిశిక్షకీ ఏ సంబంధమూ లేదు..

చాలామంది జడ్జీలు ఉరిశిక్షకు వ్యతిరేకులు. జస్టీస్ కారెగట్ తన జీవితంలో ఎవరికీ ఉరిశిక్ష విధించనని ప్రకటించాడు. ప్రభుత్వం అతడిని రాజీనామా చేయమని కోరగానే, మాటమీద నిలబడి ఉద్యోగం వదులుకున్నాడు. ఇలాంటి మానవతా వాదులు భారతదేశంలో యెక్కువమంది లేకపోవటం దురదృష్టకరం. జవహర్‌లాల్ నెహ్రూ తాను వ్యక్తిగతంగా ఉరికి వ్యతిరేకినని చెప్పేవారు. శ్రీమతి ఇందిరా గాంధీ కూడా యిదే అభిప్రాయం పలుమార్లు వెల్లడించారు.

మన న్యాయశాస్త్రం బ్రిటన్‌నుంచి అరువు తెచ్చుకోబడింది. చిత్రమేమిటంటే ప్రస్తుతం బ్రిటనే ఉరిని రద్దుచేసింది. మనం యింకా దాన్ని పట్టుకుని వేలాడుతున్నాం. పాకిస్తాన్‌లో నేరస్తుణ్ని ఇప్పటికీ బహిరంగంగా రాళ్ళతో కొట్టి చంపుతారట. ఒకప్పుడు కాళ్ళకి రాయికట్టి నీళ్ళలో పడవేసి చంపటం, గుర్రాల చేత తొక్కించి చంపటం అమలులో వుండేవట. ఇవన్నీ మనకెంత అనాగరికంగా కనబడ్తున్నాయో, మన 'ఉరి' మిగతా దేశ వాసులకు అంత అనాగరికంగా కనబడ్తుంది. ఒక వందేళ్ళు పోయాక మన భావితరం వాళ్ళు మన గురించి కూడా 'వాళ్ళు ఉరి తీసి మనుష్యుల్ని చంపేవారట' అని చిత్రంగా చెప్పుకుంటారు.

ఎటువంటి నేరస్తుల్ని ఉరికంబానికి పంపాలో మన న్యాయశాస్త్రం సరిగ్గా చెప్పలేదు. ఎటువంటి పరిస్థితుల్లో ఉరిశిక్ష విధించాలో మన జడ్జీలకు తెలీదు. ఒక నిర్దోషికి వేసిన 'ఉరి' అది అమలు జరిగిన తర్వాత అతడి నిర్దోషిత్వం బయటపడితే, వెనక్కి తీసుకోలేని దారుణమైన శిక్ష. తిమోతీ ఇవాన్స్ అనే నేరస్తుణ్ణి ఉరి తీసిన ఎనిమిది సంవత్సరాలకి అతడి నిర్దోషిత్వం బయటపడింది.

దేశంలో మరణశిక్షని పూర్తిగా రద్దు చేయాలి. దారుణంగా హత్య చేసిన వ్యక్తిని అంతకన్నా దారుణంగా చిత్రహింస పెట్టండి!! మరణించే వరకూ జైల్లో బంధించండి! అంతేకానీ మరణశిక్ష విధించకండి!!

ఉరి అమానుషమైనది! ఉరి కౄరమైనది! మనిషి బ్రతికే హక్కుని సాటిమనిషి తీసెయ్యలేడు!! ఉరి రద్దు చెయ్యండి! సెక్షన్ 302 మార్చండి!! అదే మా 'అభిలాష!!'

చదవటం పూర్తి చేశాడు చిరంజీవి. ఎందుకో తెలియదుకానీ, అతడి కళ్ళనిండా నీళ్ళు

నిలిచాయి. అది దు:ఖం కాదు. వేదన కాదు. వేదాంతం, నిరాశ, నిస్పృహ యిలాంటివేవీ కావు కూడా, తండ్రి మరణం, ఎనిమిదేళ్ళ వయసుకో తల్లిపోవటం, తండ్రి ఉరికంబం ఎక్కినప్పుడు తను మనసులోనే అనుకున్న ప్రతిజ్ఞ.

వారాలు చేసుకుంటూ ఎల్లెల్బీ చదవటం అంతా జ్ఞాపకం వచ్చింది. ఏదో అద్భుతం జరిగి తన ప్రతిజ్ఞ నెరవేరుతుందనుకున్నాడు. కానీ అంతా తారుమారయింది. తను పోయాకైనా అర్చనకి నిజం తెలిసి ఈ పోరాటం కొనసాగిస్తుందా? ఏమో.......... యెందుకు సాగించాలి?

తన కాగితాలవైపు చూసుకున్నాడు. జైలు గోడలనుంచి బైటకు పొడుచుకొచ్చిన రాయిమీద బొటనవేలు గట్టిగా అదిమాడు. చర్మం చిట్లి రక్తం స్రవించటం ప్రారంభం కాగానే, దాంతో ఆ కాగితాల మీద ముద్ర వేశాడు.

అదే అతడి నిజమైన ప్రార్ధన!

అది ముగించి బయటకొచ్చాడు. వరండా చివర ధర్మారావు చీకట్లోకి నిలబడి చూస్తూ వున్నాడు.

" సూపరెంటెండెంటుగారూ" పిలిచాడు. ధర్మారావు తలతిప్పి చూసి, దగ్గరకొచ్చాడు. "ఈ కాగితాలు......... ఈ కాగితాలు అర్చన గారికి అందజేస్తారా? ప్లీజ్."

ధర్మారావు మాట్లాడకుండా అతడివద్దనుంచి ఆ కాగితాలు తీసుకున్నాడు. మరణశిక్ష విధించబడిన ఖైదీ సాలిటరీ సెల్‌లోకి ఆ కాగితాలు ఎలా వచ్చాయియీ అన్న ప్రశ్న కూడా వేయలేదు.అతడు కాగితాలు తీసుకుంటూ వుండగా లయబద్ధంగా అడుగుల చప్పుడు వినిపించింది.

పోలీస్ గార్డ్ వస్తోంది.

పదిమంది పోలీసులూ, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్సూ రెండు వరుసల్లో వస్తున్నారు...... చిరంజీవి ఉరికంబం దగ్గరికి తీసుకెళ్ళే సమయం ఆసన్న మైంది.

తూర్పునుంచి మొట్టమొదటి వెలుగురేఖ కొద్దిగా పొడచూపింది. రాత్రంతా రాని తల్లికోసం పక్షిపిల్ల ఇక అరవటం మానేసి, నిస్త్రాణంగా పడుకొన్నట్టుంది.

5

ఆ ఇరుకు సందులోకి వచ్చి, అర్చన కారు ఎంత వేగంగా ఆగిందంటే పక్కనే కూర్చున్న శర్మ నుదురు ఎదుటి అద్దానికి కొట్టుకోబోయి కొద్దిలో తప్పింది. అర్చన ఇదంతా పట్టించుకోకుండా ఆగీ ఆగగానే ఒక్క ఉదుటున కారులోంచి దిగి లోపలికి పరుగెత్తింది.

కూలిపోవటానికి సిద్ధంగా వున్న పైకప్పు, విరిగిన మెట్లు - మెట్ల ముందు దుర్భరమైన వాసనతో మురిక్కాలువ......ఆమె కర్చీఫ్ అడ్డు పెట్టుకుని లోపలికి వెళ్ళింది. అదృష్టవశాత్తు తలుపులు గడియవేసి లేవు. ఆమె తోయగానే కిర్రుమన్న చప్పుడుతో తెరుచుకున్నాయి. లోపల ఒకే గది, దుమ్ముపట్టి వుంది. ఒక పక్క చిన్న కిరోసిన్ దీపం వుంది. ఆ వెలుగులో ఒక మూల ఒకామె పడుకుని ఉండటం గమనించింది.

ఆ ముసలమ్మే - సుశీల శవాన్ని చిరంజీవికి అమ్మింది!

అర్చన కెందుకో ఆమే అనిపించింది. క్షణం సేపు అలాగే నిద్రపోతున్న ఆ ముసలమ్మ వైపు తదేకంగా చూసింది. ఇంతలో వెనుక అలికిడి వినిపించింది. శర్మ వచ్చి మౌనంగా నిలబడ్డాడు. అర్చన తలుపు తట్టింది. మగతనిద్రలో వున్న ముసలమ్మ కళ్ళు విప్పి, అపరిచితుల్ని చూసి చప్పున లేచి కూర్చుంటూ "ఎవరదీ?" అంది భయంగా.

అర్చన మరి ఆలస్యం చెయ్యలేదు. లోపలికి అడుగు లేస్తూ "నీతో కొంచెం పని వుండి వచ్చాం" అంది. ముసలమ్మ

మాట్లాడలేదు కానీ, ఆ కళ్ళల్లో బెదురు కనిపించింది.

అర్చన మోకాళ్ళమీద కూర్చొని, "సుశీల వుండేది ఈ గదిలోనే కదూ" అంది. ముసలమ్మ మరింత బెదిరి "మళ్ళీ మీరెవరు? పోలీసులా" అంది శర్మ దుస్తులవైపు చూస్తూ. అప్పటికే అంతకుముందు పోలీసులు ఒకటి రెండు సార్లు వచ్చి ఎంక్వయిరీ చేస్తే తనకేం తెలీదు అని చెప్పింది.

"ఊహూ, కాదు" అంది అర్చన. "కానీ ముందిది చెప్పు సుశీల వుండేది ఈ గదిలోనేనా?"

ముసలమ్మ తలూపింది.

"ఎలా చచ్చిపోయింది ఆమె."

ముసలమ్మ మాట్లాడలేదు.

"రాత్రి చచ్చిపోతే అర్ధరాత్రి ఒకతను వచ్చి శవాన్ని తీసుకువెళ్ళాడు కదూ"

దీనికూడా ముసలమ్మ మాట్లాడలేదు. కానీ ఆమె చేతి వేళ్ళు కొద్దిగా వణకటం గమనించింది అర్చన. ఆమె అమితంగా భయపడ్తూందని గుర్తించి, అనునయిస్తున్నట్టు "చూడు అవ్వా, ఇందులో నువ్వు భయపడవలసిందేమీ లేదు. మేము పోలీసులం కాదు. ఆరోజు జరిగింది ఏమిటో ఉన్నదున్నట్లు చెప్పు. మామూలుగా చచ్చిపోయిన ఆ సుశీల - అలా చావలేదనీ, చిరంజీవి అనే అతడు చంపాడనీ కేసు పెట్టారు. అతడిని ఉరి తీస్తున్నారీ రోజు. ఉన్న విషయం చెప్పావంటే ఒక మనిషిని రక్షించినదానివవుతావు. చెప్పు...... ఆ సుశీల ముందురాత్రే మరణించింది కదూ! అంతకుముందు ఒకటి - రెండు రోజుల్నించీ అనారోగ్యంగా వుంది కదూ."

"నాకు తెల్వదు."

అర్చన హతాశురాలైంది. నిర్లిప్తంగా వున్న ఆ ముసలమ్మ మొహం చూస్తుంటే అర్చనకి కోపమూ, ఉక్రోషమూ కట్టలు తెంచుకొనేలా వున్నాయి. అతి కష్టంమీద వాటిని అణుచుకుని,

మరోసారి అనునయిస్తున్నట్టూ "నీకేం భయంలేదు అవ్వా. అంతా మేం చూసుకుంటాం. నువ్వు చెయ్యవలసిందల్లా, ఉన్నదున్నట్టూ చెప్పతమే. అందువల్ల ఒక నిండు ప్రాణం రక్షించబడుతుంది" అంది.

ముసలమ్మ మాట్లాడలేదు.

శర్మ అడుగు ముందుకేసి, "నిజం చెప్తావా? స్టేషన్‌కి తీసుకెళ్ళమంటావా?" అని గద్దించాడు. అతడిలో అసహనం ఎక్కువ అవుతూంది. ఇంకొద్ది సేపయితే ఎవరు చేసేదీ ఏమీ లేదని తెలుస్తూంది. అతడలా బెదిరించగానే ముసలమ్మ మరింత వణికింది. శత్రువుని చూడగానే

లోపలికి ముడుచుకుపోయే నత్తలా మరింత కుదించుకు పోయింది.

అర్చన చేత్తో అతడిని వారించి, ముసలమ్మ వైపు తిరిగి, "నువ్వీ నిజం చెప్తే ప్రభుత్వం నీకు అయిదొందలిస్తుంది అవ్వా" అంది.

ఆ మాటలు ఆమె మీద వెంటనే ప్రభావం చూపించినట్టూ, ఆమె తలెత్తి చూసింది. అర్చన ఆ అవకాశం విడవకుండా "ఔనవ్వా, ఏం జరిగిందో చెప్పు. నీకు డబ్బు ఇప్పించే పూచీ నాది" అంది అభయమిస్తున్నట్టూ.

"సుశీల సానా మంచి పిల్ల ......." ముసలమ్మ మాట్లాడటం ప్రారంభించింది. శ్రోతలిద్దరూ ఊపిరి బిగపట్టి వినసాగారు "ఈ గదిలోనే ఒంటరిగా వుండేది. ఏదో స్కూల్లో టీచరట. ఒకరోజు...... ఒకరోజు...."

"ఒకరోజు.... ఏమైంది ఒకరోజు......"

"నాకు తెల్వదు. ఓబులేసు నడగండి."

అర్చనా, శర్మా మొహమొహాలు చూసుకున్నారు. ఓబులేసు! అవును. ఇందులో అతడు కూడా వున్నాడు. దారాసింగ్‌కి శవం సంగతి చెప్పిందతడే.

"ఎక్కడుంటాడు ఆ ఓబులేసు?" అడిగింది అర్చన.

"ఈ వీధిలోనే...... మసీదు లేదూ, దానెదురు అరుగు మీద పండుకుంటాడు."

అర్చన చురుగ్గా ఆలోచించింది. దగ్గర్లోనే వున్న ఆ ఓబులేసుని కూడా పట్టుకుంటే పని మరింత సులభతరమవుతుంది. అతడిని చూసి, ఈ ముసలమ్మకూ్కడా నిజం చెప్పటానికి ధైర్యం వస్తుంది. ఓబులేసుని కన్విన్స్ చేయటం కూడా పెద్ద కష్టం కాకపోవచ్చు, అందులోనూ డబ్బుతో.

ఒకవేళ ఓబులేసు దొరక్కపోతే.... అప్పుడు ఈ ముసలమ్మతోనే ప్రయత్నం చెయ్యొచ్చు. ముందు అతడిని పట్టుకోవటం మంచిది కదా.

క్షణంలో ఇదంతా ఆలోచంచి ఆమె జువ్వలా లేచింది. బైటకొచ్చి మెట్లు దిగుతూంటే, వీధికి కుడివైపు చివర మసీదు కనబడింది. వీధి ఇంకా నిద్ర లేవలేదు. కారు వదిలేసి నడకనే ఆమె మసీదు చేరుకుంది. పరుగులాంటి నడక, వెనుకే శర్మ వచ్చాడు.

మసీదు ఎదురు అరుగుమీద ఇద్దరు, ముగ్గురు బిచ్చగాళ్ళలా వున్న వాళ్ళు పడుకుని వున్నారు. ఓబులేసు గురించి వాకబు చేయగానే - ముందు అర్చనని చూసి ఏదో అనబోయారు కానీ, కాకీ బట్టల్లో వున్న శర్మని చూడగానే వెనక్కి తగ్గారు.

"ఓబులేసా - అవును. ఈడే పడుకుంటాడు రోజూ."

"ఏడీ? ఎక్కడున్నాడు?

"ఏమో! రాత్రి రాలేదు."

"అంటే ఒక్కోరోజు రాడా?"

"బాగా పైసలున్న జేబు దొరికిందంటే అర్ధరాత్రి వరకూ కల్లు కాంపౌండులోనే తాగి ఆడే తొంగుంటాడు."

ఈ జేబులు కొట్టేవాళ్ళు - తాగుడు వాళ్ళూ - చిరంజీవికి ఎక్కడ దొరికారో ఆమెకి అర్థం కాలేదు. అయినా దాని గురించి ఆలోచించలేదు. ఇక టైం లేదు. ఆ ముసలమ్మనే తమతో తీసుకెళ్ళి వీలైనంత ప్రయత్నం చేయాలి. ఆమె శర్మ వైపు చూసింది. శర్మ కూడా వెళ్దామన్నట్టు తలూపాడు.

ఇద్దరూ తిరిగి ముసలమ్మ ఇంటికొచ్చారు. అర్చన కారు దగ్గరే నిలబడి, అతడిని వెళ్ళి ఆమెని తీసుకురమ్మంది.శర్మ తలుపు తెరిచి లోపలకు వెళ్ళబోయి, షాక్ తిన్నట్టు ఆగి పోయాడు.

లోపల ముసలమ్మ లేదు. ఆమె పడుకున్న చాప కూడా లేదు. తెల్లవారు ఝామున యిద్దరొచ్చి తనని నిద్రలేపి ప్రశ్న లడగటంతో బెదిరిపోయి అక్కణ్ణుంచి పారిపోయిందన్న విషయం తెలుస్తూనేవుంది. ఇక యిప్పట్లో కనబడదు. ఆ యిరుకు యిళ్ళల్లో యెక్కడో మాయమై పోయింది. కేవలం ఆవిడ భయం, అమాయకత్వం, ఒక నిండు ప్రాణాన్ని బలికోరుతున్నాయి.

శర్మ స్థాణువవటం చూసి అక్కడికి వచ్చిన అర్చన కూడా విషయం గ్రహించింది. అప్పటివరకూ లేని నిస్సత్తువ ఆమెని ఒక్కసారిగా ఆవరించింది. ప్రపంచంలో ఇక ఏ శక్తీ చిరంజీవిని రక్షించలేదన్నది ఆమెకి అర్థమైంది. ఆ గుమ్మం పట్టుకుని, నేలమీద జారిపోకుండా నిలదొక్కుకుంది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

17 వ భాగం

ఆ శూన్యమైన గది వంకే చూస్తూ ఇద్దరూ కొద్దిసేపు నిలబడ్డారు.

ముందు కదిలింది అర్చనే! భారంగా అడుగులు వేసుకుంటూ వచ్చి కారులో కూర్చుంది. శర్మకూడా వచ్చాడు. కారు కదిలింది. అయితే ఈసారి అది వేగంగా నడవటంలేదు. లోపల కూర్చున్న వాళ్ళుకూడా తమతమ ఆలోచన్లలో వున్నారు. చిరంజీవితో తమ పరిచయాన్ని నెమరువేసుకుంటున్నారు.

మెయిన్‌రోడ్డుకి వచ్చాక శర్మ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "నేనిక్కడ దిగి పోతానమ్మగారూ" అన్నాడు. అతడలా ఎందుకన్నాడో అతనికే తెలీదు. కానీ అతడు వెళ్ళటం ఆమెకి యిష్టం లేదు. మునిగిపోతున్న పడవమీద ఒకరికొకరు తోడు.

కానీ అంతలోనే, 'ఇక వుండి చేసేదేముంది' అన్న అతడి భావాన్ని అర్థం చేసుకున్నట్టు కారు పక్కకి తీసి ఆపుచేసింది. అతడు కారు తలుపు తీసుకుని దిగాడు. క్షణం ఆగి, తటపటాయించి, ఏదో చెప్పాలనుకుని, అది చెప్పలేక "నన్ను క్షమించండి అమ్మగారూ" అన్నాడు.

ఆమె నెమ్మదిగా కళ్ళెత్తి చూసింది. ఆ కళ్ళలో ఏ భావమూలేదు. శూన్యంగా ఏదో లోకంలో వున్నట్టు వున్నాయి "మనం చేయగలిగినదంతా చేశాం శర్మా. నాకు పోలీసులంటే చాలా చిన్న భావం వుండేది. ఇప్పుడది పోయింది. ఈ రాత్రి నువ్వు చేసిన సాయం నేను జీవితమంతా గుర్తుపెట్టుకుంటాను" అంటూ ముందుకు కారు పోనిచ్చింది.

ఆమె ఇంటికి చేరుకునే సరికి ఇల్లంతా లైట్లు వేసి వున్నాయి. అందరూ మెలుకువగా వుండి, వరండాలో నిలబడి వున్నారు. ఆమె ఆశ్చర్యంతో కారు దిగుతూ వుంటే రామయ్య పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఎప్పుడూ నిశ్శబ్దంగా భావరహితంగా వుండే అతడిలో టెన్షన్ కొట్టొచ్చినట్లు కనబడ్తూంది.

"అయ్యగారి కారు లోయలో కూలిపోయిందటమ్మగారూ. పోలీసులు ఫోన్ చేశారు. అయ్యగార్ని జనరల్ హాస్పిటల్‌లో చేర్పించారట."

ఆమె నిశ్చేష్టురాలైంది!

ఎన్నెన్నో భావాలు ఒక్కసారిగా ఆమెని చుట్టుముట్టాయి. సర్వోత్తమరావు అంకుల్ రాష్ట్రపతి దగ్గరికి వెళ్ళకపోవటానికి కారణం అదన్న మాట!

ఆమె లోపల ఫోన్ దగ్గరకి పరుగెడ్తూ "మామయ్యకి ఎలా వుందట?" అని అడిగింది.

చిరంజీవిని రక్షించగలిగేది ఆయనొక్కడే! ఆయన దగ్గర్నుంచి ప్రెసిడెంట్‌కి ఫోన్‌కాల్ చాలు. పోయిన ధైర్యం అంతా మళ్ళీ వచ్చినట్టు అయింది.

"డాక్టరు పూర్ణచంద్రరావుగారు మిమ్మల్ని రాగానే ఫోన్ చెయ్యమన్నారు" అన్నాడు రామయ్య.

పూర్ణచంద్రరావు హాస్పిటల్ సూపర్నెండెంటు. అర్చన మెడికో కాబట్టి బాగా తెలుసు. తొందర తొందరగా, వణుకుతున్న చేతుల్తో ఆమె ఫోన్ తిప్పింది. ఎప్పుడూ ప్రార్థించనిది, అప్పుడు దేముణ్ణి ప్రార్థించింది " భగవంతుడా! మామయ్యకి కొద్దిగా మాట్లాడే శక్తిని ప్రసాదించు" అని.

అయితే దేముడు ఆమె ప్రార్ధన విన్లేదు.

"అవునమ్మా. నేనే అటెండ్ అయ్యాను. పేషెంట్ డీప్ కోమాలో వున్నాడు. కండిషన్ సీరియస్సే......" అన్నాడు డాక్టర్ పూర్ణచంద్రరావు.

"ఆయనకి ఎప్పుడు మెలకువ వస్తుంది డాక్టర్" కంపిస్తున్న కంఠంతో అడిగింది.

"ఇంకో పదీ - పన్నెండు గంటలు పోతేగానీ చెప్పలేనమ్మా...."

ఫోన్ పడేసి టేబిల్ మీదకి వాలిపోయింది అర్చన. అప్పుడొచ్చింది ఆమెకి దు:ఖం. వ్యధాభరితమైన మనసుతో, అలసటతో ఆమె అదోరకమైన సుషుప్తిలోకి జారుకుంది. అలా ఎంత కాలం గడిచిందో తెలీదు. అది నిముషమైనా కావొచ్చు. గంట అయినా కావొచ్చు.

ఆ శూన్యంలోంచి ఒక మెరుపు మెరిసినట్టయింది. ఏదో ఆలోచన స్ఫురించి, కళ్ళు విప్పింది. ఫోన్లో ఆస్పత్రి సిబ్బందితో మళ్ళీ ఇంకొకసారి మాట్లాడి, దాదాపు పరుగెడ్తున్నట్టూ బైటకొచ్చి కారు స్టార్ట్ చేసింది.

ఆమె వెళుతున్నది ఆస్పత్రికి కాదు. అక్కడికి వెళ్ళినా లాభం వుండదని తెలుసు. సర్వోత్తమరావు పడిపోయిన చోటికి వెళ్తోంది ఆమె. అప్పటికే తూర్పు బాగా ఎర్రబడటం ప్రారంభం అయింది.

ఆమె హిల్ టాప్నుంచి కారుని సర్రున క్రిందికి కోస్తూ పక్కకి తిప్పింది. ప్రమాదకరమైన మెలికల్లో కూడా స్లోచేయటంలేదు. ఒక ఫర్లాంగు ముందుకు రాగానే క్రింద లోయలో కాలిపోయిన కారు కనబడింది. ఒక పోలీసు అక్కడ నిలబడివున్నాడు. ఇంకా బాగా తెల్లవారలేదు కాబట్టి చాలా కొద్దిమంది - దాదాపు పదీ - పదిహేనుమంది దాకా నిలబడి చూస్తున్నారు.

వర్షానికి తడిసిన మట్టిమీద నుంచి జారిపోకుండా పెద్దపెద్ద బండరాళ్ళని ఆసరా చేసుకుంటూ ఆమె క్రిందికి దిగుతూ వుంటే జనం ఆశ్చర్యంగా చూడసాగారు. ఆమె దాన్ని పట్టించుకోకుండా కారు దగ్గరకి వచ్చింది. ఆమెని చూసి కానిస్టేబిల్ సెల్యూట్ చేశాడు. కారు బోర్లా పడివుంది. టైర్లు కాలలేదు గానీ సీట్లు పూర్తిగా కాలిపోయినయ్. ఆ మసి చల్లగా పేరుకుని వుంది. తడిసిన బూడిద వర్షపు పాయల్లో తెల్లగా మెరుస్తుంది.

ఆమెని ఆ కారు తాలూకు వ్యక్తిగా గుర్తించి "కారులోంచి బైటపడటం అదృష్టం అమ్మగారూ! లేకపోతే ప్రాణానికి చాలా ప్రమాదం జరిగివుండేది" అంటున్నాడు పోలీసు. ఆమెతల వూపింది. అతడింకేదో మాట్లాడుతున్నాడు గానీ, ఆమె దాన్ని పట్టించుకోకుండా తన పనిలో తానుంది. ఆమె కళ్ళు ఆ ప్రదేశంలో ప్రతి అం గుళాన్ని తీక్షణంగా శోధిస్తున్నాయి.

ఊడిపోయిన రేడియేటర్ మూత దూరంగా మెరుస్తోంది. చక్రం తాలూకు హబ్ వూడిపోయి, రాళ్ళమధ్య నొక్కులు పడింది. పగిలిన అద్దం ముక్కలు ధగ ధగా మెరుస్తున్నాయి.

ఆమె వంగి కారులోకి చూసింది. ఊడిన రబ్బరు ముక్కలు సగం కాలి వున్నాయి. ఇంకా వాసన వస్తూనే వుంది. స్టీరింగ్ ఒక

ప్రక్క వంగిపోయి వుంది.

"అన్నీ వాళ్ళు తీసుకుపోయారు అమ్మగారూ! అందులో ఏమీ లేవు" అన్నాడు పోలీసు ఆమె దేనికోసం వెతుకుతుందో తెలీక!

ఆమె తలూపి కారునుంచి దూరంగా వచ్చింది. ఆ కారులో అది వుండే అవకాశం లేదనీ, వున్నా కాలిపోయివుంటుందని నిశ్చయించుకుని, ఇక అక్కడ చేసేదేమీ లేదని వెనుదిరుగుతుంటే అక్కడే పెద్ద బండరాయి ప్రక్కన - ఆమెకి కావల్సింది దొరికింది - అదో కవరు!

పూర్తిగా కాలిపోయి చివర్లు మిగిలింది. ఆ చివరి అంచులుకూడా వర్షానికి తడిసిపోయాయి. ఆమె చప్పున వంగి దాన్ని చేతుల్లోకి తీసుకుంది. అవి అసలేం ఫోటోలో కూడా తెలియటం లేదు. కేవలం అంచులు మాత్రం వున్నాయి. అయితే ఆమె ఆలోచిస్తున్నదీ - చూస్తున్నదీ అవి ఏ ఫోటోలూ అని కాదు. ఆ ఫోటోలన్నీ పాజిటివ్‌లు?

మరి నెగిటివ్‌లు ఏమయ్యాయి? తన ఇంట్లోనే ఎక్కడో వున్నాయన్న మాట!!

ఆమె మరిక ఆలస్యం చేయకుండా తన కారు వైపు పరుగెత్తింది.

## 6

అతడి చేతులు వెనక్కి కట్టబడ్తున్నాయి. కళ్ళు మూసుకుని వున్నాడతను. జైలరూ మిగతా సెంట్రీలూ, గార్డులూ చూస్తున్నారు.

చేతులు సెల్‌లోనే వెనక్కి కడతారు. కాళ్ళు మాత్రం ఉరికంబం ఎక్కే ముందు కడ్తారు. ఖైదీ ఎన్ని గంటలకి వురి తీయాలీ అన్నది ఆర్డరులోనే వుంటుంది. ప్రిజన్ రూల్ నెంబర్ 555 "ప్రత్యూషవేళ ఉరితీత కనువైన సమయం" అని చెబుతూంది. అంతకన్నా వివరణ లేదు. వేసవికాలంలో కొద్దిగా తెలతెలవారుతూ వుండగా ఉరి అమలు జరుపుతారు. శీతాకాలంలో కొన్ని సందర్భాల్లో తొమ్మిదింటికి తీసిన సంఘటనలు కూడా వున్నాయి.

రాత్రి వర్షం తాలూకు ప్రభావం ఇంకా తగ్గలేదు. చలిగాలి వీస్తూనే వుంది. అయితే చిరంజీవి శరీరం మాత్రం బాధపడటం లేదు. అతడి శరీరం వణుకుతూంది. సన్నటి ఆవిర్లు వస్తున్నాయి. దాదాపు కళ్ళు మూసుకునే, ఎవరేం చెయ్యమంటే అది చేస్తున్నాడు.

ఇద్దరు గార్డులు అతడిని చెరో వైపూ పట్టుకుని నడిపిస్తున్నారు. సాలిటరీ సెల్ మెట్లు దిగాడు. అది విశాలమైన జైలు. ముందో పెద్ద మైదానం, దానికి ఒకవైపు బారెక్స్. అది అరవైమంది నుంచీ - డెబ్బైమంది దాకా పట్టే పెద్దహాలు. అటు కాకుండా తిన్నగా వెళ్తే యింకోహాలు. అందులో మంచాలూ, దోమతెరలూ కూడా వుంటాయి. అది రాజకీయ ఖైదీల కోసం, డిటెన్యూలకోసం ఏర్పాటు చేయబడిన ఆ గది పక్కనే వంటగదీ, స్టోర్ రూమూ వున్నాయి, దానికి ఎడమ వైపు మళ్ళీ ఇంకో బారెక్స్.

ఇరువైపులా సున్నం పూసిన తెల్లటి ఇటుక రాళ్ళు పాతిన ఎర్రటి మట్టిరోడ్డు ఆ బారెక్స్ మధ్యనుంచి ముందుకు సాగుతుంది. అక్కడ ఇంకో ఇనుప గేటు. అది దాటితే సాలిటరీ సెల్స్. ఒక్కొక్క గదిలో ఒక్కొక్క ఖైదీ. ఆ సెల్స్ చుట్టూ

పెద్దగోడ.. గోడతో పోలిస్తే, చాలా చిన్నదిగా కనిపించే తలుపు, ఆ తలుపు తెరిస్తే విశాలమైన మైదానం.

మైదానం మధ్యలో ఉరికంబం!

దాదాపు ఇరవై అడుగుల పొడవూ, పది అడుగుల వెడల్పూ వున్న ఎత్తైన గచ్చులాంటి ప్రదేశం. దానికి ఇరువైపులా రెండు ఇనుపగొట్టాలు, వాటికి కొక్కాలు! ఆ గచ్చుమీద తలుపులు...... ఆ తలుపులకి లివరు! ఆ ఎత్తైన గచ్చు క్రింద ఖాళీరూము. కందకం లాంటిది. ఉరికంబం వెనుక వైపునుంచి ఆ రూములోకి మెట్లున్నాయి. పైన చెక్క తలుపుల గచ్చుమీద ఖైదీని నిలబెట్టి, మెడకు ఉరి బిగించి, లివరు లాగగానే తలుపులు క్రిందకి ఆటోమాటిక్‌గా తెరుచుకుంటాయి. క్రింది నాలుగు గోడలమధ్య కందకంలోకి శరీరం జారిపోయి, అక్కడ గాలిలో వేలాడుతూ వుంటుంది.

అరగంట తర్వాత డాక్టర్ క్రిందికి మెట్లగుండా దిగి, వేలాడ్తున్న శరీరపు కాలిని స్పృశించి, మరణాన్ని ధృవపర్చాక, పైన తాడు వదులు చేస్తారు - శరీరం క్రిందకి పడిపోతుంది.

ఉరికంబానికి వందగజాల దూరంలో పెద్దసైజు కోళ్ళ గూడులాంటిది వుంది. శ్మశానానికి తీసుకెళ్ళే వరకూ అక్కడ వుంచుతారు శవాన్ని.

ఉరితీత కార్యక్రమం పూర్తి కాగానే సాక్షులు మరణాన్ని ధృవపరుస్తున్నట్టు సంతకాలు పెడ్తారు. ఆ పత్రం రికార్డు చేయబడుతుంది. అంతటితో ఖైదీ జీవిత చరిత్ర ముగుస్తుంది. (సికింద్రాబాదు జైల్లో ఉరికంబం మెట్ల పక్క ఎవరో సున్నంతో "వెల్‌కమ్" అని వ్రాశారు. అది సెన్స్ ఆఫ్ హ్యూమరో, లేక శాడిజమో తెలీదు.)

ఇద్దరు వార్డెన్లు చెరో వైపు వస్తూంటే చిరంజీవి భారంగా నడుస్తున్నాడు. జాగ్రత్తగా చూస్తే, అతడు ఒక పక్కకి వంగి గార్డు ఆసరాతో నడవటం కనిపిస్తుంది!

పెద్ద గోడ దగ్గరకి వచ్చారు వాళ్ళు. ఆ గోడకే వున్నది చిన్న తలుపు, అది తీస్తే, ఉరి స్థలం. అక్కడ అందరూ ఆగారు....... ఒక గార్డు తలుపు తీయబోతున్నాడు. ఇంతలో తనని తాకినట్టయి, చిరంజీవి తల తిప్పాడు. ఎవరో ఒక నల్లటి గుడ్డని పైకెత్తడం కనబడింది. అంతే! ఆ తరువాత అది మెడమీదగా జారింది.

కళ్ళముందు నల్లటి పొర........... ముసుగువేసినట్టు! దాంతో ప్రపంచం అదృశ్యమయిపోయింది.

## 7

ఆమె నుదుటి మీద చెమట ధారగా కారుతోంది. ఆమె చేతులు వణుకుతున్నాయి. కాగితాల్ని చెల్లాచెదురు చేస్తూ, ఆమె వెతుకుతోంది.

పాజిటివ్ ముక్కలూ, నెగిటివ్ ఫిల్మూ, క్లిప్పులూ, లోషనూ - ట్రేలూ - అంతా అస్తవ్యస్తంగా పడివున్నాయి. అయినా వాటిని ఆమె అంతగా పట్టించుకోవటం లేదు. ఒక్కో క్షణం గడుస్తున్నకొద్దీ, ఆమెలో అసహనం ఎక్కువ అవుతోంది.

అప్పటివరకూ చాలా జాగ్రత్తగా తనని కంట్రోలు చేసుకుంటూ వచ్చింది ఆమె. ఇక అప్పుడు ఆపుకోలేకపోయింది. దాదాపు పిచ్చిదై, ఆ కాగితాల్ని చిందర వందర చేస్తోంది.

అక్కడ చచ్చిపోతున్నవాడు తన ప్రియుడూ, చిరంజీవి అనికాదు. ఒక నిర్దోషి!! అంతే!! ఆమెను ఆ భావనే పిచ్చెకిస్తోంది. తెల్లటి పాజిటివ్ ఫిల్మ్‌ని పక్కకి తోసేస్తూ

నెగిటివ్‌ల కోసం వెతుకుతోంది. ఒక్కొక్క నెగిటివ్‌నీ చూసి, అది తనకి కావల్సినది కాదు అని నిశ్చయించుకుని పక్కకి పడెయ్యటం!!! నెగిటివ్‌ని చూడవలసి రావటంతో

టైమ్ మరింత వేస్టు అవుతోంది. దానికి తోడు నిస్సహాయతతో కనులవెంట నిండుకునే నీరు - పొరలా అడ్డుపడుతోంది. మాటిమాటికీ కళ్ళు తుడుచుకుంటూ వెతుకుతోంది.

ఆలోచన్లతోనే ఆమె వెతకటం పూర్తిచేసింది. ఇక వెతకవలసినది ఏమీలేదు. ఆమె చుట్టూ ఫిల్ము ముక్కలు. తెల్లనివీ - నల్లనివీ చీకటి వెలుగుల్లా పరుచుకొని వున్నాయి. చేతులు రెండూ వెనక్కి కట్టుకుని, గోడకి ఆనుకుని నిస్సహాయంగా గదంతా చూస్తూ నిలబడింది ఆమె.

అంతా నిశ్శబ్దంగా వుంది. మనసంతా దిగులు...... శూన్యం. అంతా అయిపోయిందన్న భావన. ఆమె అలా నిలబడింది అరనిముషమే. అదే యుగాలైనట్టుగా తోచి, భారంగా అక్కణ్ణుంచి కదిలి బైటకి వచ్చింది.

రాబోతూ వుంటే - అప్పుడు కనబడింది ఆ కవరు. చెత్తబుట్టలో - కాగితాల మీదనుంచి క్రింద పడటానికి సిద్ధంగా వుంది.

ఆమె ఒక క్షణం తను చూస్తున్నది కలో నిజమో నమ్మలేక అలాగే నిశ్చలంగా వుండిపోయింది. ఆ తరువాత మెరుపుకన్నా వేగంగా వంగి ఆ కవరు చేతుల్లోకి త్రీసుకుని విప్పింది. తన గుండెచప్పుడు తనకే స్పష్టంగా వినిపిస్తూంది. కంపిస్తున్న వేళ్ళతో లోపల పేపర్లని బైటకి విసురుగా లాగింది.

అవి నెగిటివ్‌లు!

ఆమె క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఫోటో ఫ్రేములో బిగించి లైట్ ఆన్ చేసింది. పాజిటివ్ మీద బొమ్మ ఎడ్జెస్టు చేసి, దాని మీద ముద్ర పడిందని నిశ్చయం అవగానే ట్రేలో వున్న ద్రవంలో ముంచింది.

నెమ్మదిగా - నెమ్మది నెమ్మదిగా పాజిటివ్ మీద బొమ్మ రూపుదిద్దుకోసాగింది. కొంచెం సేపటికి ఆ బొమ్మ స్పష్టమైంది. ఏ కేసులో అతడు హంతకుడై ఉరికంబం ఎక్కుతున్నాడో, ఆ సుశీల అనే హతురాలి శరీరాన్ని చిరంజీవి బావిలో పడేసే బొమ్మ. అది నిజాన్ని నిరూపించేది!! అలాంటివే మిగతావి.

ఆమె ఒక్క గెంతులో గదిలోంచి బైటకి వచ్చి ఫోన్ చేరుకున్నది. కుర్చీ లాక్కుని కూర్చుంటూ రిసీవర్ ఎత్తి -ఒకటి - ఆరు - నాలుగు - తొమ్మిది - మూడు - డయల్‌చేసి 'హలో' అంది దాదాపు అరుస్తున్నట్టు. ఆమె ఉద్రిక్తతనీ, ఉద్వేగాన్నీ మరింత పరీక్షిస్తున్నట్టూ అటువైపు నుంచి "ఎంగేజ్డ్" శబ్దం వచ్చింది.

ఆమె రిసీవర్ పెట్టేసి, మళ్ళీ వెంటనే ఎత్తి గెస్ట్‌హౌస్‌కి ఫోన్ చేసింది. ఎవరో నిరాసక్తంగా ఎత్తి ప్రెసిడెంట్ లేరన్న సంగతి చెప్పారు.

ఆమె మళ్ళీ యింకొకసారి ఫోన్ చేసే ప్రయత్నం చెయ్యలేదు. ఫోటోవున్న కవరు చేత్తో పట్టుకుని వేగంగా కారు చేరుకుంది. మరుక్షణం కారు గేట్లోంచి బైటికి దూసుకుపోయింది.

సూర్యుడు తూర్పునుంచి పైకి వస్తున్నాడు. దాదాపు సగం పైగా వచ్చేశాడు.

8

అతడి కళ్ళముందు చీకటిగా వుంది.

ఉరికంబం ఇంకా పది అడుగుల దూరంలో వుంది. వణుకుతూన్న కాళ్ళతో అతడు అడుగులు ముందుకేస్తున్నాడు. ఒక్కో అడుగూ వేయటానికి పట్టే క్షణకాలం, ఒక్కో యుగంలా మారి ఆలోచన్లని రేకెత్తిస్తోంది.

ఎక్కడివాడు తను? ఎక్కడ తన జీవితం అంతం కాబోతూంది? అనుకున్నాడు. ఎక్కణ్నుంచి పోతుంది ప్రాణం? ఆఖరి శ్వాసనుంచా? విరిగిన మెడ ఎముకనుంచా? లేక మూతపడిన కనురెప్పల చీకటినుంచా? ఎక్కణ్ణుంచి? తల్లి కడుపులో ముడుచుకుని పడుకున్నప్పటి స్థబ్దత మళ్ళీ కాలే చితిమీద వస్తుందా? మెడ బిగుసుకోవటం తెలుస్తుందా? ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతాడా? చావు తరువాత ఏమవుతుంది? ఆత్మ ఎక్కడికి వెళుతుంది?

నవ్వాడు. నవ్వించాడు. ఆకలితో కడుపు కాలుతున్నా పైకి నవ్వుతూనే వుండేవాడు. తన ఆశయ సాధన కోసం అహర్నిశలూ పని చేశాడు. అదెవరికీ తెలీదు. భవిష్యత్తులో కూడా తెలీదేమో!

తనతో పాటే తన ఆశయమూ, శాశ్వత సమాధి కాబడుతుంది. మళ్ళీ ఎప్పటికో ..... ఎప్పటికో ఈ దేశంలో ఉరి రద్దు అయ్యేది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

18 వ భాగం

చల్లటి గాలి వీస్తోంది. జామచెట్టు, వేపచెట్టు, చిన్న చిన్న పొదలూ వున్నాయి. మధ్యలో దారి! చుట్టూ పాతిక అడుగుల ఎత్తున్న గోడ.

ఒక్కసారిగా చుట్టూవున్న వాళ్ళని విదిలించుకుని పారిపోవాలన్న కోరిక కలిగింది.

ఏం చేస్తారు? తుపాకుల్తో కాలుస్తారా? ఉహూ - అంత సులభంగా చావనివ్వరు? లేడిని వేటాడినట్టు వేటాడి పట్టుకుంటారు. గోడ పైనున్న కరెంటు తీగెలు తాకి చచ్చిపోయే అవకాశం కూడా యివ్వరు. క్షణక్షణమూ లెఖ్ఖ పెట్టుకుంటూ చావు కోసం ఎదురు చూడటం ఎంత దుర్భరమైనది! మామూలు చావుకూడా ఎంత హాయిగా వుంటుందో యిప్పుడు తెలుస్తోంది.

అతడికి తన తండ్రి జ్ఞాపకం వచ్చాడు. తండ్రీ యిలాగే ఆ క్షణం చేయని నేరానికి బాధపడ్తూ మరణాన్ని ఆహ్వానించి వుంటాడు! ఇక్కడ సమస్య - నేరం చేయటమా కాదా అన్నది కాదు. మరణంశిక్ష వుండొచ్చా లేదా అన్నది. సమాజానికి ఒక వ్యక్తి చీడపురుగు అని భావిస్తే అతడిని నాలుగ్గోడల మధ్య జీవితాంతం బంధించండి! అతడితో రాళ్ళు కొట్టించండి. గనులు తవ్వించండి!! ఇంకా మీకు కసి తీరకపోతే అతడి కాళ్ళు నరకండి. కానీ ప్రాణాలు మాత్రం తీయకండి. ప్రజలారా! కొద్దిగా ఆలోచించండి. సాటి మనిషి ప్రాణాలు తీసేహక్కు మీకు లేదు. మార్చండి సెక్షన్ 302ని మార్చండి. మార్చ...........

చదునైన గచ్చు తగలగానే తీసుకువెళ్తున్న చేతులు అతడిని ఆపుచేశాయి! అంతకుముందే అతడికి బ్లాక్ వారెంట్ చదివి వినిపించబడింది. ఎందువల్ల అతడికి మరణశిక్ష విధించబడిందో, ఏ సెక్షన్ ప్రకారం అతడిని ఉరి తీస్తున్నారో కూడా చెప్పబడింది.

ఆ తరువాత అతడి కాళ్ళు తాళ్ళతో కట్టివేయబడ్డాయి. ఉరి బిగుసుకొనేటప్పుడు కాళ్ళు గిలగిలా కొట్టుకోకుండా అలా కట్టెయ్యడం జరుగుతుంది.

మాజిస్ట్రేట్ టైమ్ చూసుకున్నాడు. ఇంకా రెండు నిముషాలుంది. పై అధికారుల నుంచి వచ్చే ఆర్డర్లోనే ఎన్నింటికి ఉరి తీయాలి అన్నది వ్రాయబడి వుంటుంది. ఆ టైమ్ని మాజిస్ట్రేట్ జైలరుకి చెప్తాడు. జైలర్ చేతిలో రుమాలుంటుంది.

దాన్ని ఊపగానే తలారి లివరు లాగుతాడు. ఖైదీ కాళ్ళ క్రింద తలుపు తెరుచుకుని కందకంలోకి వేలాడుతుంది శరీరం.

కాళ్ళు కట్టటం పూర్తయిన తరువాత తలారి లేచి చిరంజీవికి నమస్కారం చేశాడు. "సర్కారీ ఆజ్ఞ ననుసరించి నేనీ పని చేస్తున్నాను సాబ్. మీ మీద నాకు పగలేదు. నన్ను క్షమించండి" అన్నాడు. అది నిజాయితీ!

ఆ తరువాత ఉరి తాడుని చేతుల్లోకి తీసుకున్నాడు.

9

తను కారు ఇంజను ఆపు చేసిందో లేదో కూడా చూసుకోలేదు. ఆగీ ఆగగానే ధడేలున తలుపు తెరుచుకుని బైటకు

దూకింది. గవర్నరు ఇంటి ముందు సెక్యూరిటీ పోలీసు చప్పున ముందుకు రాబోయి, దిగుతూన్నది అమ్మాయని క్షణం తటపటాయించాడు. ఆ క్షణంలోనే ఆమె లోపలికి దూసుకుపోయింది.

విశాలమైన హాలు! పక్కనే ఒక మూల టేబిలు, దానిమీద ఫోన్. హాలంతా నిర్మానుష్యంగా వుంది. ఇంకా అక్కడ దిన చర్య ప్రారంభం కాలేదు.

బైట విజిల్స్ ........ ఎవరో పరుగెడ్తున్నట్టూ బూట్ల చప్పుడు...... ఇంకెవరో గట్టిగా అరుస్తున్నారు. అంతా రణగొణ ధ్వని..........

ఆమె దేన్నీ పట్టించుకోలేదు. వింటినుంచి వెలువడిన బాణంలా దూసుకుపోతోంది. ఒకరిద్దరు నౌకర్లు విచిత్రంగా అయోమయంగా చూస్తున్నారు.

తనని గవర్నరు గుర్తుపడ్తాడాలేదా అన్నది కూడా ఆమెకి అపనమ్మకమే! ఎప్పుడో మెడికల్ కాలేజీలో ఒకసారి బహుమతి ఇస్తూ అభినందించాడు. ఆ తరువాత ఆమె ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశాడు. అది గుర్తుంటుందో, లేదో...... అయినా తన గురించి చెప్పి - పరిచయం చేసుకుని - అన్ని వివరించేటంత టైమ్ లేదని ఆమెకి తెలుసు.

ఇదంతా ఆలోచించటానికి క్షణం కూడా పట్టలేదు. ఆలోచిస్తూనే పరుగెడ్తూ హాల్లోంచి పక్కగదిలోకి తిరిగింది. అంతలో రెండు బలమైన చేతులు చెరోవైపునా పట్టుకోవటంతో ముందుకు తూలిపడబోయి నిలదొక్కుకుని నిస్సహాయంగా వాళ్ళ వైపు చూసింది.

ఇద్దరు నేపాలీ సెక్యూరిటీ గార్డులు ఇరువైపులా వున్నారు.

......

ఆ తెల్లవారుఝామున అర్చన తనని రోడ్డుమీద వదిలిపెట్టాక విష్ణుశర్మకి ఏం చెయ్యాలో తోచలేదు. ఇంటికి కూడా వెళ్ళబుద్ధి కాలేదు. తనే హోటలునుంచి ఫోన్ చేశాడో, ఆ హోటలుకి వెళ్ళి ఒక కప్పు టీ తాగాడు.

తను తప్ప మిగతా ప్రపంచం అంతా సంతోషంగా వున్నట్టు అనిపించింది. ఎవరిమీదో తెలియని కసి - ఉక్రోషం అతనిలో చోటు చేసుకుని, ఏ క్షణమైనా ఉబికి వచ్చేలా వున్నాయి.

టీ తాగి, అతడు ఇంటి వైపు వెళ్ళకుండా తిరిగి జైలువైపు నడిచాడు. మెయిన్ గేటు దగ్గర గార్డు అతణ్ని పలకరించాడు. కానీ శర్మ అది పట్టించుకోకుండా లోపలికి నడిచాడు. రాత్రి డ్యూటీ చేసిన వాళ్ళకి మరుసటి రోజంతా 'ఆఫ్' వుంటుంది.

అతడు "ఎంట్రీ బుక్" వున్న టేబిల్ పక్కనే కుర్చీలో కూర్చొని అరచేతుల మధ్య తల ఆన్చుకుని కళ్ళు మూసుకున్నాడు.

"అలా వున్నావేం భాయ్?" అడిగాడు తోటి సెంట్రీ. అతడు మాట్లాడలేదు.

కొద్ది క్షణాల్లో - చాలా కొద్ది క్షణాల్లో ..... తమకి ఓ రెండు వందల గజాల దూరంలో చిరంజీవి మరణించబోతున్నాడని అతడికి తెలుసు. కనుచూపు మేర నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుంది. అంటే అందరూ అక్కడికి చేరుకున్నారన్నమాట. అతడు కళ్ళు తెరిచి, దూరంగా కనబడ్తున్న తెల్లటి గోడ వైపు చూశాడు. గోడమీద పక్షి - అది డేగో, రాబందో తెలియటం లేదు. అవతలి వైపు జరిగే తంతుని ఆసక్తిగా చూస్తోంది.

అతడు తల తిప్పి జైలు గడియారం వంక చూస్తున్నాడు. ఇంకొక్క నిముషం వుంది. ముసలి వాచ్‌మెన్ అప్పుడే జైలు గంటలు కొట్టటం కోసం మెట్లెక్కి తాడు పట్టుకున్నాడు.

శర్మ పిడికిళ్ళు బిగించి, నుదురు టపటపా కొట్టుకున్నాడు.

......

తలారి తాడుని చిరంజీవి మెడలో చుట్టూ బిగించాడు. బిగిస్తూ అన్నాడు...... "బాబూ...... ముందు లివరు శబ్దం వినిపిస్తుంది. అప్పుడే కాళ్ళ క్రింద తలుపు తెరుచుకోవటం ప్రారంభం అవుతుంది. లివరు శబ్దం వినిపించగానే మనసులో మరే ఆలోచనా రానివ్వక దేముణ్ణి ప్రార్థించు...."

తలార్లు ఖైదీల్తో చాలా జాలి చూపిస్తూ మాట్లాడతారు. ఆ ఖైదీ ఎన్నో హత్యలు చేసినవాడై వుండొచ్చు. దారుణ మారణకాండ జరిపిన వాడై వుండొచ్చు. కానీ ఆ క్షణం నిస్సహాయంగా ప్రాణాలు కోల్పోబోతున్నాడు. ఆ బాధేమిటో తలార్లకే తెలుస్తుంది.

రెండు తలుపులూ కలిసేచోటు చిరంజీవి కాళ్ళకి తాకుతూంది. అతడు నిశ్చలంగా నిలబడ్డాడు. ఇప్పుడిక ఏ బాధాలేదు. ప్రాణాలు పోవటానికి ఇక కొద్ది క్షణాలే. అతడు దేముణ్ణి కూడా ప్రార్థించటం లేదు. భారత దేశపు రాజ్యాంగ నిర్మాతల్ని ప్రార్థిస్తున్నాడు. "ప్రభువుల్లారా ఉరిని రద్దు చేయండి!" అని మనసులోనే వేడుకుంటున్నాడు. మరి అది ఆ మేధావుల వరకూ చేరిందో లేదో తెలీదు.

తలారి లివర్ వద్దకు వెళ్ళిన అడుగుల చప్పుడు వినిపించింది. చిరంజీవి ఆఖరి సారి గుండెల నిండా గాలి తీసుకుని, ఊపిరి బిగపట్టి అచేతనుడయ్యాడు. టైమ్ అయినట్టు మాజిస్ట్రేట్ ధర్మారావు వైపు చూశాడు. ధర్మారావు తలూపి, వాచీ చూసుకున్నాడు. దారికి ఇటూ, అటూ వున్న గార్డులు అటెన్షన్‌లో నిలబడి వున్నారు. అందరూ శిలా ప్రతిమల్లా నిలబడి వుండటంతో గాలి కూడా స్థంబించినట్టయింది.

ధర్మారావు కదిలాడు. సెకన్ల ముల్లు పన్నెండు మీదకి రాగానే కర్చీఫ్‌ని పైకి యెత్తాడు. చేతిని అతడు పైకి యెత్తగానే, తలారి లివర్‌ని రెండు చేతుల్తో పట్టుకుని జరపటం మొదలు పెట్టాడు.

సరిగ్గా అదే సమయానికి, ఆ నిశ్శబ్దాన్ని చెదురుస్తూ, మెయిన్ ఆఫీసులో, టేబిల్ మీద ఎంట్రీ బుక్ పక్కనే వున్న ఫోన్ మ్రోగింది. మోచేతులమీద తల ఆన్చి నిస్త్రాణగా కళ్ళు మూసుకుని వున్న శర్మ ఫోన్ ఎత్తి 'హలో' అన్నాడు.

ఒక కంఠం చాలా తాపీగా "దిసీజ్ పి. యస్. టు గవర్నర్..... కెన్ ఐ స్పీక్" అని నెమ్మదిగా అంటూంది.

శర్మ చేతిలో రిసీవర్ బిగుసుకుంది. ఒక్కసారిగా రక్తం మొహంలోకి తన్నుకొచ్చింది దాదాపు అరుస్తున్నట్టు "....... చిరంజీవి గురించా" అన్నాడు.

"యస్. ది గవర్నర్ వాంట్స్ టు స్పీక్."

ఆ మాటల్ని మధ్యలో ఆపు చేసి, "అర్చనగారున్నారా అక్కడ" అని అరిచాడు శర్మ.

"ఉన్నారు"

అంతే... అతను ఫోన్ వదిలేశాడు. తనంత తొందరగా ఒక నిర్ణయానికి రాకూడదనీ, ఆ నెంబర్ తీసుకుని మళ్ళీ అదే నెంబర్‌కి ఫోన్ చేసి నిర్ధారణ పర్చుకోవాలనీ ఆ తరువాత తన పై అధికారులకి ఆ విషయం తెలపాలనీ అతడికి తెలుసు.

అంతేకాదు, ఒక వైపు ఉరి అమలు జరుపుతూవుండగా, సెక్యూరిటీ ఏర్పాట్లు బాగా పకడ్బందీగా వుంటాయనీ, సెంట్రీ దుస్తుల్లో వున్న తను ఏ మాత్రం తొందరపడి ప్రవర్తించినా, అది తన ఉద్యోగానికి ముప్పు తేవటమే కాక తనకి జైలు శిక్ష కూడా పడేటట్టూ చేస్తుందని అతడికి తెలుసు.

అయినా అతడు అదేమీ ఆలోచించలేదు. ముసలి వాచ్‌మెన్ తాడు లాగి గంటలు కొట్టటం ప్రారంభించాడు. అతడు లేవటం, కుర్చీ వెనక్కి తోసి మైదానం వైపు పరుగెత్తటం ఒకేసారి జరిగినయ్.

పక్కనున్న వార్డెన్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. శరీరంలో వున్న శక్తినంతా అరికాళ్ళలోకి తెచ్చుకుని దాదాపు గాలిలో ప్రయాణం చేస్తున్నవాడిలా పరుగెత్తాడు. క్షణానికి ఎంత విలువుందో ఆ క్షణం తెలిసింది.

ఆ క్షణం గడిచిపోయిందా? ఏమో!

జైలు గంటలు మ్రోగుతూనే వున్నాయి.

ఎదురుగా ఎత్తైన గోడ. ఇనుప తలుపు. అక్కడ నిలబడి అతడు దిక్కులు చెదిరిపోయేలా - ప్రకృతి కదిలిపోయేలా - గొంతులో రక్తనాళాలు తెగిపోయేలా - "ఆపండీ!!" అని కేకపెట్టాడు.

ఆ కేకకి గోడమీద కూర్చున్న డేగ రెక్కలు టపటపా కొట్టుకుంటూ గాలిలోకి లేచింది. నిశ్శబ్దం ఆ రెక్కల చప్పుడికి మరింత చెల్లా చెదరయినట్టయింది.

తరువాత ఏం జరిగిందో శర్మకి తెలీదు. గొంతు పగిలేలా అరిచిన ఆ అరుపుతో పాటు అతడికి స్పృహ తప్పింది. మోకాళ్ళమీద నేలమీదికి సొమ్మసిల్లినట్టు జారిపోయాడు.

మళ్ళీ తిరిగి శర్మకి స్పృహ వచ్చేసరికి, ఇద్దరు గార్డులు చెరోవైపునా కనబడ్డారు. మొహం మీద నీళ్ళు జల్లి తుడుస్తున్నారు.

చప్పున లేచి కూర్చుంటూ "ఆ చిరంజీవి........ అదే....... ఖైదీ....... ఉరి - ఏమైంది" అని అడిగాడు తడబడుతూ.

"మాజిస్ట్రేట్ సాబ్ ఫోన్లో మాట్లాడి వచ్చి కాన్సిల్ చేసిండుగా" అన్నాడు సెంట్రీ. శర్మ తాపీగా కళ్ళు మూసుకుని వెనక్కి వాలాడు. మళ్ళీ అతడికి స్పృహ తప్పిందేమో అనుకుని నీళ్ళు పడుతూంటే హాయిగా వుంది. మనసు కూడా హాయిగా ఎక్కడో తేలిపోతున్నట్టూ వుంది.

"కథ సుఖాంత మైందన్న మాట" అనుకున్నాడు శర్మ. అసలు కథ అప్పుడే ప్రారంభం అయింది.

## మూడో అధ్యాయం

రకరకాల లైట్ల కాంతి ఆ హాలులో ధగధగా మెరుస్తోంది. చిరంజీవి ఫుల్ సూట్‌లో వున్నాడు. గెలుపు తెచ్చిన ఆనందం అతడి మొహానికి అదోలాంటి మెరుపుని సమకూర్చింది. నీట్‌గా షేవ్ చేసుకున్న చెంపల మీద వెల్తురు పడి అందంగా మెరుస్తోంది.

ఆ హాల్లో దాదాపు పాతిక మంది దాకా అతిథులు వున్నారు. అందరిచేతుల్లోనూ గ్లాసులున్నాయి. కొంత మంది ఆడవాళ్ళు కూడా వున్నారు. ఆడవాళ్ళ కళ్ళు మాటిమాటికీ చిరంజీవి మీద పడటం చూసి తనలో తనే అర్చన నవ్వుకుంటోంది. సర్వోత్తమరావు ఒక్కడే అక్కడ లేడు. ఇంకా తొడ ఎముక అతుక్కోని కారణంగా ఆయన నర్సింగ్‌హోమ్‌లోనే వున్నాడు.

ఒక ఫోటో గ్రాఫర్ ఫ్లాష్‌తో చిరంజీవిని ఫోటోలు తీస్తున్నాడు. ఇద్దరు, ముగ్గురు జర్నలిస్టులు అతడి వద్ద చేరి ఉరికి సంబంధించి వివరాలు అడుగుతున్నారు.

"ఇంతవరకూ చరిత్రలో ఎక్కడా మెడలో తాడు వేసిన తర్వాత బైట పడటం అనేది జరగలేదు. ఆ క్షణం మీరెలా ఫీలయ్యారు."

చిరంజీవి నవ్వి "చెప్పలేను" అన్నాడు "నాకు భాష సరిగ్గా రాదు. బహుశా మనసంతా వేదాంతం నిండివుందేమో ఆ క్షణం చెప్పలేను."

"ఉరికన్నా ఎలక్ట్రిక్ ఛెయిర్ మంచి సాధనమే ప్రాణాలు తీయ్యటానికి" అన్నారెవరో.

"ప్రాణాలు ఎంత సులభంగా తీయగలమా అన్నది కాదు మేం కోరుకునేది. అసలు మరణశిక్షనే రద్దు చేయాలని" అంటూ చిరంజీవి అక్కణ్నుంచి మరో గ్రూపు వద్దకు కదిలాడు. అర్చన కూడా అక్కడే వుంది. అతడిని చూసి నవ్వింది.

ఆ గ్రూపులోనే వున్న లావుపాటావిడ చిరంజీవిని చూసి "ఏమబ్బాయ్ మాకు పప్పన్నం ఎప్పుడు పెడతావ్" అంది, ఆవిడ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారి భార్య.

చిరంజీవి నవ్వి వూరుకున్నాడు. అర్చన అతడి వైపు ఓరగా చూసింది.

"ఈ కేసు ఎప్పటికి పూర్తవుతుంది" అడిగిందామె మళ్ళీ.

"ఇంక పూర్తవటానికేముంది" అన్నాడామె భర్త. అతడు ప్రాసిక్యూటరే గానీ, చిరంజీవికి వ్యతిరేకంగా వాదించినవాడు కాదు. ఈయనకి నలభై అయిదేళ్ళుంటాయి. 'లా' క్షుణ్ణంగా తెలిసినవాడు.

"సర్వోత్తమరావుగారి సాక్ష్యంతో కేసు కొట్టేస్తారు. అప్పటి వరకూ మాత్రం బెయిల్ మీద వుండాలి" అని చిరంజీవివైపు తిరిగి "మొత్తం మీద భలే సెన్సేషన్ క్రియేట్ చేశావోయ్. ఈ ఉరి రద్దుగురించి పేపర్లు ఎడిటోరియల్స్ వ్రాయటం మొదలు పెట్టినయ్, అనధికార వార్త ఏమిటంటే, అప్పుడే ఢిల్లీలో ఈ రద్దుకోసం 'కదలిక' మొదలైందట! కొంతమంది ఎమ్.పి.లు ప్రధాన మంత్రిని కలుసుకున్నారట కూడా."

"కంగ్రాచ్యులేషన్స్"

ఆ ప్లాటరీతో చిరంజీవి అక్కణ్ణుంచి తప్పుకొని హాలు బైట బాల్కనీ లోకి వచ్చాడు. బోగన్‌విల్లా అందంగా వూగుతోంది.

గాజు అద్దాల వెనుక నుంచి జనం నీడల్లా కనబడుతున్నారు.

అతడు ఒంటరిగా నిలబడి వుండటం చూసి, అర్చన కూడా బైటికి వచ్చింది. ఇద్దరూ చాలాసేపు మౌనంగా వున్న తర్వాత, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "ఐయామ్ సారీ అర్చనా" అన్నాడు.

ఆమె విస్మయంతో "ఎందుకు" అంది.

"ఇదంతా చిన్నపిల్లాడిలా చేశాను. అనవసరంగా మీ అందరికీ టెన్షనూ, పేపర్లో నీ గురించి హంతకుడిని ప్రేమించిన అమ్మాయిగా వర్ణించడం....... నీ సర్కిల్స్‌లో అది నీకు తలవంపులు" అంటూ యేదో అనబోతూవుంటే ఆమె వారిస్తూ, "నువ్వు ఇదంతా చేసింది ఒక ఆశయ సాధనకోసం! పైకి నవ్వుగానే కనపడవచ్చు గానీ, అందులో ఎంత రిస్కూ, బాధా వున్నాయో ఆలోచించిన వాళ్ళకే తెలుస్తోంది" అంది.

"కానీ....." అంటూ ఏదో అనబోయాడు.

"ఇక అదంతా మర్చిపో. ఈ హత్య - జైలు, అంతా ఒక కల అనుకో."

అతడు నవ్వి "సుశీల గురించి కూడా మర్చిపోమంటావ్" అన్నాడు.

ఆమె కోపంగా చూసి, 'ఊ' అంది. అతడు ఈసారి కొద్దిగా బిగ్గరగానవ్వి, "ఓ.కే. ఓ.కే. మర్చిపోదాం. ఈ హత్య గురించీ - సుశీల గురించీ పూర్తిగా మర్చిపోదాం, అంతకన్నా కావల్సిందేముంది" అన్నాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

19 వ భాగం

"లోపలికి పోదాం పద, ఇక్కడ చీకటిగా వుంది."

అతడు కదలకుండా, "నిజం చెప్పు అర్చనా! నాకు ఇటువంటి కాంప్లెక్సు వున్నవాడినీ - ప్రతి దాంట్లోంచీ హాస్యాన్ని పుట్టించేవాణ్ణీ, ప్రేమించటానికి నీకు బాధగాలేదూ" అన్నాడు.

"ఇప్పటివరకూ లేదు. కానీ నువ్వు మాటిమాటికీ ఆ మాట అంటే నిజమేనన్న అభిప్రాయం కలగొచ్చు కూడా, అయినా హీరో డబ్బున్న వాడైతే ఎప్పుడూ సీరియస్‌గా, నీట్‌గా సూట్‌లోనే వుండాలనీ లేక బీదవాడైతే సర్వకాలం సర్వావస్థలోనూ నీతీ నిజాయితీ - నమ్రత - అందం - తెలివితేటలు వగైరాల్తో ప్రవర్తించాలనీ రూల్ లేదే" అంది.

"అయితే నేను హీరోనేనంటావ్" అపనమ్మకంగా అడిగాడు.

ఆమె కొద్దిగా చీకట్లోకి జరిగి, చప్పున అతడి మెడచుట్టూ చేతులు వేసి ఏం జరిగిందో అతడు గ్రహించేలోపులో ముద్దు పెట్టుకుని 'ఈ రుజువు చాలా' అని, అతడు జవాబు చెప్పేలోపులో తూనీగలా లోపలికి పారిపోయింది.

మంచి షాంపూతో తలారా స్నానం చేసినట్టయింది చిరంజీవికి. ముందు మత్తెక్కింది, తరువాత లోపల్నుంచి ఆనందం తన్నుకొచ్చింది. గాలిలో తేల్తున్నట్టు లోపలికి వెళ్ళాడు. ఏవీ జరగనట్టు అర్చన చాలా మామూలుగా అతిధులకి అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయో, లేదో చూస్తోంది.

అతడు ఆమె పక్కగా చేరి "అప్పులు తీసుకోవటం, ఇంకొకరిది నా దగ్గర వుంచుకోవటం నా కిష్టం ఉండదు. నీది నీకిచ్చేద్దామనుకుంటున్నాను" అన్నాడు సీరియస్‌గా.

అర్చనకి ముందు అర్థం కాలేదు. అర్థం అయ్యాక "తరువాత ఇవ్వొచ్చులే" అంది చుట్టూవున్న జనాన్ని చూసి.

"వడ్డీ పెరిగిపోతుంది"

"ఇంతమందిలో అప్పుల ప్రసక్తి బావోదు."

"ఎక్కడ తీసుకున్నానో అక్కడ యిచ్చెయ్యటం ఒక మంచి పౌరుడిగా నా ధర్మం."

పక్కవాళ్ళకి ఈ సంభాషణ అర్థం కావటం లేదు.

"ఈ కాలంలో మంచి పౌరుల్ని ఎవరూ ఇష్టపడరు, తెలివితేటల్తో అవకాశాలు కల్పించుకోగలిగే వాళ్ళనే లైక్ చేస్తారు. అప్పు ఎలా తీరుస్తావో ఇక నీ ఇష్టం" అంది అర్చన కవ్విస్తున్నట్టు.

"చూస్తూ వుండు, పార్టీ అయిపోయేలోపులో నీ అప్పు తీర్చెయ్యకపోతే…" అన్నాడు చిరంజీవి.

ఆ క్షణం నుంచీ అతడు ఆలోచనలో పడ్డాడు. తన తెలివి తేటలకి అదో పరీక్ష. అతడు అందరితో మాట్లాడుతూవున్నాడన్న

మాటేగానీ ఆలోచిస్తున్నాడు. రెండు నిముషాల తరువాత ఫ్రిజ్ వున్న గదిలోకి వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చేశాడు.

కొంచెం ఎత్తుగా వున్న ప్లేస్‌మీద నిలబడి "ఫ్రెండ్స్" అన్నాడు. అందరూ అతడివైపు చూశారు.

"ఈరోజు ఈ పార్టీ జరగటానికి - ఒక రకంగా చెప్పాలంటే నేను మృత్యుముఖం నుంచి బైట పడటానికి కారణం ఒక వ్యక్తి! కేవలం మానవతా వాదంతో ఎంతో రిస్కు తీసుకున్న ఆ వ్యక్తి ఈ పార్టీకి వి.ఐ.పి.గా పరిచయం చేయటం నాకు చాలా సంతోషకరం"

అందరూ చిరంజీవి ఎవరి గురించి చెప్తున్నాడా అని ఎదురుచూడసాగారు. చిరంజీవి పక్కకి వంగి కొద్దిగా సిగ్గుపడ్తూన్న విష్ణుశర్మని పైకిలాగి "త్రీ ఛీర్స్ టు ది హీరో ఆఫ్ ది అకేషన్" అన్నాడు.

అంతే! ఆ గది చప్పట్లతో మార్మోగిపోయింది. శర్మ కంగారుపడి నమస్కారం పెట్టాడు! మరిన్ని నవ్వులు.

అర్చన మాత్రం చిరంజీవివైపు సంభ్రమాశ్చర్యాల్తో చూసింది. నలుగురిలో గట్టిగా మాట్లాడటానికే సిగ్గుపడే ఇతడంటే చిరంజీవే అని నమ్మకం కుదరటం లేదు.

ఇంతలో రామయ్య వచ్చి - ఫ్రిజ్ పని చెయ్యటం లేదని చెప్పటంతో ఆమె లోపలికి వెళ్ళి చూసింది. ఫ్రిజ్‌లో లైటు వెలగటం లేదు. పరీక్షిస్తే ప్లగ్ తీసేసి వుంది. ప్లగ్‌ని ఆమె హోల్డర్‌లోపెట్టింది, అంతే, టప్‌మన్న చప్పుడుతో కరెంట్ పోయింది. జనం గోల!

రామయ్య కొవ్వొత్తుల కోసం రూమ్‌లోకి వెళ్ళాడు.

"ఫ్యూజ్ పోయినట్టుంది" అంటున్నారెవరో పార్టీలో.

"ఆ విషయం స్ఫూర్తికి తెలుసు. అతడు బాగుచేసే పనిలోనే వున్నాడు" చెవి పక్కగా వినిపించేసరికి అర్చన ఉలిక్కిపడి తిరగబోయింది. కానీ, అప్పటికే ఆలస్యమయింది. చిరంజీవి అప్పు తీర్చేశాడు.

రెండు నిముషాల్లో కరెంటు వచ్చింది. చిరంజీవి అక్కడ లేడు. అసలేమీ జరగనట్టూ ఎవరో జర్నలిస్టుతో మాట్లాడుతున్నాడు.

"అవకాశాలు మనమే కల్పించుకోవాలండీ! చుట్టూ జనం వున్నారు కదా అని ధైర్యంగా పందెం కాస్తే అది వాళ్ళ తప్పు."

ఎదుటి జర్నలిస్టుకి ఏవీ అర్థం కావటం లేదు. ఏడవలేక నవ్వుతూ "మరే మరే" అంటున్నాడు.

"అసలు తీర్చినవాడు వడ్డీ తీర్చకుండా వుంటాడా! మీరే చెప్పండి"

"ఎందుకు తీర్చడు? తప్పక తీరుస్తాడు" వంత పాడాడు.

"తీరుస్తాడు కాదు. తీర్చగలడు - అనండి" చిరంజీవి సరిదిద్దాడు.

"అవును. తీర్చగలడు!!"

వింటూన్న అర్చన మొహం ఉక్రోషంతో ఎర్రబడింది. ఆ సోడాబుడ్డి కళ్ళద్దాల జర్నలిస్టుని లాగి కొడ్డామన్న కోర్కెని బలవంతం మీద ఆపుకుంది. పాపం అతడు మాత్రం ఏం చేస్తాడు? నాలుగో పెగ్గులో వున్నాడు. చిరంజీవి నవ్వుతున్నాడు.

ఆమె ఏదో పని కల్పించుకుని లోపలికి వెళ్ళిపోయింది.

పార్టీ మొదలై చాలా సేపవటంతో - జనం బిగ్గరగా మాట్లాడటం మొదలుపెట్టారు. స్పీకర్‌లోంచి సితారు వినిపిస్తూంది. చిరంజీవి పక్కకి స్ఫూర్తి వచ్చి చేరాడు.

"కొద్ది సేపట్లో కరెంటు పోతుందనీ - అదీ ఫ్యూజ్ పోవటం వల్లే పోతుందనీ ఎలా తెలుసుకున్నావ్ గురూ?"

"సైకో టెలీపిపోప్నపతీ,"

"అమ్మో - అమ్మో - అదెలా వస్తుంది గురూగారూ" జర్నలిస్టు అడిగాడు.

"ఎవరైనా అమ్మాయి మనకి అప్పెడ్తే వస్తుంది" అన్నాడు చిరంజీవి.

తన మాటలు లోపల అర్చనకి వినబడ్తున్నాయని చిరంజీవికి తెలుసు.

"అమ్మాయిలు మనకి అప్పెట్టటమా - భలేవారే - మన దగ్గర తీసుకోకపోతే అదే చాలు" అన్నాడు జర్నలిస్టు.

"సాధరణంగా వాళ్ళు 'తీసుకుంటూ' వుంటారు. కానీ బాగా హుషారొస్తే వాళ్ళే యిస్తూ వుంటారు."

"ఏమిటో గురూగారూ - ఆడపిల్లల సంగతి అలా వుంచండి. ఒక్కడు కూడా అవసరం వస్తే అప్పు పెట్టడు నాకు" అన్నాడు జర్నలిస్టు విచారంగా.

"మీరా సోడాబుడ్డి కళ్ళద్దాలు మార్చకపోతే - అప్పెట్టటం అలా వుంచండి, కనీసం అప్పు తీసుకోవటానికి కూడా ఆడపిల్ల రాదు" జర్నలిస్టు అహం దెబ్బతిన్నది.

"రాకపోతే వాళ్ళ ఖర్మ సార్ - ఆ సుశీల చూడండి, ఒక్క బోయ్ ఫ్రెండూ లేక దిక్కులేని చావు చచ్చింది"

స్ఫూర్తి కల్పించుకుని "అంటే బోయ్ ఫ్రెండ్స్ వున్నది, ఛస్తే తగలెయ్యటానికా?" అన్నాడు.

"అబ్బెబ్బె - నా ఉద్దేశ్యం అదికాదు గురూగారూ! మనలాంటి ఓ స్నేహితుడుంటే, ఆ ముసలమ్మ శవాన్ని అమ్మే ధైర్యం చెయ్యదు కదా."

"సుశీల అలాంటిది కాదు. చాలా మంచిపిల్ల" అన్నాడు చిరంజీవి. "తనెవరితోనూ ఎక్కువ మాట్లాడదు. మొగవాళ్ళంటే అసహ్యం తనకి"

సర్వర్‌తో ట్రే పట్టించుకొస్తూన్న అర్చన హఠాత్తుగా ఆగిపోయింది. చిరంజీవి చాలా క్యాజువల్‌గా మాట్లాడేస్తున్నాడు. ఆమె ఆలోచనలు మాత్రం అక్కడే, ఆ వాక్యం దగ్గరే - "సుశీల అలాంటిది కాదు. చాలా మంచి పిల్ల .... తనెవరితోనూ మాట్లాడదు. మొగవాళ్ళంటే అసహ్యం తనకి......"

అర్థ రాత్రి శవాన్ని తీసుకొచ్చిన వాడికి ఆమె ఎలాంటి అమ్మాయో ఎలా తెలిసింది? చచ్చిపోయిన సుశీల్ని నూతిలో పడేసిన వాడికి - ఆమె బ్రతికి వున్నప్పుడు ఎవరితోనూ మాట్లాడేది కాదనీ, ఆమెకి మొగవాళ్ళంటే అసహ్యం అనీ ఎలా తెలిసింది?

చాలా చిన్న అనుమానం! చరిత్ర చీకట్లో కప్పబడిపోయిన ఒక అద్భుత రహస్యం వెలికి రావటానికి ఆ అనుమానం కారణమైంది. ఆ అనుమానంతో మంటల్లో రెక్కలు కాలిపోయిన పురుగులా అమె మనసు విలవిలలాడింది. అయోమయంగా వాళ్ళకేసి చూస్తూ వుండిపోయింది. ఆమెని ఎవరూ గమనించలేదు.

"మంచిపిల్ల కాబట్టే రేప్ చేయబడిందోయ్. చెడ్డపిల్ల అయితే రేప్ ఎందుకు - అంతా స్ట్రైపే......." స్వామి రెడ్డి అంటున్నాడు.

"ఇందులో రేప్ ఏముంది? రేప్ లేదు, మర్డర్ లేదు."

"మనవాడు ఆద్యంతమూ స్పృశించాడు కాబట్టి అది రేప్......."

"ఇక ఆ సుశీల ప్రసక్తి మానేస్తే మంచిదేమో" అన్నాడు చిరంజీవి.

"అవును. మనవాడి కొత్త జీవితం ప్రారంభం అవుతుంది కాబట్టి పాత ఛాప్టర్లు మూసెయ్యాలి. మనవాడి కొత్త లైఫ్‌కి మరోసారి ఛీర్స్"

అర్చన చిరంజీవి మొహాన్నే చూస్తోంది. అతడి మొహంలో చచ్చిపోయిన సుశీల గురించి మాట్లాడటం ఎందుకులే అన్న సానుభూతి కనబడలేదు. ఆ పీడకల గురించి మర్చిపోదాం అన్న భావం కనబడుతోంది.

అయితే ఆ పీడకల తన గురించా? సుశీల గురించా? సుశీల గురించే అని ఆమె మనసు చెబుతోంది.

అంతలో పక్కనెవరో గట్టిగా నవ్వేసరికి ఈ లోకంలోకి వచ్చింది. చిరంజీవి బిగ్గరగా నవ్వుతూ అంటున్నాడు - "అంత తెలివి మన పోలీస్ డిపార్టుమెంటుకి ఎక్కడుందండీ - ఇక డాక్టర్లంటారా......." అని ఏదో అనబోయి, పక్కనే అర్చనని చూసి "ఓ సారీ! డాక్టరుగారూ ఇక్కడే వున్నారు" అన్నాడు.

అందరూ తనవైపు చూసేసరికి అర్చన బలవంతం మీద నవ్వు తెప్పించుకుని అక్కణ్ణుంచి తప్పుకుంది.

అక్కణ్ణుంచి కదిలిందన్నమాటే గానీ ఆమెకి ఏదో వెలితిగా అనిపించసాగింది. ఆ పార్టీలో ఇమడలేక పోతోంది. కొంచెం సేపు బైటకొచ్చి బాల్కనీలో నిలబడింది. మళ్ళీ లోపలికి వెళ్ళింది. ఎవరి హడావుడిలో వాళ్ళుండి ఆమెనెవరూ పట్టించుకోలేదు. ఆమెకూడా ఎవరితోనూ మాట్లాడలేదు. మనసులో ఏదో తొలుస్తూ వుంది.

అయినా ఇందులో పెద్ద ఆలోచించాల్సిందేముంది? ప్రాసిక్యూషన్ వాళ్ళు కోర్టులో హత్యకేసు విచారణ కొచ్చినప్పుడు - సుశీల అనే హతురాలికి మొగవాళ్ళంటే ద్వేషం అని చెప్పి వుండవచ్చు. దాన్ని విన్న చిరంజీవి అవే మాటల్ని ఇప్పుడు రిపీట్ చేసి వుండవచ్చు.

ఈ ఆలోచన వచ్చాక ఆమె కొద్దిగా తేరుకుంది. ఆమె లోపలికి రాబోతూ వుంటే పబ్లిక్ ప్రాసిక్యూటర్ "ఏమ్మా - అర్చనా, మా చేతుల్లోనేనా వుండాల్సింది - నువ్వు తాగవా" అంటూ చొరవగా ఆపిల్ జ్యూస్ అందించాడు. తరువాత వాళ్ళిద్దరూ

సంభాషణలోకి దిగారు.

"ఎలా వుంది మామయ్యకి" అడిగాడు ఆయన.

"ఎముక హీల్ అవ్వాలట. దానికి ఎంతలేదన్నా ఇంకొంత కాలం పట్టొచ్చు" అంది అర్చన.

"మొత్తానికి చాలా గొప్ప ప్లాన్. ఎవరు వేశారు? చిరంజీవా? ఆయనా??"

"చిరంజీవే"

"కంగ్రాచ్యులేషన్స్ అమ్మాయ్. చాలా తెలివైన కుర్రాడు నీకు భర్తగా లభిస్తున్నాడు"

అర్చన నవ్వి వూరుకుంది. వాళ్ళకి కొద్ది దూరంలో స్వూ ర్తి వాళ్ళు జోకులేసుకుంటూనే వున్నారు.

"చిరంజీవేమిటి మనిద్దరిమీదా సెటైర్లు విసురుతున్నాడు?" అన్నాడాయన. అర్చన ఆశ్చర్యపోయి "మనిద్దరిమీదా?" అంది.

ఆయన బిగ్గరగా నవ్వి "అదేనమ్మా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అంటే పోలీసు డిపార్టుమెంటు, నువ్వంటే డాక్టరు" అన్నాడు.

అర్చన కూడా నవ్వి "ఒక్క చిరంజీవికేమిటి - చాలా మందికి పోలీసులన్నా, డాక్టర్లన్నా తేలిక అభిప్రాయమేగా" అన్నది.

"అది చాలా తప్పు అభిప్రాయం అమ్మాయ్."

"అందులో తప్పేంలేదు" అన్నదామె "మన డాక్టర్లు ఎంత తెలివైన వాళ్ళంటే, శవం నూతిలో దొరికింది కాబట్టి, నీళ్ళలో మునగటం వల్లనే మరణం సంభవించిందని పోస్ట్‌మార్టమ్ రిపోర్టు ఇచ్చేస్తారు. అంతేకానీ ఊపిరితిత్తుల్లో నీళ్ళున్నాయా లేదా అని చూడరు. ఒకవేళ ఊపిరితిత్తుల్లో నిజంగా నీళ్ళున్నాయి అని వాళ్ళు వ్రాసినా, మన పోలీసులు ఎంత తెలివైన వాళ్ళంటే, బైటే పీక నులమబడి చచ్చిన శవం, బావిలో పడ్డాక నీళ్ళెలా పీల్చిందీ అనైనా ఆలోచించరు. ఉదాహరణకి సుశీల కేసు తీసుకుందాం" అంటూ చెప్పబోయింది.

ఆయన "అబ్బెబ్బె, సుశీల కేసు గురించి మనం ఆలోచించనక్కర్లేదు. ఆ పోస్టుమార్టమ్ చేసింది ఎవరనుకున్నావ్? డాక్టరు రావుగారు. ఆయన రిపోర్టు యిచ్చారంటే దానికి తిరుగులేదు. దాదాపు పది పేజీల రిపోర్టు ... అన్నీ పరీక్షించి విపులంగా వ్రాస్తారాయన" అన్నాడు.

ఆ రిపోర్టు యిచ్చింది రావు అని తెలిసేసరికి యింకేం మాట్లాడలేకపోయింది ఆమె. "ఎవరూ? మా పాథాలజీ ప్రొఫెసర్ రావ్‌గారా" అంది.

"ఆయనే"

"ఆయన నాకు బాగా తెలుసు."

ఇంతలో ఎవరో రేడియోగ్రామ్ వాల్యూమ్ ఎక్కువ చేశారు. దానికి తోడు రౌండ్స్‌లో వున్నవాళ్ళ కంఠం కూడా పెరిగింది. నవ్వులు ఎక్కువయ్యాయి. రామయ్యా, బైరాగీ హడావుడిగా తిరుగుతూ అన్నీ చూసుకుంటున్నారు.

టైమ్ ఏడున్నర అయింది. పార్టీ పూర్తయ్యేసరికి ఎంత లేదన్నా ఇంకో రెండు గంటలు పడుతుంది. తను లేకపోయినా అది సాగిపోతుంది.

ఆమె నిరాసక్తంగా బైటకి వచ్చింది. గేటు దగ్గర గూర్ఖా మసక వెల్తుర్లో ఆమెని గమనించి చప్పున లేచి నిల్చున్నాడు. కాంపౌండ్ లోనూ, బైట రోడ్డుమీద కార్లు వరుసగా వున్నాయి.

ఆమె గారేజీ దగ్గర కొచ్చి క్షణం సేపు ఆలోచిస్తూ నిలబడింది. లోపల్నుంచి నవ్వులు, మ్యూజిక్కూ వినబడుతున్నాయి. ఆమె కొద్దిగా తటపటాయించి, తరువాత ఓ నిర్ణయానికి వచ్చినట్లు గ్యారేజీలోంచి కారు తీసి, ప్రొఫెసర్ రావ్ ఇంటివైపు పోనిచ్చింది.

........

ప్రొఫెసర్ రావ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్. తన విద్యలో ప్రావీణ్యం వున్న వాడేకాక, చేసిన ప్రతి పనిని చాలా శ్రద్ధతో, ఓర్పుతో చేస్తాడు. అర్చన మెడికో కాబట్టి ఆమెకి ఆయన తెలుసు.

ఆమె వెళ్ళేటప్పటికి ఆయన తన లైబ్రరీలో పుస్తకం చదువుకుంటున్నాడు. అర్చనని చూసి "రా అమ్మా రా - ఏమిటి ఇలా వచ్చావ్" అని ఆహ్వానించాడు.

"ఏం లేదు సర్" అంది అర్చన, కూర్చుంటూ "నేనూ, చిరంజీవి పందెం వేసుకున్నాం" అన్నది, కొంత సంభాషణ మామూలుగా జరిగాక.

"అవును ఆ విషయమే మర్చిపోయాను. చిరంజీవిని వదిలేశారటగా. కంగ్రాట్స్! ఇంతకీ ఏం పందెం వేసుకున్నారు?"

"డాక్టర్లు దేనికీ పనికిరారని అన్నాడు. నూతిలో పడిన మనిషి నీళ్ళు తాగి మరణించిందా? మరణించిన తరువాత పడిందా కూడా చెప్పలేరన్నాడు" నవ్వుతూ అంది.

"ఎందుకు చెప్పలేం? చాలా సులభంగా చెప్పొచ్చు" అని అంతలోనే ఏదో స్ఫురించినట్టు...... " ఆ సుశీల కేసులోనూ ఈ వాదన వచ్చింది? ఆ కేసులోనే అయితే ఆ అమ్మాయి నూతిలో పడటానికి ముందు మరణించింది. నేను రిపోర్టులో అదే వ్రాశాను. చిరంజీవి కోర్టులో కూడా అలాగే చెప్పాడు" అన్నాడు. "నిజంగా మీ మామయ్యది మాస్టర్ ప్లాన్ అమ్మాయ్. రేపు ఆస్పత్రికి వెళ్ళినప్పుడు అభినందించాలి. శవాన్ని తిరిగి చంపటం అనేది గొప్ప ఆలోచన."

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

20 వ భాగం

అర్చన చాలా నెమ్మదిగా, కానీ స్పష్టంగా అంది "సుశీల రాత్రి ఏడూ ఎనిమిది మధ్య మరణించింది. చిరంజీవి వాళ్ళూ ఆమెని అర్ధరాత్రి దాటాక బావిలో పడేశారు. అలా పడేసేముందు మెడ నులిమారు. అప్పటికే రిగర్ మార్టిన్ ప్రారంభం అయివుంటుంది కదా. మరి మెడ నులిమిన గుర్తులు శరీరం మీద ఎలా పడ్డాయి...... సార్?"

ఆయన షాక్ తగిలినట్టు నిశ్చేష్టుడయ్యాడు.

నిజమే! రిగర్ మార్టిన్ మూడు స్టేజీల్లో వుంటుంది. హతురాలి శవాన్ని నూతి దగ్గరకి తీసుకొచ్చే సమయానికే శరీరం రెండో స్టేజిలోకి వచ్చేసి వుంటుంది. మరి మెడమీద......

ఆయనేదో చెప్పబోయి, ఆగి "ఇదేం లాభం లేదమ్మాయ్. పోస్ట్‌మార్టమ్ రిపోర్టు చూడాల్సిందే - " అని రాక్‌లోంచి ఒక టైప్ చేసిన పుస్తకాన్ని ఆమె కిస్తూ "ఇదే రిపోర్టు చదువుతూ వుండు, ఈ లోపులో రెండు కప్పులు టీ పట్టుకొస్తాను" అన్నాడు. "అబ్బే, ఇప్పుడేమీ వద్దండీ -"

"నాక్కావాలమ్మాయ్. నువ్వు చెప్పిన లాజిక్కుతో తల తిరిగిపోయింది." అంటూ లోపలికి వెళ్ళాడు.

అర్చన నవ్వి, ఆ రిపోర్టు తీసుకుని, కుర్చీ వెనక్కి వాలి చదవటం మొదలుపెట్టింది.

ఫ్రం

స్టేషన్ హౌస్ ఆఫీసర్

గాంధీపురం.

టు

ప్రొఫెసర్ రావ్, ఫోరెన్సిక్ మెడిసిన్ మెడికల్ కాలేజి

సర్,

పి.సి. నెం. 295 ద్వారా మేం పంపుతున్న సుశీల అనే ఈ యువతి శరీరాన్ని శవ పరీక్ష చేసి, మీ నివేదిక పంపగలరు. శరీరంలోని ప్రతీ అంగాన్ని పరీక్షించటం అనేది ముఖ్య విషయంగా భావించమని మనవి.

సం.......యస్. హెచ్.ఓ.

తేదీ...... ........... ..........

అర్చన పేజీ తిప్పింది.

శరీరపు వివరాలు : కుమారి కె. సుశీల - వయస్సు ఇరవై ఒకటి - స్త్రీ - ఎత్తు అయిదడుగుల రెండంగుళాలు - నీలికళ్ళు - నల్ల జుట్టు - మోకాలికి పైగా చిన్న మచ్చ - గాంధీపురం సత్రం పక్కన నూతిలో కనుక్కోబడిన శరీరం. తెల్ల లంగా, నీలం చీరె - అదేరంగు జాకెట్టు - చెవులకి రోల్డుగోల్డు రింగులు - ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్ సంతకం, తేదీ, శవం కనుక్కోబడిన టైము, మరణాన్ని ఊహిస్తున్న టైము......

తరువాత నివేదిక మొదలైంది.

"నాకందజేయబడిన కుమారి సుశీల అనే యువతి తాలూకు శరీరపు భాగాల్ని, శరీరాన్ని పరీక్షచేసి వున్నాను, సదరు శరీరం పి. సి. నెం 295 ద్వారా నాకు అందజేయబడింది. ఆ శరీరం సుశీలదే అని, శరీరాన్ని ఛిద్రం చేసేముందు పి. సి. 295 అహ్మద్ ఆలీ గుర్తించి వున్నాడు. మొకాలిమీద పుట్టుమచ్చకూడా గుర్తించబడింది. పోస్టుమార్టమ్ సరిగ్గా పొద్దున తొమ్మిదింటికి ప్రారంభం అయింది.

శరీరం మీద మెడ నులిమిన గుర్తులు స్పష్టంగా కనబడ్తున్నాయి. మొహం పాలిపోయి, కనుగుడ్లు పచ్చగా వున్నాయి. నాలుక లావై, పెదవులు నీలంగా వున్నాయి. చర్మపుకకణాలు తెల్లబడి, మెడ చుట్టూ దండలా యేర్పడ్డాయి - గుండెని పరీక్షచేసి చూడగా, ఎడమవైపు కవాటంలో రక్తం తక్కువగా వుండి, ఆ అనుమానాన్ని ధృవపర్చింది. ఊపిరితిత్తుల్లో నీరు లేదు. వక్షోజాలమీద గోళ్ళ గుర్తులున్నాయి. పెటిజియల్ హెమరేజి వున్నది. ప్లూరల్ కేవిటీలో ఒక ఔన్సు దాకా నీరువుంది. కుడివైపు గుండెలో వున్న నల్లరక్త శ్వాస ఆడకపోవడం వల్ల క్లాట్ అయినట్టూ తెలుస్తూంది.

శరీరపు ప్రైవేట్ పార్ట్స్‌ని పరీక్ష చేయటం జరిగింది. ప్యూబిక్ హేర్ వున్నది. కాళ్ళు విడదీస్తే లాబియామీద స్టెయిన్స్ వున్నాయి, వెజీనా ఆమె అప్పటి వరకూ కన్య అని చెబుతుంది గానీ హైమన్ పొరమీద 5 గంటల పొజిషన్‌లో చిరుగు వుంది. చివర్లు తెల్లగా పాలిపోయినా, లేతగా వున్నాయి, టు ఓ క్లాక్ పొజిషన్‌లో ఇంకో చిరుగు కనబడ్తూంది! ఇది ఎర్రగా కమిలిపోయివుంది.

టు ఓ క్లాక్ పొజిషన్‌లో వున్న చిరుగు బలవంతపు ఇంటర్‌కోర్స్‌ని సూచిస్తోంది. వెజీనాలో వున్న సాంద్రపదార్థాన్ని మైక్రోస్కోప్‌లో పరీక్షించగా అందులో స్పెర్మటోజోవా వున్నట్టుగా గుర్తింపబడింది.

ఇది సహజమరణం కాదనీ హత్య అనీ నేను ధృవీకరిస్తున్నాను. మరణం సంభవించి ముప్పై ఆరు గంటలయింది. మరణానికి కారణం ఆస్ఫిక్సియా! నీళ్ళలో పడటానికి కొన్ని గంటల ముందే మెడ నులమబడింది. అలా చంపటానికి కొద్ది ముందుగా హంతకుడు ఆమెను దారుణంగా రేప్ చేశాడని రుజువవుతూంది......"

చదవటం పూర్తి చేసిన అర్చన అలాగే కుర్చీలో కూర్చుండిపోయింది. రక్తం లేనట్టూ ఆమె మొహం పాలిపోయింది. చేతిలోంచి రిపోర్టు జారి ఎప్పుడో వళ్ళో పడిందో తెలీదు.

......

ఆమె వేగంగా కారు డ్రైవ్ చేయటం లేదు. తను హోస్టెస్‌నీ - పార్టీ యిస్తున్నది తనేననీ, అతిథులు తనకోసం ఎదురు చూస్తూ వుంటారనీ ఆమెకి తెలుసు.

కానీ యిక్కడ సమస్య తన జీవితానికి, భవిష్యత్తుకీ సంబంధించింది ఇది ముఖ్యం. ఇప్పుడీ అనుమానాన్ని వెంటనే తీర్చుకోకపోతే అది భూతమై, పెనుభూతమై, వేధించే అవకాశం వున్నది. ఏం చెయ్యాలి...? తనేం చెయ్యాలి?

ఆలోచన్లతోనే ఆమె కారు డ్రైవ్ చెయ్యసాగింది. అప్పుడు టైమ్ ఎనిమిదింపావు అయింది. బాగా చీకటిగా వుంది అక్కడ.

ఇల్లు కొద్దిదూరంలో వుందనగా సడన్ బ్రేక్‌తో ఆమె కారును ఆపుచేసింది. చీకట్లో ఇల్లూ, ఇంటిముందు కాంపౌండులో చెట్లు అస్పష్టంగా కనబడుతున్నాయి. వాటిని కాదు ఆమె చూస్తున్నది. గేట్ బైట, ఇంటి ముందు ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నారు. ఆమె పాలిపోయిన మొహంతో కార్లోనే కూర్చుని ఆ యిద్దర్నీ గమనించసాగింది. ఆ యిద్దర్లో ఒకరు చిరంజీవి!

చిరంజీవి లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగి బైటకొచ్చాడు. ఇద్దరూ చీకట్లో కలిసిపోయారు. పార్టీ మధ్యలో అతడెందుకు అలా వెళ్ళిపోతున్నాడా అని ఆలోచించడంలేదామె! అంతకన్నా పెద్ద విషయం - ఆ పక్కనున్న వ్యక్తి.

ఒక కాలు యిటూ, ఒక కాలు అటూ వేస్తూ వెళ్ళిపోతున్న ఆ వ్యక్తి యెవరో నడకని బట్టి పోల్చుకుంది ఆమె.

ఆ నడక దారాసింగ్‌ది. పార్టీ మధ్యలో చిరంజీవి ఎందుకు వెళ్ళిపోతున్నాడు? అందులోనూ దారాసింగ్‌తో కలిసి? ఒక క్షణం తటపటాయించి ఆమె కూడా కారు ముందుకు పోనిచ్చింది.

ఇంట్లో అతిధుల్ని వదిలి ఇలా తిరగడం సభ్యత కాదు. కానీ ఇది జీవన్మరణ సమస్య! తన వెనుక ఏదో గూడు పుఠాణీ జరుగుతోంది. ఎంత చనువు లేకపోతే దారాసింగ్ చిరంజీవి కోసం తన ఇంట్లో పార్టీ మధ్యలో కబురు పెట్టగలడు?

ఆలోచన్లతోనే ఆమె చిరంజీవి ఇల్లువున్న సందు ముందు కారుని ఆపుచేసింది. కానీ వెంటనే కారు దిగలేదు. కారణం సందు మొదట్లో దారాసింగ్ వుండటం, అయితే అతడు ఆమెని గమనించలేదు.

వీధి బాగా చీకటిగా వుంది. ఆమె కారుదిగి, సందులోకి నడిచి, చిరంజీవి ఇంటి మెట్లెక్కింది. సగం తెరిచివున్న తలుపుల్ని హఠాత్తుగా తెరుచుకుని లోపలికి అడుగుపెట్టిన అర్చనని చూసి చిరంజీవి అదిరిపడ్డాడు! ఆ సమయానికి గూట్లోంచి ఏదో వస్తువు తీసి లోపల పెట్టుకుంటున్నాడు. అతడు మొహం మీదకి బలవంతంగా తెచ్చుకున్న నవ్వు అతికినట్టు కనబడ్తూంది.

"నువ్వా....... అదేమిటి ఇలా వచ్చావ్ - ఇంట్లో పార్టీ" అంటూ తడబడ్డాడు. అతడి తడబాటుని గుర్తించనట్టు అర్చన మామూలుగా, "మనిద్దరం కలిసి యిస్తున్న పార్టీ అది.... నువ్వు మధ్యలో వచ్చేస్తే యెలా? అందుకే వెతుక్కుంటూ వచ్చాను" అంది.

"ఔను కదూ. ఔను....... ఔనౌను......... ఇప్పుడే వస్తాను. వెళ్ళిపోదాం......" అంటూ కంగారుపడి బైటకి నడవబోయాడు.

"బైట నీకోసం యెవరన్నా యెదురుచూస్తున్నారా? ..... ముఖ్యమైన వాళ్ళు?" ఓరగా చూస్తూ అంది.

గడప దాటబోతూన్న చిరంజీవి కాళ్ళకేదో అడ్డుపడినట్టు ఆగిపోయాడు. కానీ వెంటనే "అబ్బే - ఎవర్లేరు" అంటూ దాదాపు పరుగెడ్తున్నట్టు మెట్లుదిగాడు.

ఒక్కసారిగా ఆ గదిలో ఆమె చుట్టూ పేరుకున్న నిశ్శబ్దం, ఆమె మనసులోని నిరాసక్తపు శూన్యతని పెంచింది. భరించలేని

దిగులు ఆమెని ఆవరించింది. చిన్నతనం నుంచీ తను ఒంటరిదాననిన్న భావం ఆమెది. చిరంజీవి పరిచయంతో కొద్దికొద్దిగా పోతున్నది, ఈ సంఘటనల్తో మరింత బలంగా వచ్చి చేరుకుంది.

ఆమె గదిని తేరిపార చూసింది. చాలా చిన్న గది అది. అక్కడ బీదరికం తాండవం చేస్తోంది. దండెం మీద బట్టలు - కిటికీలో అద్దం - దువ్వెన, అల్మైరాలో పుస్తకాలు - ట్రంకు పెట్టెలోంచి బైటకి కనబడ్తూన్న బట్టలు.

గూట్లో ఏదో పచ్చగా కనబడితే, దాన్ని బైటకి లాగింది. తను వచ్చేసమయానికి దాన్ని అక్కడ పెడ్తున్నాడు చిరంజీవి. తనను చూసి దాచేసిన వస్తువు అది. అది డైరీ!

ఆమె ఆసక్తిగా పేజీలు తిప్పటం మొదలుపెట్టింది. చాలా నిర్లక్ష్యంగా , అక్కడక్కడా వ్రాయబడిన డైరీ అది. అందులో ఏమీలేదు. దాన్ని యధాస్థానంలో పెట్టెయ్యబోతూవుంటే లోపల్నుంచి ఒక పేజీ ముందుకు జారింది. ఆమె దాన్ని సరి చేస్తూ కుట్టువూడిన విషయాన్ని గమనించింది. మళ్ళీ డైరీ తీసిచూస్తే కొన్ని కాగితాలు జాగ్రత్తగా చింపబడి, కుట్టు లూజ్ అయిన సంగతి బైటపడింది. దాంతో ఆమె గదంతా పరిశీలగా చూసింది.

ఆమె దృష్టి చెత్త బుట్టమీద పడింది. సరీగ్గా మూడు రోజుల క్రితం అటువంటి బుట్టే చిరంజీవిని రక్షించింది.

ఆమె వంగి దాన్ని బోర్లించింది. విరిగిన దువ్వెన, న్యూస్‌పేపర్ వుండ - అరటిపండు తొక్క, అయిదారు కాగితపు ముక్కలు.......

ఆమె చప్పున ఆగిపోయింది. అవి డైరీలోంచి చింపిన కాగితపు ముక్కలు!

వాటిని జాగ్రత్తగా పేర్చడానికి రెండు మూడు నిమిషాలు పట్టింది. ఈ లోపు చిరంజీవి వస్తాడన్న టెన్షన్ - మరోవైపు. కాగితాలు పేర్చివాటిని చదవటానికి ప్రయత్నించింది.

జనవరి 15: ఈ రోజు సుశీల వచ్చింది. తనకు ఏం కావాలో చెప్పదు.

మార్చి 2 : సుశీల బాధ యెక్కువైంది.

మార్చి 15: అర్చనతో పరిచయం ప్రేమగా మారుతోంది. ఇక సుశీలలాంటి చౌకబారు కేసుల్ని వదిలెయ్యాలి

మే 12: ఎలాగైతేనేం వదిలించుకున్నాను.

చదవటం పూర్తి చేసిన అర్చన నేలమీద పరచిన కాగితాల ముందు శిలలా కూర్చొని వుంది. మనసంతా వ్యధ. ఉవ్వెత్తుగా లేచిన కెరటం కొండరాళ్ళని ఢీకొని పెద్ద శబ్దంతో సగానికి విరిగిన అనుభూతి. మెదడులో పర్జన్య ఘోష.

ఎంత సూపర్ ప్లాన్ వేశాడు చిరంజీవి! మామయ్యని చదరంగలో పావులా వాడుకుని తన ప్లాన్‌ని తెలివిగా అమలు జరిపాడు!!

ఈ చిరంజీవి కోసం ఎంత మూర్ఖుల్లా ఈ ప్లాన్‌లో ఇరుక్కుపోయారు తనూ తన మామయ్య! చిరంజీవి గోల్డుమెడల్స్ - ఎల్లెల్బీ చదువు - తెలివితేటలు ఇలా వుపయోగపడ్డాయన్న మాట.

అడ్డు తొలగించుకోవాలన్న సుశీలని హత్య చేసి, అది హత్య కాదని నిరూపించటానికి ప్రసిద్ద క్రిమినల్ లాయర్ సర్వోత్తమరావు సాక్ష్యం తీసుకోవడం, శవాన్ని నూతిలో పడెయ్యడం, దాన్ని ఫోటోలు తియ్యటం, హేట్సాఫ్ చిరంజీవీ!

ఆమెకి చిరంజీవి పార్టీలో అన్న మాటలు గుర్తొచ్చాయి "అయితే నేను హీరోనే నంటావ్!" అంతకు ముందు జైల్లో కూడా "జిడ్డులా పట్టుకుని వదల్లేదు. చంపటం తప్ప ఇంకో మార్గం లేకపోయింది! ఎలాగూ చంపుతున్నాను కదా అని రేప్ చేశాను" అన్నాడు. చేసింది నిర్భయంగా చెప్తూ కూడా శిక్ష తప్పించుకున్నాడు.

చిరంజీవి అమాయక ప్రవర్తనకి హాస్యపూరిత సంభాషణకి కారికేచర్‌కీ అర్థం ఆమెకిప్పుడు తెలుస్తోంది.

ఎంత ప్రిటెన్షన్!

"జైలూ హత్యా అంతా మర్చిపో....." అని తను అన్నప్పుడు ఎంత సెటైరికల్‌గా "సుశీల గురించి కూడా మర్చిపొమ్మంటావా?"" అని అతనన్నా కూడా తను గుర్తించలేకపోయింది. ఎంత మూర్ఖురాలు!!

ఇప్పుడు మూడురోజుల క్రితం జైలునుంచి రాగానే, సుశీల గుర్తులేమీ లేకుండా గదంతా సర్ధుకున్నాడన్నమాట. అదీ విషయం.

ఒక నిర్ణయానికి వచ్చినట్టు ఆమె లేచి నిలబడింది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఏ ఆధారాలతో అతడు ఉరిని తప్పించుకోవాలని చూశాడో అంతకు రెట్టింపు ఆధారాలతో అతడిని ఉరికంబానికి ఎక్కించనిదే తను నిద్రపోదు. ఇక్కడ ప్రేమా, ఆప్యాయతలకి చోటులేదు. న్యాయం జరగాలి. అంతే!

అయిదు నిమిషాల తరువాత ఆత్రంగా అడుగుపెట్టిన చిరంజీవికి ఆ గది ఖాళీగా కనిపించింది.

.......

అతిధులు వెళ్ళిపోయిన హాలు బోసిగా వుంది. అక్కడక్కడ కాగితపు వుండలు, ఖాళీ ప్యాకెట్లు పడివున్నాయి. ఆ హాలు ఆమె మనసులాగే వుంది. మిగిలిపోయిన శూన్యపు జ్ఞాపకాలు.

రామయ్య, బైరాగి అంతా సర్దటం పూర్తయ్యేసరికి పదకొండయింది. ఆమె పక్కమీద వాలిందన్న మాటేగాని, అంత అలసటలోనూ నిద్రపట్టలేదు. చిరంజీవితో చేసిననేరాన్ని ఎలా వప్పించటం? అతడిని నిలదీసి అడిగి, తను కనుక్కున రుజువుల్నీ, సాక్షాల్నీ చూపించవచ్చు.

కానీ దానివల్ల లాభం లేదు. తను డైరీలో వ్రాసుకున్న సుశీలా, చనిపోయిన సుశీల వేరని అతడు వాదించవచ్చు. లేదా దారాసింగే సుశీల్ని రేప్ చేసి చంపి వుండవచ్చు అని వాదించవచ్చు.

అవును, అలా ఎందుక్కాకూడదు? దారాసింగే రేప్ చేసి ఏమీ తెలీదన్నట్టూ, శవాన్ని చిరంజీవికి అప్పజెప్పాడేమో?

'అది నిజమైతే ఎంత బావుణ్ను' అని ఆమె స్త్రీ హృదయం ఒక క్షణం ఆక్రోశించింది. కానీ తర్కం తిరిగి ఆలోచింపజేసింది.

అది నిజం కాకపోవచ్చు. ఎందుకంటే సుశీల తనకి తెలిసిందే కాబట్టి, ఆమె శవాన్ని చూడగానే చిరంజీవి షాకై ఈ పనికి

శవం వద్దులే అని తిరస్కరించి వుండాలి! పోనీ అలాక్కాదూ, తన డైరీలో వ్రాసుకున్న సుశీలా, ఈ సుశీలా వేరు అనుకుంటే, మరి ఈ రోజు పార్టీలో "సుశీలకి మొగవాళ్ళంటే అసహ్యం" అని ఎలా అనగలిగాడు?

చాలా లాజికల్‌గా ఏ చిన్న విషయాన్నీ వదిలిపెట్టకుండా ఆలోచిస్తూ వుందామె.

ఆమె రెండుగా విడిపోయింది. చిరంజీవిని ప్రేమించిన అర్చన కాదామె. నిజానికి ఆఖరి నిముషం వరకూ పోరాడి, చిరంజీవిని ఉరికంబం నుంచి తప్పించిన స్త్రీ కూడా అర్చన కాదు. అప్పుడు ఒక నిర్దోషి కోసం పోరాడిన అర్చనే - ఇప్పుడు మళ్ళీ న్యాయం కోసం పోరాడుతోంది.

రాత్రి ఒంటిగంట కావొస్తోంది. ఆమె చూపు సగం తెరిచివున్న అటాచ్డ్ బాత్‌రూమ్ తలుపులమీద పడింది. చిరంజీవిని మొట్టమొదట చూసింది అక్కడే. అతడింకా అక్కడే నిలబడి వున్నట్టూ భావన! తడిసిన కోటు - ఎర్రటై - జుట్టులోంచి కారుతున్న నీళ్ళు - అతడు తడబడుతూ అంటున్నాడు.....

"నేనిలా మీ బాత్‌రూమ్‌లోకి రావడం....... నా కోర్కె - ఐ మీన్ నాకు నీళ్ళు కావల్సిరావడం........... యాద్.....యాద్.......... యాదృచ్ఛికం."

గతం గుర్తుకొచ్చి అర్చన గుండెలలో దిగులు కరిగి కంటినీరైంది. పెదవిని పంటి క్రింద నొక్కిపట్టి కళ్ళు గట్టిగా మూసుకుంది. నీటిచుక్క చెక్కిలిమీదకు జారింది. ఎందుకు చేశావ్ చిరంజీవి? ఎందుకు చేశావమ్మా యిలా?

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

21 వ భాగం

మరుసటిరోజు ప్రొద్దున్న ఎనిమిదింటికి ఆమె హాస్పిటల్‌కి వెళ్ళింది. స్పెషల్ రూమ్‌లో వున్నాడాయన.

"ఎలా వుంది అంకుల్" కూర్చుంటూ అడిగింది.

"ఇంకో రెండు రోజుల్లో అయిపోతుందట ఈ బందిఖానా, ఇంతకీ నిన్న పార్టీ ఎలా జరిగింది?" అని అడిగాడు సర్వోత్తమరావు. పక్కమీద వెల్లకిలా పడుకుని వున్నాడాయన. కాలికి బ్యాండేజీ వుంది.

"పార్టీ బాగానే జరిగింది" అందామె నిర్లిప్తంగా.

తను చెప్పదల్చుకున్న విషయాలు ఎలా మొదలు పెట్టాలో ఆమెకి తెలియడం లేదు. కొంచెంసేపు నిశ్శబ్దంగా వుండి, హఠాత్తుగా "ఓబులేసంటే ఎవరో నీకు తెలుసా అంకుల్" అని అడిగింది.

"ఓబులేసా? వాడెవడు?" విస్మయంగా అన్నాడు ఆయన.

ఆమె మాట్లాడలేదు. మళ్ళీ నిశ్శబ్దం.

"ఏమిటమ్మా? ఏమైంది? నువ్వు అదోలా వున్నావ్?"

ఆమె కొంచెం సేపు మౌనంగా వుండి "నువ్వెళ్ళే సమయానికి శవం ఎలా వుంది అంకుల్? క్రిమినల్ లాయర్‌వి కదా, కొంచెం ఆలోచించి చెప్పు. అది సహజ మరణంగానే తోచిందా, లేక హత్యా?" అన్నది.

ఆ మాటలకి సర్వోత్తమరావు అదిరిపడ్డాడు.

"ఏమిటమ్మా నువ్వు అంటున్నది?" అయోమయంగా అడిగాడు.

"సుశీలది సహజ మరణం కాదు అంకుల్"

"నీ కెవరు చెప్పారు?"

ఆమె మాట్లాడలేదు. అతడు పక్క మీద ముందుకి వంగి జాగ్రత్తగా దిండు ఆసరా చేసుకుని కూర్చున్నాడు.

కూర్చుంటూ "సుశీలది సహజమరణం కాదని, చిరంజీవి యిందులోంచి బైటకు రాలేడనీ నీ భయమైతే దాన్ని వదిలిపెట్టు. ఇంకో పది రోజుల్లో నేను బైటకి వచ్చీరాగానే నా సాక్ష్యంతో కేసు కొట్టివేయబడ్తుంది. దీని గురించి నువ్వు దిగులు పడక్కర్లేదు. ఆ హామీ నేను యిస్తున్నాను. సరేనా" అన్నాడు.

'నేను చెప్పదల్చుకున్నది అదికాదు అంకుల్ -' అనుకుంది మనసులో బాధగా - కానీ ఎలా చెప్పడం?

ఆమె తడబాటుని ఆయన గుర్తించాడు "నీ మనసులో ఏదో వుంది అది చెప్పలేకపోతున్నావు, అమ్మా అర్చనా! చిన్నప్పటినుంచీ నువ్వు దేన్నీ నా దగ్గర దాచలేదు. ఏమిటమ్మా నీ బాధ"

ఈ ఒక్క ఓదార్పు మాటతో ఆమె కదిలిపోయింది. పార్టీలో తనకి అనుమానం రావటం...... దారాసింగ్ విషయం, చిరంజీవి డైరీ - అన్నీ వివరంగా చెప్పింది.

ఆమె చెప్తున్నది వింటూంటే సర్వోత్తమరావు మొహంలోకి రక్తం జివ్వున యెగజిమ్మింది. నమ్మలేని విషయం వింటున్నట్టు నిశ్చేష్టుడయ్యాడు. ఆమె చెప్పడం పూర్తి అయ్యాక కూడా వెంటనే అతడేమీ మాట్లాడలేకపోయాడు! చాలాసేపటికి తేరుకుని "చిరంజీవి........ చిరంజీవి అలాంటివాడంటే నేను నమ్మను" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. అరచేతులవంక చూస్తూ కూర్చుండిపోయింది.

"ఆరోజు రాత్రి నాకు ఫోన్ చేసి భీమేశ్వర్ అన్న రౌడీ - శవం రెడీగా వుందని చెప్పాడని చెప్పాడు. నేను వెళ్ళేసరికి గదిలో శవం వుంది అదే జరిగింది" తనలో తను ఆలోచించుకున్నట్టూ ఆయన పైకి అన్నాడు.

అంతలో ఏదో స్ఫురించినట్టూ పక్కకి వంగి ఫోన్ ఎత్తి డయల్ చేశాడు. అయన ఎక్కడికి ఫోన్ చేస్తున్నాడో అర్థంకాక ఆమె చూస్తూ వుండిపోయింది.

"హల్లో పోలీస్ స్టేషన్! ఇన్‌స్పెక్టర్‌గారున్నారా - ఆ .....నేనే...... బావున్నారా" అంటూ కుశలమడిగి "నాకో చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి. ఆ సత్రం దగ్గిర భీమేశ్వర్ అని ఓ రౌడీ ......ఆ... ఆ.........వాడే - వాడి గురించి నాక్కొంచెం వివరాలు కావాలి. ముఖ్యంగా సుశీలకీ వాడికీ ఏమైనా సంబంధం వుందా? సుశీల మరణించినరోజు వాడు ఎక్కడ వున్నాడు - వగైరా" అని, మరో రెండు నిముషాలు మాట్లాడి ఫోన్ పెట్టేస్తూ ఆయన అర్చన వైపు తిరిగాడు "చిరంజీవి మనకి అబద్ధం చెప్పాడమ్మాయ్."

"ఏమిటి అంకుల్?"

"ఆ రోజు అర్ధరాత్రి దారాసింగ్ అతడి వద్దకు వెళ్ళి శవం రెడీగా వున్నదని చెప్పడం శుద్ధ అబద్ధం"

"ఎలా?"

"అంతకు ముందురోజు ప్రొద్దున్నే దారాసింగ్‌ని ఏదో చిల్లరదొంగతనం మీద పోలీసులు అరెస్టు చేశారట. ఆ రెండ్రోజులూ వాడు జైల్లోనే వున్నాడట"

అర్చన మెదడులో సన్నటి హోరు మొదలైంది. క్షణంలో అది సుడిగాలిలా మారింది. స్పృహ తప్పి పడిపోకుండా తనని తాను అతి కష్టం మీద నిగ్రహించుకుంది.

సర్వోత్తమరావుకి కూడా ఇది సామాన్యమైన దెబ్బేమీ కాదు. చాలా సేపు మౌనంగా తనలో తానే ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చినట్టు ఆయన అన్నాడు "తన ప్లాన్ ప్రకారం చిరంజీవి సుశీలని వదిలించుకోవటం నిజమైన పక్షంలో - నా సాక్ష్యం అతడికి కంచుకోటలా నిలబడేది. చాలా గొప్ప ప్లాన్ వేశాడు. కానీ దురదృష్టం అతడిని వెంటాడి నిజాన్ని బైట పెట్టిస్తోంది. ఆ రెండ్రోజులూ దారాసింగ్ జైల్లో వున్నాడనీ చిరంజీవికి బహుశా తెలిసుండక పోవచ్చు.

అందుకే ఇప్పుడా దారాసింగ్ అతడిని బ్లాక్ మెయిల్ చేయటం మొదలెట్టాడు".

అని ఆగి మళ్ళీ ఆయన ఆలోచిస్తూ తిరిగి అన్నాడు "ప్రస్తుతం చిరంజీవి బెయిల్ మీద వున్నాడు కదా. పోతే ఈ సుశీల కేసులో ఫైనల్ హియరింగ్ ఎప్పుడమ్మాయ్"

"ఇంకో నాల్రోజులు వుంది అంకుల్"

"అనుకున్నది అనుకున్నట్టు జరిగివుంటే - ఈ రోజు చిరంజీవి విడుదలై వుండేవాడు. న్యాయస్థానంతో ఆడుకున్నందుకు కోర్టు అతడిని కొద్దిగా చీవాట్లు పెట్టి విడుదల చేసి వుండేది. సుశీలని రేప్ చేసి చంపింది ఎవరా అని పోలీసులు కొంతకాలం తల బద్దలు కొట్టుకుని ఫైలు మూసేసి వుండేవారు. కానీ ఇప్పుడు జరిగింది వేరు" అని విషాదంగా నవ్వి "ఇంత జరిగినా ఇదంతా చిరంజీవి చేశాడంటే నేను నమ్మలేకుండా వున్నానమ్మా. పైకి అలా అమాయకంగా కనబడినా చాలా బ్రైట్‌బోయ్ అతడు".

"అవునంకుల్. అతడి బ్రైట్‌నెస్ అతడు వేసిన ఈ అద్భుతమైన ప్లాన్‌లోనే తెలుస్తూంది. చేసిన హత్య మళ్ళీ చేసి, దానికి ప్రఖ్యాత క్రిమినల్ లాయర్ సాక్ష్యం ఫోటోల్తో సహా సంపాదించటం" అని ఓ నిర్ణయానికి వచ్చినట్టు లేచి నిలబడింది.

ఆమె వెళ్ళటానికి ఉద్యుక్తురాలవటం చూసి "చిరంజీవిని నా దగ్గరికి ఒకసారి రమ్మను, నేను మాట్లాడతాను."

"వద్దు అంకుల్, నేనే మాట్లాడతాను" అని ఆమె ఆ గదిలోంచి బయటకొచ్చింది. విశాలమైన వరండా శూన్యంగా, ఖాళీ అయిన మనసులా ఉంది. ఆమె మనసులో ఇప్పుడు వ్యధ, బాధ, ఆవేశం - ఇలాంటివేమీలేవు.

ఆమె మెట్లు దిగుతూంటే అకస్మాత్తుగా చిరంజీవి ఎదురుపడ్డాడు.

అతడి చేతిలో బత్తాయి పళ్ళున్నాయి. ఒకర్నొకరు చూసుకుని యిద్దరూ చప్పున ఆగిపోయారు.

ముందు కదిలింది చిరంజీవే! "ఏమిటీ? నిన్న రాత్రి రూమ్‌నుంచి చెప్పకుండా వెళ్ళిపోయావ్!" అన్నాడు.

ఆమె దానికి సమాధానం చెప్పకుండా "సాయంత్రం ఆరింటికి మా ఇంటికిరా - నీతో మాట్లాడాలి" అంది పొడిగా.

ఆమె మాటల్లో సీరియస్‌నెస్‌ని అతడు గుర్తించలేదు "ఆరింటికి క్లయింటొస్తారు. పనుంటే..... ఏడింటికి వస్తా. డైరెక్ట్‌గా డిన్నర్‌కి వెళ్ళిపోదాం" అన్నాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

22 వ భాగం

"క్లయింట్సేమిటి?"

చిరంజీవి నవ్వాడు - "సుశీల కేసు పుణ్యమా అని పేరు పేపర్లో ఎక్కిందిగా, దాంతో పాపులారిటీ పెరిగింది. క్లయిట్స్ రావటం మొదలుపెట్టారు. ఇక భవిష్యత్తు నేను చూపించే తెలివితేటల మీదా, అదృష్టం మీదా ఆధారపడి వుంటుంది."

"తెలివితేటల కేముంది - అవి నీ కెప్పుడూ తక్కువ లేవుగా?"

చిరంజీవి విశాలంగా నవ్వి "థాంక్యూ" అన్నాడు.

అర్చన నవ్వలేదు "సుశీల హత్య కేసు ఎప్పుడు కొట్టేస్తారట" అంది.

"తొందర్లోనే, మీ మామయ్య కూడా రావాలి కదా"

"మొత్తానికి సుశీల మరణం నీ ప్రాక్టీసు పెరగటానికి ఉపయోగపడిందంటావ్?"

ఆ మాటల్లో వ్యంగాన్ని గుర్తించలేదు అతడు "ఛా అలా అనకు" అన్నాడు.

"అవును, అనకూడదు. సుశీల చాలా మంచి పిల్ల" అంది అర్చన "కానీ నిజాలు యెంత చేదువైనా నిజాలేకదా. ఉదాహరణకి సుశీల మరణాన్నే తీసుకో. నువ్వు తెలివైనవాడివి. క్లయింట్స్ అంటూ రావటం మొదలుపెడ్తే, ఎలాగూ ఊహించలేనంతగా నీ ప్రాక్టీసు పెరిగిపోతుంది. కానీ మొదట క్లయింట్స్ రావాలికదా. దానికి సుశీల మరణం, ఆ విషయం పేపర్లో పడటం, నీకు పేరు రావటం - అన్నీ తోడ్పడ్డాయి. అంటే నీ జీవితం ఓ గొప్ప మలుపు తిరగటానికి, నీ జీవితంలోంచి - సారీ ఈ ప్రపంచంలోంచి సుశీల తప్పుకోవటం చాలా ఉపయోగపడిందన్న మాట".

"చాలా గొప్ప లాజిక్కేగానీ - అందులో లాజిక్కులేదు" అంటూ నవ్వాడు చిరంజీవి "నువ్వు చెప్పేది ఎలా వుందంటే పాకిస్తాన్‌తో యుద్ధం రాకపోయివుంటే భారత దేశం ఒకటున్నదని విదేశీయులకి తెలిసుండేది కాదు - అన్నట్లుంది."

అర్చన కోపాన్ని అతికష్టం మీద అణుచుకుని, "అంటే నీ పేరు ప్రఖ్యాతులు ప్రపంచ చరిత్రలో భారతదేశం అంత గొప్పవి అంటావా?" అంది.

"చాలా రోజులపాటు లార్జెస్ట్ సర్కులేటెడ్ దినపత్రికల్లో మొదటి పేజీల్లో వేస్తూ వచ్చారుగా"

"గాంధీని చంపిన రోజుల్లో గాడ్సె గురించి కూడా అలానే వేశారు."

"కాఫీకి పిల్చావ్, ఇంట్లో టిఫినేమిటి?"

హఠాత్తుగా మారిన సబ్జెక్టుకి ఆమె ఆశ్చర్యపోయి "తెలీదు, ఏం?"

"అహా. పచ్చిమిరపకాయ బజ్జీలేమో. నేను రాకముందు ఒకటి రెండు నోట్లో వేసుకున్నావని అనుమానం వచ్చి అడిగాను"

రోషంతో ఆమె మొహం ఎర్రబారింది. రెండు పెద్ద పెద్ద కంపెనీలని మానేజ్ చేస్తూ అవసరం వస్తే ఎంతో సీరియస్‌గా సబార్డినేట్స్‌ని తిట్టే ఆ అమ్మాయిమీద యిప్పటివరకూ యిలా జోకులేసినవాళ్ళు ఎవరూలేరు. చిరంజీవి మాత్రం ఎప్పటిలాగే అమాయకంగా ఉన్నాడు.

తెలివితేటలున్న వాడు అమాయకంగా వుంటే పేలే జోకు గొప్పగా ఉంటుంది. అయితే అర్చన వాటిని ఆస్వాదించే స్థితిలో లేదు "సుశీల వుంటున్న ఇంటిగలావిడ వచ్చింది. సుశీల చచ్చిపోయింది జాండీస్‌తోనట. ఆ ఆస్పత్రి రసీదు యిచ్చింది. అది నీకేమైనా ఉపయోగపడ్తుందా?" ఓరగా చూస్తూ అడిగింది.

"అఖ్ఖర్లేదు. ఆ అమ్మాయి ఎలా చచ్చిందో శవపరీక్ష చేసిన డాక్టర్లు చెప్పగలరు"

"డాక్టర్లు అప్పుడే చెప్పారు. మామూలుగానే చచ్చిందట. కానీ చిన్నప్పుడు ఏదో వాతరోగం వస్తే మెడ మీద వాతలు పెట్టారట. ఆ వాతల్నే చేతివేళ్ళ గుర్తులని పొరబడ్డారట! రేపు కోర్టులో డాక్టర్లు క్షమాపణ చెప్పుకోబోతున్నారు" వ్యంగ్యంగా అంది.

"ప్రతీ కేసు చివరా దేముడికో - పేషెంటుకో - క్షమాపణ చెప్పుకోవటం డాక్టర్లకి అలవాటేగా. ఈ కేసులో కోర్టుకి చెప్పుకుంటున్నారన్నమాట."

"మొత్తం మీద సుశీల గొంతు పైన గుర్తులు చిన్నప్పుడు పెట్టిన వాతలేననీ, చేతివేళ్ళవి కావనీ అంటావ్"

"అవి కూడా అయి ఉండొచ్చు..... నేనే శవం గొంతు నులిమాగా"

"ఉస్మానియా యూనివర్సిటీవాళ్ళు ఎల్లెల్బీలో పాథాలజీ సబ్జెక్టు కూడా పెట్టాలని ఆలోచిస్తున్నారట."

హఠాత్తుగా ఆమె సబ్జెక్టు మార్చేసరికి ఈ సారి అతడు ఆశ్చర్యపోయి "ఎందుకు?" అన్నాడు.

"లాయర్లకి కూడా శరీరతత్వం కొద్దిగా తెలిసివుంటే మంచిదని" అన్నదామె "లేకపోతే మనిషి చచ్చిపోయిన కొద్దిసేపటికే శవం బిగుసుకుపోతుందనీ, చేతివేళ్ళ గుర్తులు మెడమీద పడవనీ లాయర్లకి తెలిసే అవకాశం లేదుగా" అంది.

ఆ మాటలు అర్థం కావటానికి అతడికి కొంచెంసేపు పట్టింది.

"నిజమే సుమా. ఆ విషయం నాకు తట్టనే లేదు" అని" కొత్తగా పాసయిన కుర్రవాళ్ళకి ఆ సబ్జెక్టు పెడ్తే లాభం లేదు. ప్రాక్టీసు చేస్తున్న లాయర్లకికూడా రిఫ్రెషర్ కోర్సులాగా ఆ సబ్జెక్టు పెట్టాలి. పాతికేళ్ళ సర్వీసున్న మీ మామయ్యకే ఇంత చిన్న సంగతి గుర్తుకు రాలేదంటే, ఇంతకాలం డాక్టర్లలోనే మూర్ఖులుంటారనుకున్నాను - లాయర్లలో కూడా వుంటారన్నమాట" అన్నాడు.

ఆమె మరింత ప్రజ్వరిల్లి "మామయ్యని యేమీ అనకు" అంది రోషంగా.

"మీ మామయ్యని నేను అనటం లేదు. డాక్టర్లని అంటున్నాను. లేక పోతే నీ వాదన ఏమిటి అర్చనా! అందులో ఏమైనా బలం వుందా అసలు? నేను డాక్టర్‌ని కాను. కానీ నాకూ కొద్దిగా శరీరతత్వం గురించి తెలుసు. రిగర్ మార్టిన్ స్టేజి నెంబరు

టూ ఎప్పుడు ప్రారంభం అవుతుంది? అసలు మేం ఇద్దరం అక్కడికి చేరుకోవటానికి ఎంత కాలం ముందు సుశీల చచ్చిపోయింది? రెండు మూడు గంటల కాలం కన్నా ఎక్కువ కాకపోతే నా చేతివేళ్ళ గుర్తులు ఎందుకు ఆమె మెడమీద పడవు? ఈ మాత్రం గ్రహించలేవా నువ్వు? దానికోసం సెటైరికల్‌గా సుశీలకి చిన్నప్పుడు వాతరోగం రావాలా ఎక్కడా పెట్టకుండా వాతలు మెడ మీద పెట్టాలా" అన్నాడు.

"సుశీల శరీరం మీద ఎక్కడెక్కడ వాతలు, ఎక్కడెక్కడ పుట్టుమచ్చలు ఉన్నాయో తెలిసినట్టు మాట్లాడుతున్నావే."

అతడు పాలిపోయిన మొహంతో "అర్చనా" అన్నాడు.

"ఏం, తెలీదా నీకు?"

"ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది?"

"సుశీల నీకు అంతకుముందు తెలీదా అని అడుగుతున్నాను."

"తెలీదు."

"తెలీదూ."

"తెలీదు."

"నిజంగా తెలీదూ?" కంఠం హెచ్చించింది.

"నిజంగా తెలీదు."

ఆమె అతడి చెయ్యి విసురుగా లాక్కొని తన తలమీద పెట్టుకుని "ఇప్పుడు చెప్పు, నిజాయితీగా తెలీదూ" అన్నది.

"నిజంగా తెలీ..........." అనబోయి ఆగి, ఆమె కళ్ళలోకి ఒకసారి చూసి, కళ్ళు దించుకుని నెమ్మదిగా .... "తెలుసు" అన్నాడు. ఆ జవాబుతో వొక్కసారిగా ఆ గది నిశ్శబ్దమైపోయింది. రెండు చేతుల్తోనూ అతడి చేతిని అలా తలమీద పట్టుకునే వున్నదల్లా అతనా మాట అన్నాక విసురుగా ఆ చేతిని తోసెయ్యబోయింది గానీ, తనమీద ఒట్టు అనగానే అంత్క విపత్కర పరిస్థితిలోనూ అతడు నిజం చెప్పాడన్న విషయం ఆమెని అలా చెయనివ్వలేదు.

ఆమె మనసు అలా బలహీనమయ్యేసరికి ఒక్కసారిగా అతడి మీద పూర్వపు ప్రేమ తిరిగి వచ్చింది. అతడిని అనునయించి, జరిగిన విషయం తెలుసుకుని, పరిష్కారం అలోచిద్దామనుకుంది. ఈ లోపులో అతడు చేతిని తీసేస్తూ "సుశీల నాకు ఇంతకుముందే తెలుసా, తెలీదా అన్న చిన్న విషయం కనుక్కోవటం కోసం ఇంత డ్రామా ఎందుకు అర్చనా! మామూలుగా అడుగుతే చెప్పేవాణ్నిగా" అన్నాడు.

కొద్దికొద్దిగా కరుగుతూన్న మనసు ఈ మాటలకి తిరిగి గడ్డకట్టుకుపోయింది. "ఓహో! చెప్పేవాడివా - అయితే ఇప్పుడు అడుగుతున్నా- చెప్పు. ఆమెని ఎందుకు చంపావు?" అంది సూటిగా.

అతడు అదిరిపడి "ఏమిటి" అన్నాడు. అయోమయంగా "సుశీలని నేను చంపటం ఏమిటి?"

“డ్రామా వద్దన్నావ్‌గా - మరి చెప్పవేం?”

ఆమె ప్రశ్న కలిగించిన అయోమయం లోంచి అతడింకా తేరుకోలేదు. ఆమె అన్నది - “సుశీల నీ కెంతకాలం నుంచి తెలుసు?”

“నాలుగైదుసార్లు నా దగ్గర కొచ్చింది.”

“నువ్వెప్పుడూ ఆమె ఇంటికి వెళ్ళలేదా?”

“వెళ్ళాను.”

ఆమె ఉద్వేగంతో “ఎందుకు” అని ప్రశ్నించింది.

“దారాసింగ్ శవం రెడీగా వుందని చెప్పినప్పుడు తీసుకెళ్ళడానికి.”

ఆ జవాబుకి ఆమె హతాశురాలై రెట్టించిన ఆవేశంతో “అంతేకాని ఆమె బ్రతికి వుండగా ఎప్పుడూ వెళ్ళలేదంటావ్” అంది.

“ఎందుకు వెళ్ళటం? వెళ్ళే అవసరం నాకేం వుంది?”

“ఒకబ్బాయి ఒంటరిగా వున్న అమ్మాయి ఇంటికి ఏ అవసరంతో వెళ్తాడో తెలియకుండానే ఎల్లెల్బీ పాసయ్యావా?”

అతడికి మొట్టమొదటిసారి కోపం వచ్చింది. “నీ ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పవలసిన అవసరం లేదు నాకు” అన్నాడు.

“ఇప్పుడు చెప్పక పోయినా రేపు కోర్టులో చెప్పవలసి వుంటుంది.”

“కోర్టులో అవన్నీ అడగరు. మీ మామయ్య సాక్ష్యంతో కేసు కొట్టేస్తారు.”

ఆమె దాన్ని పట్టించుకోకుండా, తన సహజ ధోరణిలో, “ముందు సుశీలెవరో నాకు తెలీదన్నావ్. కొద్దిగా రెట్టించేసరికి తెలుసునన్నావ్. అలాగే ఇదీనూ ఇప్పుడైనా నిజాయితీగా చెప్పు............ నీ జీవితంలో సుశీల పాత్ర ఎంతవరకూ -?”

“ఏమీ లేదు.”

“ఏమీ లేదూ?”

“ఉహూలేదు.”

ఆమె విసురుగా పక్కకి తిరిగి, బల్లమీదున్న పుస్తకాల్ని కెలికి, అడుగునుంచీ ఫైల్‌తీసి, అందులోవున్న ఫోటో స్టాట్ కాపీలు అతడి మొహం మీదకు విసిరి“ ఇప్పుడు చెప్పు ఏమీలేదని - ” అంది ఆవేశంతో, జీరబోయిన కంఠంతో.

అతడు ఆ కాగితాల్ని ముందు మామూలుగా చూసి, అది తన చేతి వ్రాతగా గుర్తించి మరింత పరీక్షగా గమనించాడు. “ఇవి .................. ఇవి............. నా డైరీలో కాగితాలు, నీకెక్కడివి?”

“జీవితంలో ఏ ప్రాముఖ్యతా లేకుండానే డైరీలోకి సుశీల ఇన్ని సార్లు ఎక్కిందా? అందులోనూ అస్సలు డైరీ వ్రాయని

వాడివి -"

అతడు మాట్లాడకుండా, చేతిలో కాగితాలవైపు చూస్తూ వుండిపోయాడు. ఆమె అంది - " ఇక నువ్వు వెళ్ళొచ్చు. వాడి ఒరిజినల్స్ రేపు కోర్టులో సబ్మిట్ చెయ్యబడ్తాయి." ఆ మాటల్లో వ్యంగ్యం కన్నా బాధా, సిన్సియారిటీ ఎక్కువగా వున్నాయి. అతడు కదలలేదు. "సుశీల గురించి నేను వ్రాసుకుని వుండటానికీ, ఆమె మరణానికీ సంబంధం ఏమిటీ?" అన్నాడు.

ఆమె విసుగ్గా "ఇంత చెప్పినా, ఇన్ని ఋజువులు చూపించినా, యింకా నీ వాదననే పట్టుకుని పాకులాడటానికి నీకు సిగ్గు వేయటం లేదూ" అంది.

'సిగ్గు వేయటం లేదూ' - అన్న మాట ఆమె నిజానికి అనాలని అన్లేదు. ఆ విసురులో వచ్చేసింది. ఆ మాటవల్ల అతడి మొహం అవమానంతో వాడిపోయింది. ఇక మాట్లాడటానికి ఏమీలేనట్టూ అక్కణ్నుంచి కదలి వెళ్ళిపోబోయాడు. కానీ రెండడుగులు వేసి, ఆగి, "ఇంత అభిప్రాయభేదం వచ్చాక మనం తిరిగి కలుసుకోవటం కూడా పడదేమో అర్చనా! ఒకటి మాత్రం

నమ్ము. ఆ సుశీలెవరో నాకు నిజంగా తెలీదు. ఆమె సహజంగా మరణించిందా హత్య చేయబడిందా అన్నది కూడా నాకు తెలీదు. ఆ శవాన్ని ఆ రాత్రి మొదటిసారే నేను చూశాను. అది నిరూపణ కాక, నువ్వన్నట్టూ మీ మామయ్యతో సహా అందరూ నాకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తే, నాకు తిరిగి ఉరిశిక్షే ఖాయమవచ్చు. ఈ సారి ఉరికంబం ఎక్కటానికి నాకేం బాధగా లేదు అర్చనా! నా బాధ అంతా మనిద్దరిగురించే. నే నెటువంటి వాణ్ణో నీకు తెలుసు. నాకు వ్యతిరేకంగా లక్ష సాక్ష్యాలు దొరికినా నువ్వు నా మీద నమ్మకం వుంచటాన్ని నేనుకోరుకుంటాను.

ప్రేమ అంటే అదేనని నా వుద్దేశ్యం. కానీ దురదృష్ట వశాత్తూ నువ్వు పెరిగిన ప్రపంచం వేరు అక్కడ నువ్వో మహారాణివి - అందరూ నీ కనుసన్నల్లో మెలుగుతూ నీ ఆజ్ఞల్ని నెరవేర్చేవారే, బహుశా, అదే నీలో ఆ సుపీరియారిటీ కాంప్లెక్స్ని డెవలప్ చేసిందేమో. పోస్ట్మార్టమ్ రిపోర్ట్ని పరీక్షించటం, రాత్రి నా గదిలొచ్చి డైరీకోసం వెతకటం యిదంతా ఎందుకు అర్చనా! నన్ను అడుగుతే, నేను చెప్పనా............. నువ్వు అనొచ్చు - 'ఇప్పుడు మాత్రం నిజం చెప్పావా, నా మీద వొత్తేయిస్తేగానీ నిజం బయటికి రాలేదుగా' అని. ఇక్కడ నా పరిస్థితినీ, నేను పెరిగిన జీవితాన్నీ కూడా నువ్వు ఆలోచించాలి. ప్రతీదానికీ బెదిరిపోవటం, ఎవరేమనుకుంటారో అనుకోవటం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ - యివన్నీ నా లోపాలని నీకు తెలుసు.

అందుకే 'నేను హీరోనా' అని అడిగింది నిన్ను. అన్నీ తెలిసిన నువ్వు నన్ను కొద్దిగా లాలించి అడిగుంటే, అంతా వివరంగా చెప్పేవాణ్ణి. ఇక్కడ 'లాలించి' అన్న పదం నీకు హాస్యాస్పదంగా కనిపించవచ్చు. కానీ అర్చనా! ఆ పదం యెంత లోతైనదో" అన్నాడు. "ఈ సందర్భానికి ఎంత సరి అయినదో కొద్దిగా ఆలోచిస్తే నీకు తెలుస్తుంది........"

గదిలో లైటు వేసుకోకపోవడం వల్ల కేవలం వరండాలోంచి వెన్నెల వెలుతురు అతడి చెంపమీద జీరాడుతూంది. అతడు మంద్రస్వరంతో పలికిన ఆ మాటలు ఆమెని కదిలించివేసాయి. అతడికి ఆఖరి అవకాశమిస్తున్నట్టూ "సరే చెప్పు! ఆ రాంత్రేం జరిగింది?" అన్నది.

"ఆ రాత్రి ప్రత్యేకంగా ఏమీ జరగలేదు అర్చనా! జరిగిందంతా నీకు తెలిసిందే" అన్నాడు.

ఆమె హిస్టీరిక్గా మారి పిడికిలితో నుదురుకొట్టుకుంటూ జీరపోయిన కంఠంతో "ఎందుకు....? ఎందుకు నన్నిలా వేధిస్తావ్?"

అంది దాదాపు ఏడుస్తూ.

అతడు తెల్లబోయి, "నేను నిజమే చెప్తున్నాను అర్చనా!" అన్నాడు. ఆమె తనను తాను తమాయించుకోవటానికి కొద్దిసేపు పట్టింది. తరువాత కన్నార్పకుండా అతడి వైపు చూసి నెమ్మదిగా అన్నది - "ఇదంతా డ్రామా అన్న నీ మాట నిజమైతే దాని క్లైమాక్స్ ఏమిటో నిర్ణయించవలసినవాడివి కూడా నువ్వే చిరంజీవి! నువ్వునిజం చెబుతున్నావా - అబద్ధం చెబుతున్నావా అన్నది నిరూపించుకోవటం కోసం ఈ ఒక్క ప్రశ్నకి నిజాయితీగా సమాధానం చెప్పు. నా దగ్గరవున్న ఆఖరి అస్త్రం .... దాన్నే నీ మాటల్లో చెప్పాలంటే 'ట్రంఫ్ ఆర్డ్ ఉపయోగించే అవసరం రాకుండానే నువ్వు నిజం చెప్పాలి. ఈసారి నువ్వు అబద్ధం చెబితే యిక ఒట్లూ అవీ ఉండవు. మనిద్దరిమధ్యా 'స్నేహం' పూర్తిగా తెగిపోతుంది."

"దీనికి ట్రంఫ్ కార్డ్ - ఆఖరి అస్త్రం లాంటి చౌకబారు మాటలు ఎందుకు? అడుగు."

"ఒక చౌకబారు డిటెక్టివ్‌లా ఇవన్నీ పరిశోధించాను కదా! అందుకు."

"నీ మనసు నొప్పిస్తే సారీ అర్చనా! నువ్వు అడగదల్చుకున్నది అడుగు మన స్నేహం వున్నా, తెగిపోయినా నిజమే చెప్తాను."

ఆమె సూటిగా అడిగింది - "ఆ రోజు రాత్రి నీకూ, సుశీలకీ మధ్య ఎందుకు గొడవైంది?"

"అదేనా నీ ప్రశ్న?"

"అవును."

"అయితే చెప్తా విను. ఆరోజు నాకూ, సుశీలకీ మధ్య ఏ గొడవా జరగలేదు. అంతేకాదు. ఏ రోజూ మా యిద్దరి మధ్యా గొడవ జరగలేదు. సరికదా నువ్వు అనుకునే సంబంధం కూడా ఏదీ మా మధ్య లేదు............." అని యింకా ఏదో చెప్పబోతూ వుండగా అతడి మాటల్ని మధ్యలో ఖండించి, "నేను అడిగింది ఆ వివరాలన్నీ కాదు. సుశీల మరణానికి ముందు ఆ యింటిలో జరిగిన సంభాషణ ఏమిటీ అని..........." అంది.

"నేను చెప్పేది కూడా ఏమీ లేదనే............."

"అంటే దారాసింగ్ నీ దగ్గర కొచ్చి శవం సంగతి చెప్పాకే నువ్వు అక్కడికి ఆ రాత్రి బయల్దేరావ్."

"అవును."

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

23 వ భాగం

"మొత్తం మీద దారాసింగ్ ఆ రాత్రి నీ గదికి వచ్చాడంటావ్" కోపాన్ని అణుచుకుంటూ అంది.

"అవును" అన్నాడు చిరంజీవి "నేను దారాసింగ్‌తో కలిసి వెళ్ళింది కేవలం శవం కోసమే! అది సుశీలది అయినా, రాధదయినా ఒకటే! సుశీల నాకు తెలిసివుండటం కేవలం కాకతాళీయం అంతే."

"అయితే సుశీల్తో మాట్లాడలేదన్నమాట."

"నేను శవాల్తో మాట్లాడే క్షుద్ర దేవతోపాసకుడిలా కనబడ్తున్నానా?"

ఆమె కోపంగా "నా సహనానికీ ఓ హద్దుంది" అంది.

"నిజానికి ఆ మాట నేననాలి. ఏదో నేరస్తుడిలా నీ ముందు నిలబడి నీ ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పాల్సిన అవసరం కూడా నాకు లేదు. నాకు కోపం రాకపోవడం కూడా నా అసమర్ధతలాగే కనబడ్తున్నట్లుంది నీకు"

ఆమె ఒక నిర్ణయానికి వచ్చినట్టు "ఓ.కే! నిన్ను మరిక ఏ ప్రశ్నా అడగను. అసలు మనిద్దరి మధ్యా ఇక మాట్లాడుకునే అవకాశం వస్తుందని కూడా నేననుకోను. పోతే నేను మాటిచ్చిన ప్రకారం, నువ్వూ, సుశీలా హత్యకి కొంచెంసేపు ముందు మాట్లాడుకున్నట్టు మీ మధ్య జరిగిన వ్యవహారాన్నంతా చూసిన ప్రత్యక్షసాక్షిని ఇప్పుడు నీకు చూపించబోతున్నాను" అంటూ పక్క తలుపు హాండిల్‌మీద చెయ్యి వేసి "అతడిని చూసిన తరువాత నువ్వు మళ్ళీ ప్లేట్ మార్చి ఇంకో కట్టుకథ చెప్పి తప్పించుకోవటానికి ప్రయత్నించకు. ఇదే నా ఆఖరి అస్త్రం ..... ట్రంప్ కార్డ్" అంది.

"నువ్వు చెప్పింది నిజమైన పక్షంలో నా అంతట నేనే పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోతాను."

"ఇంత సేపటికి నిజాయితీగా ఓ మాట అన్నావ్" అంటూ తలుపు తెరిచి "శర్మా, ప్లీజ్ బ్రింగ్ హిమ్ హియర్" అంది.

లోపల్నుంచి సమాధానం లేకపోవటంతో తలుపు మరింత తెరిచి "అతడిని ఇలా - " అంటూ మాటల్ని సగంలోనే ఆపుచేసింది. ఆమె మొహం వివర్ణమయింది. లోపలిగది ఖాళీగా వుంది. అవతలివైపు తలుపు గాలికి నెమ్మదిగా కొట్టుకుంటోంది.

పక్కగది తలుపు తెరిచి - అర్చన స్థాణువులా నిలబడిపోవటంతో చిరంజీవికి మొదట ఏమీ అర్ధం కాలేదు, అతడు కూడా లోపలికి తొంగి చూశాడు. లోపల గదిలో ఎవరూ లేరు.

"ఎవరు అర్చనా అంత ముఖ్యమైన సాక్షి!" అని అడిగాడు. అతడి ప్రశ్నలో వెటకారం లేదు. ఆ విషయం అర్చన కూడా గుర్తించింది.

నిజానికి ఆమెకు దారుణమైన ఓటమి? తరువాత ఆమె చిరంజీవిని దోషిగా నిరూపించగల్గి వుండకపోవచ్చుగాక! కానీ

ఈ క్షణం మాత్రం ఆమె ఫ్లాల్ అయింది.

అయితే దాన్ని గుర్తించనట్టు కనబడటంలోనే చిరంజీవి గొప్పతనం ఉంది. అతడు చాలా మామూలుగా "ఏమైంది అర్చనా" అని అడిగాడు.

ఆమె మాట్లాడలేదు.

"అర్చనా?" అన్నాడు కదిలి వెళ్ళబోతూ "నా మీద నీకు ఒక అనుమానం కలిగింది. అది నా దురదృష్టమో, లేక ఎవరైనా చెయ్యాలని చేస్తున్నారో నాకైతే తెలీదు కానీ అన్నీ అలాగే కలిసొచ్చాయి. నీ అనుమానం పెనుభూతమైంది. ఇప్పుడు నీలో కల్గిన ఆ అనుమానం పోగొట్టటం కన్నా ఆ పెనుభూతంతో పోరాడటమే మంచిదని భావిస్తున్నాను. నేనేం చెప్పినా ఇప్పుడు నువ్వు నమ్మే స్థితిలో లేవు........... వస్తాను అర్చనా - గుడ్‌బై" అని తలుపు దగ్గరగా వేసి కదిలాడు.

.......

"అర్చనకి నీ మీద అనుమానం రావటంలో తప్పులేదని నా ఉద్దేశ్యం - " అన్నాడు స్ఫూర్తి.

చిరంజీవి అతడివైపు కోపంగా చూసి, "ఇల్లు కాలి ఒకడేడుస్తూంటే చుట్ట వెలిగించుకోవటం కోసం నిప్పు అడిగాడట ఇంకొకడు. అలా వుంది నువ్వు చెప్పేది! ఇంకో నాలుగు రోజుల్లో నా ఉరి అని నేనేడుస్తూ వుంటే వాళ్ళ వాదన కరెక్ట్ అంటావేమిటి?"

"వాళ్ళ పరిస్థితుల్లో ఎవరున్నా అలా చేస్తారనే నేను అంటున్నది. ఇంకా అర్చన మంచిది కాబట్టీ, నిన్ను ప్రేమించింది కాబట్టీ అలా వదిలి పెట్టింది - అదే ఇంకొకరైతే అక్కడికక్కడ నిన్ను అరెస్టు చేయించేవారు".

"అసలు నువ్వు మధ్యలో అలా వదిలిపెట్టి వెళ్ళిపోవటంతో వచ్చింది యిదంతా....."

"దారాసింగ్ వచ్చి అర్జెంటుగా పాతిక రూపాయలు కావాలని అడిగాడు."

"వాడికి డబ్బు యిచ్చే అవసరం నీకు లేదు"

"లేదు - నిజమే. కానీ వాడితో గొడవెందుకు. రేపు కోర్టులో వాడి సాక్ష్యంకూడా అవసరమేకదా. ఓ పాతిక యిస్తే ఏం పోయిందీ అని వాడిని గదికి తీసుకెళ్ళి పాతిక ఇచ్చాను. అప్పుడే డైరీ కనబడింది. అందులో సుశీల గురించి వ్రాసింది జ్ఞాపకం వచ్చి, ఆ కాగితాలు చింపేశాను. అదే కొంప ముంచింది."

"అవును - డైరీ సంగతేమిటి?"

"ఒకరోజు సర్వోత్తమరావు ఇంటినుంచి వస్తూంటే ఈ సుశీల నన్ను రోడ్డుమీద కలుసుకుంది. నేను లాయర్నని తెలుసుకుందట. తనకి సాయం చెయ్యాలనీ, ఫీజు ఏమీ ఇవ్వలేననీ వేడుకుంది. మొదటి క్లయింట్ కదా అని ఇంటరెస్ట్‌తో డైరీలో వ్రాసుకున్నాను.

కానీ తరువాత తెలిసింది. ఈ సుశీల ఓ ఇంట్రావర్టు అని - ఇంట్రావర్టు అంటే తెలుసుగా వాళ్ళు ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడరు. అయినా సరే ఆమె నా మొదటి క్లయింట్ కాబట్టి చాలా ఓర్పుతో, సహనంతో ఆమె బాధేమిటో తెలుసుకోవటానికి ప్రయత్నించాను. ఎన్నిసార్లు కలుసుకున్నా ఏడుస్తుందే తప్ప తనకేం కావాలో చెప్పదు. దాంతో ఆమెని వదిలించుకోవటానికి తాపత్రయపడ్డాను.........”

“ఆ ‘వదిలించుకోవటం’ అన్న దాన్నే ఇంకోలా అర్థం చేసుకుంది అర్చన ” అన్నాడు స్ఫూర్తి.

చిరంజీవి తల పట్టుకుని - “అర్చన రేపు కోర్టులో సుశీల గురించి నా డైరీలో చూసినట్టు చెప్తుంది. ఆ తరువాత సాక్షి దారాసింగ్ తనకా శవం సంగతి ఏమీ తెలియదనీ చెప్తాడు. ఇక నా పని గోవిందో...........” రెండోసారి ‘గోవిందా’ అనలేదు. ఉరికంబం మీద ఆఖరిసారి అంటే సరిపోతుందనుకున్నాడు.

“ఇదంతా నువ్వు చేజేతులా చేసుకున్నదే! సుశీల నీకు తెలుసు అన్న సంగతి సర్వోత్తమరావుకి ఎందుకు చెప్పలేదు?”

“నేనా చీకట్లో చూసిందెక్కడ గురూ! మెడ పిసుకుతున్నప్పుడు గమనించి ఓ క్షణం షాక్ అయ్యాను. అంతలోనే సుశీల అయితే మాత్రం నష్టం ఏమిటి అనుకున్నాను. ఆఖరి క్షణంలో ఆ నూతి దగ్గర - ‘ఈ శవం వద్దు సార్. ఇంకో శవం వెతుకుదాం’ అంటే ఏం బావుంటుంది? అందుకే పని పూర్తి చేశాను. చివరికి అదే ఇలా మెడకు చుట్టుకుంటుందని నాకేం తెలుసు?”

“సుశీల ఇంటికి వెళ్ళినప్పుడైనా అది సుశీల ఇల్లు అని తెలీదా?”

“సుశీల ఇంటికి ఇంతకుముందు నేనెప్పుడూ వెళ్ళలేదు.”

“సుశీల హత్యకి ముందు మీ ఇద్దరికీ సంభాషణ జరిగిందిగా?”

“లేదు - లేదు - లేదు. నేనా ఇంటికి ఆమె బ్రతికుండగా ఎప్పుడూ వెళ్ళలేదు. ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ నమ్మరేం?” అరిచాడు చిరంజీవి.

“ఎందుకు నమ్మాలి? ఇన్ని అబద్ధాలు చెప్పినవాడివి ఇది మాత్రం నిజంచెప్తున్నావని నమ్మకం ఏమిటి?”

“నమ్మకపోతే మీ ఖర్మ”.

స్ఫూర్తి నవ్వి “సరీగ్గా యిటువంటి సంభాషణే నీకూ, అర్చనకీ మధ్య జరిగివుంటుందని నా నమ్మకం, ఖర్మ అని వూరుకుంటే లాభం లేదు బ్రదర్. నీ గురించి ఒక చెడు అభిప్రాయం అర్చన మనసులో నాటుకుపోయింది. అయితే కేవలం పరిస్థితులే నీమీద ఆవిడకి అనుమానం కల్పించి వుండవు. దానికి తోడు యెవరో తప్పుడు సాక్ష్యంతో నిన్ను ఏడిపించడానికి మరింత మసాలా జోడుచేసి వుండవచ్చు. అదెవరో కనుక్కోవాలి. నీకూ, అర్చనకీ చెడితే సంతోషించేది యెవరు?”

“ఇద్దరు - ఒకడు ప్రకాష్, ఇంకొకడు బైరాగి. ఒకడు విదేశాల్లో వున్నాడు - ఇంకొకడు పిచ్చివాడు”

“వీళ్ళిద్దరూ కాకపోతే యింకెవరో కనుక్కోవాలి”

"టైమెక్కడుంది గురూ......... ఈడ్చి తంతే నాలుగురోజులు లేదు. బుధవారం నుంచి జైలే కదా."

"అందుకే నన్ను ఎస్సెస్ స్ఫూర్తి అన్నారు. దేనికయినా సమయస్ఫూర్తి కావాలి. దాంతో సమస్యను జాగ్రత్తగా నరుక్కుంటూ రావాలి."

చిరంజీవి ఇందులో యెంతగా కూరుకుపోయాడో - దురదృష్టం ఎంత దగ్గరలో పొంచి వుండి అతడిని కాటు వేయడానికి సిద్ధంగా వుందో సమస్య సీరియస్‌నెస్ తెలియని స్నేహితులిద్దరూ మాట్లాడుకుంటున్నారు చాలా మామూలుగా.

స్ఫూర్తి అన్నాడు "అర్చన తలుపు తెరిచి, 'శర్మా బ్రింగ్ హిమ్ హియర్' అన్నదన్నావ్ - ఆ శర్మెవరో ముందు పట్టుకోవాలి"

చిరంజీవి లేచి "ఆ శర్మ నాకు తెలుసు. జైల్లో సెంట్రీ" అన్నాడు.

"అంతకన్నా ముందు సర్వోత్తమరావుని మనకి సాయం చేయమని కోరాలి. ఆయన మనవైపు వాదిస్తే సగం నెగ్గినట్టే."

"ముందు ఆయన దగ్గరకే వెళ్తాను" అంటూ కదలబోయి, ఆగి "నేనొక సాయం అడుగుతాను చేస్తావా? నవ్వకూడదు" అన్నాడు. ఈసారి అతడి మొహం సీరియస్‌గా వుంది.

"నవ్వను - చెప్పు"

"నాల్రోజుల్లోగా నా నిర్దోషిత్వం బయటపడక నేను ఉరికంబం ఎక్కితే నా బాధ్యత నువ్వు తీసుకోవాలి. దీన్ని ఇక్కడితో వదిలిపెట్టక అసలు కారణాన్ని శోధించాలి. ఇదంతా నా మీద సానుభూతి కోసం కాదు. సెక్షన్ 302 మార్చటం కోసం !! దీన్నో ఉద్యమంలా స్వీకరించాలి. ఒక నిర్దోషి ఉరికంబం ఎలా ఎక్కుతాడో చెప్పటం కోసం నా మరణాన్ని ఉదాహరణగా తీసుకోవాలి... నేనిలా ఆవేశంగా మాట్లాడటం చూస్తూ వుంటే నీకు బహుశా నవ్వు వస్తూ వుండవచ్చు. నవ్వకు.......... ప్లీజ్"

స్ఫూర్తి నవ్వలేదు. స్నేహితుడి భుజంమీద చెయ్యి వేసి - "అంత వరకు రాదనే నా ఉద్దేశ్యం........ ధైర్యంగా వుండు" అన్నాడు అనునయంగా.

.......

"కాలు బ్యాండేజి రేపు తీసేస్తారట. ఎల్లుండి డిశ్చార్జ్ అవ్వొచ్చుననుకుంటున్నాను" అన్నాడు సర్వోత్తమరావు.

ఆస్పత్రి నిశ్శబ్దంగా వుంది. పదకొండయినా అంత ఎండగా లేదు. చాలా ఖరీదైన ఆస్పత్రి అది. నర్సులు రంభల్లా, డాక్టర్లు దేవదూతల్లా వున్నారు.

"వచ్చే బుధవారం కోర్టులో కేసుంది. మీదే సాక్ష్యం. అప్పటికి నడవటానికి వీలవుతుందా?" అడిగాడు చిరంజీవి.

"వచ్చే బుధవారం అంటే - ఓ మూడు రోజులుంది కదా - అప్పటికి శుభ్రంగా నడవగలను" అని అన్నాడాయన

“ఏమిటి నీగురించి ఆ ఇన్‌స్పెక్టరు చాలా పట్టుదలగా వున్నాడు?”

చిరంజీవి నిస్సహాయంగా నవ్వాడు “జైలు నుంచి నన్ను వదిలి పెట్టవలసి రావటంతో తన స్వంత పరువు పోయినట్టుగా బాధపడ్తున్నాడు. అన్ని వైపులనుంచీ తిరిగి సాక్ష్యాల్ని సమకూరుస్తున్నాడు. రేపు బుధవారం నేను కోర్టుకు హాజరు కాగానే నా బెయిల్ నిరాకరింపబడేటట్టూ చూడటానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు. నేను సాక్ష్యాల్ని మాయం చేస్తున్నానన్న నెపంతో ఆరోజే అరెస్టు చేసి రిమాండ్‌లో వుంచటానికి కోర్టుని అనుమతి అడుగుతాడు. నేను బైట వుంటే ఆ ప్రమాదం వుంది కాబట్టి కోర్టు కూడా దానికి వప్పుకోవచ్చు. బుధవారం జైలుకి..........” అని ఆగి నెమ్మదిగా .......... “తరువాత ఉరికి” అన్నాడు.

ఆయన అనునయంగా “అంతవరకూ రాదులేవోయ్” అన్నాడు. ఆ మాటలే చిరంజీవికి కొండంత ఆశ కల్గించినయ్.

“థాంక్యూ సర్” అని ఆనందంతో రుద్ధమైన కంఠంతో “ మీరా మాత్రం భరోసా యిస్తే యిక ఏవీ ఫర్లేదు. ఈ పోరాటంలో చాలా అలసిపోయాను సార్. మరీ ఒంటరిగాణ్ణి అయిపోయాను.......... నిజంగా” అన్నాడు.

నిజంగా అతడు మానసికంగా చాలా అలసిపోయి వున్నాడు. ఆడుతూ పాడుతూ సరదాకి వేసిన ప్లాన్ యిలా మెడకి చుట్టుకుంటుందని కలలో కూడా వూహించలేదు అతడు.

ఆయన చాలా సేపు మౌనంగా వుండి, నెమ్మదిగా “చిరంజీవీ! నా మీద నీ అభిప్రాయం ఏమిటోయ్!” అని అడిగాడు. చిరంజీవి ఉలిక్కిపడ్డాడు. ఆయన నవ్వి “సిన్సియర్‌గా చెప్పు” అన్నాడు. చిరంజీవికి యేం మాట్లాడాలో తోచలేదు.

“చెప్పటానికి నీకు ఇబ్బందిగా వున్నట్టుంది. పోనీ నేను ప్రశ్నలడుగుతాను చెప్పు. అర్చన నిన్ను ప్రేమిస్తోందని తెలిసినప్పుడు నేను డబ్బున్న ఆడపిల్ల తాలూకు మనిషిలా ‘ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు’ అని గర్జించానా?”

ఆయన ఇదంతా ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాక “లేదే” అన్నాడు.

“మీ ఇద్దరి ప్రేమనీ ప్రోత్సహించింది నేనా, కాదా?”

“మీరే”

“సరే, ఆ విషయం అలా వుంచు. లాయరుగా నామీద నీ అభిప్రాయం ఏమిటి? లక్షరూపాయ లిచ్చినా నేను నమ్మని కేసు టేకప్ చేస్తావా?”

“చేయరు.”

“ఈ విషయమై నన్ను ‘తలతిక్కగాడు’ అని తోటిలాయర్లు అనుకుంటూ వుంటారు. అవునా?”

చిరంజీవి మాట్లాడలేదు.

“ఇవన్నీ కలిపి చూస్తే నీకేమనిపిస్తుందోయ్?” అని ఆగాడు “నాక్కొన్ని ప్రిన్సిపుల్స్ వున్నాయి. ప్రపంచం తిరగబడినా వాటిని వదిలిపెట్టను. వాటి ముందు స్నేహం, బంధుత్వం యివన్నీ చాలా చిన్నవి........ పోతే అర్చన! అంటే నాకు ప్రాణం ఆ విషయం నీకూ తెలుసు.........

అర్చన దేన్ని ప్రేమిస్తే నేనూ దాన్ని ప్రేమిస్తాను. అర్చన దేన్ని ద్వేషిస్తే నేనూ దాన్ని ద్వేషిస్తాను. అందుకే అర్చన నిన్ను ప్రేమించిందీ అనగానే కటిక పేదవాడివయినా ప్రేమచిట్కాలు చెప్పి సాయం చేశాను. ఇప్పుడు అర్చన జరిగిందంతా చెప్పి సాక్ష్యాధారాలు చూపించింది కాబట్టి నిన్ను ఉరికంబం ఎక్కించేవరకూ నిద్రపోను"

యథాలాపంగా వింటున్న చిరంజీవి పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు "అర్చన....... అర్చన అంతా చెప్పిందా" అన్నాడు.

"ఆ అంతా చెప్పింది. చెబుతూ ఏడ్చింది!" అంటూ ఆవేశంతో వణికాడు "అర్చన ఆఖరి సారి ఎప్పుడు ఏడ్చిందో తెలుసా చిరంజీవీ - ఇరవై ఏళ్ళప్పుడు తల్లీదండ్రీ చనిపోయినప్పుడు ఏడ్చింది. మళ్ళీ నీ వల్ల ఇన్నాళ్ళకి తిరిగి ఏడ్వవలసి వచ్చింది" ఆయన కంఠం రుద్ధమయింది.

"అసలు జరిగిందేమిటంటే.........."

"నాకనవసరం" అన్నాడాయన "సుశీల శవాన్ని చేతులమీద ఎత్తుకుని కారులో పెడ్తున్నప్పుడు కూడా ఆమె నీకు తెలుసునన్న భావం నీ మొహంలో కనబడలేదు ఆగు! నువ్వు నాకేం చెప్పనక్ఖర్లేదు. నీ తరపున చాలామంది సాక్షులున్నారు కదా? నీకు ఆ రాత్రి శవం గురించి చెప్పిన దారాసింగూ........... నువ్వు ఇప్పటివరకూ మొహం కూడా చూడని ఓబులేసూ వగైరా వగైరాలు ......... వాళ్ళందరినీ సాక్ష్యం తెచ్చుకో. ఇక నా సంగతి అంటావా - నేను కోర్టుకొచ్చి ఈ ఫోటోల సంగతీ అదీ చెబితే జడ్జి మరింత అయోమయంలో పడవచ్చు.

నువ్వా లాయరువే కదా. నా వైపునుంచి ఆలోచించు. ఎలాగూ నా ప్రవేశం ముందేకదా హత్య జరిగింది! నా సాక్ష్యం నీకే విధంగా ఉపయోగపడుతుంది......... ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే - రేపు బుధవారం నేను కోర్టుకి రాను. ఒకవేళ వచ్చినా ఈ హత్య సంగతి నాకేం తెలియదని చెప్పదల్చుకున్నాను" అన్నాడు.

ఆ గదిలో సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం వ్యాపించింది.

విపరీతమైన షాక్ వల్ల చిరంజీవి అరచేతుల్లో తల ఆన్చుకుని కూర్చుని వున్నాడు. అతడేం మాట్లాడకపోయేసరికి "నా పరిస్థితిలో నువ్వే వుంటే ఏం చేస్తావ్?" అని ఆయనే తిరిగి అడిగాడు.

చిరంజీవి నెమ్మదిగా తలెత్తాడు "మీరు చేసిందే చేస్తాన్సార్. కోర్టుకి వెళ్ళి 'బహుశా ఈ చిరంజీవే హత్య చేసివుంటాడు' అని ఎదురు సాక్ష్యం కూడా యిస్తాను. మీరన్నదాంట్లో తప్పేం లేదాన్సర్ - తప్పేం లేదు! గుడ్‌బై" అని గదిలోంచి బయటకు వచ్చేశాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

24 వ భాగం

సాయంత్రం అయిదయింది. చిరంజీవి జైలు ముందు కాపు వేసి అరగంటయింది. మరో అయిదు నిమిషాలకి శర్మ బయటకి వస్తూ కనిపించాడు. చిరంజీవిని చూడగానే చప్పున ఆగిపోయాడు.

"హలో" అన్నాడు చిరంజీవి.

శర్మ మాట్లాడలేదు.

"నువ్వు కూడా శత్రు వర్గంలో చేరిపోయావా శర్మా" బాధగా అన్నాడు.

"మీకు శత్రువులింతమంది వున్నారని నాకు తెలీదు."

"వాళ్ళ సంగతికేం గానీ - నీ సంగతి చెప్పు."

"నాదేం వుంది సార్. చారులో కరివేపాకు లాంటివాణ్ణి. మీ ఫియాన్సీ మిమ్మల్ని చూసి మండిపడుతున్నారు" నవ్వాడు శర్మ. అతడి నవ్వు చూసి "అమ్మయ్య" అనుకున్నాడు చిరంజీవి. ఈ భారతంలో సాత్యకి తన వైపు వున్నాడు కనీసం.

"మండిపడే స్టేజి దాటిపోయిందోయ్ శర్మా! ఇంతకీ ఆరోజు అర్చన దగ్గరకి నీతోపాటూ నువ్వు తీసుకొచ్చిందెవర్ని?"

"మీకు తెలీదా?"

"ఊహూ."

"ఓబులేసుని!"

"మైగాడ్ ! వాడా!! వాడెప్పుడొచ్చాడు రంగంలోకి?"

"చెప్పానుగా - మీకు తెలియకుండానే మీ చుట్టూ శత్రువులు ఏర్పడుతున్నారని"

"వాడేమంటాడు?"

"సుశీల ఇంట్లో ఆమె మరణానికి ముందు మీరిద్దరూ మాట్లాడుకుంటూవుండగా స్వయంగా చూశానని చెప్పాడు"

చిరంజీవి అదిరిపోయి "ఆ ఓబులేసెలా వుంటాడో నేనింతవరకూ చూడనేలేదు" అన్నాడు.

"మీరు లోపలికి రావటం చూస్తూనే పులిని చూసిన కుందేలులా బైటకు పరుగెత్తాడు. వాణ్ణి తిరిగి లాక్కురావటానికి తలప్రాణం తోకకి వచ్చింది. అర్చనగారి కాళ్ళమీదపడి తనీ విషయం చెప్పినట్టూ తెలిస్తే మీరూ దాదా కలిసి తన ప్రేవులు తోడేస్తారని అన్నాడు."

చిరంజీవి తల తిరిగిపోయింది "ఇంకేముంది - అర్చన నమ్మేసివుంటుంది" అని, "వాడెవడో అద్భుతంగా నటించాడు కానీ ఇంతకీ ఆ ఓబులేసెవడో నాకు తెలీనే తెలీదు. నన్ను నమ్ము శర్మా!" అన్నాడు.

"నేను నమ్ముతున్నాను సార్. వాడు నటిస్తున్నాడని నాకు అప్పుడే అనుమానం వచ్చింది. వాడు మీ మనిషి కాదని ఈ క్షణం పూర్తిగా అర్థమయిపోయింది".

"ఎలా అయింది? నేను అబద్ధం చెబుతూ వుండొచ్చుగా."

"ఓబులేసు మీ మనిషి అయితే మేమిద్దరం కలిసి అర్చనగారి దగ్గరికి వెళ్ళిన సంగతి మీకు ఈ పాటికే వాడు చెప్పివుండేవాడు. మీరు నా దగ్గరకి వెతుక్కుంటూ రావటం దేనికి?"

'ఈ మాత్రం లాజిక్కు అర్చనకి వుండివుంటే ఎంత బావుండేది శర్మా' అనుకున్నాడు మనసులో. "ఇంతకీ ఈ ఓబులేసు వుండేదెక్కడ?" అని అడిగాడు.

"శవం దొరికిన వీధి చివర సత్రం దగ్గర ఎదురు అరుగుమీద రాత్రి పదయ్యాక దొరుకుతాడు సార్" అని, చిరంజీవి వెళ్ళబోతూంటే "మళ్ళీ ఎప్పుడు కలుస్తారు సార్" అని అడిగాడు.

"పెర్మనెంట్‌గా రెండ్రోజుల్లో" అంటూ కదిలాడు చిరంజీవి. అందులోని శ్లేష శర్మకి అర్థం కాలేదు.

.......

రాత్రి పదిన్నర అయింది. చీకట్లో అరుగు మీద కూర్చొని వున్నాడు చిరంజీవి. అతడి చూపు ఎదుటి అరుగుమీదే వుంది. ఇద్దరు ముగ్గురు బిచ్చగాళ్ళు అక్కడ పడుకుని వున్నారు. ఇంకా ఓబులేసు రావల్సి వుంది. ఓబులేసుతో ఎలా నిజం చెప్పించాలా అనేది యింకా నిశ్చయించుకోలేదు చిరంజీవి. అప్పటి పరిస్థితిని బట్టి చూద్దామనుకున్నాడు.

అంతలో, వీధిలాంతరు వెలుతుర్లో దూరంగా ఓ ఆకారం తూల్తూ రావడం కనబడింది, కడుపునిండా గుడుంబా తాగి - ఏదో పాట పాడుకుంటూ వస్తున్నాడు ఓబులేసు. భుజం మీదనుంచి జోలె తీసి అందులోంచి ఓ గుడ్డ పక్కగా వేస్తూవుండగా చిరంజీవి వెనగ్గా వెళ్ళి " ఓబులేసూ " అని పిల్చాడు.

చెవి పక్కగా వినిపించిన పేరుకి ఓబులేసు అదిరిపడి పక్కకి తిరిగాడు.

"నేనూ - చిరంజీవిని"

అంతే. చేతిలో బట్ట అరుగుమీదే వదిలేసి, పరుగుతీయటం ప్రారంభించాడు ఓబులేసు. చిరంజీవి అతడి వెంట పడ్డాడు.

"అరె - నేనేం చెయ్యను, ఆగు" అంటూ వెంటపడ్డాడు చిరంజీవి.

కానీ ఓబులేసు ఆగలేదు. బెదిరిన జింకలా పరుగెడ్తూనే వున్నాడు. క్షణంలో సందుచివర సత్రంలోకి మాయమయ్యాడు.

చిరంజీవి సందులోంచి మెయిన్‌రోడ్డువైపు పరిగెడుతూ వుంటే అరుగుమీద నిలబడి ఆ దిశగా కళ్ళకి చేతులాన్చుకుని

చూస్తున్న ఓ ముసలమ్మ "ఏమైంది బాబూ - " అని అడిగింది.

"ఏం లేదు" అంటూ ముందుకు కదలబోయిన చిరంజీవి చప్పున ఆగిపోయాడు. ముసలమ్మ!

తనకి సుశీల శవాన్ని అమ్మిన అవ్వ!! ఆ చలిలోకూడా ఉద్వేగంతో అతడి నుదుట చెమట పట్టింది.

"బావున్నావా అవ్వా."

"ఏం బాగులే .... ఏదో యిట్ట బతుకుతున్నాం....... ఎవరదీ!"

చిరంజీవి మెట్లెక్కి అరుగు మీద కూర్చుంటూ "ఆరోజు సుశీల శవాన్ని తీసుకెళ్ళింది నేనే" అన్నాడు.

ఆ మాటలకి ముసలమ్మ మొహంలో భయం కొట్టొచ్చినట్టూ కనబడింది. "మల్లెందుకొచ్చినవ్" అంది బెదుర్తూ.

"అబ్బెబ్బే. దానికీ, ఇప్పుడు నేనొచ్చినదానికీ సంబంధం లేదు. ఇల్లిల్లూ తిరిగి పన్నులేసే ఆఫీసు నాది. ఈ వీధికి నేనే ఆఫీసర్ని. అందుకే ఇంత ఆలస్యం అయింది."

"మరి మా గది సూడలేదేం బాబూ" అంది ముసలమ్మ. ఇప్పుడు ఆ కంఠంలో మార్పొచ్చింది.

"చూడక్కర్లేదు. సుశీలమ్మ శవాన్ని తీసుకెళ్ళేటప్పుడు చూశాగా. పన్ను నెలకి పదిరూపాయలు వేద్దామనుకుంటున్నాను."

"అమ్మనాయినో - " అని అరిచింది ముసలమ్మ "క్రిందటేడు రెండు రూపాయలే కట్టినాగా -" చిరంజీవి మాట్లాడకపోయేసరికి "బాబ్బాబూ - ఏదో తెలిసినోడివి ఆఫీసర్గా వచ్చినవ్. సాయం జెయ్యి బాబూ"అంది.

"నేన్నీకు తెలుసా? ఎలా?"

"అదేంది బాబూ! శవం సంగతి ఓబులేసుతో కబురు అంపింది నీకేగా."

"మరి మొన్న ఆ అమ్మాయొస్తే ఎందుకు చెప్పలేదు?"

ముసలమ్మ గుర్తు తెచ్చుకుంటూ "ఓ ఆ అమ్మాయా" అని, "........... పక్కన పోలీసున్నాడుగా - అందుకే నాకేం తెలీదని చెప్పినా" అంది.

"ఈ సారి ఆ అమ్మాయిని తీసుకొస్తే నిజంగా చెప్తావా?"

"ఆ నువ్వేం చెప్పమంటే గది జెప్తా."

"నేనేం చెప్పమంటే అది అక్కర్లేదు. జరిగింది జరిగినట్టూ చెప్పు - చాలు."

"మరి నా యింటి పన్ను....."

"ఇంక అసలు కట్టక్కర్లేకుండా నేను ఏర్పాటు చేస్తానుగా" అని అక్కణ్నుంచి కదిలాడు. రాత్రికి రాత్రే అర్చనని తీసుకొచ్చి ముసలమ్మతో మాట్లాడించాలనుకున్న బలమైన కోర్కెని అతికష్టంమీద అణుచుకున్నాడు. ఇంటికి చేరుకునేసరికి పన్నెండు

గంటలు కావొస్తూంది. పక్కమీద పడుకుంటూ అనుకున్నాడు - "ఇంకా రెండురోజులు - ".

## 5

ఎనిమిదవుతూండగా అర్చన గదిలో ఫోన్ మ్రోగింది.

ఆమె రిసీవర్ ఎత్తి 'హలో' అనగానే అట్నుంచి "నేనూ - చిరంజీవిని" అని వినిపించింది. ఆమె 'నువ్వా' అనబోయి, కంట్రోలు చేసుకుని "ఏమిటి చెప్పు" అంది. ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఎంత కాదనుకున్నా చిరంజీవి ......... మనసుకి దగ్గరగా వచ్చినవాడు!

"నీతో కొద్దిగా మాట్లాడాలి" అట్నుంచి అన్నాడు.

"ఏ విషయం?"

అతడికి ఈసారి నిజంగా కోపం వచ్చింది. "ఏ విషయమో ఫోన్లో చెప్తేగానీ అప్పాయింట్‌మెంట్ యివ్వవా?" అన్నాడు కటువుగా. ఆమె తాపీగా మాట్లాడటానికి ప్రయత్నం చేస్తూ "మనం మాట్లాడుకోవలసిన విషయాలు ఇంకా ఏమైనా వున్నాయా" అన్నది.

అతడికి విసుగేసింది "నీ మాటలు వింటూంతే - నీ ఆస్తికోసమూ, నిన్ను ప్రసన్నురాలిని చేసుకోవడం కోసమూ నేను దేబిరిస్తున్నట్టూ నా మీద నీ కభిప్రాయం ఉన్నట్టుంది. అలాంటిదేదైనా వుంటే వెంటనే మార్చుకో. కేవలం నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకుందామన్న కోర్కె తప్ప నాకింకే ఆశా లేదు" అన్నాడు. ఈ మాట మాత్రం అతడు చాలా సిన్సియర్‌గా అన్నాడు. నిజానికి అతడి మూడ్‌కూడా అలాగే వుంది.

ఆమె అతడిని 'హర్ట్' చేశానని గ్రహించింది. ఆ హక్కు తనకి లేదు "అయామ్ సారీ....... రా...... ఎదురుచూస్తూ ఉంటాను" అని ఫోన్ పెట్టేసింది.

అరగంట తరువాత అతడువచ్చి, "ముసలమ్మని చూద్దాం రా!" అని ఆహ్వానించినప్పుడు మాత్రం ఆశ్చర్యపోయి "ఎందుకు" అని అడిగింది.

"సుశీల యింటికి నేనెప్పుడూ వెళ్ళలేదనీ - సుశీల మరణం సంగతి ఓబులేసే దారాసింగ్‌కి ముందు చెప్పాడనీ ముసలమ్మ నీకు చెప్తుంది"

అర్చన మాట్లాడలేదు. అమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకుని - "ఏం ? ముసలమ్మకి లంచం యిచ్చి ఆ సాక్ష్యాన్ని నేను కొనుక్కున్నట్టూ అనుమానంగా ఉందా" అన్నాడు.

ఆమె మనసులో బాధపడి, పైకి మాత్రం పొడిగా"లేదు" అంది.

ఇక్కడ అర్చన పరిస్థితి గమనించాలి. రెండ్రోజుల క్రితం వరకూ ఒక్కొక్క సాక్ష్యమూ దొరుకుతూ వస్తూంటే ఆమె ఆవేశం పట్టలేకపోయింది. చివరకి తన మామయ్య దగ్గర చిరంజీవి దోషిగా నిరూపించగలిగిన తరువాత ఆమెకి శూన్యమే మిగిలింది. ఆ శూన్యంలో చిరంజీవి జ్ఞాపకాలు ......... చిరంజీవి మాత్రం నిర్లిప్తంగా వున్నాడు.

కారులోకూడా అతడు అలాగే ఉన్నాడు. అర్చన అతడివైపు చూసి ఒకటి రెండుసార్లు మాట్లాడదామనుకుంది కూడా. కానీ అతడి ఆలోచన్లు అర్చన చుట్టూ గానీ - ప్రేమచుట్టూ గానీ లేవు. అంతకన్నా ఎక్కువ సాంద్రత కల్గినవి - జీవితం గురించీ - ఖర్మ గురించీ.......

ఇంకోరెండు రోజుల్లో తన నిర్దోషిత్వం ఋజువు కాకపోతే....... ఉరి. ఇంతకు ముందులా ఆడుతూ, పాడుతూ ఉరికోసం ఎదురు చూడటం ఉండదు. ప్రత్యక్ష నరకం అనుభవిస్తాడు. .. చెయ్యని నేరానికి రోజుదాటి రోజు దగ్గర పడుతూంటే విలవిల లాడిపోతాడు.

అతడు కళ్ళు మూసుకున్నాడు. అర్చన రోడ్డు పక్కగా కారు ఆపుచెయ్యటం గమనించి ఆలోచనల్లోంచి తేరుకుని చిరంజీవి కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఏదో శవం వస్తోంది. పిల్లలు పైసల కోసం ముందు పరుగెడుతున్నారు. గాలిలోకి ఎగరేసిన మరమరాలు రోడ్డుమీద తెల్లగా పడుతున్నాయి. ఏదో అనాధ శవంలా వుంది.......... శవం వెనుక పదిమందికన్నా ఎక్కువ లేరు.

ఎవరైనా చనిపోతే ఆ లొకాలిటీలో బాగా తాగుతారు. చాలా తాగి, ఇద్దరు ముగ్గురు శవం ముందు నాట్యం చేస్తూ నడుస్తారు. ఒకడు డప్పు వాయిస్తున్నాడు. ఇద్దరాడవాళ్ళు బాగా వెనగ్గా నడుస్తూ మాట్లాడుకుంటున్నారు. చనిపోయిన వ్యక్తికి దగ్గర వాళ్ళుగానీ, బంధువులు గానీ ఎవరూ లేరని చూడగానే తెలుస్తూంది.

ఎందుకో, ఏదో అనుమానంవచ్చి అర్చన తలతిప్పి చిరంజీవి వైపు చూసింది. అతడు స్థాణువులా కూర్చున్నాడు.పాడెకి తాడుతో గడ్డిగా కట్టేసిన శవపు తల మాత్రం వాహకుల కుదుపులకి అటూ యిటూ వూగుతోంది.

అటే చూస్తున్న చిరంజీవి మొహంలో భావాలు నెమ్మదిగా మారసాగాయి. 'తెల్లటి జుట్టూ - చప్పి దవడలు..........'

శవం కారు దగ్గరకి వస్తోంది. చిరంజీవి మొహం పాలిపోవటం చూసి అర్చన కూడా శవం వైపు పరిశీలనగా చూసింది. శవం కారుని దాటి వెళ్ళిపోతోంది.

చిరంజీవి చటుక్కున కారు తెరుచుకుని బైటకొచ్చి నిలబడ్డాడు. మెడ సాచి, అరికాళ్ళు ఎత్తి శవం మొహాన్ని చూశాడు. వంట్లోంచి రక్తాన్నంతా ఎవరో తోడేసినట్టూ నిస్సత్తువ! క్రిందకి జారిపోకుండా వుండటం కోసం కారుని ఆనుకున్నాడు.

జనం నెమ్మదిగా ముందుకు సాగిపోయారు. అతను ప్రేక్షకుడే అయ్యాడు. అర్చన అతడి వద్దకు వచ్చి - వెళ్దామంది. అతడు కదల్లేదు. నిమిషాలు గంటలయాయేయో!

అతడికి మొట్టమొదటిసారి అనుమానం వచ్చింది - 'ఇదంతా ఆషామాషీ వ్యవహారం కాదు! నవ్వులాటకి చేసింది కూడా కాదు!! అనుక్షణం తన మీద నిఘా వుంచి, చాలా జాగ్రత్తగా తన చుట్టూ వల బిగిస్తున్నారు'

ఇంకో రెండ్రోజుల్లో తనీ వల ఛేదించి బైట పడాలి. పడగలడా?............ చీకట్లో చిన్న ఆశాకిరణం లేశమైనా కనబడటం లేదు.

......

"ముసలమ్మది మామూలు మరణమే అయి వుంటుంది. నువ్వు అనవసరంగా కంగారు పడుతున్నావేమో" అన్నాడు స్వామూర్తి.

"ఎందుకలా అనుకుంటున్నావ్?"

"ముసలమ్మని చంపటంవల్ల ఎవరికీ లాభం లేదు. సుశీల చచ్చిపోవటం మాత్రమే ఆవిడకి తెలుసు. ఎలా చనిపోయిందీ తెలీదు. అందువల్ల, ఆవిడ సాక్ష్యం వల్ల నీకు లాభంలేదన్న విషయం నీ శత్రువులక్కూడా తెలుసు."

"కానీ అర్చనకి నా మీద నమ్మకం కుదిరేది, ఓబులేసు అబద్ధం చెబుతున్నాడని అర్థమయ్యేది -"

"రెండు రోజుల్లో ఉరిశిక్ష ఎదురుగా పెట్టుకుని అర్చనని కన్విన్స్ చేయటం నీ ఆశయంగా మాట్లాడతావేమిటి? అర్చన రేపు కోర్టుకొచ్చి నీ ప్రవర్తనా, మంచితనం గురించీ సర్టిఫై చేస్తే నీకు శిక్ష వెయ్యకుండా వదిలేస్తారనుకుంటున్నావా" విసుగ్గానూ, కోపంగానూ అన్నాడు స్వామూర్తి.

చిరంజీవి వెంటనే మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా అన్నాడు - "నాకు ప్రేమ గురించి తెలీదు. దాని గురించి మాట్లాడుతున్నానని నవ్వుకోకు. నాకీ క్షణం ఈ శిక్షా - ఈ ఉరి - వీటి వల్ల భయం కలగటంలేదు. శత్రువు ఎవరో తెలియకుండా విధితో ఎలా పోరాడను? ఇప్పుడు నా ఆశ ఒకటే. కనీసం అర్చనైనా నా నిర్దోషిత్వం గురించి నమ్మితే చాలు. జైల్లో ఒంటరిగా కూర్చొన్నప్పుడు బైట ప్రపంచంలో నా గురించి కనీసం ఒక్కరైనా బాధపడుతున్నారన్నది సంతృప్తినిస్తుంది. నేను సరిగ్గా చెప్పలేకపోతున్నానేమో? నే చెప్పదల్చుకున్నది అర్థమైంది కదా......"

సరిగ్గా అదే సమయానికి ఇంట్లో అర్చన సర్వోత్తమరావుగారితో అంటోంది - "ఆ క్షణం చిరంజీవి మొహం చూస్తే అతడు చెప్పిందంతా నిజమే అనిపించింది అంకుల్! ముసలమ్మ మరణం తాలూకు షాక్ అతడి మొహంలో స్పష్టంగా కనిపించింది."

"ఆ షాక్ తనకున్న ఏకైక సాక్షి చనిపోవడం వల్ల వచ్చిందా? తను ఏర్పరుచుకున్న సాక్షి చనిపోవటం వల్ల వచ్చిందా- అన్నది మనం నిర్ణయించుకోవాలి. చిరంజీవిని రక్షించాలంటే ఒక్కటే మార్గం"

"ఏమిటి?"

"చిరంజీవీ, నేనూ ఆ రాత్రంతా కలిసే వున్నామనీ - దారాసింగ్ మా దగ్గరకొచ్చి శవం సంగతి చెప్పాకే అక్కడికి వెళ్ళామనీ నేను సాక్ష్యం ఇవ్వాలి. దాంతో చిరంజీవికి 'ఎలిబీ' ఏర్పడుతుంది"

అర్చన చాలా స్పష్టంగా చెప్పింది - ఆ కంఠంలో నిజాయితీ ఉంది, కమేండ్ వుంది. ఆమె అంది - "కేవలం చిరంజీవిని నేను ప్రేమిస్తున్నాను కాబట్టి - చౌకబారు ప్రేమకథల్లోలా అతడేం తప్పు చేసి వుండడనీ, అతడు శ్రీరామ చంద్రుడనీ నేను అనటం లేదంకుల్.

అతడు నేరం చేసి వుంటే శిక్షపడాల్సిందే! అతడికా శిక్ష పడిన తరువాత ఒంటరిగా విధిని నిందించుకుంటూ నాలో నేను కుమిలిపోను. ప్రేమించటానికి నేను ఎన్నుకున్న వ్యక్తి ఇలాంటివాడా అని మాత్రం బాధపడతాను! ఇదంతా నీకు మొరటుగా కనిపించవచ్చు. కానీ ఏదో ఒక చిన్న సంఘటనతో చిరంజీవిని నేను ప్రేమించటం మొదలుపెట్టలేదు".

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

25 వ భాగం

"ప్రేమ ఒక చిన్న సంఘటనతో ఉద్భవిస్తుందని కథలో చదివి, ఈ ఆడపిల్లల అమాయకత్వానికి నవ్వుకునేదాన్ని. ఇప్పుడు నా అంచనాయే తారుమారైంది! అయినా నా కెందుకో సిక్త్ సెన్స్ చెబుతోంది అంకుల్! ఆ క్షణం ముసలమ్మ శవాన్ని చూస్తూ నిశ్చేష్టుడిగా నిలబడ్డ చిరంజీవి మొహం ఇప్పటికీ నాకు గుర్తుంది. తను 'ఏర్పర్చుకున్న' సాక్షి చనిపోతే ఆ నిశ్చేష్టత రాదు!

అతడు నిజంగా దోషి కాక, కేవలం విధే అతడి పట్ల ఇలా ఆడుకుంటున్న పక్షంలో........ లీలగా ఆడుకుంటున్న పక్షంలో..............." ఆమె కంఠం వణికింది "ఒక నిర్దోషిని - ఉరికంబం ఎక్కించడానికి సాయపడుతున్న నీ ఎవిడెన్స్ ఆక్టూ - నీ సి. ఆర్. పి. సి. - నీ పీనల్‌కోడ్ - అన్నీ అగ్గిపుల్లేసి తగలబెట్టెయ్యాలి అంకుల్ ..... అవి ఫక్తు అనవసరం."

ఆమె కంఠంలో ఆర్ద్రతకి సర్వోత్తమరావు కదిలిపోయి "అంత మాట అనకమ్మా" అన్నాడు "మనిషి న్యాయంగా ప్రవర్తించటానికి గీసినగిరి చట్టం. దానికి సాయపడేది సాక్ష్యం. ఈరోజు మనకేదో అయిందని దాన్ని కాదనటం అన్యాయం. మనమూ ప్రయత్నిద్దాం. నిజంగా చిరంజీవి నిర్దోషి అయిన పక్షంలో నేను చదివిన చదువూ - నాకు తెలిసిన క్రిమినల్ లా - అన్నీ ఉపయోగించి అతడిని బైటకి తీసుకొస్తాను. నాకింకొక్కరోజు టైమివ్వు. రేపట్నుంచీ తిరగొచ్చు అని డాక్టర్లన్నారు. ఈలోపులో అన్నిటికన్నా ముందు చిరంజీవి నిర్దోషి అని మనం నిర్ధారణ పర్చుకోవాలి........."

"నేనూ దానికి ప్రయత్నిస్తాను"' అంటూ అర్చన లేచి "వెళుతున్నా అంకుల్" అంది.

"ఎక్కడికమ్మా?"

"కోర్టుకి - అక్కణ్ణుంచి పోలీస్‌స్టేషన్‌కి"

"ఎవరన్నా జూనియర్‌ని పంపిద్దును కదా"

"నేనే స్వయంగా చూస్తే కానీ తృప్తి వుండదు అంకుల్" అంటూ బైటకు నడిచింది. గారేజ్‌లోంచి కారు తీసి కోర్టువైపు పోనిచ్చింది.

--

ఇంకా రెండ్రోజులుంది. అంతే! ఈ నలభై ఎనిమిది గంటల్లో ఎక్కణ్ణుంచి ప్రారంభించాలి? ఎవరితో ప్రారంభించాలి?

తలుపు దగ్గర చప్పుడవటంతో చిరంజీవి ఆలోచనల్లోంచి తేరుకుని తలెత్తాడు. విశాలమైన చిరునవ్వుతో దారాసింగ్ "నమస్తే సాబ్" అని, అతడు రమ్మనకుండానే లోపలికి వచ్చాడు.

"ఏమిటిలా వచ్చావ్?"

“ఓబులేసు కనబడటం లేదట సాబ్” అంటూ నవ్వాడు. అతడి నవ్వు చూసి కంపరం పుట్టింది చిరంజీవికి “అయితే” అన్నాడు.

“సుశీల్ని పాడుచేసి చంపిందెవరో మనకిక పూర్తిగా తెలియకుండా పోయినట్టే”

“నా ఉద్దేశ్యం ఆ ఓబులేసే” అని అన్నాడు చిరంజీవి.

భళ్ళున నవ్వాడు దారాసింగ్ “వాడా - తాగీ తాగీ వాడి చేతులు వణుకుతూ వుంటాయి. వాడు మామూలుగానే ఏమీ చెయ్యలేడు సాబ్ ఇంక రేప్ ఎక్కడ?”

“సుశీల శవాన్ని మీకిచ్చింది నేనే అని చెప్పగలిగేవాడు ఇప్పుడిక ఒకడే సార్”

“ఎవరు?”

“నేనే”

“నీ జోకు తగలెయ్య - అసలు విషయం చెప్పు.”

“నాక్కొంచెం డబ్బు కావాలి సార్”

“......... ఎంత?

“ఓ లక్ష.”

చిరంజీవి దాహమేసింది “ఎంతా?” అని అడిగాడు.

“లక్ష”

“రూపాయలేనా?”

“అదేమిటి సార్ - లక్షాధికారి అయిన అమ్మాయిని చేసుకోబోతూ -”

“ఓరి దౌర్భాగ్యుడా! మా యిద్దరికీ ఎప్పుడో చెడింది”

“లక్షిస్తే నా సాక్ష్యం బాగుచేస్తుంది సార్”

“ఇవ్వకపోతే.........”

“ఉరితాడు మీ వూపిరిని ఆపుచేస్తుంది సార్”

“ఈ డైలాగులు నీ సొంతమా? ఎవరైనా పంపించారా?”

“అది మీకనవసరం సార్” నమ్రతగా అన్నాడు దారాసింగ్.

చిరంజీవి కూడా అంత తాపీగా, “సాక్షి సినిమా చూశావా?” అని అడిగాడు. దారాసింగ్ తెల్లబోయి “లేదు సార్” అన్నాడు.

“పోనీ ‘తలుపులన్నీ వేసి కొడితే పిల్లైనా తిరగబడ్తుంది’ అన్న సామెత విన్నావా?”

“లేదు సార్ - ఎందుకు?”

“ఇందుకు” అని పిడికిలి బిగించి గెడ్డంమీద బలంగా కొట్టాడు. ముందు టప్‌మని చప్పుడయింది. అది గెడ్డంమీద తగిలిన చప్పుడు. ఆ తరువాత దబ్‌మని చప్పుడయింది. అది తల వెళ్ళి గోడకి కొట్టుకున్న చప్పుడు.

అతకష్టం మీద దారాసింగ్ పైకి లేచి “హూ” అని, “దెబ్బకి దెబ్బ బదులు తీర్చుకోకపోతే నా పేరు దాదాయే కాదు” రోషంగా అని వెళ్ళిపోయాడు.

అప్పుడే వచ్చిన స్ఫూర్తి “అదేమిటి గురూ, వాడితో గొడవ పెట్టుకున్నావ్? తరువాత వాడు తిరిగి తంతే ......” అన్నాడు.

“వాడు నన్నేవీ చెయ్యలేడు?”

“ఏం? ఎందుకు చెయ్యలేడు?”

“ఎల్లుండి నుంచీ జైల్లో వుంటాను కాబట్టి” అని నవ్వాడు.

“ముసలమ్మ చచ్చిపోయింది. ఓబులేసు మాయమయ్యాడు. దారాసింగ్ ఎదురు తిరిగాడు. ఇంక నాకెవరు సాక్ష్యం చెబుతారు. ..... ‘నిండా మునిగినవాడికి చలేమిటి’ అన్న సామెత నాలాంటి వాడిని చూసే వచ్చినట్టుంది. ఆ సుశీలెవరో ఆ రోజే చావాలా - చచ్చెనుపో - ఆవిడ నాకు తెలిసిందే అయివుండాలా? తెలిసెను పో - చచ్చేముందే ఆవిడ రేప్ చెయ్యబడాలా? పడెను పో - ఆ చేసేవాడెవడో అదేదో సహజ మరణంలా, ఆ రేప్ యింట్లోనే చెయ్యాలా? చేసెను పో - ఆ రేప్.....” స్ఫురించినట్టు చప్పున ఆగిపోయాడు.

స్ఫూర్తి అతడివైపే చూస్తున్నాడు.

చిరంజీవి తనలో తనే ఆలోచిస్తున్నట్టు పైకి అన్నాడు - “అవునూ సుశీల రేప్ ఎప్పుడు జరిగింది? మరణానికి ముందుకదా! మరణం ఎప్పుడు సంభవించింది? మేం వెళ్ళటానికి చాలా కొద్ది సేపు ముందు కదా!మేం వెళ్ళేసరికి రిగర్ మార్టిన్ స్టేజి నెంబర్ వన్ కూడా ఇంకా ప్రారంభం కాలేదుకదా! ......... అంటే, రేప్ జరిగింది అర్ధరాత్రి పూట అన్నమాట!

ఆ అర్ధరాత్రి తీరిగ్గా రేప్ చెయ్యటానికి ఎవడో వచ్చాడే అనుకుందాం. ఇంట్లో ఒంటరిగా వున్న ఈవిడ తలుపు తీసి ఎలా వాడ్ని లోపలికి ఆహ్వానించింది? అంటే వచ్చింది ఎవడో తెలిసినవాడే అయివుండాలి. వాడెవడో? తెలియాలంటే ఈ ఇరవైనాలుగు గంటల్లో ఆవిడ జీవిత చరిత్రనంతా తవ్వి తియ్యాలి.... అదొక్కటే మార్గం.....”

ఈ తర్కం చూసి స్ఫూర్తి గెడ్డం బరబరా గోకేసుకున్నాడు. ఈ లాజిక్కు విని జుట్టు పీక్కున్నాడు. అయితే అది అయోమయంతో కాదు - ఆనందంతో.......

చిరంజీవి తెలివితేటలున్నవాడని తెలుసును కానీ - నిండా మునిగాక కూడా ఇంత షార్ప్‌గా ఆలోచిస్తాడని తెలీదు.

మబ్బుల వెనుక నుంచి సూర్యుడు బైటకొచ్చినట్టున్నాడు. ఒక కిరణం కిటికీలోంచి సూటిగా లోపల పడుతోంది. ఆ కిరణం ఆశలా వుంది. ప్రవాహంలో తేలే గడ్డిపోచలా వుంది.

సుశీల గత జీవిత చరిత్ర కనుక్కోవటం కోసం చిరంజీవి బయలు దేరాడు.

......

సాధారణంగా కోర్టునుంచి పేపర్లు గానీ - వివరణగానీ తీసుకోవటానికి చాలా తతంగం వుంది. కానీ డబ్బు వాటిని సులభతరం చేస్తుంది!

ఆమె కాగితాలు తీసుకుని చదవసాగింది. చిరంజీవి ఉరిశిక్ష కథ ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం యిలా సాగింది:

"హతురాలైన సుశీల, ముద్దాయి అయిన చిరంజీవికి ఎప్పటినుంచో స్నేహితురాలు కానీ వివాహం అయితేనే గానీ శారీరకంగా దగ్గర కావటానికి ఆమె ఒప్పుకోలేదు. పెండ్లి కోసం ఆమె తొందర పెట్టసాగింది. ఆమెని వదిలించుకోవటం కోసం అతడు ఆమెని సాయంత్రం ఆరింటికి సత్రం దగ్గరికి రమ్మన్నాడు. దానికి సాక్ష్యం అతడు వ్రాసిన ఉత్తరం. (ఎగ్జిబిట్ నెం.1) - అతడు

ఆమె కోసం ఎదురుచూస్తూ సిగరెట్లు కాల్చాడు. (ఎగ్జిబిట్ నెం.2) - అక్కడ ఇద్దరికీ ఘర్షణ జరిగింది. అతడు ఆమెని రేప్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ ఘర్షణలో అతడి మెడలోంచి ఒక బిళ్ళ జారిపడింది. (ఎగ్జిబిట్ నెం 3) - రేప్ చేసిన తరువాత ముద్దాయి ఆమెని హత్య చేశాడు. ఆ తరువాత శవం నూతిలోకి తోసి వేయబడింది. అభం శుభం తెలియని ఒక అమాయకురాలైన అమ్మాయిని ప్రేమ పేరిట మోసం చేసి, ఒంటరిగా సత్రందగ్గరకు రమ్మని పిలిచి రేప్ చేసి........."

ఇలా సాగింది ఆ రిపోర్టు. దాన్ని ఆమె పూర్తిగా చదవలేదు.

ఆమె చూపు ఎగ్జిబిట్ నెం 3 దగ్గరే ఆగిపోయింది "ఏమిటిది?" అని అడిగింది - చూపుడు వేలుతో ఆ వాక్యాన్ని చూపిస్తూ.

కోర్టు క్లర్కు దాని తాలూకు ఫోటో చూపించాడు. అది ఒక రాగిబిళ్ళ. దాని మీద లంగరు బొమ్మ వున్నది. నల్లతాడుకి కట్టిన బిళ్ళ అది.

దాన్ని చూపిస్తూ "హతురాలి గదిలో దొరికింది ఇది. రేప్ చేస్తునప్పుడు పడి వుంటుంది. ఇది తన మెడలోదే అని చిరంజీవి ఒప్పుకున్నాడు" అన్నాడు.

చిరంజీవి మెళ్ళో అలాంటి బిళ్ళ తనెప్పుడూ చూడలేదు. అతడు చెప్పిన కథంతా నిజమైన పక్షంలో - కేవలం తనకి ఉరిశిక్ష పడటంకోసం ప్రతీదీ తనదే అని ఒప్పుకున్నాడన్న మాట!

"అది సాయంత్రం ఆరింటికి! తరువాత వాళ్ళిద్దరూ తీరిగ్గా దెబ్బలాడుకోవటం కోసం గదికి వెళ్ళి వుండొచ్చుకదా"

పెద్ద లాజిక్కు పాయింటు పట్టుకున్నట్టు నవ్వేశాడు క్లర్కు.

"అది నిజమైన పక్షంలో గదిలో చంపిన శవాన్ని చిరంజీవి నూతి వరకూ ఎలా తీసుకెళ్ళగలిగాడు - అన్న ప్రశ్న కోర్టులో

రాలేదా?"

అతడు దెబ్బతిని, వెంటనే సర్దుకుంటూ "అర్ధరాత్రి పూట శవాన్ని తీసుకెళ్ళటంలో కష్టమేముంది - అందులో చిరంజీవిలాంటి యువకుడికి" అన్నాడు తనే జడ్జీ అయినట్టు.

"పోనీ తీసుకెళ్ళాడనుకుందాం. తీసుకెళ్ళినవాడు శవాన్ని నూతిలో పడేసి ఇంటికి పోతాడే తప్ప, అక్కడే నిల్చుని సిగరెట్లు కాల్చి పీకలు పడెయ్యడు కదా! ఎందుకంటే సిగరెట్ పీకలు సత్రం దగ్గర లేవు, నూతి దగ్గర వున్నాయి."

తేరుకోలేని దెబ్బ ఇది. బ్లాంక్‌గా అర్చన వైపు చూస్తూ "అవును, అది నిజమే......" అని, "మీ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని అడిగితే గానీ ఈ విషయాలన్నీ వివరంగా తెలియవు " అన్నాడు - తను ఓడిపోయినట్టు ఒప్పుకోవటం యిష్టంలేక.

ఆమె దాన్ని గురించి రెట్టించలేదు. ఫోటోలోవున్న బిళ్ళ, దాని మీద వున్న లంగరు బొమ్మ రెంటినీ బాగా జ్ఞాపకం పెట్టుకుని వచ్చేసింది.

వచ్చేస్తూ అనుకుంది "ఈ దేశంలో మరణశిక్షలు ఎంత తేలిగ్గా పడతాయో కొద్దికొద్దిగా తెలుసుకుంటూంటే నాకేడుపు వస్తోంది. ఈ న్యాయశాస్త్రాన్నీ, దాన్ని నిర్మించిన మన మేధావుల తెలివి తక్కువ తనాన్ని చూసి కాదు - నిష్కారణంగా ఉరికంబం ఎక్కే నిర్భాగ్యులని చూసి........."(ఈ మాటలు ఒక ప్రసిద్ధ న్యాయమూర్తి ఆత్మ కథలోనివి - రచయిత)

రాత్రి పదింటికి చిరంజీవి సీతారామపురంలో దిగాడు. చాలా చిన్న ఊరు అది. కేవలం ఓ అనాధ ఆశ్రమం వుండటం వల్ల ఆ మాత్రం పేరు వచ్చింది.

ప్రిన్సిపాల్ ఇల్లుకూడా ఆశ్రమం కాంపౌండ్‌లోనే. ఆయన్ని పట్టుకునేసరికి మరో అరగంట గడిచింది. రాత్రి పదిన్నరకి వచ్చి ఎవరో పాత స్టూడెంట్ గురించి ఎక్వయిరీ చేస్తున్న చిరంజీవిని ఆశ్చర్యంతోనూ, అనుమానంతోనూ చూశాడు ప్రిన్సిపాల్. కానీ వాకబు చేస్తున్నది సుశీల గురించి అని తెలియగానే "మీరు పోలీసా?" అని అడిగాడు.

చిరంజీవి తలూపాడు. అయితే అది 'అవునూ, కాదూ' లకి మధ్యస్థంగా వుంది.

ప్రిన్సిపాల్ అన్నాడు - "సాధారణంగా మా ఆశ్రమంలో చదివే పిల్లల గురించి వ్యక్తిగతంగా నాకేమీ తెలీదు. కానీ ఈ హత్య గురించి మావాళ్ళు చెప్పుకుంటూంటే విన్నాను. ఆ అమ్మాయి మా ఆశ్రమంనుంచి వెళ్ళిపోయి రెండు సంవత్సరాలైంది. ఉద్యోగంవచ్చాక మా ఆశ్రమంలో వుండనివ్వం. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారిని కూడా పంపేస్తాం. అయితే అదృష్టవశాత్తూ గ్రాడ్యుయేషన్ అయిన రెండు నెలలకే ఆ అమ్మాయికి ఉద్యోగం వచ్చింది" అంటూ పాత రికార్డు తెరిచాడు.

చాలా పాతబడి కాగితాలు ఊడిపోవటానికి సిద్ధంగా వున్న పుస్తకం అది. ఇరవై సంవత్సరాల వెనుక సుశీల ఆ ఆశ్రమంలో చేరినప్పటి రికార్డు.

ఆయన కాగితాలు జాగ్రత్తగా తిప్పుతూ ఆమె చేరిన తేదీ పట్టుకున్నాడు "జనవరి ఇరవై రెండో తేదీ సాయంత్రం నాలుగింటికి ఈమె ఈ ఆశ్రమంలో చేర్చబడింది. అప్పుడీమె వయసు ఆరు సంవత్సరాలు. ఈమెని చేర్పించింది ఎవరో కామాక్షమ్మ అని - ఆవిడ వృత్తి వంటలు చేయడం అట. అయితే ఈ పాపకూ, ఆమెకూ ఏమీ సంబంధంలేదు. ఈ సుశీల తల్లిపేరు వనజమ్మ. ఆవిడ చచ్చిపోయి ఈ పాప అనాధ అయింది. తండ్రి వివరాలు తెలియవు. ఈ అనాధని ఆ వంటావిడ

తీసుకొచ్చి చేర్చింది" రికార్డు చూస్తూ చెప్పాడు.

"ఈమెని చూడటానికి ఎవరైనా వచ్చేవారా! బంధువులు ఎవరైనా వున్నారా?" అని చిరంజీవి అడిగాడు.

"ఉహూ - ఆ వివరాలు నాకు తెలియవు. రికార్డు ప్రకారం ఆమెకెవరూ బంధువులు లేరు. ఏవైనా వ్యక్తిగత విషయాలు కావాలంటే తెలుగు మాస్టారు చెప్తారు. ఆయన పిల్లల్తో కలిసి మెలిసి వుంటారు" ప్యూన్ చేత ఆయన్ని పిలిపించాడు.

ఆయనకి అరవై ఏళ్ళు వుంటాయి. ఆయన కూడా ఆశ్రమంలోనే వుంటాడు. ప్రిన్సిపాల్ పిలుస్తున్నారనేసరికి ఆదరా బాదరా పరుగెత్తుకుంటూ వచ్చాడు. చిరంజీవిని పరిచయం చేసి - అతడు వచ్చిన పని చెప్పారు ప్రిన్సిపాల్.

"అవును సుశీల తెలియకపోవటమేమిటి? రవణా, అదీ బాగా ఫ్రెండ్సు. అయితే రవణ వాగుడుకాయ, సుశీల ఎవరితోనూ మాట్లాడేది కాదు"

"సుశీల తల్లి తండ్రుల సంగతి మీకేమైనా తెలుసా?"

"వాళ్ళు చిన్నప్పుడే పోయారు - తెలీదు"

"సుశీల గురించి తెలిసినవాళ్ళెవరైనా వచ్చేవారా?"

"ఇక్కడంతా అనాధలబ్బాయ్. ఎవరూ వారి కోసం రారు. అందులో సుశీలలాంటి అమ్మాయికోసం ఎవరూ రారు. ఆవిడెప్పుడూ తన లోకంలో తాను ఒంటరిగా వుండేది. మాట్లాడే నాలుగు ముక్కలూ ఆ రవణతోనే మాట్లాడేది".

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

26 వ భాగం

"రవణగారు ఇప్పుడు ఎక్కడున్నారు?"

ప్రిన్సిపాల్ కల్పించుకుని "ఉద్యోగం చెయ్యటానికి ఇష్టపడని అమ్మాయిలకి మేమే వీలైనంతలో వివాహం చేసి పంపటానికి ప్రయత్నంచేస్తాం. అదృష్టవశాత్తూ రవణని ఇష్టపడ్డ ఒక అబ్బాయి దొరికాడు. క్రిందటి వేసవిలోనే పెళ్ళి చేసి పంపించాం. ప్రస్తుతం వాళ్ళు మీ ఊళ్ళోనే వుంటున్నారు".

చిరంజీవి ఉలిక్కిపడ్డాడు. తను అనవసరంగా ఇంత దూరం వచ్చాడా? అంతలోనే సమర్థించుకున్నాడు. తనకి మాత్రం యిదంతా ఎలా తెలుస్తుంది!

"నాకు ఆ రవణగారి అడ్రసు ఇవ్వగలరా?"

"నా దగ్గరుంది - పాపం ఆ రవణ ఆశ్రమం నుంచి వెళ్ళిపోయినా మమ్మల్ని మర్చిపోలేదు" అంటూ తెలుగు మాస్టారు అడ్రసు తెచ్చి ఇచ్చాడు.

.......

సాయంత్రం అయిదయింది. అర్చన కారు ఎయిర్‌పోర్ట్‌వైపు వెళ్తోంది. ఐదయినా యింకా ఎండగానే వుంది. 'షిప్ బ్రేకింగ్ యూనిట్' స్థాపించటం కోసం లండన్ నుంచి కెప్టెన్ ఫోర్డుతో కలిసి ఆ మానేజింగ్ డైరెక్టర్ వస్తున్నాడు. విమానం నుంచి దిగిన మేనేజింగ్ డైరెక్టర్‌నీ, కెప్టెన్ ఫోర్డునీ ఆమె కారులో హోటల్‌కి తీసుకొచ్చింది. సర్వోత్తమరావు డైరెక్టుగా అక్కడికే వచ్చేశాడు.

దాదాపు రెండు గంటలు చర్చలు జరిగినయ్. అంతకు కొంతకాలం ముందే ఈ విషయాలన్నీ విపులంగా చర్చించే ఒక నిర్ణయానికి రావటం వల్ల పెద్ద ఆటంకాలు ఏమీ కలగలేదు. సర్వోత్తమరావు సూచించిన ఒకటి రెండు మార్పులకి వాళ్ళు వెంటనే ఒప్పుకున్నారు. పాడయిన ఓడల్ని బద్దలు కొట్టే పరిశ్రమ విశాఖపట్టణంలో పెట్టటానికి అంగీకారం కుదిరింది.

చర్చలు పూర్తయిన తరువాత సర్వోత్తమరావు డిన్నర్‌కి వుండకుండా వెళ్ళిపోయాడు. "అయితే అగ్రిమెంట్ మీద రేపు సంతకాలు పెట్టుకుందాం" అన్నాడు కెప్టెన్ ఫోర్డ్.

"రేపొద్దు ఎల్లుండి" అంది అర్చన.

"మరి రేపంతా ఏం చెయ్యం?"

"ఊరు చూడండి. మావూళ్ళో చాలా చారిత్రాత్మక ప్రదేశాలున్నాయి చూడటానికి"

"దట్స్ గుడ్. రేపు మీరు కూడా మాతో రావాలి" అన్నమాటలకి - ఆమె ఆ రేపుని తల్చుకుంది. ఆమె మొహం

ప్లానమయింది. ఫోర్డు గమనించలేదు కానీ మానేజింగ్ డైరెక్టర్ గమనించాడు ఆ విషయం.

"రేపు నాకు ముఖ్యమయిన పని వుంది. నేను రాలేనుగానీ, డ్రైవర్‌ని పంపిస్తాను.

అతడికి ఈ ఊరు బాగా తెలుసు " అని "ఐయామ్ సారీ" అంది నెమ్మదిగా.

పైకి ఆమె వారితో మాట్లాడుతూ వుందన్నమాటేగానీ, ఆమె ఆలోచనలు ఆ 'రేపటి విషయం' చుట్టూ తిరుగుతున్నాయి.

'రేపు కోర్టులో ఏం జరగబోతోంది? చిరంజీవి నేరస్తుడిగా నిరూపించబడ్తాడా?'

ఆమె ఆలోచన్లని భంగపరుస్తూ ఎమ్.డీ. మాట్లాడాడు - "రేపు అగ్రిమెంటు ఎందుకు వద్దంటున్నారు అర్చనా మీరు?".

"......."

"వచ్చినప్పటి నుంచీ చూస్తున్నాను, మీరెందుకో సంతోషంగా లేరు. ఈ కాంట్రాక్టు మీకు ఇష్టం లేదా?"

ఆమె నొచ్చుకుంటూ "అబ్బే - అదేమీ లేదు. దీనికి కారణం వేరే ఇంకొకటి" అని వాళ్ళిద్దరూ ఉత్సుకతతో చూసేసరికి, నెమ్మదిగా "మాకు బాగా దగ్గరైన వ్యక్తికి రేపు కోర్టులో శిక్ష పడబోతోంది."

"అరే - దేనికి?"

"హత్యా నేరం మీద"

"మైగాడ్ - హత్యా " ఎమ్.డీ., ఫోర్డు ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"హత్యే కానీ అతడు హంతకుడు అవునో, కాదో తెలీదు. ఒకవేళ ఋజువులు దొరుకుతే మాత్రం అతడు హంతకుడు అయినా, కాకపోయినా ఉరి తప్పదు"

"మైగాడ్ - మీ దేశంలో ఇంకా ఉరి వుందా?" ఫోర్డ్ అడిగాడు.

"ఉంది ఏం?"

"నాకు తెలిసినంత వరకూ మీ న్యాయశాస్త్రం మా దేశపు న్యాయశాస్త్రంనుంచి తీసుకోబడిందని నా ఉద్దేశ్యం"

"ఆ.... దాదాపు మక్కీకి మక్కి"

"మరి బ్రిటన్‌లో ఉరి రద్దు చేయబడింది కదా."

అర్చన విషాదంగా నవ్వింది "బుద్ధుడు పుట్టిన దేశం మాది. మా జాతీయులకి అహింస పట్ల నమ్మకం యెక్కువ. అయినా ఉరి రద్దు అనేసరికి జనం హంతకులైపోతారేమోననీ, హత్యలు ఎక్కువై పోతాయేమోనని భయపడుతూ వుంటారు."

- ఇలా అంటూ ఆమె మనసులోనే ఆశ్చర్యపడింది! ఇదేమిటి మావయ్యా, చిరంజీవి వాదనల ప్రభావం నా మీద పడిందా అని.

డిన్నర్ పూర్తయింది "వియ్ ఆర్ సారీ" అన్నారు వాళ్ళిద్దరూ. "ఇట్సాల్ రైట్" అంటూ - ఆమె లేచి " వెళ్ళొస్తాను" అంది.

విదేశీయులిద్దరూ భారతీయ పద్ధతిలో నమస్కారం పెట్టారు. అప్పుడు చూసింది ఆమె ఫోర్డు చేతులు జోడించిన చోట - షర్టు బైటకి వేలాడుతున్న రాగి బిళ్ళని! అదే బిళ్ళ!! లంగరు బొమ్మ వున్నది!!!

ఆమె వళ్ళు జలదరించింది. ఒక్కసారి ఎగ్జయిట్‌మెంట్ ఉప్పెనలా పొంగగా "అది......... ఆ లంగరున్న బిళ్ళ - అది మీకు - ఐమీన్ - మీరు ఎందుకు వేసుకుంటారు" అని అడిగింది. ఆమె ఎంత విభ్రాంతి చెందిందంటే, ఆ షాక్‌లో ఆమెకి మాటకూడా సరీగా రాలేదు.

ఫోర్డుకి ఆమె ప్రశ్న అర్ధం కాలేదు. తన మెడలో బిళ్ళవైపూ, ఆమె వైపూ చిత్రంగా చూశాడు. ఆమె మొహంలో తన్నుకొస్తున్న ఉద్విగ్నతని గమనించి అతడు విస్మయం చెందాడు. "నౌకాయానం చేసేవాళ్ళు సాధారణంగా వేసుకుంటారు ఈ బిళ్ళని. అఫ్‌కోర్స్ - ఈ మధ్య ఫాషన్స్ పెరిగాక ఎవరూ వేసుకోవడం లేదనుకోండి! ఎందుకిలా అడిగారు?" అన్నాడు.

ఆమె అతి కష్టం మీద తనని తాను కంట్రోల్ చేసుకుంటూ "ఏం లేదు, ఊరికినే " అంటూ అక్కణ్ణుంచి కదిలింది.

ఆమె మనసు ఇంటికి ఎప్పుడు వెళ్దామా అని తొందరపడుతోంది. తను కనుక్కున్నది చిన్న విషయమేం కాదు.

........

రాత్రి తొమ్మిదిన్నరకి, గాలిలా దూసుకొస్తూ "నన్ను కంగ్రాట్ చెయ్యాలి మావయ్యా నువ్వు" అంది.

ఆయన ఆశ్చర్యపోయి "ఏమిటి?" అని అడిగాడు.

"నీ డిఫెన్స్‌కి కావల్సిన ఆధారాలు కొన్ని సంపాదించాను. దీంతో ప్రాసిక్యూషన్ వాదనని చెల్లాచెదురు చెయ్యవచ్చు"

ఆమె మొహంలో ఉద్విగ్నతని గమనించి ఆయన పక్క కుర్చీచూపిస్తూ,"ఎగ్జయిట్ అవకు. ఇలా కూర్చో. తాపీగా చెప్పు" అన్నాడు.

తన ఆతృత ఆయన గమనించాడని ఆమె గుర్తించి కాస్త సిగ్గుతో - "సారీ అంకుల్" అంటూ కూర్చుంది.

"ఊ... ఇప్పుడు చెప్పు వరుసగా ఒక్కొక్కటీ."

"సుశీల హత్య గదిలో జరిగింది. సత్రం దగ్గర గానీ, నూతి దగ్గర గానీ కాదు" అంది అర్చన.

"అవును. ప్రాసిక్యూషన్ అలానే నిరూపించింది."

"మరి నూతి దగ్గర సిగరెట్ పీకలు ఎలా వచ్చినయ్?"

"మేమే వేశాం"

ఈ సమాధానానికి ఆమె తెల్లబోయి "ఆ విషయం కోర్టుకి తెలీదుగా" అంది.

"మనం యిక్కడ ఓ విషయం గుర్తించి, ఒక నిర్ణయానికి రావాలి అమ్మాయ్! కోర్టులో ఏదో ఒకటి చెప్పి 'బెనిఫిట్ ఆఫ్ డవుట్' ద్వారా చిరంజీవిని విడిపించేలా చెయ్యటమో, లేక వున్నదున్నట్టు మనకు తెలిసింది చెప్పటమో" అన్నాడు.

"అబద్ధం చెప్పటమనే ప్రసక్తే లేదు" అందామె దృఢంగా.

"అయితే నువ్వే డిఫెన్స్ లాయర్‌వి అనుకుని - చెప్పు. ఎలా వాదిస్తావో?"

"నూతి దగ్గర సిగరెట్ పీకలు ఎలావచ్చాయి?" లాయర్‌లా అడిగింది.

"సర్వోత్తమరావు, చిరంజీవి అనే వాళ్ళిద్దరూ - నాటకం ఆడటం కోసం అక్కడ జల్లారు. అయితే సుశీల మరణానికీ, ఈ సిగరెట్ పీకలకీ అసలు సంబంధం లేదు. ఆమె మరణం అంతకు ముందే సంభవించింది."

"ఆ మాటకొస్తే 'సాయత్రం ఆరింటికి సత్రం దగ్గర కలుసుకో' అని ఉత్తరం వ్రాసి ఆమె హాండ్‌బ్యాగ్‌లో పెట్టింది కూడా మీరిద్దరేగా"

"కోర్టు దాన్ని నమ్మాలని రూలేంలేదు. చిరంజీవి నిజంగా నిర్దోషి కాని పక్షంలో నిజంగానే ఆ సాయంత్రం ఆరింటికి అతడు సుశీల్ని సత్రం దగ్గర కలుసుకున్నాడేమో!"

ఆమె అదిరిపోయి "ఈ ఆర్గ్యుమెంటు దారుణం" అంది.

"కోర్టుకి దారుణాలూ దర్పణాలూ అని వుండవమ్మాయ్. చెవులే వుంటాయి. ప్రతీదీ 'ప్రైమాఫేసీ' నిరూపించాల్సిందే! మనంఈ కేసు టేకప్ చెయ్యగానే ప్రాసిక్యూషన్ ఏ పునాది మీద వాదన మొదలు పెడుతుందో తెలుసా 'చిరంజీవికి సుశీల ముందే తెలుసు ఆమెని వదిలించుకోవటానికి ప్లాన్ వేశాడు. దానికి సర్వోత్తమరావు అనే ఆయన సాయం తీసుకున్నాడు' అని అడ్డంగా వాదిస్తుంది."

"కానీ సాయంత్రం ఆరింటికి రా అన్న ఉత్తరం మీరు వ్రాసిందేగా?"

"నా సాక్ష్యాన్ని కోర్టు నమ్మాలని రూల్ లేదు. నేను డిఫెన్స్ లాయర్ని. అతడు నా మేనకోడలుకి కాబోయే భర్త."

"అంటే సాయంత్రం ఆరింటికి వాళ్ళిద్దరూ కల్సుకున్నారంటావా?"

"పాత స్నేహితులు........ కలుసుకుని వుండవచ్చు. ఘర్షణ కూడా జరిగివుండవచ్చు. అందుకే 'అమ్మయ్య - వదిలించుకున్నాను' అని అతడు డైరీలో వ్రాసుకుని వుండవచ్చు" అని ఆగి నెమ్మదిగా "ఇదంతా నేను చెప్తున్నది కాదు ప్రాసిక్యూషన్ ఇలా " అన్నాడు.

ఆమె అర్థమైనట్టు తలూపింది.

ఒక క్షణం చేతి గోళ్ళవైపూ - వాటికి వేసిన పాలిష్ వైపూ చూసుకుంటూ మౌనంగా వుండి ఆ తరువాత నెమ్మదిగా అన్నది "ఆ సాయంత్రం చిరంజీవి సుశీల్ని కలుసుకోలేదు అంకుల్."

“ఎలా చెప్పగలవు?”

“ఆ సాయంత్రం ఆరింటికి అతడు సత్రం దగ్గరలేడు.”

“మరెక్కడ వున్నాడు?”

“అద్దెకు తీసుకున్న కారులో .......... అమ్మేసిన మెడల్స్‌తో - హోటల్ ఏషియానాలో నాకు డిన్నర్ ఇస్తున్నాడు. ‘ఫోర్క్ మధ్యలో కత్తిపెడ్తే ఏమవుతుంది’అని అక్కడ వెయిటర్‌ని అడిగాడు. ‘ఐ లవ్యూ సర్’ అని అతడనగానే హోటల్ కప్పు ఎగిరిపోయేలా ‘హుర్రె..... హుర్రె’ అని అరిచాడు. వీటన్నిటికీ మనకి సాక్ష్యాలున్నాయి.”

సర్వోత్తమరావు విభ్రాంతితో అర్చన మొహం వైపు బ్లాంక్‌గా చూశాడు.

కొంచెం సేపటికి తెప్పరిల్లి “అవును కదూ” అన్నాడు.

మళ్ళీ సాలోచనగా “ప్రాసిక్యూషన్ వాళ్ళు ఇంకో పాయింట్ లేవదీయొచ్చు అమ్మాయ్” అన్నాడు “చిరంజీవి కథనం ప్రకారం అతడు తన గదిలో మామూలుగా పడుకుని వుండగా - ఓ అర్ధరాత్రి పూట దారాసింగ్ వచ్చిలేపాడు.”

“అవును. అదే జరిగి వుండవచ్చు.”

“ఎలా? చిరంజీవి డైరీలో సుశీల గురించీ - ఆమెని వదిలించుకోవటం గురించీ వ్రాసుకున్నాడు కదా.”

“ఆ విషయం నేనూ ఆలోచించాను” అంటూ హాండ్‌బ్యాగ్‌లోంచి కాగితాలు తీసింది అర్చన. చిరంజీవి డైరీలోంచి చింపిన కాగితాలు అవి.

“సుశీల్ని నేను వదిలించుకున్నాను! అని చిరంజీవి ఎప్పుడు వ్రాసుకున్నాడు? తేదీ చూడు అంకుల్. సుశీల మరణానికి నెలరోజుల ముందు వ్రాసుకున్నాడు” అని కాగితాలు అతడికి అందించి కుర్చీ వెనక్కి వాలింది.

ఆ గదిలో కొంచెం సేపు గాఢమైన నిశ్శబ్దం తాండవించింది. డైరీ పేజీలు చదవడం పూర్తి చేసి సర్వోత్తమరావు తలెత్తాడు. ఆమె ఆయన మొహం వైపే ఆతృతగా చూస్తోంది.

ఆయన నెమ్మదిగా నవ్వి “నిన్ను ‘లా’ చదివించకుండా ఎంబిబిఎస్ చదివించటంలో నేనెంత తప్పు చేశానో అర్థమవుతూందమ్మాయ్” అన్నాడు.

ఆయనేమంటాడో అని ఆత్రంగా చూస్తున్న అర్చన మొహం ఈ మాటలకి సంతోషంతో వెలిగిపోయింది.

“అప్పుడే ఏముంది అంకుల్ - ఇంకొక్క విషయం చెబితే నువ్వు ఎగిరి గంతేస్తావ్?” అంది వుత్సాహంగా.

“గంతు వెయ్యలేనుగానీ అదేమిటో చెప్పు.”

“సుశీలని రేప్ చేసిన వాడి మెడలోంచి ఒక రాగ బిళ్ళ జరి పడింది. దాని మీద లంగర్ బొమ్మ వుంది. నీకు తెలుసా అంకుల్ అదెవరు వేసుకుంటారో..........”

"ఊహు"

"ఓడలమీద తిరిగే వాళ్ళు వేసుకుంటారు. ఓబులేసు ఫకీరు. వాడికి ఓడ అంటే ఎలా వుంటుందో కూడా తెలీదు. సుశీలని రేప్ చేసింది ఎవడో ఓడ కళాసీ! ఆ లొకాలిటీలో వాడిని పట్టుకోవటం పోలీసులకి పెద్ద కష్టం కాదు" అని చెప్పటం ఆపింది.

"అద్భుతం - నిజంగా నీ తెలివితేటలు అద్భుతం అమ్మాయ్! అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ! ఈ ఆధారాల్తో ప్రాసిక్యూషన్ వాదనని ముక్కలు ముక్కలుగా విరగ్గొట్టెయ్యవచ్చు. చిరంజీవి బైటపడ్తాడా, లేదా అన్నది తరువాత కానీ, రేపు బెయిల్ మాత్రం తప్పక దొరుకుతుంది. చాలా కష్టపడ్డావు. కంగ్రాట్స్......"

ఆమె సోఫాలోంచి లేచి చిరునవ్వుతో "థాంక్స్ అంకుల్" అంది.

.....

"ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది మన పరిస్థితి" అన్నాడు చిరంజీవి. స్ఫూర్తి మాట్లాడలేదు.

ప్రొద్దున్న ఏడయింది. లారీ దిగి సరాసరి గదికి వచ్చేశాడు చిరంజీవి.

"ఆ అనాధాశ్రమంలో తెలుసుకున్నదల్లా ఏమిటంటే సదరు సుశీలకి ఒక స్నేహితురాలుందనీ - ఆవిడ పేరు రవణ అనీ - ఆమె ఈ వూళ్ళోనే వుంటుందనీ......... ఇదిగో అడ్రస్".

స్ఫూర్తి ఆ అడ్రసు చూసి "ఇక్కడికి దగ్గరే కదా - వెళ్ళొద్దాం పద" అన్నాడు.

"ఇప్పుడా......." అన్నాడు చిరంజీవి "ఇంకో మూడు గంటల్లో కోర్టులో వుండకపోతే వారెంట్ యిస్తుంది కోర్టు. ఎలాగైనా నా చేతులకి సంకెళ్ళు వేసి తీసుకెళ్ళాలని మహా ఉబలాటంగా వున్నాడు ఆ ఇన్‌స్పెక్టర్! అతడి కోరికా నెరవేరినట్టు అవుతుందిలే - పద వెళ్ళొద్దాం" అంటూ కదిలాడు.

ఇద్దరూ ఆ అడ్రస్ పట్టుకుని వెళ్ళేసరికి రవణ భర్త ఫ్యాక్టరీకి వెళ్ళటానికి తయారవుతున్నాడు. అతడు ఓ ఫ్యాక్టరీ వర్కర్. సంస్కారవంతుడిలా కనబడ్తున్నాడు. ఇల్లు చిన్నదైనా పొందిగ్గా వుంది. తాము వచ్చిన పని చెప్పాడు స్ఫూర్తి.

"మీరు పోలీసులా?" అడిగాడు అతడు. చిరంజీవి తన స్వభావ సిద్ధమైన అలవాటుగా అవునూ, కాదూల మధ్య తల అడ్డంగా, నిలువుగా కాకుండా వాలుగా వూపాడు.

అతడు లోపల్నుంచి భార్యని పిలిచి వాళ్ళు అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పమని చెప్పి వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని ఫ్యాక్టరీకి వెళ్ళిపోయాడు. చిరంజీవి రవణ వైపు చూశాడు. పైట నిండుగా కప్పుకుని గుమ్మానికి ఆనుకుని నిల్చుని వుందామె. అనాధాశ్రమం రిజిష్టర్‌లో తను వ్రాసింది నిజమే ..... ఎన్నో పూలు కాగితప్పూలు కాకుండా రక్షిస్తూంది ఆ ఆశ్రమం.

వివాహం చేసుకుని, తనదంటూ ఒక యిల్లు ఏర్పరచుకున్న ఆమె కళ్ళల్లో యిప్పుడిప్పుడే జీవితం పట్ల ధీమా యేర్పడుతున్నట్టుంది. మనుష్యుల పట్ల నమ్మకం కూడా!

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

27వ భాగం

"సుశీలకి ఈ మనుష్యులంటే అసహ్యం. ఈ ప్రపంచం అంటే కూడా అసహ్యామే" అంది.

"ఎందుకు" స్ఫూర్తి అడిగాడు.

"ఆమె తల్లిది మరణం కాదనీ - ఎవరో చంపేశారనీ ఆమె నమ్మకం. ఆవిడ అలా చచ్చిపడివుంటే చూసే నాధుడే లేక మున్సిపాలిటీ వాళ్ళు ఈడ్చేశారట. ఆ వయసులో అవన్నీ చూడవలసి రావటం వల్ల - ఆమె అదో రకంగా తయారైంది.

"మరి తండ్రి?"

"అంతకుముందే చచ్చిపోయాడు. అలా ఒకసారి చెప్పింది. మళ్ళీ ఇంకోసారి - అతడు తల్లిని పెళ్ళి చేసుకోకుండా మోసంచేసి పారిపోయాడంది. తన మాటల మీద తనకే నిలకడ లేదు. అందులో సుశీల్ని తప్పు పట్టడానికి వీల్లేదు. ఇదంతా జరిగినప్పుడు దానికి ఆరేళ్ళు. అంతే."

"సుశీల తల్లి ఫోటో వుందా?"

"లేదనుకుంటా - ఉంటే సుశీల దగ్గరే వుండాలి."

" పోనీ తండ్రి ఫోటో"

వెధవ ప్రశ్న - అన్నట్టు చూశాడు స్ఫూర్తి చిరంజీవివైపు. ఈ ఫోటోలెందుకు? సుశీల జ్ఞాపకార్థం గదిలో దండవేసి పెట్టుకోడానికా!

"తండ్రి ఫోటో సంగతి కూడా నాకు తెలీదు. కామాక్షమ్మ వుంటే మీకింకా వివరాలు తెలిసి వుండేవి".

"కామాక్షమ్మ ఎవరు?" స్ఫూర్తి అడిగాడు.

"సుశీలని అనాధాశ్రమంలో చేర్చినావిడ" అని చిరంజీవి అతడికి సమాధానం చెప్పి రవణ వైపు తిరిగి "ఆ కామాక్షమ్మ ఇప్పుడెక్కడుంది" అని అడిగాడు.

"ఆవిడ చచ్చిపోయి అయిదేళ్ళయింది" అంది.

'ఏడ్చినట్టుంది' అనుకున్నాడు చిరంజీవి.

"మనం పూర్తిగా రాంగ్ ట్రాక్‌లో వెళుతున్నాం " అన్నాడు స్ఫూర్తి.

"ఏం?"

"అర్ధరాత్రి సుశీల తలుపు తీసిందీ అంటే వచ్చినవాడు ఈ వూళ్ళో ఈ మధ్య పరిచయమైన స్నేహితుడయి ఉండటానికే ఎక్కువ స్కోప్ వుంది. కాబట్టి ఆవిడ తల్లిదండ్రుల పూర్వపు చరిత్ర వెలికి తియ్యటం అనవసరం."

"అవును. అది నిజమే" అన్నట్టు తల పంకించాడు చిరంజీవి.

రవణ కల్పించుకుని "సుశీల్ని రేప్ చేసిందెవరో మీకు యింకా తెలీదా" అని అడిగింది.

ఇద్దరూ ఆత్రంగా ఒకేసారి "ఎవరు? మీకు తెలుసా?" అడిగారు ఆమె జవాబుకోసం. నరాలు తెగిపోతాయా అన్నంత టెన్షన్!

"ఓ! మా పేట పేటంతా చెప్పుకున్నారుగా ఆ మధ్య"

"ఎవరు?"

"చిరంజీవి అని - ఈ వూరేనట" అంది.

జవాబు విని జావకారిపోయాడు స్ఫూర్తి. చిరంజీవికి తల తీసుకెళ్ళి ఎక్కడన్నా పెట్టుకోవటం అంటే ఏమిటో అప్పుడు తెలిసింది. స్నేహితుడి పరిస్థితి గమనించి, "ఇక పోదామా" అన్నాడు స్ఫూర్తి.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

28 వ భాగం

నీరసంగా తలూపేడు చిరంజీవి. ఆమెకి కృతజ్ఞతలు చెప్పి ఇద్దరూ బైట కొస్తుంటే మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు వెనక్కొచ్చి "సుశీల తాలూకు ఫొటోలు అవీ ఎక్కడున్నాయి?" అని అడిగాడు.

"ఈ ఊళ్ళోనే ఉంది కాబట్టి సుశీల ఇంటికి రెండు మూడు సార్లు నేనూ వెళ్ళాను. మొన్న సుశీల పోయిందని తెలిసి- దాని ఫొటో ఏదైనా దొరుకుతుందేమో తెచ్చి పెట్టుకుందామని వెళ్తే ఆ ఇంటిగల ముసలమ్మ అలాటివేమీ లేవు పొమ్మంది. బహూశా ఆ ముసలమ్మే సుశీల చీరెల్నీ, బట్టల్నీ కాజెయ్యటానికి అలా అబద్ధాలు చెప్పి ఉంటుంది అని నేను అనుకుంటున్నాను."

"అలా కాజేసి ఆవిడ బావుకున్నదీ ఏవీ లేదు లెండి."

"ఏం? ఎందుకలా?"

"ఆవిడా పోయింది" అంటూ అక్కణ్ణుంచి కదిలేడు. స్ఫూర్తితో కలిసి వీధిలోకి వచ్చాక "ఇప్పుడేం చెయ్యాలిక?" అని అడిగాడు స్వగతంలా.

"రాత్రంతా ప్రయాణంలో వున్నావ్ కదా, గెడ్డం గీసుకుని స్నానం చేసి కోర్టుకెళ్లడమే" అన్నాడు స్ఫూర్తి.

"వెళుతున్నది అత్తవారింటికి కాదు గురూ, జైలుకి... దానికి గెడ్డం గీసుకోవడం కూడా ఎందుకు- అదో దండగ" అన్నాడు.

చిరంజీవి "నువ్వు స్నానం చేసి, ఆ నల్లకోటు వేసుకుని కోర్టుకిరా."

స్ఫూర్తి ఆశ్చర్యంగా "ఎందుకు" అని అడిగాడు.

"నా వైపు వాదించడానికి."

" ఏం నువ్వు సవ్యంగ బైటపడడం ఇష్టం లేదా?"

"ఈ పరిస్థితుల్లో ప్రసిద్ధ క్రిమినల్ లాయర్ సర్వోత్తమరావుగారు స్వయంగా వచ్చి వాదించినా నేను బైట పడనుగానీ- నువ్వే రా ఛాన్సు తీసుకుందాం."

"మరి నువ్వేం చేస్తావ్"

"తొమ్మిదవొస్తూంది. ఇంకో గంట టైముంది. ఆ సుశీల గదీ- ముసలమ్మ ఇల్లూ వెతుకుతాను. చూద్దాం ఏ పెట్టెలో ఏ సామానుందో."

........

గడియారం తొమ్మిదిన్నర కొట్టింది. సర్వోత్తమరావు కోర్టుకి వెళ్ళిపోయాడు. అర్చన వెళ్ళలేదు.

చిరంజీవి నిర్దోషని మనసు చెపుతుంది. కానీ రక్షించడం ఎలా? కోర్టు ఎలా నమ్ముతుంది?

ఏమీ తోచలేదు. శారీరకంగా కన్నా, మానసికంగా బాగా కృంగి పోయి ఉంది. ఆమె లేచి కిటికీ దగ్గరకి వెళ్ళి తలుపు తెరిచి బైట తోటలోకి వెళ్ళి చూసింది. గేటు దగ్గర గూర్ఖా కనపడలేదు. రామయ్యని పిలిచి అతడి సంగతి అడిగింది.

"రెండ్రోజులు సెలవు పెట్టాడమ్మా" అని చెప్పేసి వెళ్లబోతూ ఆగి, "కొంచెం హార్లిక్స్ తీసుకుంటారా?" అని అడిగాడు.

ఆమె తలూపింది. అతను వెళ్ళి తీసుకొచ్చాడు.

అందుకుంటూ, "రంగమ్మ ఏదీ?" అని అడిగింది. ఆమె కంఠం ఆమెకే నీరసంగా ధ్వనిస్తోంది.

"వెచ్చాలు తీసుకురావటానికి పచారి కొట్టుకు వెళ్ళింది." అని, కప్పు తీసుకుని అతను వెళ్ళిపోయాడు.

గదిలో నిశ్శబ్దం అలముకుంది. కరెంటు పోయినట్టుంది, ఎయిర్ కండిషనర్ పని చెయ్యటం లేదు. ఉన్నట్టుంది ఆ గదిలో శూన్యత వ్యాపించినట్టయింది.

అకారణంగా ఆమె వెన్ను ఒక్కసారి జలదరించినట్టయింది. ఆ గదిలో ఎవరో పొంచి వున్నట్టూ- తనని అనుక్షణం గమనిస్తున్నట్టూ భావన. ఆమె గదిలోంచి బైటకొచ్చింది.వరండాలో ఎవరూ లేరు. క్రింద హాలు కూడా నిర్మానుష్యంగా ఉంది.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ గది కంపించేలా టెలిఫోన్ మోగింది. ఆమె రిసీవర్ అందుకుని "హలో" అంది.

"నేనమ్మా" ఆయన కంఠం ఆందోళనగా పలికింది అవతల్నుంచి.

"ఏమైందంకుల్"

"చిరంజీవి ఏమయ్యాడో తెలియటం లేదు. ఇప్పటి వరకూ కోర్టుకే రాలేదు."

ఆమె విస్తుపోతూ గడియారం వంక చూసింది. పది నిమిషాలు తక్కువ పది.

'అవతల్నుంచి సర్వోత్తమరావు కంఠం కోపంగా వినిపిస్తూంది. అందులో నిస్సహాయత కూడా ధ్వనిస్తూంది.- 'ఏవయ్యాడు ఇతను? ఇదేమన్నా కోర్టు అనుకున్నాడా?- ఆటలనుకున్నాడా? అందులోనూ 'లా' చదివినవాడు."

"ఇప్పుడేం చెయ్యాలి అంకుల్?" ఏమీ తోచనట్టు అడిగింది.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను.... ఇంకో పదినిమిషాలు ఆగి ఫోన్ చేస్తాను మళ్ళీ."

ఆమె ఫోన్ పెట్టేసింది.

ఎక్కడున్నాడు చిరంజీవి? ఏం చేస్తున్నాడు?? కోర్టుకన్నా ముఖ్యమైన పని ఏముంది! ఇప్పుడిక కోర్టు వారెంట్

ఇస్తుంది.....! పోలీసులు అతడి కోసం వేటకుక్కల్లా పడతారు....! చేతులకి సంకెళ్ళు వేసి తీసుకెళ్తారు.... ఇదంతా అతడికి తెలీదూ? తెలిసీ ఇంత బాధ్యతారహితంగా ఎలా ప్రవర్తిస్తున్నాడు?

అసలెక్కడున్నాడు??

......

ఒక క్షణం తటపటాయించి తలుపు తెరిచి లోపలికి ప్రవేశించాడు చిరంజీవి. లోపల గది ఘోరంగా వుంది. ఒక మూల కుక్క పడుకుని వుంది. ఇంకో మూల ఎవరో వంట కోసం రాళ్ళు పేర్చుకున్నారు.

ముసలమ్మ చచ్చిపోవటంతో ఆ గది బిచ్చగాళ్ళ సొత్తు అయిపోనట్టుంది- తామే వారసుల్లా దాన్ని స్వంతం చేసుకున్నట్టున్నారు. ఆ గదిలో సామానులేమీ లేవు. అన్నీ ఎప్పుడో ఎవరికి దక్కినవి వారు తీసుకుపోయారు.

దాని పక్క గది సుశీలది. రెండింటికీ మధ్య తలుపు ఉంది. అది అట్నుంచి గడియవేసుంది. వెనుక పెరటివైపు తలుపు తాళం వేసినట్టుంది. అతడు తలుపు లాగి చూసేడు. తనని ఎవరూ బైట రోడ్డు మీద నుచి గమనించటం లేదని ధృవపర్చుకుని వెనుదిరిగి అతడు తలుపుని బలంగా భుజంతో కొట్టాడు.

గడియ ఊడుతుంది. అయితే అతననుకొన్నట్టూ లోపలి గది ఖాళీగా లేదు. అందులో ఒక ఫకీరులాంటి వ్యక్తి నిద్రపోతున్నాడు. తలుపు చప్పుడుకు అదిరిపడి కళ్ళు విప్పి- గడియ విరుగుతున్న గ్రహించి- వెనుకవైపు తలుపు తీసి చల్లగా జారుకున్నాడు.

గదిలోకి ప్రవేశించిన చిరంజీవికి - లోపల చీకటి వల్ల ఒక క్షణం ఏమీ కనబడలేదు. తరువాత మసక మసగ్గా వస్తువులు కనపడసాగేయి. వస్తువులంటే పెద్దవస్తువులేమీ కావు. ఒక పాత ట్రంకు పెట్టె- ఒక కోడు పూర్తిగా వూడిపోయిన బల్ల, గోడకి కాలెండరు, దండెం....

అతడు మోకాళ్ళ మీద కూర్చుని పెట్టె మూత తెరిచాడు. ఆ పాత ట్రంకుపెట్టె తలుపు తెరుచుకుంటూ చేసిన చప్పుడులో అతడి వెనుకే తెరుచుకున్న గుమ్మం తలుపు చప్పుడు వినిపించలేదు.

బైట కెళ్ళిన వ్యక్తి నిశ్శబ్దంగా లోపలికి వచ్చాడు. అతడి చేతిలో గునపంలాంటి ఇనుపరాడ్ వుంది. పెట్టెలో ఏముందో చూడాలన్న తొందర్లో వున్న చిరంజీవి వెనుక నుంచి నీడలా పాక్కుంటూ వస్తూన్న వ్యక్తిని గమనించలేదు.

పెట్టెలో బట్టలు ఏమీ లేవు. రెండు మూడు చిరిగిపోయిన పాతగుడ్డలున్నాయి. కొన్ని పాత పత్రికలు కూడా. చిరంజీవి ఒక్కొక్కటే బైట పడేయసాగేడు. చివర్న చేతికి అద్దం లాటిది తగిలింది. తీసి చూస్తే ఒక పాత ఫొటో.

దాన్ని వెలుతుర్లోకి తీసుకొచ్చి చూద్దామనుకొని వెనుదిరగబోతూ- వెనుక ఎవరో నిల్చున్న భావన కలిగి చప్పున పక్కకి వంగేడు. అదే అతడిని రక్షించింది.

గునపం వెళ్ళి ట్రంకుపెట్టె మిద పెద్ద చప్పుడుతో పడింది. అది ఎంత బలంగాపడిందంటే - ఆ దెబ్బకి పెట్టె మధ్యకి వంగిపోయి, పైకి లేచింది.

క్షణం పాటు చిరంజీవి నిర్విణ్ణుడయ్యాడు. తడి ఆరిన గొంతుతో, "ఓబులేసూ!" అన్నాడు. అయితే ఓబులేసు చిరంజీవిని చూసి పూర్వంలా భయపడలేదు. మళ్ళీ బలంగా గునపం పైకి ఎత్తి దాన్ని అతడి మీదకి విసిరేడు.

చిరంజీవి చప్పున పక్కకి తప్పుకుని దాన్ని తప్పించుకున్నాడు. నిజానికి ఓబులేసు అల్పప్రాణి. తాగుడు వల్ల నరాలు పట్టుదప్పి శరీరం ఎప్పుడూ వణుకుతూ ఉంటుంది. కానీ ఆ క్షణం అతడు ప్రాణాలకు తెగించినట్టూ కనబడుతున్నాడు. చిరంజీవిని చంపటమే ఆశయంగా పెట్టుకున్నట్టూ ఆవేశంతో ఉన్నాడు.

చిరంజీవికదే ఆశ్చర్యంగా ఉంది. ఎందుకితడికి తన మీద ఇంత పగ?.. ఓబులేసు కళ్ళు అదోలా ఉన్నాయ్. చంపటమో-చావటమో తేల్చుకొనేటట్టూ ఉన్నాడు. జుట్టు నుదుటి మీదకు పడుతూంది.

రెండు నిమిషాల పాటు ఆ గదిలో భీకర పోరాటం జరిగింది. ప్రాణాలు తియ్యాలని ఒకరు- ఆ పోరాటం ఎందుకో తెలియక ఒకరు- చివరికి చిరంజీవే గెలిచాడు. ఓబులేసు చేతిలోంచి గునపాన్ని లాక్కొని విసిరేసి, అతడి చెయ్యి మెలితిప్పాడు."..... చెప్పు, అర్చనకి ఎందుకు అబద్ధం చెప్పావు? నేన్నీకు ముందే తెలుసా?"

ఓబులేసు జవాబు చెప్పలేదు. ఆయాసంతో రొప్పసాగేడు. తన మాటల్ని చిరంజీవి రెట్టించాడు. దానికీ సమాధానం లేదు.

"చూడూ! నాకు నవ్వించటమే కానీ ఏడిపించటం రాదు. నువ్వేడిస్తే నీతోపాటు నాకూ ఏడుపొస్తుంది. నిజం చెప్పేవరకూ నిన్నెలాగూ వదిలిపెట్టను. తొందరగా చెప్తే నీకే మంచిది"

ఓబులేసు మాట్లాడలేదు.

చిరంజీవి అతడి చేతిని మరింత వెనక్కు విరిచేడు. ఎముక విరిగి- కలుక్కుమన్న శబ్దం- ఓబులేసు కెవ్వున అరిచిన అరుపులో కలిసిపోయింది.

చిరంజీవి అతడి నోటి మీద ఫట్‌మని కొట్టి "గట్టిగా అరుస్తే ఎవరైనా వస్తారేమోనని ఆశపడ్తున్నావేమో- అలాటి ఆశలేమీ పెట్టుకోకు. ఎవరైనా వచ్చినా- నీ ప్రాణాలుతీసిగానీ వాళ్ళకి నేను లొంగిపోను."

ఓబులేసు నోటి నుంచి రక్తం కారసాగింది.

చిరంజీవి కామ్‌గా అన్నాడు "మీరందరూ కలిసి నన్ను చాలా బాధలుపెట్టారు ఓబులేసూ! నా అర్చనని నాకు కాకుండా చేసేరు. సమాజంలో మరి తలెత్తుకోకుండా చేసేరు. తప్పుడు సాక్ష్యాల్తో నన్ను ఇప్పుడు ఉరికంబం ఎక్కించబోతున్నారు. ఎలాగూ చావబోతున్న వాణ్ణి- నాకిక చావు అంటే భయంలేదు. నిన్ను చంపి మరీ ఛస్తాను. మామూలుగా చంపను. చిత్రహింస పెట్టి మరీ చంపుతాను. దీన్ని తప్పించుకోవాలంటే నీకు ఒకటే మార్గం నిజం చెప్పటం!! దీని వెనుక ఉన్నది నువ్వు కాదని నాకు తెలుసు! అదెవరో చెప్పు, నిన్ను వదిలిపెడ్తాను. లేదా- చెప్పావనుగా నీకు చిత్రహింస తప్పదు. నన్ను ఇన్నాళ్ళూ పెట్టిన మానసిక హింసకి ప్రతీకారం తీర్చుకుంటాను చాలా స్వీట్‌గా!"

హీనమైన కంఠంతో, "నా చెయ్యి" అన్నాడు ఓబులేసు. చిరంజీవి చెయ్యి వదిలేసేడు. అది తోటకూర కాడలా వేలాడసాగింది. చిరంజీవి జాలిపడలేదు. అతడు చాలా కామ్‌గా ఉన్నాడు. ఈరోజు ఏదో ఒకటి తేలిపోవాలి.

చిరంజీవి చెయ్యి వదిలేయగానే ఓబులేసు అంతటి బాధలోనూ బయటకు ఒక్క అంగలో పరుగెత్తబోయాడు. అయితే అది

ముందే ఊహించిన చిరంజీవి కాలు ముందుకు జరిపాడు.

అంతటి శరీరమూ ఒక్కసారిగా పక్కకి పడింది. ఆ పడటంలో అది విరిగిన ఎముక మీద పడింది. గదిగోడలు కంపించేలా ఓబులేసు పెట్టిన కేక వికృతంగా గుడ్లగూబ అరిచిన అరుపులా ధ్వనించింది.

అయితే చిరంజీవి చాలా మాములుగా ఉన్నాడు. తాపీగా, " నాకు సమాధానం కావాలి ఓబులేసూ" అని అన్నాడు. "చెప్తావా... చెప్తావా?"

ఓబులేసు నీరసంగా "చెప్తాను" అన్నాడు. చిరంజీవి అడగడం ప్రారంభించాడు.

"నువ్వు దాదాకి శవం సంగతి చెప్పిన మాట నిజమేనా?"

"నిజమే."

"ఎలా చెప్తావ్? దాదా ఆరోజు రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడు కదా."

"పోలీస్ స్టేషన్‌లో లేడు. నే కల్సుకున్నా కదా"

"అసలు శవం సంగతి నీకెలా తెల్సింది?"

ఓబులేసు జవాబు చెప్పటానికి తటపటాయించేడు. కానీ చిరంజీవి అడుగు ముందుకేయడంతో బెదిరి "చెప్తాను" అన్నాడు.

"మరి చెప్పు!"

"బైట అరుగుమీద పడుకుని వుండగా లోపల్నుంచి ఓ కేక వినిపించింది. ముందు భయమేసినా, సానాసేపు అట్ట పడుకోలేకపోయినా, సూడాలా వద్దా అని ఆలోసిత్తూ పక్కమీద పొర్లుతున్నా"

"చూడాలన్నా ఎలా? కిటికీ తలుపులు తెరిచి వున్నాయా?"

"లేదు. ముందు తలుపులు తెరిసున్నాయి?"

చిరంజీవి ఆశ్చర్యంగా "అంటే బైట్నుంచే వెళ్ళిపోయాడా చంపినవాడు" అని అడిగాడు.

"ఎల్తే నాకు కనబడి వుండేవాడుగా - ఇట్నుంచి ఎనకేపు ఎల్లిపోయుంటాడు" అన్నాడు వెనుకవైపు తలుపు చూపిస్తూ.

"వెనుక నుంచి ఎవరికీ తెలియకుండా వెళ్ళిపోవాలనుకున్నవాడు ముందు తలుపు గడియ ఎందుకు తీస్తాడు?"

సమాధానం తెలియదన్నట్టు ఓబులేసు మౌనంగా ఉండిపోయాడు.

చిరంజీవి మెదడులో ఫ్లాష్‌లాగా వచ్చింది ఆలోచన. శవం కోసం తనని పిలవటం అన్నది ముందుగానే ఆలోచించి పెట్టుకున్న పథకమేమో!

అవును, అందుకే తలుపు తీసి పెట్టి ఉండవచ్చు. ఓబులేసు ఎలాగైనా తెల్లవారేలోపు చూస్తాడన్న నమ్మకం వాళ్ళకుంది.

"శవాన్ని చూడగానే నువ్వేం చేశావు?"

"దాదాకి చెప్పినా"

"అప్పుడు దాదా ఎక్కడున్నాడు"

"నా పక్కనే వున్నాడుగా"

చిరంజీవి అదిరిపడి "నీ పక్కనా?" అన్నాడు.

"ఆ గదిలోంచి కేక ఇనిపించగానే - ఏం జరిగుంటదా అని ఆలోచన్లతో నిద్రపట్టక పొర్లుతున్న. అంతలో దాదా వచ్చిండు. అప్పటికే సాన రోజుల క్రితం ఏదైనా శవం వుంటే కావాలని సెప్పిండు దాదా. ఆ రాత్రి వచ్చి 'ఇంకా శవం దొరకలేదా?' అని అడిగిండు..... లేదన్నా.... అంతలో ఆలోచన వచ్చి - ఎదురింటి గదిలో అంతక్రితవే సచ్చినట్టు కేక ఇనబడింది అని సెప్పి సూసొస్తనన్న. ఇద్దరం తలుపు తెరిచి సూసేసరికి లోపల సుశీలమ్మ సచ్చిపడుంది".

చిరంజీవి ఊపిరి బిగపట్టి "తరువాత ఏమైంది" అని అడిగాడు. దారాసింగ్ ఓబులేసుకి శవం సంగతి పరోక్షంగా తెలియజేశాడన్న మాట!

"దాదా కంగారు పడలే. పోయి ముసలమ్మకి సెప్పమన్నాడు. ఇద్దరికీ తప్ప యింకెవరికీ తెలియకూడదన్నాడు. ఇంకో గంటలో రాత్రికి రాత్రే మున్సిపాలిటీ వాళ్ళొచ్చి శవాన్ని తీసుకుపోయే ఏర్పాట్లు చేస్తానని సెప్పిండు. ముసలమ్మకి క్కూడా అట్టే జెప్పమన్నాడు. నాకు యాభైరూపాయలిచ్చిండు. తరువాతేమైందో నాకు దెల్వదు. గుడుంబా షాపుకి పోయినా."

అతడు చెప్పినదానిలో అబద్ధమేమీ ఉన్నట్టు కనబడలేదు. అదే నిజమైన పక్షంలో - సుశీల మరణం సంగతి ఓబులేసుకు తెలియటానికి దారాసింగ్ ప్రయత్నించాడన్న మాట.

ఎందుకు?

కారణం చాలా చిన్నది అయి వుండవచ్చు. తన ద్వారా శవాన్ని వదిలించటం అన్నిటికన్నా సులభమార్గం కాబట్టి 'వాళ్ళు' దీన్ని ఎన్నుకుని వుండవచ్చు. కానీ ఇంత పెద్ద మాస్టర్ ప్లాన్ వెనుక దారాసింగ్ ఒక్కడే వుండివుండడు. మరి ఇంకెవరు? ..... ఆలోచిస్తూనే - "సుశీల గురించి దాదా అప్పుడప్పుడు వచ్చేవాడా?" అని అడిగాడు.

"లేదు"

"ఎప్పుడూ లేదా?"

"లేదు. అసలెప్పుడూ లేదు" ధీమాగా చెప్పాడు "నేను ఎదుటి అరుగు మీదే వుంటాగా...."

"పోనీ ఇంకెవరైనా వచ్చేవారా?"

"లేదు"

"ఎవ్వరూ - ఎప్పుడూ."

"ఎవ్వరూ రాలే - ఎప్పు......" అనబోయి ఆగి, ఒక క్షణం ఆలోచించి "సావుకి నాల్రోజుల ముందు ఓ పెద్ద మనిషి వచ్చిండు" అన్నాడు.

"ఎలా వున్నాడు"

"కోటేసుకున్నడు. సాన స్టయిల్‌గున్నాడు. జుట్టు తెల్లగుంది."

"చూస్తే గుర్తు పట్టగలవా?"

"ఆ"

ఇంక ఆ గదిలో వుండి చేసేది ఏమీ లేదనిపించింది. ఈ ఓబులేసుని తీసుకెళ్ళి గదిలో పెట్టి - ఎలాగైనా దారాసింగ్‌ని అక్కడికి రప్పించాలి. ఎలాగైనా రహస్యం కక్కించాలి.

చిరంజీవి అతడి చెయ్యి పట్టుకుని "పద" అన్నాడు.

"ఎక్కడికి?"

"నా గదికి. దాదా అక్కడికి వస్తాడు. సుశీల చంపిందెవరో ఈ రోజు తేలిపోవాలి."

దాదా పేరు చెప్పగానే ఓబులేసు కళ్ళలో బెదురు కనబడింది "అమ్మో! దాదా నన్ను సంపేత్తాడు " అన్నాడు.

"ఫర్లేదు, నేనున్నాగా."

"అయినా నేను రాను" ప్రాణభయం ఓబులేసు మొహంలో కొట్టొచ్చినట్లు కనబడింది. చిరంజీవి చేయి వదిలించుకోవటానికి ప్రయత్నించసాగాడు. విరిగిన చేతి బాధను కూడా లెఖ్ఖ చేయటం లేదంటే, అతడికి దారాసింగ్ అంటే ఎంత భయమో అర్థమవుతోంది.

గింజుకుంటూన్న అతడిని దాదాపు రెండు చేతుల్తోనూ బైటకు తీసుకురావటానికి చిరంజీవి ప్రయత్నం చేయ్యసాగాడు.. చిరంజీవి కూడా అన్నిటికీ తెగించినవాడిలా ఉన్నాడు. ఆ రోజు ఏదో ఒకటి తేలిపోవాలి - అన్న దృఢనిశ్చయంతో ఉన్నాడతను.

విరిగిన చేతి మీద తాకిడి తగిలినప్పుడల్లా వికృతంగా అరుస్తూ చేతుల మధ్య జారిపోతున్నాడు ఓబులేసు. ఇద్దరూ అలా తోసుకుంటూ గుమ్మం వైపు రెండు అడుగులు వేశారు.

అంతలో ఓబులేసు కాలికింద అద్దం పుటుక్కుమని విరిగింది, చూస్తే అది చిరంజీవి సుశీల పెట్టెలోంచి బయటకు తీసిన ఫోటో. అద్దం గుచ్చుకుని ఓబులేసు పాదం నుంచి రక్తం స్రవించసాగింది. కానీ చిరంజీవి గమనిస్తున్నది దాన్ని కాదు - కిటికీలోంచి పడ్తున్న వెలుతురు వెలుగులో - ఓబులేసు కాలిక్రింద నలిగిన పటాన్ని.

క్షణకాలపు అనుమానం - మరుక్షణం పెనుభూతమై - వంగి - ఆ ఫోటో చేతుల్లోకి తీసుకుని పరీక్షగా చూశాడు.

మొహం రక్తం తోడేసినట్లు తెల్లబడింది. చేతులు సత్తువ లేనట్టు వణకసాగాయి. అతడిలో ఒక్కసారిగా వచ్చిన మార్పుని చూసి, తన బాధని కూడా మర్చిపోయి, ఓబులేసు అతడి భుజం పక్కనుంచి ఫోటోకేసి తొంగి చూసి "ఈయనే అప్పుడొచ్చింది" అని అరిచాడు - ఓ రహస్యాన్ని పెల్లగించినట్టూ...... ఓ జ్ఞాపకాన్ని తవ్వి తీసినట్టూ......

పాతిక సంవత్సరాల క్రితంనాటి ఫోటో అయినా అందులో వ్యక్తికి ఇప్పటికీ పెద్ద మార్పు రాలేదు. సుశీల తల్లి పక్కనే అదే చిరునవ్వుతో ఇప్పటికీ ఉన్నాడు.

అతడు సర్వోత్తమరావు!

చిరంజీవి ఫోటో పట్టుకుని అచేతనుడిలా నిలబడి వున్నాడు. మెదడులో ఉత్తుంగ తరంగాలవలె ఆలోచనల హోరు. ఉరిశిక్ష రద్దుకై తను వేసిన ప్లానుని కూతురి అడ్డు తొలగించుకోవటానికి అద్భుతంగా ఉపయోగించుకున్నాడన్నమాట - ఈ ప్రసిద్ధ క్రిమినల్ లాయర్! దాని కోసం చదరంగంలో పావుగా తనని ఉపయోగించుకుంటున్నాడన్న మాట.

ఉద్యోగం చేసుకోవటానికి ఈ వూరొచ్చిన సుశీల హఠాత్తుగా సర్వోత్తమరావుని చూసి తన తండ్రిగా గుర్తించి వుంటుంది. అయితే ఆ అమ్మాయి ఆయన్ని కలుసుకొని నిలదీసే సాహసం చెయ్యలేకపోయింది.

అప్పుడప్పుడూ వాళ్ళింట్లో కనబడే తనని ఈ సహాయం అర్థించటానికి కలుసుకున్నా "ఇంట్రావర్ట్" అవటం చేత అసలు విషయం తనతో చెప్పలేకపోయింది.

తనేమో ఆమెని క్లయింట్ అనుకున్నాడు. తన ఇంటి ముందు వూరికే తచ్చట్లాడే అమ్మాయి గురించి తెలిసి వుంటుంది. తన ఇరవై అయిదు సంవత్సరాల క్రిమినల్ తెలివిని ఈ అపురూపమైన ప్లాన్ కోసం వినియోగించి, ఎవరితోనో చంపించి ఆ శవాన్ని తనకు చూపించేలా చేశాడన్న మాట. తనో మూర్ఖుడిలా ఇందులో యిరుక్కుపోయాడు. అన్నీ తనే చేశానని స్వయంగా కోర్టులో ఒప్పుకున్నాడు.

అనుకున్నది అనుకున్నట్టుగా జరిగివుంటే తను ఉరి తీయబడి ఉండేవాడు. కేసు క్లోజు అయిపోయి వుండేది. సర్వోత్తమరావు అక్రమసంబంధం గురించీ అతడి కీర్తి ప్రతిష్టలకి మచ్చ కలిగించే సుశీల గురించీ ఎవరికీ తెలిసి వుండేది కాదు. చిరంజీవే హంతకుడిగా శాశ్వతంగా రికార్డుల్లో ఉండేది.

అసలు అర్చన ఆఖరి క్షణంలో తనని ఉరి నుంచి రక్షించడంలో వచ్చింది యిదంతా.

అంటే - సర్వోత్తమరావు ఆక్సిడెంట్ విషయం కూడా నిజం కాదన్నమాట!

కారుని లోయలోకి తోసేసి - కాలు విరిగినట్టు నాటకమాడి ఆ రాత్రి ఆస్పత్రిలో చేరి తెల్లవారుఝామున తను ఉరికంబం ఎక్కే క్షణం కోసం చూశాడన్న మాట!

మైగాడ్! .... చిరంజీవి వళ్ళు జలదరించింది. కోల్డ్బ్లడెడ్ మర్డర్ అంటే ఏమిటో అర్థమైంది. చిరంజీవికి రహస్యమంతా పొగమంచు విడినట్టు విడిపోసాగింది.

తాము వేసిన ప్లాన్ గురించీ, శవాన్ని నూతిలో పడెయ్యటం గురించీ మూడో కంటికి తెలియకూడదని ఆయన అందుకే

అన్నాడన్నమాట!

మనసులోనే ఆయన తెలివికి జోహార్లర్పించాడు చిరంజీవి.

నరరూప రాక్షసుడంటే ఏమిటో తెలిసింది.

అన్ని విషయాలూ తెలిసినా ఇంకో రెండు విషయాలు మాత్రమే అర్థం కాకుండా మిగిలిపోయినయ్.

ఎందుకు ఆయన ఈ కేసులో 'తననే' యిరికించటానికి ప్రయత్నిస్తున్నాడు? ఎందుకు అర్చనని యింత దారుణంగా భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు?

......

గది బైట ఎవరో తచ్చాడిన అనుమానం రాగానే చటుక్కున తలుపు వేసేసుకుంది అర్చన. కానీ వచ్చింది రామయ్య.

తను తలుపులు వేసుకుని లోపల యెందుకు వుండిపోయిందో చెప్పవలసిన అవసరం తన మీద ఉన్నట్టు గ్రహించి ఏదో ఒకటి చెప్పాలన్నట్టు "టి.వి. చూస్తున్నాను" అంది అర్చన. ఏమీ తోచనప్పుడు తలుపులు వేసుకుని వీడియో చూడటం వారికి అలవాటే.

"కూర ఏం వండమంటారు?" కిటికీ అవతల్నుంచి రామయ్య అడిగాడు.

ఆమెకి అనుమానం కలిగింది. ఎవరూ - ఎప్పుడూ తనని యిలాంటి విషయాల గురించి అడగరు. అందులోనూ వంటపని రంగమ్మది. పైకి రావటంకోసమే యితడు ఈ పని పెట్టుకున్నాడా?

"ఏం? రంగమ్మ లేదా?" లోపల్నుంచే అడిగింది.

"ఎప్పుడొస్తుందో తెలీదమ్మగారూ."

"నీ ఇష్టం వచ్చినది వండు"

అతడు వెనుదిరిగి, మెట్లు దిగబోతూ, మళ్ళీ వెనక్కి వచ్చి "మీ ఫోను పనిచేస్తుందా" అని అడిగాడు.

ఆమె గుండె ఆగినట్టయింది "ఏం?" అంది తడారిన గొంతుతో.

"క్రింద ఫోను పని చెయ్యటంలేదు."

"సర్లె - సర్లె"

అతడు మెట్లు దిగి వెళ్ళిపోయాడు. ఆమె ఒక్క అంగలో ఫోన్ దగ్గరికి వెళ్ళి రిసీవర్ ఎత్తింది. అదృష్టవశాత్తూ అది పని చేస్తూంది. ఆ తరువాత ఏం చెయ్యాలో ఆమెకి తోచలేదు. ఆ గదిలో తలుపులు వేసుకుని అలా ఎంతకాలం ఉండగలదు...... ఆమె చేతులు అప్రయత్నంగా వీడియో కేసేట్స్‌ని వెతికినయ్.

చేతికి దొరికినదాన్ని అందుకుని టి.వి.కి అమర్చి స్విచ్ వేసింది.

మరుక్షణం టి.వి.లో చిత్రం ప్రారంభం అయింది. ఆమె కుర్చీలో కూర్చొని చిత్రాన్ని చూస్తుందన్నమాటేగానీ - మనసంతా బైట రామయ్య ఏం చేస్తున్నాడా అని ఆలోచిస్తూనే వుంది.

తలుపులు తీసి బయటకు వెళ్ళడం శ్రేయస్కరం కాదు. మావయ్య దగ్గర్నుంచీ రాబోయే ఫోన్ కోసం చూస్తూ ఆమె అన్యమనస్కంగా టి.వి. చూడసాగింది. ఆమె చూస్తున్నది చార్లీచాప్లిన్ నటించిన చిత్రం.

అర్చన చిత్రాన్ని చూస్తూ వున్నదన్న మాటేగానీ ఆమె మనసంతా వేసిన తలుపుల అవతలివైపే వుంది. ఒక మనిషి అక్కడ తచ్చాడుతున్నట్టు ఆమెకి అనిపిస్తోంది. ఆమె సాధారణంగా భయపడే వ్యక్తికాదు. కానీ క్రితం రాత్రి తాలూకు సంఘటన ఆమెలో భయాన్ని విపరీతంగా సృష్టించింది.

టి.వి.లో చార్లీ చాప్లిన్ మంచుకొండలమీద నిప్పు రాజెయ్యటానికి నానా అవస్థా పడుతున్నాడు. మామూలు పరిస్థితులలో అయితే కడుపు చేతపట్టుకుని నవ్వేదే. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు.

బయట చప్పుడు వినటంకోసం ఆమె ఎయిర్ కండిషనర్ ఆఫ్ చేసింది. అయినా ఆ గది దాదాపు సౌండ్ ప్రూఫ్ కాబట్టి ఏం జరుగుతున్నదీ తెలియడం లేదు.

టి. వి. లో చాప్లిన్ కాలి బూటులోంచి మేకుని బయటకు లాగుతున్నాడు.

ఆమె తలుపు వరకూ వెళ్ళి సందుల్లోంచి బైట వరండాలో రామయ్య వున్నాడేమో చూడటానికి ప్రయత్నించింది. సాధ్యం కాలేదు. చార్లీ చాప్లిన్ మంచు మీద నడవటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆమె తలుపు తెరిచి చూద్దామని అనుకుంది. కానీ అతడు అక్కడే వున్న పక్షంలో, తనకి అనుమానం కలిగిన సంగతి అతడికి తెలిసిపోతుంది.

ఆమె మొహం అంతా చెమటలు పట్టినయ్. మృత్యువు చాలా సమీపానికి వస్తున్నట్టూ సిక్త్ సెన్స్ చెబుతూంది. తిరిగి ఎయిర్ కండిషనర్ ఆన్ చేసింది.

ఆ చప్పుడు కన్నా ముందు టెలిఫోన్ మోగింది.

ఆమె ఒక్క అంగలో వెళ్ళి ఫోన్ అందుకుని "హలో" అంది.

"నేనమ్మా" అట్నుంచి సర్వోత్తమరావు కంఠం వినిపించడంతో ఆమె ఒక్క క్షణం రిలాక్స్ అయింది. అయినా భయం తగ్గలేదు. కంపిస్తున్న స్వరంతో "ఏమైందంకుల్ - వచ్చాడా?" అని ఆతృతగా అడిగింది.

"రాలేదమ్మా - అదే అర్థం కావటంలేదు. కోర్టులో మిగతా లాయర్లక్కూడా అంతు బట్టటంలేదు. లా చదివినవాడు కోర్టుని ఇంత నిర్లక్ష్యం చేయటం ఏమిటి అనుకుంటున్నారు. ఇప్పుడిక అరెస్టు వారెంట్ వస్తుంది. అయినా కోర్టులో కేసు పెట్టుకుని ఇతడు ఏ రాజ్యాలేలటానికి వెళ్ళాడు?" ఆయన కంఠంలో విసుగు ధ్వనించింది.

"నువ్వింకా అక్కడే ఉంటావా అంకుల్?"

"నువ్వు ప్రేమించిన నేరానికి అతడిని బైటకు తీసుకురావాలి కదమ్మా. నువ్వేం కంగారు పడకు. ఆరు మూడయినా, మూడు

ఆరయినా చిరంజీవిని తప్పించే బాధ్యత నాది.”

“కానీ ఇక్కడ నేను ఒంటరిగా.....” ఆమె మాట్లాడటం చప్పున ఆపుచేసింది. ఒక్కసారి ఫోనులో నిశ్శబ్దం సంతరించుకోవటంతో - “హల్లో......హల్లో”అంటూ అవతల్నుంచి సర్వోత్తమరావు ఫోన్ టాప్ చేయసాగాడు.

అర్చన దృష్టి ఫోన్ మీద లేదు. టి.విని చూస్తూ స్థాణువులా నిలబడి వుంది. మెదడులో ఎక్కడో పొరల అడుగున కదలిక!

చార్లీ చాప్లిన్ మంచుకొండల మీద జాగ్రత్తగా దిగుతున్నాడు - ఇటోకాలూ - అటో కాలూ వేసి - జారిపోకుండా - ఇటో కాలూ - అటో కాలూ - గరిమనాభి రెండు కాళ్ళ మధ్యా వుండేటట్టూ చూసుకుంటూ మంచు స్లోప్స్‌లో జారిపోకుండా - అదే నడక!!!

“అంకుల్......” ఉద్విగ్నతతో గొంతు పగిలిపోయేటట్టూ వుంది. ఆమె చేతిలో రిసీవర్ వణుకుతోంది “సుశీల్ని రేప్ చేసింది ఎవరో కనుక్కున్నాను అంకుల్. మెళ్ళో లంగరు బొమ్మ ఉన్న ఓడ కళాసీ యెవరో తెలిసిపోయింది.....” చిత్రాన్నే చూస్తూ అంది “ఇప్పుడే...... ఇప్పుడే తెలిసింది ” అని అరిచింది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

29వ భాగం

"ఎవరు?"

"దారాసింగ్"

అట్నుంచి కొంచెం సేపు నిశ్శబ్దం తరువాత నెమ్మదిగా సర్వోత్తమరావు "ఎలా కనుక్కున్నావమ్మా?" అని అడిగాడు.

ఎగ్జయిట్‌మెంట్‌తో అంది "చాలాకాలం క్రితం పారిస్ వెళ్ళినప్పుడు కెప్టెన్ ఫోర్డ్ చెప్పాడంకుల్.... నావల మీద నడిచేవాళ్ళు కుదుపులకి పడిపోకుండా ఇటోకాలూ, అటోకాలూ వేసి నడుస్తారట. అదే బయటకూడా అలవాటయిపోతుందట. దారాసింగ్ అలాగే నడుస్తాడు. అతడి చరిత్ర తవ్వితీస్తే అతడు కళాసీయా, కాదా అన్న విషయం తెలిసిపోతుంది. అతడి మెళ్ళో బిళ్ళే ఆ గదిలో పడింది - లంగరు బొమ్మ ఉన్న బిళ్ళ - ఓడ కళాసీలు వేసుకునేది."

సర్వోత్తమరావు సాలోచనగా "చాలా మంచి పాయింట్ పట్టుకున్నావమ్మా" అన్నాడు.

ఆమె తన ధోరణిలో చెప్పుకుపోతోంది "దారాసింగ్ ఆరోజు రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఎలా వున్నాడో - అందులో నిజనిజాలేమిటో మనం కనుక్కోవాలి అంకుల్. ఇందులో ఏదో తిరకాసు వుంది"

"ఆ విషయం నేను చూసుకుంటాలే గానీ - ఏమిటి ఇందాక ఏదో చెప్తూ ఆపుచేశావ్?"

"ఏమిటి"

"ఇక్కడ నేను ఒంటరిగా.. అంటూ చెప్పబోయి ఆగావ్."

ఆమెకి మళ్ళీ తన స్థితి గుర్తొచ్చింది. భయం వెనక్కి వచ్చి చేరుకుంది "అవునంకుల్. మన ఇంట్లోనే ఒక వ్యక్తి మనకి ప్రత్యర్థిగా వున్నాడని అనుకున్నాం కదా. అతడెవరో కాదు అంకుల్ - రామయ్యే. ఇంట్లో ఇప్పుడు మేమిద్దరమే వున్నాం" అంటూ తన పరిస్థితి వివరించింది.

"పాతిక సంవత్సరాల్నుంచీ మన ఇంట్లో నమ్మకంగా పనిచేస్తున్న రామయ్య ఇంత పని చేశాడంటే నమ్మలేకుండా ఉన్నానమ్మా"

"నాకు భయంగా వుందంకుల్"

"గది తలుపులు వేసుకునే ఉన్నావ్ కదా"

"ఆ"

"అవి తీయకు. నేను చెప్పింది జాగ్రత్తగా ఫాలో అవు..... కిటికీలోంచి అతడిని పిలిచి రంగమ్మ ఎక్కడికి వెళ్ళిందో

పిలుచుకురమ్మను. దానికి ఎలాగూ ఓ అరగంట పడ్తుంది. అతడు వెళ్ళిపోయాక నీ గదిలో కూర్చోకు! క్రింద హాల్లోకి వచ్చేయ్. అర్థం అయిందా?"

"అయిందంకుల్"

"నీ గదిలో బైట వైపు వున్న కిటికీ దగ్గర్నుంచి చూస్తే అతడు మెయిన్ గేటుగుండా వెళ్ళిందీ లేనిదీ కనిపిస్తుంది"

"నీది సూపర్బ్ ఐడియా అంకుల్. ఇప్పుడే అలా చేస్తాను"

"వెంటనే చెయ్యి" అంటూ ఫోన్ పెట్టేశాడు సర్వోత్తమరావు.

చుట్టూ చూశాడు. ఆఫీసంతా నిశ్శబ్దంగా వుంది.

ఫ్యాక్టరీకి సెలవు అవటం వల్ల కార్మికుల కలకలం కూడా వినిపించటంలేదు. పొడిసున్నం తాలూకు వాసన ఆఫీసులోకి కూడా వస్తోంది. విశాలమైన టేబుల్ ముందు కూర్చొని వున్నాడాయన. ఒక్క సారిగా పది సంవత్సరాలు వయసుపైన పడినట్టు కనిపిస్తున్నాడు.

తనలో తనే ఒక నిర్ణయానికి వచ్చినట్టు రెండో ఫోన్ ఎత్తి డయిల్ చేశాడు సర్వోత్తమరావు. రెండు నిముషాలు మాట్లాడి పెట్టేశాడు..... ప్రాణం కన్నా మేనకోడలు ఎక్కువకాదు.....

0 0 0 0 0 0 0 0 0 0

ఆ సమయానికి హాల్లో కూర్చొని వుంది. చేతిలో పుస్తకం వుందన్న మాటేగానీ - చూపు మెయిన్ గేటుమీదే వుంది. అయితే ఆమె భయం సగం వరకూ తగ్గిపోయింది, చెప్పగానే రామయ్య వెళ్ళిపోవటంతో.....

దానికి తోడు మెయిన్‌హాల్లో కిటికీలన్నీ తెరుచుకుంటే బయట ప్రపంచంలో జనం మధ్య వున్నట్టే వుంది. అయిదు నిమిషాల క్రితంవరకూ తను అనవసరంగా పడిన భయం గురించి తలుచుకుంటే నవ్వొస్తుంది. ఈ స్నేక్ ఫోబియా పోవటానికి ఎవర్నన్నా సైకియాట్రిస్ట్‌ని కలుసుకోవాలి!

ఆమె అలా ఆలోచన్లలో ఎంతసేపు వుందో తెలియదు. అంతలో పై గదిలో ఫోన్ మోగింది. క్రింద ఫోన్ పాడయిందని రామయ్య చెప్పటం గుర్తొచ్చింది. ఆమె చిరంజీవి ఏమయ్యాడా అన్న కంగార్లో వుంది. ఫోన్ వచ్చింది మామయ్య దగ్గర్నుంచి అని తెలుసు. ఆమె ఒక్క అంగలో మెట్లెక్కి పైకి వెళ్ళింది.

మెయిన్ గేటు పక్కనే నిలబడి ఆ ఫోన్ సంకేతం కోసం అప్పటి వరకూ చూస్తున్న దారాసింగ్ నీడలా లోపలికి ప్రవేశించాడు.

అది తన స్వంత ఇల్లులా - తాపీగా హాలుగుండా మెట్లెక్కి పైకి నడిచాడు.

బెడ్ రూమ్‌లో ఫోన్ రిసీవర్ ఎత్తబోతున్న అర్చన - గుమ్మం దగ్గర నీడని చూసి చప్పున వెనుదిరిగింది.

దారాసింగ్ పెదవులు నవ్వుతో విచ్చుకున్నాయి. ఆ నవ్వులో పాత పగ, కసి అన్నీ వున్నాయ్. స్ప్రింగ్ డోర్ అతడి వెనుకే

నెమ్మదిగా మూసుకుపోయింది. అతడు వెనుదిరిగి దాన్ని లాక్ చేశాడు.

అర్చన నిశ్చేష్టురాలై కళ్ళప్పగించి అలానే చూస్తూ వుండిపోయింది. ఆమెకు అరవాలన్న ధ్యాస కూడా రాలేదు.

ఆమె స్మృతిపథంలో దారుణంగా రేప్ చేయబడి - హత్య కావించబడిన సుశీల రూపం మెదిలింది. తనకీ అదే గతి పట్టబోతోందా?

"అరవకు సిన్నమ్మా. అరిచినా బయటకు వినపడదు, వినబడినా బయట ఎవరూ లేరు"

అంటూ అడుగు ముందుకేశాడు.

ఆ మాటలకి అప్పుడే స్పృహలోకి వచ్చినదాన్లా ఆమె కదిలింది. సత్తువంతా కాళ్ళలోకి

తెచ్చుకుని - ఒక్క అంగలో బాత్‌రూమ్‌లోకి పరుగెత్తి తలుపు లాక్ చేసింది.

తలుపుకి ఆనుకుని నిలబడి వుందామె. వేగంగా కొట్టుకుంటున్న గుండె చప్పుడు ఆమెకి స్పష్టంగా వినిపిస్తోంది.

బైట్నుంచి సన్నగా నవ్వు వినబడింది! "పెద్ద పెద్ద తాళాలే దాదాకి అడ్డురావు సిన్నమ్మా ... ఇదెంత?"

తలుపు వేసిన లాక్ తాలూకు స్క్రూ నెమ్మదిగా తిరగటం కనిపించింది.

అర్చన గుండె ఆగిపోయినట్టయింది. ఇంకెంత, రెండు మూడు నిమిషాలు... లాక్ తెరుచుకోవడానికి.....

ఒక స్క్రూ వూడిపోయింది. ఇంకొక్కటే మిగిలింది. ఇక అతడు లోపలికి ప్రవేశిస్తాడు. అరిచినా, గింజుకున్నా లాభం వుండదు. అది ప్రూఫ్ గది. ప్రపంచానికి తెలియకుండా ఒక దారుణం జరిగిపోతుంది. ప్రపంచం అలాగే వుంటుంది. తను వుండదు.

ఆమె నిస్సహాయంగా తిరుగుతున్న రెండో స్క్రూ వైపు చూడసాగింది.

మరో నిముషానికి తలుపుకి వున్న లాక్ విడివిడి పెద్ద శబ్దంతో క్రిందపడిపోయింది. ఆ తరువాత హాండిల్ కదుల్చుతున్న ధ్వని.

వాష్ బేసిన్ మీద చేతులు ఆన్చి - ఊడిపోతున్న తలుపు గడియవంక చూస్తూ వుందామె.

అవతల్నుంచి దాదా హాండిల్ టప్ టపా కదులుస్తూ - తలుపు తొయ్యటానికి ప్రయత్నం చేస్తున్నాడు. వీడియో తాలూకు సినిమాలో వస్తూన్న మ్యూజిక్‌లో అతడి చర్య తాలూకు శబ్దం కలిసిపోయింది.

మధ్యాహ్నం పన్నెండు కావొస్తోంది. గదిలో ఇంత గొడవ జరుగుతున్నా బైట నీరవం మందంగా పేరుకుని వుంది. ఆ ఇంట్లోనూ - ఇంటి బైట కాంపౌండ్‌లోనూ నిశ్శబ్దం తాండవిస్తోంది.

నిర్మానుష్యంగా వున్న ఆ కాంపౌండ్‌లో గాలి సవ్వడి మాత్రం నెమ్మదిగా వినిపిస్తూ వుంది. ఒక ఎండుపుల్ల విరిగిన శబ్దం..... ఒక పక్షి చెట్టు మీద కదిలిన శబ్దం.

చివరి కొక్కెం కూడా వూడుతూ వుండగా అప్రయత్నంగా అర్చన దృష్టి హీటర్ మీదపడింది. స్నానానికి వేణ్ణీళ్ళు అప్పటికప్పుడు తయారు చేసే యిన్‌స్టంట్ ఎలక్ట్రిక్ హీటర్ అది.

అదే సమయానికి చిరంజీవి సర్వోత్తమరావుని కలుసుకోవటానికి వెళుతున్నాడు.

0 0 0

ఆమె చేతి వేళ్ళు మిషన్ కన్నా వేగంగా పనిచేస్తున్నాయి.

ఆమె ముంగురులు చెమటవల్ల నుదుటికి అతుక్కుపోయి వున్నాయి. ఏకాగ్రతతో పని చేస్తోంది.

ఈ ప్లాన్ కానీ అనుకున్నది అనుకున్నట్టు జరక్కపోతే ఇక తన పని ఆఖరని ఆమెకి తెలుసు. ప్రాణాలు పోకుండా దేవుడు కూడా ఆపలేడు. సమయం కూడా ఎక్కువ లేదు. దారాసింగ్ ధాటికి బలహీనమైన కొక్కెం ఎక్కువ సేపు ఆగలేదు. ఊడిపోవటానికి సిద్ధంగా వుంది.

ఆమె గీజర్ స్విచ్ వేసి నిముషమైంది. నీళ్ళు తిప్పక పోవటం వల్ల హీటర్‌లోంచి పొగలు వస్తున్నాయి.

అగ్నిమాపక దళంవాళ్ళు నీళ్ళ పంపుని పట్టుకుని నిలబడ్డట్టూ ఆ రిలాక్సబుల్ షవర్‌ని పట్టుకుని నిలబడింది.

నీటిని వదలకపోవటం వల్ల గీజర్‌లోంచి మరింత పొగలు వస్తున్నాయి.

నీటి శబ్దం వినిపించి దారాసింగ్ లోపల జరుగుతున్నది గ్రహించవచ్చు.

ఆమె షవర్ పట్టుకుని ఒక్క క్షణం పూర్తి కాలేదు. తలుపు కొక్కెం వూడిపోయింది. చిన్న విజయపూరితమైన నవ్వు.

"బైటికి రా సిన్నమ్మా" తాపీగా వినిపించింది.

ఆమె కదల్లేదు.

ఊపిరి బిగపట్టి నిలబడింది.

"బాత్‌రూమ్ బావోదు. బయటికి రా సిన్నమ్మా"

ఆమె కన్నార్పకుండా తలుపు వైపు చూస్తూంది. ఒక్క క్షణం కూడా ఏమరుపాటుగా వుండకూడదని ఆమెకు తెలుసు.

దారాసింగ్ తలుపు ధడేలున తన్ని లోపలికి ప్రవేశించాడు.

పెద్ద చప్పుడుతో తలుపు తెరుచుకోగానే అర్చన పంపు తిప్పింది. ముందు ప్లాస్టిక్ గొట్టం ఉబ్బింది. తరువాత షవర్‌లోకి నీరు ప్రవేశించినట్టూ అది కదిలింది. ఈ లోపులో దారాసింగ్ అడుగు ముందుకు వేశాడు. క్షణంలో ...... నీటిధార ఒక్క సారిగా పొంగినట్టు వర్షం తొండాల్తో ధార కారినట్లూ ఫోర్స్‌తో జల్లులా వెళ్ళి అతడి మొహాన్ని తడిపింది.

అయితే అది చల్లటి నీరు.

పైన బాత్‌రూమ్‌లో దారాసింగ్ మొహాన నీటి జల్లు పడుతున్న సమయానికి పచారీ కొట్టునుంచి రంగమ్మ, రామయ్య కబుర్లు చెప్పుకుంటూ ఆ యింటి కాంపౌండ్‌లో ప్రవేశించారు. రామయ్య చేతిలో కూరగాయల సంచి వుంది - ఆమె వెచ్చాలు పట్టుకుని వస్తోంది.

దారాసింగ్ మొహం మీదకు పడుతున్న నీరు చల్లటిదని గ్రహించగానే అర్చన కంగారుపడింది. పై ప్రాణాలు పైనే ఒక్కసారిగా పోయినట్టు అనిపించింది.

తలుపు తీయగానే జరిగిన ఈ సంఘటనతో దారాసింగ్ కూడా కొద్దిగా కంగారుపడ్డాడు. అయితే అది రెప్పపాటుకాలం మాత్రమే. వెంటనే అతడు సర్దుకున్నాడు. చల్లటి నీరు మరింత

హాయిగా వుందనిపించింది. కొద్దిగా మొహాన్ని పక్కకి వంచి రెండడుగులు ముందుకొచ్చాడు.

ఒక్కసారిగా పొంగినట్టు వేడినీరు లోపల్నుంచి తన్నుకొచ్చింది. అందులోనూ మొహం డైరెక్టుగా నీటి వైపు పెట్టి ఉంచాడేమో - ఆ నీరు ముందు రెప్పల్ని - ఆ అదురుకి వాటిని తెరవగానే కళ్ళనీ కాల్చింది.

అప్పటికప్పుడే చర్మం ఎర్రగా మారిపోయింది. పొయ్యిమీద కాల్తున్న పెనం నుంచి వస్తున్నట్టు అతడి మొహం మీద నుంచి ఆవిర్లు రాసాగినయ్.

అతడు పెట్టిన కేక ఆ చిన్న గదిలో వికృతంగా ప్రతిధ్వనించింది.

పైప్‌లైన్‌లో అప్పటివరకూ వున్న చల్లటి నీరు ముందు బైటకి వచ్చిందనీ, ఆ తరువాత వేడినీరు వచ్చిందనీ ఆమె గ్రహించింది. అయినా దాని గురించి ఆలోచించే టైమ్ లేదు! అతడు మోకాళ్ళమీద చేతుల్లో మొహం దాచుకుని - దాదాపు పొర్లుతున్నాడు.

ఆమె ఒక్క అంగలో బాత్‌రూమ్‌నుంచి బైటకొచ్చింది.

గది బయటకు పడుగెత్తబోతూంటే - టెలిఫోన్ మోగింది. కాళ్ళకేదో అడ్డుపడినట్టు ఆగిపోయి ఒ క్షణం టెలిఫోన్‌కేసీ - బాత్‌రూమ్‌కేసీ చూసింది. దారాసింగ్ కదలటంలేదు. స్పృహతప్పి పడివున్నాడు.

ఒక అమాయకురాలిని దారుణంగా రేప్‌చేసి - చంపినందుకు ప్రతిఫలం అనుభవిస్తున్నట్టు మాంసం కాలిన అతడి మొహం చెబుతోంది.

ఆమెకింకా భయంతగ్గలేదు.

టెలిఫోన్ తీసుకుని గది బయట బాల్కనీలోకి వచ్చేసి - తలుపు లాక్ చేసేసింది.

అప్పటికామె బెదురు కాస్త తగ్గింది.

ఫోన్ ఎత్తి "హల్లో" అంది. ఆమె కంఠం ఫోన్లో వూహించలేనట్టు అట్నుంచి ఒక సెకను జవాబు రాలేదు. ఆమె తిరిగి -

‘హల్లో’ అంది.

“నేనమ్మా - ఎలా వున్నావ్?”

“మైగాడ్ అంకుల్! ఒక్క క్షణంలో ఎంత ప్రమాదం తప్పిపోయిందో! లేకపోతే........”

“అసలేమైందమ్మా” కంగారు ధ్వనించింది సర్వోత్తమరావు కంఠంలో.

దారాసింగ్ రావటం, తను ప్రమాదం నుంచి బయటపడటం అంతా వివరించి చెప్పింది ఆమె “అతనిప్పుడు నా గదిలోనే వున్నాడంకుల్! బయట తాళంవేశాను.”

“ఇంట్లో ఎవరూ లేరా?”

“లేరంకుల్”

“అమ్మా! ఎవరు శత్రువులో ఎవరు మిత్రులో తెలియకుండా ఆ ఇంట్లో నువ్వో క్షణంకూడా వుండటాన్ని నేనొప్పుకోను. వెంటనే నా దగ్గరకి వచ్చేసెయ్.”

“థాంక్స్ అంకుల్. నేనూ అదే అనుకుంటున్నాను” అందామె. మూసివున్న తలుపుల కేసి అనుమానంగా చూస్తూ.

“బైదిబై నేను కోర్టులో లేనమ్మా. మన ఫ్యాక్టరీలో వున్నాను”

“అదేమిటంకుల్ - చిరంజీవి .......”

“చిరంజీవికి బెయిల్ దొరికిందమ్మా”

ఆమె అంత టెన్షన్‌లోనూ తేలిగ్గా వూపిరి పీల్చుకుంది. ఫోన్ పెట్టెయ్యబోతూవుంటే అవతల్నుంచి వినిపించింది “కార్లో వస్తున్నప్పుడు జాగ్రత్తగా చూసుకో, వాడుగానీ చచ్చాడా” దారాసింగ్ గురించి అడిగాడు.

“తెలీదంకుల్”

“వాడిని అలా వదిలెయ్. నువ్వు మాత్రం వచ్చేయ్. ఏ మాత్రం ఆలస్యం చెయ్యకు. నా గదిలో అల్మైయిరాలో బట్టల క్రింద 38 వుంటుంది. నీతో పాటు పెట్టుకో- ఎవరు అడ్డువచ్చినా కాల్చేయ్. ఆత్మరక్షణార్ధం కాబట్టి ఏం భయంలేదు. అర్ధమైందా?”

“అంత అవసరం రాదనుకుంటున్నాను”

“వస్తే సంగతి చెప్తున్నాను. ఇక యిల్లు తాళం వెయ్యటంలాంటి పన్లేమీ పెట్టుకోక. హర్రీ అప్......”

“వచ్చేస్తున్నా అంకుల్” అని ఫోన్ పెట్టేసి ఒక్క అంగలో మెట్లు దిగ సాగింది. ఆమె క్కూడా ఆ యింట్లోంచి ఎప్పుడు బయటపడదామా అని వుంది.

అదే సమయానికి రామయ్య, రంగమ్మ హాల్లో ప్రవేశిస్తున్నారు. వాళ్ళని చూడకుండా ఆమె పక్కగదిలోకి వెళ్ళి రివాల్వర్ తీసుకుని మళ్ళీ బయటపడి రాబోతూ వాళ్ళని చూసి చటుక్కున ఆగిపోయింది.

ఆమె ఆకారం చూస్తూ వాళ్ళు విస్తుబోయారు. ఆమె వాళ్ళని చూసి మరింత భయంతో బయటకు పరుగెత్తబోయింది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

30 వ భాగం

"ఎక్కడికమ్మా" అని అడిగింది రంగమ్మ సాహసం చేసి.

అర్చన ఆగకుండానే "ఫ్యాక్టరీకి" అంటూ అక్కణ్నుంచి వడివడిగా బయటకు వెళ్ళి మెట్లు దిగింది. ఆమెకింకా వెనుక నుంచి ఎవరో తరుముకొస్తున్నట్లే వుంది.

కారులో కూర్చొని స్టార్టు చేసి వేగంగా పోనిచ్చింది. దుమ్ము లేపుకుంటూ కారు ఆ ఇంటి కాంపౌండ్‌లోంచి బయటకు దూసుకుపోయిన సమయానికి చిరంజీవి గేటు దగ్గరకి ప్రవేశించాడు. ఆమె అతడిని గమనించలేదు.

"అర్చనా" పిలవబోయి ఆగిపోయాడు. అప్పటికే ఆమె కారు అతడిని దాటి మలుపు దగ్గరకి వెళ్ళిపోయింది.

అతడు లోపలకి వెళ్ళి అడిగితే అమె ఫ్యాక్టరీకి వెళ్ళిందని చెప్పారు. అతడి మనసు చివుక్కుమంది. ఇక్కడ తను జీవన్మరణ సమస్యలో వుంటే - ఆమె తన పనులు చూసుకోవడానికి మామూలుగా ఫ్యాక్టరీకి వెళ్ళింది!

ఇప్పుడు అంత కంగారు - కంగారుగా వెళ్ళి ఆమె మామయ్య తాలూకు నిజస్వరూపాన్ని ఆమెతో చెప్పాల్సిన తొందరేం వుంది?

అలా అనుకుని, అతడు వెనుదిరిగి ఇంటివైపు నడవటం సాగించాడు.

0 0 0

బయల్దేరిన పదినిముషాల్లో అర్చన ఫ్యాక్టరీ చేరుకుంది. ఊరు బయట ఫ్యాక్టరీ నిర్మానుష్యంగా వుంది. తెరిచిన గేటు గుండా ఆమె కారు లోపలికి బాణంలా దూసుకుపోయింది.

సర్వోత్తమరావు ఆఫీసు రూమ్ దగ్గర కాకుండా ఫ్యాక్టరీ తలుపు దగ్గర వున్నాడు. ఆమెకి ఎదురెళ్ళి "వచ్చావా, నాకు నువ్వు వచ్చేవరకూ మనసు మనసులో లేదనుకో" అన్నాడు.

అర్చన నవ్వింది, కొండంత ధైర్యం వచ్చింది. "ఈ రివాల్వరూ అదీ చెప్పి నన్ను మరింత బెదరగొట్టేశావ్ అంకుల్" అంటూ దాన్ని అతడి చేతికి అందించింది.

సర్వోత్తమరావు తాపీగా దాన్ని అందుకున్నాడు. అతడు ఫ్యాక్టరీ లోపలికి వెళ్తూంటే ఆమె అతడిని అనుసరించింది. అతడి మొహం భావరహితంగా వుంది.

లోపల సున్నం కాలుతున్న వాసన ఘాటుగా వేస్తోంది.

"ఎవరూ లేరేమిటి అంకుల్"

"శెలవు రోజు ఎవరు వుంటారమ్మా? బయట గూర్ఖా వున్నాడుగా" అన్నాడు - గేటు దగ్గర కూర్చునే గూర్ఖాని ఉద్దేశించి.

ఇద్దరూ మిషన్ల మధ్యకి వచ్చారు.

సర్వోత్తమరావు ఆగాడు.

అర్చన అతడికేసి అమాయకంగా చూస్తూ "ఏమిటంకుల్" అంది - అతడేదో చెప్పబోయి ఆగినట్టు గ్రహించి.

"ఏం లేదు" అన్నాడు అతడు. అతడి కంఠం అదోలా ధ్వనించింది. ఆమె దాన్ని గుర్తించలేదు. ఆయన ఎందుకింత తాత్సారం చేస్తున్నాడో ఆమెకి అర్థంకాక "...... మనం

పోలీసులకి ఫోన్ చెయ్యాలి అంకుల్. వాడు గానీ స్పృహలోంచి లేచాడంటే ఆ బెడ్ రూమ్ తలుపులు బద్దలుకొట్టి బయటకొచ్చేస్తాడు" అంది.

"అవును. ఎలాగూ బయటకొచ్చేస్తాడు"

ఆమెకి అతడి మాటల్లో శ్లేష అర్థంకాలేదు "చిరంజీవికి కూడా చెప్పాలి అంకుల్. పాపం భయపడి ఎక్కడ దాక్కున్నాడో ఏమిటో - ఆ దారాసింగ్ దీనికంతా కారణమనీ, ఆరోజు రాత్రి వాడు పోలీస్ స్టేషన్‌లో వున్నట్టు మనకొచ్చిన వార్త అబద్ధమనీ - చిరంజీవి మీద కేసు ప్రూవ్ అవదనీ చెబితే - పాపం చిరంజీవి కొద్దిగా స్థిమిత పడ్తాడు."

సర్వోత్తమరావు మాట్లాడలేదు. మరో రెండు అడుగులు ముందుకేశాడు. అర్చన బాయిలర్ పక్కగా వచ్చింది.

అతడు ఆగి, నెమ్మదిగా వెనుదిరిగి మేనకోడలి మొహంలోకి సూటిగా చూశాడు. తను ఆప్యాయంగా పెంచుకున్న ఒక పూల మొక్క నిర్దాక్షిణ్యంగా పీకెయ్యవలసి వచ్చినప్పుడు మనిషి పడే బాధ లాంటిది అతడిమొహంలో క్షణంసేపు కదలాడింది. అయితే అది క్షణం మాత్రమే! వెంటనే అతడు సర్దుకున్నాడు.

ఆ పాటికే అర్చన మరో రెండు అడుగులు వేసి రెయిలింగ్ పక్కగా వచ్చింది.

సర్వోత్తమరావు ఆమెకు మరింత దగ్గరగా వెళ్ళాడు. అతడి చేతిలో రివాల్వర్ మామూలుగానే వుంది.

అతడి మనసులో భావాల్ని లేశమాత్రమైనా గ్రహించని అర్చన రెయిలింగ్ పట్టుకుని నిలబడింది.

క్రింద సున్నం కుతకుతా వుడుకుతోంది.

"సెలవు రోజు మనం ఎందుకు అంకుల్, పోదాం పద" అంటూ ఫ్యాక్టరీలోంచి బయటకు రావటం కోసం అడుగు ముందుకు వేసింది. సరిగ్గా అక్కడితో రెయిలింగ్ పూర్తయింది.

"ఎప్పుడో ఒకప్పుడు పోవల్సినవాళ్ళమే కదమ్మా మనందరం. పోతే ఒకళ్ళు ముందు ఒకరు వెనుకా" అతది కంఠంలో కొత్తగా వినిపించిన జీరని విని తల తిప్పి చూసింది.

అతడు చెయ్యి పైకెత్తాడు.

అతడి చేతిలో రివాల్వర్ చూసి నవ్వింది "....... ఏమిటంకుల్ - రిహార్సలా"

సర్వోత్తమరావు మొహం కఠినంగా వుంది "మనింట్లో ఎవరో శత్రువుకి సాయం చేస్తున్నారని అన్నావ్ కదా! అలా సాయం చేసేవాళ్ళు ఎవరూ లేరు. జాగ్రత్తగా విను. ఆ అసలు శత్రువుని నేనే" అన్నాడు మోనోటోన్‌లో......

ఆమె చప్పున అడుగు వెనక్కి వేసింది. అయినా నమ్మకం కుదరనట్టు బేలగా, "ఇదంతా నవ్వులాటకి అంటున్నావ్ కదంకుల్. నన్నేడిపించటానికి అంటున్నావ్ కదూ" అంది. ఆమెకి చిన్న

పిల్లలా ఏడవాలనిపిస్తోంది! అందరూ చుట్టూ చేరి ఏడిపిస్తూంటే రోషంతో ఏడ్చే చిన్న పిల్లలా వూహించనిది జరిగినట్టు, ఉక్రోషంతో ఏడవాలనిపిస్తోంది!

ఆమె పెదవులు వణుకుతున్నాయి. అరచేతులు చెమటలు పట్టాయి. ఏ వటవృక్షం క్రింద విశ్రాంతి తీసుకుంటూందో, ఆ వృక్షమే విరిగిపడినట్టు - విలవిలలాడిపోతోంది.

"కొన్ని నిజాలు - అవి ఎంత అబద్ధాల్లా కనపడ్తాయంటే వాటిని నిజంగా చెప్పినా ఎవరూ నమ్మరు. అలాంటి పచ్చి నిజం నీకొకటి చెప్పనా - సుశీల నా కూతురు?"

ఒక్కసారిగా ఆ ఫ్యాక్టరీలో అన్ని మిషన్లూ గిరగిరా తిరుగుతున్నట్లూ - భూమ్యాకాశాలు ఏకమై గాలి ఘోషిస్తున్నట్టు ఆమె కంపించింది.

"సుశీలా........ సుశీలా" అంది తడారిన గొంతుతో.

"అవును. సుశీలే.......... ఇరవై ఏళ్ళు అజ్ఞాతవాసంలో వుండి - ఒక్కసారి బైటకొచ్చి - నా ముందు ప్రశ్నలా నిలచింది! క్రొత్తగా ప్రాక్టీసు పెట్టిన రోజుల్లో నాకు ఒక సాధారణ స్త్రీతో పరిచయం వుండేది. ఆ రోజుల్లోనే నువ్వు తల్లీ తండ్రి చచ్చిపోయి లక్షల ఆస్తితో నా దగ్గరకొచ్చావు. నా ప్రాక్టీసు కూడా పెరగసాగింది. భవిష్యత్తు ఎంతో అందంగా కనపడసాగింది. అంత ఆనందంలోనూ ఒకటే అడ్డు - మాటి మాటికీ తగుల్తూ వుండేది.

ఆ అడ్డు సుశీల తల్లి.

అప్పటికే ఆవిడ గర్భవతి. పెళ్ళి చేసుకొమ్మని తొందర పెడ్తూ వుండేది. ఎంతో అందమైన భవిష్యత్తు ముందుంచుకుని అలాంటి అనామకురాల్ని చేసుకోవటం నాకిష్టం లేకపోయింది. వాయిదా వేస్తూ వచ్చాను. ఈ లోపులో సుశీల ఈ ప్రపంచంలోకి వచ్చింది. తాకిడి మరీ ఎక్కువైంది. ఇంకో దారిలేక ....... దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం...... ఈ చేతుల్తో - స్వయంగా ఈ చేతుల్తో సుశీల తల్లిని చంపేశాను"

0 0 0

కెవ్వున కేక....

దాన్ని అనుసరించి మళ్ళీ ఒకటి రెండుసార్లు కేకలు....

చూస్తున్న వాస్తవాన్ని అర్థం చేసుకోలేనట్టు నిజాన్ని జీర్ణం చేసుకోలేనట్టు గుండెలవిసేలా కేకలు........

ఆ కేకలు రంగమ్మవి!

అదే సమయానికి అర్చన ఫ్యాక్టరీకి వెళ్ళిపోయిందని తెలిసి, ఆ యింట్లోంచి బయటకు అడుగు పెడ్తున్నాడు చిరంజీవి. ఆ కేకలు విని, తిరిగి లోపలికి పరుగెత్తాడు.

బెడ్‌రూమ్ తుడవడానికి వెళ్ళిన రంగమ్మ లోపల మొహం కాలి వికృతంగా పడివున్న అపరిచిత వ్యక్తిని చూసి, కేకలు పెడుతోంది.

రామయ్య అక్కడికి చేరుకున్నాడు. వెనుకే చిరంజీవి.......

లోపలి దృశ్యం చూసి చిరంజీవి ఒక్క క్షణం అప్రతిభుడయినా, వెంటనే సర్దుకున్నాడు.

అతడి ఆలోచన్లు వేగంగా సాగినయ్.

రిలాక్సబుల్ షవర్ పైపు, ప్లాస్టిక్ గొట్టం - అతడికి జరిగిన విషయాన్ని చెప్తున్నాయి.

దారాసింగ్ మొహాన్ని కాల్చిన తరువాత అర్చన ఈ ఇంట్లో వుండలేక, చివరికి రామయ్యనీ, రంగమ్మనీ కూడా నమ్మలేక - ఫ్యాక్టరీకి వెళ్ళిపోయిందన్న మాట. అంటే సర్వోత్తమరావు అక్కడే వుండి వుండొచ్చు.

తన మామయ్యకు దారాసింగ్ విషయం చెప్పటం కోసమే అర్చన ఫ్యాక్టరీకి వెళ్ళిన పక్షంలో - ఈ విషయాన్ని విన్న సర్వోత్తమరావు ఎలా ప్రవర్తిస్తాడు? తన మేనకోడలికి ఎలా నచ్చచెప్పుకుంటాడు? అదే సమయానికి తను ప్రవేశిస్తే ఆ నాటకం ఎలా పరిసమాప్తమవుతుంది? సర్వోత్తమరావు పని అడకత్తెరలో పోక చెక్క అవదూ!

మరి ఆలస్యం చెయ్యకుండా చిరంజీవి ఫ్యాక్టరీకి బయల్దేరాడు. అయితే అతడు చేసిన తప్పేమిటంటే - సర్వోత్తమరావుకి, అర్చనకీ మధ్య ఇంకా సంబంధాలు వున్నాయనుకోవటం...... అర్చన ముందు అప్పుడే సర్వోత్తమరావు బయటపడడని అనుకోవడం..... అన్నిటికన్నా ముఖ్యంగా, ఫ్యాక్టరీకి ఆ రోజు సెలవు అని తెలుసుకోకపోటం.......

అతడు ఫ్యాక్టరీ చేరుకునే సమయానికి అక్కడంతా నిర్మానుష్యంగా వుంది. గేటు దగ్గర గూర్ఖాకూడా లేడు. అర్చన వచ్చిన కారు మాత్రంవుంది. అతడు లోపలికి వెళ్ళాడు. ఆఫీసు తలుపులు మూసేసి వున్నాయి. లోపల ఫ్యాక్టరీలో అలికిడి వినిపించడంతో అటు నడిచాడు.

అదే సమయానికి సర్వోత్తమరావు చెప్తున్నాడు "సుశీలని దారాసింగ్ చంపేశాడు. కానీ ఈ ప్లాన్‌లో నేను చేసిన ఒకే ఒక తప్పేమిటంటే, సుశీల చనిపోయిన రోజు దారాసింగ్ జైల్లో వున్నాడని నీకు చెప్పటం. కానీ దురదృష్టవశాత్తూ వాడి మెళ్ళోంచి వూడిపడిన రాగిబిళ్ళ సాయంతో వాడే ఈ రేప్ చేసింది అని నువ్వు కనుక్కున్నావు. నువ్వు పోలీస్ రిపోర్టు యిచ్చి పోలీసులు వాడిని అరెస్ట్ చేస్తే వాడు వూరుకోడు. నన్ను కూడా యిందులోకి లాగుతాడు. అందువల్ల ఈ రహస్యం ఇక్కడే కప్పబడి పోవాలంటే - ఇంకో మార్గంలేదు నిన్ను చంపెయ్యాలి"

చాటునుంచి వింటున్న చిరంజీవి ఉలిక్కిపడ్డాడు.

అటు తిరిగి మాట్లాడుతున్న సర్వోత్తమరావు చేతిలో రివాల్వర్ వుందనీ - అతడు అర్చనని చంపే వుద్దేశంలో వున్నాడనీ

చిరంజీవి అప్పటివరకూ అనుకోలేదు.

తనమీద మరింత బలంగా నేరం మోపటం కోసం ఇంకేవో కొన్ని ఆధారాలు సృష్టించి - మేనకోడలుకి నచ్చచెప్తున్నాడని అనుకున్నాడు.

కానీ అక్కడ పరిస్థితి మరోలా వుంది. తనని తను రక్షించుకోవటం కోసం మేనకోడల్ని కూడా చంపటానికి వెనుదియ్యటంలేదు సర్వోత్తమరావు.

"నువ్వు చెయ్యవలసిందల్లా - కళ్ళు మూసుకుని నాలుగు అడుగులు ముందుకెయ్యటమే" అంటున్నాడతడు.

చిరంజీవి తలుపు వెనుకనుంచి కొద్దిగా పక్కకి వచ్చాడు. ఇద్దరూ స్పష్టంగా కనబడ్తున్నారు. అతడి చేతిలో రివాల్వర్ మెరుస్తోంది.

మనిషిలోంచి రాక్షసుడు బయటకొచ్చినట్టు వున్నాడు. అతడో ప్రఖ్యాత క్రిమినల్ లాయర్ అంటే ఆ క్షణం ఎవరూ నమ్మరు.

"ఊ తొందరగా" అంటున్నాడు.

అర్చన ముందుకు చూసింది.

కన్వేయర్ బెల్ట్ క్రింద పెద్ద నుయ్యి లాంటి గొయ్యి వుంది. బెల్ట్ చివర పెద్ద చక్రం వుంది. రబ్బర్ బెల్ట్ ఆ చక్రం మీదనుంచి మళ్ళీ వెనక్కి వచ్చి చిన్న చక్రం మీదుగా తిరిగి పైకి వెళ్తూంది. బట్టలు కుట్టుకునే మిషనుకి వున్న తాడులా రెండు చక్రాల్నీ కలుపుతోంది అది.

ఆ బెల్ట్ క్రింద వున్న గోతిలో తెల్లటి నీరువుంది. అది పైకి కనబడేటంత నిర్మలం కాదనీ, అడుగున సున్నం కుతకుతా ఉడుకుతూ వుందనీ ఆమెకి తెలుసు. అందులో పడిన రెండు నిమిషాల్లో మాంసం, ఎముకలతో సహా కరిగి అందులో కలిసిపోతుందనీ, ఆనవాలు కూడా మిగలదని కూడా తెలుసు.

నిజానికి అతడు తనని రివాల్వర్‌తో చంపి, అందులోకి తోసెయ్యొచ్చు. కానీ పోస్టుమార్టమ్‌లో మళ్ళీ బుల్లెట్ కనబడితే గొడవ అవ్వొచ్చు. అందుకే తనంతట తననే దూకెయ్యమంటున్నాడు.

ఆమె అతడి వైపు బాధతో, వేదనతో చూసింది...... ఇతడేనా తనకి చదువు చెప్పించి పెంచి పెద్దచేసింది? ఇతడేనా సమాజంలో తనకో స్థానాన్ని కల్పించింది! మనిషి మనసులో ఇంత రాక్షసుడు దాగివుంటాడా? డబ్బు..... కీర్తి........ స్త్రీ....... ఈ మూడేనా ఆ రాక్షసుణ్ణి నిద్రలేపి విశ్వరూపం ధరింపచేసేవి?

ఒక రకమైన వేదాంత భావంతో ఆమె అడుగు ముందుకేసింది.

ఇంకో అడుగు మిగిలివుంది.

చిరంజీవికి ఏం చెయ్యాలో తోచలేదు.

అతడు చప్పున గుమ్మం మధ్యకొచ్చి నిలబడి "హల్లో" అన్నాడు. సర్వోత్తమరావు అదిరిపడి వెనుదిరిగాడు. ఒక క్షణం

ఆలస్యం చేసినా చేసినట్టే.

కానీ అతడిని చూసి సర్వోత్తమరావు కంగారు పడలేదు తాపీగా నవ్వాడు.

"నువ్వు కూడా సమయానికి వచ్చావ్! రా" అన్నాడు. "ప్రేమికులిద్దరూ కలిసి చద్దురుగానీ."

చిరంజీవి, అర్చనా ఒకర్నొకరు చూసుకున్నారు. ఎన్నాళ్ళ తరువాతో కలుసుకున్న ఆత్మీయుల్లా చిరంజీవి ఆమె దగ్గరగా వెళ్ళాడు. ఎదురుగా ఓపెన్ బాయిలర్..... కాల్షియం హైడ్రాక్సైడ్ వాసనకి ముక్కుపుటాల్నుంచి రక్తం వచ్చేటట్టు వుంది.

"ఆఖరి క్షణంలో నీకో రహస్యాన్ని చెపుతాను. చిరంజీవీ! విని ఆశ్చర్యపోతావ్....

అదేమిటో తెలుసా? సుశీల నా కూతురు"

"నాకు తెలుసు" అన్నాడు చిరంజీవి. సర్వోత్తమరావు ఆ జవాబు విని ఆశ్చర్యపోయాడు. చిరంజీవి అన్నాడు "ఈ విషయం నాకేకాదు నా స్నేహితుడైన స్వూర్తిక్కూడా తెలుసు. మీరు

మమ్మల్ని చంపి తప్పించుకుపోలేరు. స్వూర్తి పోలీస్ స్టేషన్‌లో జరిగినదంతా చెప్తూ ఉంటాడు."

ఆ మాటకి సర్వోత్తమరావు మొహం పాలిపోయింది. అయితే అదో క్షణకాలం మాత్రమే అంతలోనే నవ్వి, అన్నాడు - "మీ యిద్దరూ చచ్చిపోతే - వెయ్యి మంది స్వూర్తిలు కూడా నన్ను న్యాయస్థానంలో దోషిగా నిలబెట్టలేరు. దారాసింగ్ సంగతి అతడికి తెలిసే వీలులేదు"

చిరంజీవికి ఆ విషయం తెలుసు. కేవలం చీకటిలో బాణంవేశాడంతే.

"ఆలస్యం చెయ్యకు చిరంజీవీ! నీ ప్రియురాలు పక్కనే వుంది. కళ్ళు మూసుకు దూకెయ్ - ఊ - ఇద్దరూ" అన్నాడు సర్వోత్తమరావు.........

చిరంజీవి నిజంగానే కళ్ళు మూసుకున్నాడు. అంతలో -

అర్చన కంఠం వినిపించింది. "రోమియో జూలియెట్ - దేవదాసు పార్వతీల్లా మేమూ ఒకేసారి చచ్చిపోవటం నాకెంతో సంతోషంగా వుందంకుల్. పోతే వాళ్ళ చరిత్రలో లేని గొప్పతనం మాలో ఇంకొకటి వుంది. అదేమిటంటే ఏ కన్వేయర్ బెల్ట్‌మీద మొట్టమొదటిసారి చిరంజీవి నన్ను తాకాడో అదే ప్రదేశంలో చచ్చిపోతున్నాం. ప్రధమ స్పర్శ..... చివరి మరణం ఒకేచోట......." అంటోంది అర్చన.

'చావుకి ముందు వచ్చే సంధిప్రేలాపన' అంటే అలాగే ఉంటుందనుకున్నాడు కళ్ళు మూసుకుని వింటూన్న చిరంజీవి.

అంతలో అతడి మెదడులో ఏదో మెరిసినట్లయింది. కళ్ళు విప్పి చప్పున అర్చనవైపు చూశాడు. తన 'హింట్' అతడు గ్రహించినట్టు తెలుసుకుని - ఆమె పెదవులు విడీవిడనట్టు నవ్వింది.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

31 వ భాగం

అతడు కొద్దిగా పక్కకి జరిగాడు. ఎలక్ట్రిక్ స్విచ్ చేతికి అందేటంత దూరంలోకి వచ్చింది తల తిప్పి ఓరగా పక్కకి చూశాడు.

సర్వోత్తమరావు ఈ ఆలస్యాన్ని భరించలేనట్టు, "ఊ, క్విక్" అంటూ అడుగు ముందుకు వేశాడు. అతడి కాలు కన్వేయర్ బెల్ట్‌వున్న ప్రదేశంలో గచ్చుమీద పడటం - చిరంజీవి స్విచ్ ఆన్ చేయటం ఒకేసారి జరిగినయ్.

పెద్ద శబ్దంతో ఒక్కసారి అన్ని మిషన్లూ పనిచేయటం ప్రారంభించేసరికి - ఆ ఫ్యాక్టరీ కంపించినట్టు అయింది. కన్వేయర్ బెల్ట్‌మీద వాలుగా - పైకి ప్రయాణం చెయ్యసాగాడు సర్వోత్తమరావు.

బొగ్గు గనుల్లో బెల్టుకు వేలాడుతూ సాగిపోయే బొగ్గు గంపలా అతడు వాలుగా పైకి వెళ్ళసాగాడు. దూరంగా నిలబడ్డ చిరంజీవి - దగ్గరగా వున్న అర్చనా - ఇద్దరూ నిశ్చేష్టులై ఆ దృశ్యాన్ని చూడసాగారు. ఇంక అయిదూ పది సెకన్ల కన్నా ఎక్కువ సమయంలేదు. బెల్టుతో పాటూ పైకి వెళ్ళగానే - అతడి చేయి చక్రం మధ్యలో నలుగుతుంది. చెయ్యి వదిలేస్తే క్రింద కుతకుతా ఉడుకుతున్న సున్నం.

సర్వోత్తమరావు బెల్టు పైకి రావటానికి ప్రయత్నం చేశాడు. కానీ అది అసాధ్యం అని తెలిసిపోయింది తన మరణం కూడా అనివార్యం అని గ్రహించాడు - ఇంకో అయిదు సెకనులు అంతే.

నెమ్మదిగా రివాల్వర్ ఉన్న చేతిని పైకెత్తాడు......... చిరంజీవి వైపు ........ తన ఏకైక ప్రత్యర్థి వైపు...

అతడి అభిప్రాయాన్ని గ్రహించిన అర్చన అప్రయత్నంగా "అంకుల్" అని అరిచింది. ఒక చేతిలో బెల్ట్ పట్టుకుని - ఇంకో చేతితో రివాల్వర్ పట్టుకుని మృత్యువు వైపు ప్రయాణం చేస్తూన్న సర్వోత్తమరావు మనసులో ఆ ఒక్క సెకనులో లక్ష పరస్పర విరుద్ధమైన భావాల ఘర్షణ! అర్చన శిలలా నిలబడి చూస్తోంది.

అతడు ట్రిగ్గర్ నొక్కబోతూ అర్చనవైపు చూశాడు. అర్చన చూపు అతడిని నిలబెట్టేసింది. ఆ కళ్ళు బేలగా .......... ఆర్తిగా ......... ప్రేమగా నిస్సహాయంగా...... అర్థిస్తూ........... ప్రార్థిస్తూ.

అతడు రివాల్వర్ వదిలేశాడు. క్రింద సున్నం తొట్టిలోకి అది జారిపోయింది.

అనూహ్యమైన ఈ చర్యకి చిరంజీవి కూడా మొదట స్థాణువైనా వెంటనే తేరుకుని, అటు పరుగెత్తాడు. బాయిలర్ పక్కనే వున్న రాడ్‌ని అందుకుని, దాన్ని సర్వోత్తమరావుకి అందించాలనీ అతడి కోర్కె. అయితే అతడు బాయిలర్ దగ్గరకు చేరుకునే సమయానికి జరగవలసింది జరిగిపోయింది.

ముందు వినిపించింది చక్రానికీ, బెల్టుకీ మధ్య పడి చేతి ఎముకలు విరుగుతున్న ధ్వని, దానితో పాటూ అతడు బాధతో అరిచిన కేక. చిప్పిల్లిన చేతి రక్తం జివ్వున చిమ్ముతూ వుండగా అతడు చేతిని వదిలేశాడు.

అంతే....... దబ్బున శబ్దం, కుతకుతా ఉడుకుతూ మాంసం కాలుతున్న వాసన...........

చిరంజీవి ఆపాటికే ఊచ అందుకుని బెల్ట్ పక్కగా వచ్చి సున్నంలోకి ఊచని వంచాడు. నడుము వరకూ అందులోకి జారిపోతూ స్పృహ కోల్పోతున్న సర్వోత్తమరావు ప్రాణభయమూ - చావు ధైర్యమూ యిచ్చిన బలంతో ఆ రాడ్‌ని పట్టుకున్నాడు.

## 11

"ఎలా వుంది డాక్టర్ ?" చిరంజీవి అడిగాడు. డాక్టర్ మాట్లాడలేదు. అర్చన అతడి వైపు ఆత్రంగా చూస్తోంది. చిరంజీవి అదే ప్రశ్న తిరిగి అడిగాడు.

"ఫిఫ్టీ ఫిఫ్టీ ఛాన్సెన్స్" అన్నాడు డాక్టర్ . బ్రతికే అవకాశం సగానికి సగం వుంది. తొడల వరకూ మాంసం పూర్తిగా కాలిపోయింది. ఒక వేళ బ్రతికినా రెండు కాళ్ళు పూర్తిగా తీసెయాల్సిందే. పోతే కిడ్నీస్ ఎఫెక్టు అయ్యాయేమో చూడాలి. దానిమీదే రిజల్టు పూర్తిగా ఆధారపడి వుంటుంది" అతడు అంటూ వుంటే లోపల్నుంచి నర్స్ వచ్చి ఏదో చెప్పింది. డాక్టర్ లోపలికి వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు.

వచ్చి "మిమ్మల్ని చూడాలనుకుంటున్నాడు ఆయన" అన్నాడు. చిరంజీవి, అర్చన మొహామొహాలుచూసుకుని లోపలికి అడుగు పెట్టారు.

ఎందరో రోగుల్ని, ఎన్నో భీభత్స దృశ్యాలను చూసిందీ అయిన అర్చనే ఆయన్ను చూడలేకపోయింది. కాళ్ళ మధ్యగా తెల్లటి ఎముక స్పష్టంగా కనబడుతూంది. పడినప్పుడు చిమ్మిన సున్నం మొహం మీద పడిన చోటల్లా నల్లగా కాలి పోవటం వల్ల బుగ్గలూ, గెడ్డమూ వికృతంగా వున్నాయి.

వాళ్ళని చూడగానే సర్వోత్తమరావు నవ్వాడు "అలా కూర్చో చిరంజీవి - నేను నా డెత్ స్టేట్‌మెంట్ ఇద్దామనుకుంటున్నాను" అన్నాడు.

దోషి మరణానికిముందు చేసే కన్‌ఫెషన్ గురించి ఆయన మాట్లాడుతున్నాడని చిరంజీవికి అర్థమయింది. సాధారణంగా అటువంటి సమయాల్లో మేజిస్ట్రేటుని పిలుస్తారు. కస్టడీలో నేరస్తుడు మరణిస్తే - ఆ మరణానికి ముందు పోలీసులకి అతడిచ్చిన వాఙ్మూలాన్ని కోర్ట్ సాక్ష్యంగా గుర్తించదు. తప్పనిసరిగా మేజిస్ట్రేట్ ఉండి తీరాలి. మేజిస్ట్రేట్ దొరకని పక్షంలో డాక్టర్ దగ్గర ఆ స్టేట్‌మెంట్ ఇస్తే, దాన్ని సాక్ష్యంగా గుర్తిస్తుంది.

సర్వోత్తమరావు కళ్ళు తిప్పి "ఇంకా ఎంతసేపట్లో ఆపరేషన్ డాక్టర్?" అని అడిగాడు.

పేషెంట్ ఎంత తెలివిగా మాట్లాడుతున్నా అది కేవలం చావుకి ముందు వచ్చే 'కాన్షస్‌నెస్' అని అర్చన గుర్తించింది.

"ఇంకో పది నిముషాలో దానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి" అన్నాడు డాక్టర్.

"ఈ లోపులో నేను 'కోమా'లోకి వెళ్ళిపోననే అనుకుంటున్నాను" అన్నాడు సర్వోత్తమరావు.

ఎవరూ మాట్లాడలేదు. మళ్ళీ ఆయనే "నేను బ్రతకటానికి ఛాన్సెంతుంది? నూటికి ఒక పాలన్నా వుందా?" అని అడిగాడు.

"మీరు తప్పకుండా బ్రతుకుతారు" డాక్టర్ పేషెంట్‌కి ధైర్యం చెప్పే ధోరణిలో "ఆపరేషన్‌కి ఏర్పాట్లు జరుగుతున్నాయి."

ఆయన నవ్వి "అయితే ఛాన్సెన్స్ ఫిఫ్టీ ఫిఫ్టీ అన్నమాట" అన్నాడు. అని డాక్టర్‌తో "మీరు కాస్త బయటికి వెళ్తారా - ఈ పది నిమిషాల్లో నేను వీళ్ళతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు. డాక్టర్ తటపటాయించి "ఎందుకు" అన్నాడు.

"మీరు వెళ్ళక పోతే నేనేం చెప్పలేను డాక్టర్! కొన్ని నిజాలు నాతోనే అంతరించి పోతాయి"

ఆ గదిలో ఒక క్షణం నిశ్శబ్దం రాజ్యమేలింది. అర్చన కదిలి "నేనూ డాక్టర్నే డాక్టర్ - ఫర్లేదు" అంది. ఆమెకి తన మామయ్య ఏం చెప్తాడా అని ఆతృతగా వుంది. డాక్టర్ అయిష్టంగానే బయటికి వెళ్ళాడు. ఆపరేషన్ ఏర్పాట్లు చూడటానికి.

"నేనెందుకు డాక్టర్‌ని వెళ్ళిపొమ్మన్నానో తెలుసా?"

"తెలుసు" చిరంజీవి పళ్ళు బిగించి అన్నాడు. కోపమూ - నిస్సహాయతా అతడిని పెనవేసుకుంటున్నాయి.

"ఎందుకు వెళ్ళిపొమ్మన్నాను?"

దానికి సూటిగా సమాధానం చెప్పలేదు చిరంజీవి "లా ఆఫ్ ఎవిడెన్స్ ............. ఎంపరర్ వర్సెస్ మహమ్మద్ బక్ష్" అన్నాడు.

"గుడ్ - వెరీగుడ్" అన్నాడు సర్వోత్తమరావు "నా వయసొచ్చే సరికి నా కన్నా పెద్ద లాయర్‌వి అవుతావు నువ్వు. అందులో సందేహం లేదు."

సర్వోత్తమరావు పైకి అలా తేలిగ్గా మాట్లాడుతున్నా - అమితమైన బాధని అతి కష్టంమీద అణుచుకుంటున్నాడని అర్థమైంది.

సర్వోత్తమరావు చెప్పటం మొదలు పెట్టాడు.

.....

"నిజం ఎప్పుడూ నిజమే. దాన్ని నమ్మినా నమ్మకపోయినా అది నిజమే. కానీ కొన్ని దారుణమైన నిజాలు నిజానికి నమ్మబుద్ధికావు. నాతో అక్రమ సంబంధం పెట్టుకున్న సుశీల తల్లిని మూడోకంటికి తెలియకుండా చంపేశాక సుశీల గురించి పూర్తిగా మర్చిపోయాను. కానీ నేను హంతకుణ్ణి అన్న భావం నన్ను అమితంగా భయపెట్టేది. మాటిమాటికీ ఉరికంబం జ్ఞాపకం వచ్చేది.

ఆ రోజుల్లోనే ఉరి రద్దు మీద ఒక వ్యాసం వ్రాశాను. దానికి ఎంతో పాపులారిటీ లభించింది. న్యాయవాద వృత్తితో పాటు ఉరిరద్దు గురించి కాన్వాస్ చెయ్యటం కూడా ఒక భాగంగా పెట్టుకున్నాను. కాపిటల్ పనిష్‌మెంట్ అబాలిషన్ మీద ఏ చర్చ జరిగినా నన్ను పిలిచేవారు. దేశంలో పెద్ద క్రిమినల్ లాయర్స్‌లో నేనూ ఒకడిని అయ్యాను. ఈ లోకంలో మనిషికి అన్నిటికన్నా ఎక్కువ విలువైనదీ, మనిషిని ఆశించేదీ డబ్బు అంటారు. కానీ - అది కాదు. అంతకన్నా పెద్ద వ్యసనం 'కీర్తి కండూతి'. దానికి అలవాటు పడ్డాక వదులుకోవటం కష్టం.

అదృష్టవశాత్తూ డబ్బూ - కీర్తి - ఈ రెండూ నాకు రెండు వైపుల్నుంచీ రాసాగినయ్. అప్పటికే నాకు ముప్పై అయిదేళ్ళు దాటినయ్. అప్పటికి అర్చన తల్లీ తండ్రి చచ్చిపోయి ఎనిమిదేళ్ళయింది. అర్చనకి పధ్నాలుగేళ్ళు వచ్చినయ్. తన

సంరక్షణ భారాన్నంతా నేనే చూసుకునే వాణ్ణి. మిత్రులు పెళ్ళి చేసుకొమ్మనేవాళ్ళు. వారి మాట వినే వాణ్ణి కాదు. అర్చనే సర్వస్వం అనేవాణ్ని. అర్చన వయసు వంపుల్ని దిద్దుకోసాగింది. నా మాటల్లో గూఢార్థం ఎవరికీ బోధపడేది కాదు......."

వింటున్న అర్చనకి చప్పున ఏదో అర్థమయి కంపెంచి పోయింది. చిరంజీవి మొహం ఎర్రబారింది. పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి.

"మనిషి మనసంత కుత్సితమైనదీ, అనూహ్యమైనదీ మరొకటి లేదని నా ఉద్దేశ్యం, పాతిక సంవత్సరాలు క్రిమినల్ లాయరుగా పనిచేసి నేను కనుక్కున్నదేమిటంటే, ఈ ప్రపంచంలో ప్రతీ మనిషీ క్రిమినలే. కొందరు చట్టపరిధిలోకి వస్తారు - కొందరు రారు. నేను రెండో రకానికి చెందినవాణ్ని అని నాకు తెలుసు. అయినా మనసుని అదుపులో పెట్టుకోలేక పోయేవాణ్ణి.

పొద్దున్నే దేముడి పూజచేసి బెడ్‌రూమ్‌లోకి వచ్చి పధ్నాలుగేళ్ళ అమ్మాయిని నిద్ర లేపటం చిత్రమైన సంతృప్తినిచ్చేది. లేపేముందు మోకాళ్ళ మీద గౌను సర్దటం, ఇంకో రెండు మూడేళ్ళు పోయాక తొలగిన పైట సర్దకుండా లేపటానికి ప్రయత్నించటం అలవాటయింది. నేను కొద్ది కొద్దిగా ఫెటసిస్ట్‌గా మారసాగాను. ఒకరోజు బాత్‌రూమ్‌లో నా కంటిని పుల్లతో పొడిచావు కూడా....."

వింటూన్న అర్చన శిలే అయింది. ఇంత నిజాన్ని అస్వాదించే శక్తి ఆమెకి లేకపోయింది. ప్రొద్దున్నే పూజగదినుంచి సరాసరి తన గదికి వచ్చి "లే అమ్మా లే............ ఎనిమిదవుతూంది" అని తట్టి లేపే మావయ్య తన స్వంత మావయ్య మనసులోనూ, చర్య వెనుకా ఇంత ఘాతకమైన ఆలోచన వుందా?

ఆమె సిగ్గుతో కుదించుకుపోయింది. ఆయన తన గదిలో ఉన్నప్పుడు స్వంత తండ్రే వున్నట్టు ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తించేది! అనుక్షణమూ తన కదలికల్నే - వంపుల్నీ పరిశీలిస్తూ ఉండేవాడన్న మాట. ఇంత కాలం బైరాగే ఫెటసిస్ట్ అనుకుంటూ వచ్చింది. తెలివి తక్కువవాడు కాబట్టి వాడు బైటపడేవాడు. అయినా ఇంత చిన్న విషయం కనుక్కోలేకపోయిందంటే ఏమైనవి తన తెలివితేటలన్నీ?

మొహంలో రక్తం అంతా ఎవరో తోడేసినట్టూ అచేతనంగా కూర్చున్న అర్చనతో సర్వోత్తమరావు అన్నాడు "......... ముందు చిరంజీవి తెలివితేటలపట్ల నాకు చాలా తేలిక అభిప్రాయం ఉండేది. ఆ కారణంగానే నీతో స్నేహాన్ని ప్రోత్సహించాను. కానీ అతడు పైకి కనబడేటంత అమాయకుడు కాదని తొందర్లోనే అర్థమైంది. దాంతో నాకు కొంచెం కంగారు పుట్టింది. అంతలో నా కింకో షాక్ తగిలింది. ఒకరోజు అర్ధరాత్రి మన ఇంటి వైపు వెళ్తూ వెళ్తూ దార్లో ఓ ఇన్‌స్పెక్టర్ కనబడితే, తను నిన్ను పెళ్ళి చేసుకోబోతున్నాడని, అక్కణ్నుంచే వస్తున్నాననీ చిరంజీవి అన్నాడు. ఆ విషయం ఇన్‌స్పెక్టర్ చెప్పగానే కదిలిపోయాను.

కానీ నాకు అనుమానమే! ఇంత హై స్టేటస్ ఉన్నదానివి చిరంజీవిని ప్రేమిస్తావా? విషయం తెలుసుకోవటం కోసం అతడిని తొందర పెట్టాను. నేను తొందర పెట్టకపోతే అతడు తనకున్న కాంప్లెక్స్‌తో ఎప్పటికీ నీ దగ్గర తన ప్రేమని వెల్లడించలేకపోయి ఉండేవాడు. అందుకే అద్దెకారు, అద్దెసూటులతో ఓ బఫూన్‌లా నిన్ను హోటల్‌కి తీసుకెళ్ళి ప్రేమని వెల్లడించమన్నాను. నువ్వు అతడిని తిట్టి తెగతెంపులు చేసుకుంటా వనుకున్నాను.

కానీ నీది నాకన్నా షార్ప్ బ్రెయిన్. చిరంజీవి తెలివితేటల్ని నువ్వూ గుర్తించి అతడి ప్రేమని ఆమోదించావ్. ఇది వూహించలేని మలుపు. ఏం చెయ్యాలో నాకు అయితే తోచలేదు. నా నుంచి ఆస్తి వ్యవహారాలన్నీ చిరంజీవి తీసుకుంటాడు.

అందులో అంత బాధేమీ లేదు. బాధల్లా నీ గురించే! చిన్నపిల్లాడి నుంచి తాయిలం లాక్కున్నట్టు నానుంచి నిన్ను అతడు తీసుకుంటున్నాడు. అదే బాధ. ఆ బాధలోంచే అతడంటే కసి - ద్వేషం - అసూయ అన్నీ పుట్టుకొచ్చినయ్........"

"ఈ సమయంలోనే ఒక ఆడపిల్ల మన ఇంటి ముందు నిలబడి - ఇంటివైపే చూస్తూ వుండటం గమనించాను. ఒకరోజు చిరంజీవితో మాట్లాడటం కూడా చూశాను. ఎవరాపిల్ల అని అనుమానం వచ్చి వెంటాడి ఆమె ఇంటికి వెళ్ళాను. ఆమె చిరంజీవి స్నేహితురాలైతే ఆ విషయం నీకు చెప్పొచ్చని నా ఆలోచన.

కానీ నా అంచనా తప్పైంది. నా అంతట నేను తనింటికి రావటం చూసి ఆ అమ్మాయి ఆశ్చర్యంతోనూ సంభ్రమంతోనూ అల్లల్లాడిపోయి, తను నా కూతురన్న విషయం వెల్లడించి తల్లి గుర్తులు చెప్పింది. కొద్ది రోజులుగా నన్ను కలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాననీ కానీ మన యింటి వాతావరణం, ఆ హోదా అవన్నీ చూసి లోపలికి రావటానికి బెదిరిపోయాననీ ఏడవటం మొదలుపెట్టింది. ఒంటరితనం ఆమెనో సైకిక్‌గా మార్చిందని గ్రహించాను. కొద్ది రోజుల్లో ఏదో సెటిల్ చేస్తానని నచ్చ చెప్పి వచ్చేశాను.

ఇటొచ్చి, అటొచ్చి సమస్య నా మీదకే తిరిగింది. ఇరవై సంవత్సరాల క్రితం చేసిన తప్పు ఇన్నాళ్ళకి తిరిగి సుశీల రూపంలో వచ్చి ఎదురు నిలుస్తుందని నేను కలలో కూడా వూహించలేదు. ఇప్పుడు నా పరువు - అంతస్థు - అన్నీ కదిలిపోయే పరిస్థితి ఏర్పడింది.

సరీగ్గా అదే సమయానికి చిరంజీవి నా దగ్గరికి వచ్చి ఫోటోలు తీసి ఉరి రద్దు కోసం ప్రయత్నం చేయటం అనే ప్లాన్ గురించి చెప్పాడు. ఒక శవాన్ని సంపాదించి దాన్ని నూతిలో పడెయ్యటం గురించి వివరించాడు. అప్పుడొచ్చింది నాకు ఆలోచన! సుశీల్ని చంపి, ఆ శవాన్ని చిరంజీవి ద్వారా నూతిలో పడేయిస్తే?

రెండు పనులూ ఒకేసారి నెరవేరతాయి.

ఈ సమయానికే చిరంజీవి దారాసింగ్‌ని శవం గురించి అడిగాడని తెలిసింది. దాదా ఓడల మీద పనిచేసి వచ్చినవాడు. చూసిరమ్మంటే కాల్చి వచ్చే రౌడీ. మా ఇద్దరికీ సులభంగానే ఒప్పందం కుదిరింది.

నేను తెర వెనుకే వుంటూ వచ్చాను. ఏ లొసుగులూ వుంచలేదు. ఆ రోజు ప్రెసిడెంట్‌కి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకున్నాను కూడా. అదృష్టవశాత్తూ ఆరోజు తుఫాను. వెళుతూ వెళుతూ కారుని లోయలోకి జార్చి, దాంతో పాటూ నేనూ జారాను. జేబులో ఫోటోలు మంటల్లో పడ్డాయి. ఇక్కడే దురదృష్టం నన్ను పరిహసించింది. డార్క్ రూమ్‌లో బల్లమీద నెగిటివ్‌లు హడావుడిలో కవర్లో పెట్టుకోవటం మర్చిపోయాను. అదే ఈ కథని మలుపు తిప్పింది. నా అజాగ్రత్తవల్ల నెగిటివ్‌లు జారి చెత్తబుట్టలో పడ్డాయి.

ఆస్పత్రిలో తల మీద కట్టుతో, కాలువిరిగినట్టు నాటకమాడి పడుకున్న నాకు, తెల్లారాక తెలిసిన న్యూస్ ఏమిటంటే; నువ్వు చిరంజీవిని రక్షించావని! ........ ఊహించలేని దెబ్బ యిది నాకు.

చిరంజీవి ఉరినుంచి బయటపడ్డాడని తెలిసి ముందు చాలా కంగారు పడ్డా వెంటనే సర్దుకున్నాను. నేనే హంతకుడినని ఎవరూ కనుక్కోలేరని నాకు తెలుసు. సుశీల్ని రేప్ చేసి చంపిన దాదాకి, నాకు తప్ప మూడో కంటికి ఈ రహస్యం తెలీదు. అదృష్టవశాత్తూ నువ్వు చిరంజీవిని అనుమానించటం ప్రారంభించావు" చెబుతూన్న సర్వోత్తమరావు ఆగాడు.

# అభిలాష

యండమూరి వీరేంద్రనాథ్

32 వ భాగం

సడెన్‌గా అతడి మొహంలో బాధ కనిపించింది. బలం కూడగట్టుకుని చిరంజీవి వైపు తిరిగి చెప్పసాగాడు - "............ ఈ ప్లాన్ మొత్తంలో నేను చేసిన తప్పేమిటంటే, చిరంజీవి ఊరినుంచి బయటపడ్డాడన్న కంగారులో ఒక అబద్ధం చెప్పటం. సుశీల చనిపోయిన రోజు రాత్రి చిరంజీవికి దారాసింగ్ వచ్చి శవం గురించి చెప్పలేదని, ఆ సమయానికి అతడు జైల్లో వున్నాడనీ అర్చనకి చెప్పాను. ఏవో నాలుగు నెంబర్లు తిప్పి, పోలీస్ స్టేషన్‌నుంచి నాకా వార్త తెలిసినట్టు నాటకమాడాను. దారాసింగ్‌ని అరెస్టు చేసి వాడు నిజం చెప్తే మొత్తం తెలిసి పోతుందని అనుకోలేదు. నా దృష్టి అంతా అర్చన మీదే వుంది. తప్పితే నువ్వూ వేరే కోణంలోంచి పరిశోధన సాగించి, నిజాన్ని.....
కనుక్కొంటా...........వని.........అను.........కో..........లే..........దు."

అర్చన చప్పున అతడి దగ్గరికి వెళ్ళింది. అతడు బాధతో మెలికలు తిరుగుతున్నాడు.

సరీగ్గా నిముషం తర్వాత అతడి స్ట్రెచర్ ఆపరేషన్ థియేటర్‌లోకి ప్రవేశించింది. ఆపరేషన్ మొదలైంది.

......

ఆస్పత్రి బాల్కనీలో థియేటర్‌కి ఎదురుగా వరండాలో నిలబడి వున్నారు చిరంజీవి, అర్చన, కొద్దిదూరంలో విష్ణుశర్మా, స్వాతి మాట్లాడుకుంటున్నారు. ఆపరేషన్ పూర్తయితేగానీ ఏమీ చెప్పలేమన్నారు డాక్టర్.

"నాకొకటి అర్థం కాలేదు" అంది అర్చన.

"ఏమిటి"

"ఈ విషయాలన్నీ చెప్పేటప్పుడు మావయ్య ఎందుకు డాక్టర్‌ని వెళ్ళిపొమ్మన్నాడు? 'ఎంపరర్ వర్సెస్ మహమ్మద్ బక్ష్' అని నువ్వు అన్నావే - దానికి అర్థం ఏమిటి?"

చిరంజీవి మొహం మ్లానమైంది "తరువాత చెప్తాన్లే అర్చనా!"

"కాదు. ఇప్పుడే చెప్పు" పట్టు పట్టింది.

అతడు చాలా నెమ్మదైన స్వరంతో అన్నాడు. "నీ మామయ్య ఏ విధమైన రిస్కూ తీసుకోదల్చుకోలేదు అర్చనా. అందుకే డాక్టర్ని తను బ్రతికే ఛాన్సు ఎంత అని అడిగాడు. ఛాన్సు ఫిఫ్టీ ఫిఫ్టీ అని డాక్టర్ చెప్పగానే అతడిని బయటికి వెళ్ళిపొమ్మన్నాడు. ఎవిడెన్స్ ఆక్టులో దోషి ఒక డాక్టర్ ముందు మరణ వాగ్మూలం ఇస్తే - ఆ డాక్టర్‌ని సాక్షిగా గుర్తించాలని ఎంపరర్ వర్సెస్ మహమ్మద్ బక్షి కేసులో జడ్జిమెంట్ వుంది. అందుకే నేనా కేసు పేరు చెప్పగానే నన్ను పొగిడాడు.

ఆయన ఆపరేషన్ థియేటర్‌లో చచ్చిపోతే నేను దోషిగా ఉరికంబం ఎక్కకుండా రక్షింపబడటం కోసం మనిద్దరికీ అసలు విషయాన్ని చెప్పాడు. ఒకవేళ తను బ్రతికి బయటపడితే, ఈ డాక్టర్ సాక్ష్యంతో తను ఉరికంబం ఎక్కకుండా ఉండటం

కోసం డెత్ స్టేట్ మెంట్ యిచ్చేటప్పుడు డాక్టర్ని వుండటానికి వీల్లేదన్నాడు. అంటే అతడు బయటకొస్తే ఈ హత్య విషయం తనకేమీ తెలీదని బుకాయిస్తాడన్నమాట".

"మైగాడ్" అన్నది అంన ఈ నిజాన్ని నమ్మలేనట్టూ "ఇంత జరిగాక కూడా తను హంతకుణ్ణి కాదంటాడా?"

"బెనిఫిట్ ఆఫ్ డవుట్" అంటూ చిరంజీవి విషాదంగా నవ్వాడు "...... హంతకుడు అవటం వేరు - హంతకుడిగా కోర్టు శిక్ష వేయటం వేరు. కోర్టులో అతడు చాలా సులభంగా తప్పించుకుంటాడు. సుశీల తన కూతురు కానే కాదంటాడు. శిథిలావస్థలో ఉన్న ఫోటో సాక్ష్యం నాలిక గీసుకోవటానికి కూడా పనికిరాదు. చచ్చీ చెడి సుశీల కూతురే అని నిరూపించామనుకో - అయినా లాభం లేదు.

స్వంత కూతుర్ని ఎలా రేప్ చేయిస్తాను అని వాదిస్తాడు. ఆరోజు రాత్రి నేను లేపేవరకూ ఇంట్లో నిద్రపోతున్నానని అంటాడు. ఓబులేసు సాక్ష్యం డిఫెన్సు ముందు నిలబడదు. దారాసింగ్ తనకసలు ఏమీ తెలీదు అంటాడు. మనిద్దరం ఇప్పుడు జరిగింది చెప్పినా అది నేను బయటపడటంకోసం నిర్మించుకున్న సాక్ష్యంలాగా కనిపిస్తుంది. చట్టం దృష్టిలో దోషికీ, నిర్దోషికీ మధ్య తేడా ఎంత చిన్నదో చూడు!

ఇప్పటివరకూ నేను దోషిని కానీ ఇప్పుడు సర్వోత్తమరావే హంతకుడని మనిద్దరికీ తెలుసు. అయినా ఏదీ నిరూపణ కాదు! సినిమాల్లో ఇన్‌స్పెక్టరు ఆఖరి నిముషంలో వచ్చి భూగృహంలో విలన్‌ని అరెస్టు చేసి తీసుకెళ్తాడు కదా - ఆ తరువాత అతడి మీద ఛార్జెస్ ఎలా ఫ్రేమ్ చేస్తాడా, ప్రైమాఫేసీ ఎవిడెన్స్ ఏం చూపిస్తాడా - అని"

"ఈ పరిస్థితుల్లో కూడా నువ్విలా తేలిగ్గా ఆలోచించటం ఆశ్చర్యంగా వుంది"

"ఇందులో తేలిగ్గా ఆలోచించటం అంటూ ఏదీ లేదు అర్చనా! నా జీవితంలో వున్న ఒకే ఒక ఆశయం న్యాయం, చట్టం మార్పుల గురించే చెప్తున్నాను. ఏమి చట్టం ఇది? ఏమి ఆక్టులు ఇవి?? సరోత్తమరావు స్వయంగా నేనే కూతుర్ని చంపించాను అని చెపితే తప్ప ఎవిడెన్స్ ఆక్ట్ ఏమీ చెయ్యలేదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఏమీ చెయ్యలేదు. ఈ మోటో ఎస్టాబ్లిష్ చేస్తే తప్ప యిండియన్ పీనల్ కోడ్ శిక్ష విధించదు. ......... ఆక్ట్స్ ........... కోడ్స్........ సెక్షన్స్ .....హెల్ విత్ దిస్ లాస్........... ఒక దారుణమైన హత్య చేయించినవాణ్ణి, తన స్వంత కూతుర్నే రేప్ చేయించి చంపించిన నరరూప రాక్షసుణ్ణి ఉరికంబం ఎక్కించలేని సెక్షన్ 302 ఎందుకు? కాల్చనా?

ఈ కథనంతా ఎవరైనా రెండు అధ్యాయాలుగా వ్రాసే - మొదటి అధ్యాయమంతా నిర్థోషై వుండీ 302 సెక్షన్ బారినుండి తప్పించుకోవటానికి ఒకరు ఎంత కష్టపడ్డారో వివరింపబడి వుంటుంది. ఎంత సులభంగా బయట పడగలడో వర్ణింపబడి వుంటుంది. ఇంత లూజ్‌గా వున్న ఈ సెక్షన్ ద్వారా ఉరిశిక్ష విధించే అధికారం భారత న్యాయశాస్త్రానికే లేదన్నదే ఆ కథకి నీతి వాక్యం ........" అతడి మాటలు పూర్తికాకముందే ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి.

నర్స్ కంగారుగా బయటకొచ్చి ఏదో ఫ్లూయిడ్ తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. ఆమె వెళుతుంటే అర్చన అడుగు ముందుకేసి "ఎలా వుంది?" అని ఆత్రంగా అడిగింది "డాక్టరు గారు చెప్తారు" అంటూ నర్స్ వడివడిగా వెళ్ళిపోయింది. ఆమె కంఠంలో టెన్షన్ అందరూ గుర్తించారు.

చిరంజీవి మనసులో అనుకున్నాడు............ "సర్వోత్తమరావు బ్రతకాలి! తప్పకుండా బ్రతకాలి!! కోర్టులో బోనెక్కాలి. కేసు ఏమైనా సరే...... ఉరి రద్దు కోసం నేను చేస్తున్న పోరాటంలో ఈ కేసు ఒక నూతనాధ్యాయం సృష్టించాలి! కేసు నామీద

తిరిగినా సరే - ఈ పోరాటం సాగాలి! విదేశాల్లో 'ఈవాన్' కేసు ఎంత ప్రాచుర్యం పొందిందో - సుశీల కేసు కూడా అంత ప్రాచుర్యం పొంది - ఉరిశిక్ష రద్దుకు అది నాంది కావాలి!

దీనికి నేను సమిధనైనా సరే ఫర్లేదు. సర్వోత్తమరావు బ్రతకాలి. ఉరికంబం తాటి ఛాయలో నిలబడి ఒక దోషి - ఒక నిర్దోషి ప్రాణాల కోసం పోరాడుకొంటూంటే అప్పుడైనా భారత ప్రజ కళ్ళు తెరుస్తుంది. ఈ కేసు ఇలా పేలవంగా పూర్తి కావటానికి వీల్లేదు..... సర్వోత్తమరావు బ్రతకాలి?"

అదే సమయానికి అర్చన కళ్ళు మూసుకుని ప్రార్థిస్తోంది "భగవాన్! మావయ్యని చంపెయ్యి! ఒక మనిషిలో దాక్కున్న మరో దారుణమైన మనిషిని నేను చూడలేను. అతడు నన్ను పెంచినవాడు, పెద్ద చేసినవాడు. అతడు ఫ్రెటసిస్టే కావొచ్చు. హంతకుడే కావొచ్చు. కానీ అదంతా గతం. ఇదే భవిష్యత్తుగా కొనసాగితే ఆ రెండో మనిషి విజృంభిస్తాడు. ప్రాణాల కోసం మరిన్ని అబద్ధాలు చెప్తాడు. అలాంటి మావయ్యని నేను చూడలేను. చంపెయ్యి. భగవంతుడా - మావయ్యని చంపెయ్యి."

ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి. డాక్టర్ బయటకొచ్చాడు. అతడి మొహం విచారంగా వుంది.

( సమాప్తం )